Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

पुस्तकालय
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

"Forwarded free of Cost, and with the Compliments of Department of Education Government of India., New Delhi."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

DONATION
7971

మబ్బుల వెనుకనుంచి వీస్తూ, నా చుట్టూ, నా నిండా
కమ్ముకొనే వెలుగులూ

పొగలతో, మంటలతో, [illegible] అలసిపోయిన రోజు మీద,
బంగారు కాంతులను చిమ్మే సంధ్యలూ

నక్షత్రాల సంగీతాలను నాదాకా మోసుకొచ్చే శీతల పవనాలూ

[illegible] పచ్చదనం ప్రవహించే
పొలాలు, తోటలు, అడవులూ

నెలవంకలు, [illegible], మంచుజడులు, మంచితనాలు,
ఇంద్ర ధనుస్సులు, కన్నీళ్ళు, కారుణ్యాలూ

ఇంకా ఇంకా [illegible] చాలా నా చుట్టూ ఉన్నాయి...

అయినా [illegible] ఏకాంతం

నీడలా నన్ను అనుసరిస్తూనే ఉంది...

డాక్టర్ రావూరి భరద్వాజ

"Forwarded free of Cost, and with the Compliments of Department of Education Government of India., New Delhi."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తొలి ముద్రణ : 1990

హక్కులు : రచయితవి

ముఖచిత్రం : బాపు

వెల : రూ. 25-00

సంపాదకుడు :
త్రిపురనేని సుబ్బారావు

టైటిల్ ముద్రణ :
బాలాజీ ఆర్టు ప్రింటర్స్, చిక్కడపల్లి, హైదరాబాదు

ప్రచురణ :
బాలాజీ గ్రంథమాల
విజయనగర్ కాలనీ, హైదరాబాదు-457

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞానభవన్, హైదరాబాదు-1

విశాలాంధ్ర బుక్ హౌస్
హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు
అనంతపురం, తిరుపతి, హనుమకొండ, కాకినాడ.

పుస్తక ముద్రణ :
విష్ణు ప్రింటర్స్, తిలక్ నగర్, హైదరాబాదు-44

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ ఒంటరి బాటసారి

— జస్టిస్ జి. రామానుజులు నాయుడు

1987వ సంవత్సరం ఆగస్టు 1వ తేదీ శనివారం సాయంకాలం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖవారు, డాక్టర్ రావూరి భరద్వాజ గారి "నాలోని నీవు" గ్రంథావిష్కరణోత్సవం ఏర్పాటు చేశారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొనే భాగ్యం నాకు లభించింది. అప్పుడు నే నిలా అన్నాను — "మిత్రుడు భరద్వాజను ఎలా పరిచయం చేయడమని ఆలోచిస్తున్నాను ... రచయిత భరద్వాజ - నాకు చాలా ఇష్టుడు. వ్యక్తి భరద్వాజ - నాకు మరీ మరీ ఇష్టుడు. నే నిష్టపడడానికి నాదగ్గర చాలా కారణాలున్నాయి..." అంటూ సాగిపోయింది నా ఉపన్యాసం. ఆనాటి నా ఉపన్యాసంలో ముఖ్యమైన, కొన్ని కారణాలను మాత్రమే చెప్పాను. ఇంకా ఇంకా చెప్పవలసిన ఎన్నెన్నో కారణాలను, అప్పుడు చెప్పలేకపోయాను. ఇప్పుడూ - అన్నింటినీ చెప్పలేను గానీ - కొన్నింటిని మాత్రం చెప్పడానికి ప్రయత్నిస్తాను.

భరద్వాజ వైయక్తిక జీవితాన్నీ, సాహితీ జీవితాన్నీ, సూక్ష్మంగా పరిశీలించిన వారికి, భిన్నమైన రెండు ధోరణులు, జమిలిగా సహజీవనం చేయడం కనపడుతుంది. మనిషిలోని క్రూరత్వం పట్లా, అమానుషత్వం పట్లా, రక్తదాహంపట్లా, దయారాహిత్యం పట్లా, అంతులేని ద్వేషమూ, కోపమూ, కసీ, అతనిలో కనపడతాయి. అదే సమయాన, అదే మనిషిలో - ఎక్కడో తళుక్కుమని మెరిసే మంచితనంపట్ల, అవధు లెరుగని అనురాగమూ, ఆప్యాయతా కూడా కనపడుతుంది.

ఇందుక్కారణా లేమిటి ?

నాకు తోచిన వాటిని సంక్షిప్తంగా చెబుతాను.

"Forwarded free of Cost, and with the Compliments of Department of Education Government of India., New Delhi."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరీ చిన్నతనం నుండీ, ఏదో ఒకరకమైన ఏకాంతం - గాఢంగానో, ఛాయామాత్రంగానో, భరద్వాజను ఆవరించుకొనే ఉన్నది. అందరికీ దూరంగా పెడగా, విసిరేసినట్టుగా, ఉండవలసిరావడంవల్ల, అతనిలో "ఆంతర్ముఖత్వం" పెరిగి పోయింది. అదే సమయాన, తనచుట్టూ ఉన్నవారితో సంఘర్షిస్తూనో, సర్దుకుపోతూనో జీవించవలసి రావడంవల్ల, "బహిర్ముఖత్వం" కూడా పెరిగి పోయింది. ఈ రెండు లక్షణాలూ, భరద్వాజ వ్యక్తిగత జీవితంలోని, సాహితీ జీవితంలోని, మూల మూలల్లోనికి సాంద్రంగా విస్తరించాయని మనం సులభం గానే గ్రహించవచ్చు.

సామాన్యమైన, అసామాన్యమైన, అద్భుతమైన, అమానుషమైన సంఘటనలెన్నో భరద్వాజను రాసుకొంటూ, పూసుకొంటూ, రెచ్చగొడుతూ, చిచ్చి గొడుతూ, పలకరిస్తూ, ఉలకరిస్తూ ప్రవహించి పోయాయి. ఆ ప్రవాహాలు తమతో తెచ్చిన జీవరసాయనాలతో, భరద్వాజ జీవిత క్షేత్రం సారవంత మయింది. ఆ పొలంలోంచి, ఈ నామిత్రుడు రకరకాల పంటలను చాలా పెద్ద ఎత్తున పండించి రాసులు పోశాడు. తన ప్రతి అనుభవాన్నీ, ప్రతి అనుభూతిని అక్షరబద్ధం చేయడానికి భరద్వాజ తపించి పోవడమూ, తపస్సు చేయడమూ నాకు తెలుసు.

చాలామంది కవులు, రచయితలు, ఇతర రంగాలకు చెందిన కళా కారులు, జీవితం ఏదిస్తే, దానినే తీసుకొని, అంతటితోనే తృప్తి పడతారు.భర ద్వాజ కూడా జీవితం ప్రసాదించిన దానిని, కృతజ్ఞతా పూర్వకంగానే తీసు కున్నాడు అయితే - అంతటితో ఆగిపోలేదు. తనకు కావలసిన దానిని - కొన్ని సార్లు - జీవితం నుండి వొడుపుకొన్నాడు. తనకు రావలసిన దానిని - మరి కొన్ని సార్లు - జీవితం నుండి పిండుకొన్నాడు.

ఒక్కొక్కసారి, బండల మీదుగా, కొండలమీదుగా, జోరుగా, హోరుగా మంటల సుడిగాలిలా ప్రవహిస్తూ పోతాడు. మరోసారి, మంచుకన్నా తెల్లగా, మంచికన్నా చల్లగా, చివురు కూడా కందనంత మెల్లగా, పచ్చని పాటగా, పూవులతోటగా, మనలను పలకరిస్తూ పోతాడు భరద్వాజ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆకాశంలో బిక్కు బిక్కుమంటూ, ఓ మబ్బుముక్క కనిపించినా, విసిరేసినట్టుగా ఒంటరిగా ఉన్న ఓ చుక్క కనిపించినా, పాలకోసం 'కుయ్ కుయ్' మంటూ తనను వేధిస్తున్న పిల్లలను ఏమీ అనలేని తల్లి కుక్క కనిపించినా, ముసలి బిచ్చగత్తె ఖాళీ గిన్నె కనిపించినా, చెత్తకుండీల్లో వెదికే పసితనం కనిపించినా, భరద్వాజ ఏమయిపోయేదీ నాకు తెలుసు.

ఈ భరద్వాజ నాకు అత్యంతమైన ఆత్మీయుడు. అతనిచేత "బావా!" అని ఆర్ద్రంగా పిలిపించుకొనే, బహుకొద్ది మందిలో, నేనూ ఒకణ్ణి కావడం నా అదృష్టం.

భరద్వాజ జీవితం-సందేహంలేదు-అచ్చంగా బండరాయి లాంటిది. ఆ శిలను, అందమైన శిల్పంగా తీర్చిదిద్దిన ఘనత - అక్షరాలా, కాంతమ్మగారిదే! మూడున్నర దశాబ్దాలపాటు; సారవంతమైన జీవితాన్ని జీవించాడు. జీవితపు సరిహద్దులను, అన్ని దిక్కులకూ విస్తరింప చేశాడు. జీవితంనిండా ఆహ్లాదమయమైన వెలుగులను నింపుకొన్నాడు. కానీ — ఈశ్వరుడు ఆ ఆదర్శదాంపత్యానికి ఎడబాటు కలిగించాడు. నా సోదరి మరణం మా భరద్వాజను అంతర్ముఖుణ్ణి చేసింది. ఇప్పుడతనిలో మనకు కనిపించే మనిషి వేరు, మనకు కనిపించని మనిషి వేరు.

ఇప్పుడతను - తననుతాను దహించుకొంటున్న మంచు కప్పిన అగ్ని పర్వతం లాంటివాడు. ఒకప్పుడతని దృష్టి పదునుగా మాత్రమే ఉండేది. ఇప్పుడది పదనుగా కూడా మారింది.

ఒకప్పుడతను - మాటలను, మంటల్లో వెచ్చ చేసుకొన్నాడు. తరువాత మందు పాతరలుగా మార్చుకొన్నాడు. ఇప్పుడేమో - వాటిని,సన్నగా,చిన్నగా, మెరుగ్గా, మెత్తగా, శస్త్ర పరికరాలంత స్వచ్ఛంగా మలుచుకొన్నాడు.

ఇంతకాలంగానూ, అపారమైన తన అనుభవ సంపదలను ఎదలో పదిల పరుచుకొన్నాడే తప్ప. పదిమంది ముందూ పరచలేదు, పదుగురికీ పంచన్నా లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంతకాలంగానూ, అస్పష్టంగా, అపురూపంగా, సూక్ష్మంగా, అతనిలో దాగొన్న తాత్వికుడైన కవి, ఇప్పుడు స్పష్టంగా, సరూపంగా, విస్తృతంగా బయట పడుతున్నాడు. అందువల్లనే ఆకాశాల, నక్షత్రాల, మేఘాల, ఉభయ సంధ్యల, దివారాత్రాల, Moods ను, అందంగా, అద్భుతంగా, అక్షర బద్ధం చేయగలుగు తున్నాడు.

ఒక నైరూప్య భావానికి, సారూప్యతను సంతరించడంకోసం, భరద్వాజ పడే మథనం నాకు తెలుసు.ఆ భావాన్ని పదాల్లోనూ వాక్యాల్లోనూ,బంధించడం కోసం, తనను తాను దహించుకోవడం నాకు తెలుసు. ఆ మంటల్లోంచి, వాక్యాల మీదుగా అతని ఆలోచనలు ప్రవహించి, పఠితల అంతరాంతరాల్లో తమ గళాలను విప్పినప్పుడు, ఆ బృందగానంలోని తీవ్ర స్థాయిని, పాఠకులు అందుకొనేలాగా చేయడంకోసం, అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ అతనెలా సద్వినియోగం చేసుకొంటాడో నాకు తెలుసు.

సమస్త సంగీత ప్రపంచమూ, సప్తాక్షరాలలోనే, నాలుగైదు తంత్రుల లోనే ఇమిడిపోయి ఉంటుంది. భరద్వాజ జీవితంకూడా, ఈసంగీత ప్రపంచం లాంటిదే ననిపిస్తుంది నాకు. సువిశాలమైన, అతని జీవితాన్ని, ఏడక్షరాలకూ, నాలుగైదు తంత్రులకూ నిబద్ధం చేసిన వ్యక్తి - సోదరి కాంతమ్మగారు. అలా నిబద్ధీకరించడానికీ, శ్రుతిచేయడానికీ, మా సోదరి కాంతమ్మగారు ఎంత శ్రమ పడిందో - మాట మాత్రంగానైనా, ఎప్పుడూ నాతో చెప్పలేదు. పోనీండిగానీ - హోరుగా, జోరుగా, ఏరులై ప్రవహించే అద్భుత సంగీతాలను మాత్రం తన 'పిచ్చాయన'లో పలికించి, తను నిశ్శబ్దంగా నిష్క్రమించింది.

ఇప్పటి అతని రచనలను చదువుతుంటే, మన ఇంద్రియాల గ్రహణ పరిధి విస్తరిస్తున్నట్టుగా ఉంటుంది. మన మనస్సుకు కొత్త రెక్కలు మొలిచి నట్టుగా ఉంటుంది. మన కనులకు కారుణ్య కజ్జలాన్ని దిద్దినట్టుగా ఉంటుంది. మన హృదయాన్ని కొత్త వెలుతురుతో మిరుమిట్లు గొలుపుతున్నట్టుగా ఉంటుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎక్కువమంది - ఎదురుగా ఉన్న జీవితాన్నే చూస్తారు. భరద్వాజ అలా కాదు. ఎదురుగా ఉన్న జీవితాన్నీ, ప్రక్కలకు పరుచుకపోయిన జీవితాన్నీ, తీరాలను దాటి, చీకటి అగాధాల్లోకి, ఇరుకులోయల్లోకి పొర్లిపోయిన జీవితాన్నీ, దగ్గరగా వెళ్ళి చూస్తాడు. దయా హృదయంతోనూ చూస్తాడు.

కుండీల్లో నాజూకుగా పెరిగిన మొక్కకూ,పృధ్విని బద్దలు చేసుకొంటూ ఎదిగిన వృక్షానికీ ఉన్నతేడా వంటిదే, భరద్వాజకూ, కొందరు రచయితలకూ మధ్య ఉన్నదనిపిస్తుంది నాకు. లోతుల్లోకి, మరింత లోతుల్లోకి, వేళ్ల చొచ్చుకు పోయిన వృక్షం; ఎత్తుల్లోకి, మరింత ఎత్తుల్లోకి ఎదుగుతుంది. ఆ కొమ్మల చివ రల్ని: మొగ్గలుగా, పూలుగా, పళ్లగా, మార్చుకొంటుంది; తల గాలిలో ఊగు తున్నా, వేళ్లు నేలలోకి చొచ్చుకొని ఉన్నాయి గనుక.

భరద్వాజ కూడా, ఈ వృక్షంలాంటి వాడే : అతని శిరస్సు ఎత్తులను తాకుతున్నప్పటికీ, అతని కాళ్లు మాత్రం మట్టినే అంటి పెట్టుకొని ఉన్నాయి. అదీ - అతను సాధించిన విజయం !

ఒక్కొక్కసారి భరద్వాజ చెప్పే సంఘటనలూ, సన్నివేశాలూ, మనల్ని చకితులను చేస్తాయి. దయాసహితమైనవి, దయారహితమైనవి; మానుషమైనవి అమానుషమైనవి; అక్రూరమైనవి, క్రూరమైనవి; పాశవికమైనవి, పరమ రమణీయమైనవీ, ఎన్నెన్ని అనుభవాలను పండించుకొన్నదీ మనకు స్పష్టంగా తెలియదు.గుప్తంగా గుండె పొరల్లో దాచుకొన్న వెన్నో అసలే తెలియదు.కానీ ఒకటి మాత్రం మనకు స్పష్టంగానే తెలుసు. ఇలాంటి నేపథ్యమే లేకపోతే, వైవిధ్య పూరితమైన అంతటి సాహిత్య సృజన జరగదు - జరగడానికి అవకాశమూ లేదు.

భరద్వాజ వ్యక్తిత్వాన్ని తెలియ చేసే, అనేక సంఘటనల్లో, ఒకటి రెండింటిని మాత్రం, ఇక్కడ ఉదహరిస్తాను.

"ఆత్మకథ రాయమని నన్ను చాలా మంది అడుగుతున్నారు. సన్ని హితులైన వారు వత్తిడి కూడా చేస్తున్నారు నేను మాత్రం ఒప్పుకోకపడం లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'ఆత్మకథ' అన్న తరువాత, కొన్ని అసత్యాలూ, అతిశయోక్తులూ చోటు చేసుకోక తప్పదు. నా లోపాలనూ, నా బలహీనతలనూ, నా దోషాలనూ, నేను యథాతథంగా బయట పెట్టడం సాధ్యపడుతుందా? నా గురించి, మంచిగానూ, మరీ మంచిగానూ చెప్పుకోకుండా నన్ను నేను నిగ్రహించుకోవడం నాకు సాధ్యపడుతుందా? ఆత్మకథ, సత్యచోదితంగా ఉండాలి. నా కాంతమ్మను గురించిన కాసిని సత్యాలను అచ్చేసినందుకే, నన్ను ఆడిపోసు కొంటున్నవారు - నేను చెప్పే కఠోర సత్యాలను ఎలాభరిస్తారు బావగారూ? 'ఆత్మకథ' అనికాదు గానీ, నా గురించిన కొన్ని అంశాలను గుత్తళంగా గుచ్చి, "వాడికథ" అన్న పేరుతో, ఓ పుస్తకం తెద్దామనుకొంటున్నాను. కాంతమ్మ గారి మరణం తరువాత కూడా మిగిలిన నన్ను గురించి, "నాకు తెలియని నేను" అని రాద్దామనుకొంటున్నాను. ఇలాగా - చాలా చాలా అనుకొంటున్నాను. తీరా, కలం పుచ్చుకు కూర్చుంటే - కాంతమ్మ గారూ, ఈశ్వరుడూ తప్ప, ఇంకెవ్వరూ నా మనస్సులోనికి రావడం లేదు. ఇది మంచిదో కాదో నాకు తెలీదు. కానీ, ఇప్పుడు నేనున్నది ఈ స్థితిలోనే బావగారూ!" అన్నాడు భరద్వాజ ఈమధ్యనే.

మరో సందర్భంలో -

"ఎంత నల్లని మబ్బుకైనా, తెల్లని అంచును చూడడం ఇప్పుడిప్పుడే నేర్చుకొంటున్నాను. ఇలా నేర్చుకోమని కూడా నాకు జీవితమే చెప్పింది. ఇందుకోసం నేను పెట్టిన పెట్టుబడి 'ఆకలి + అవిద్య'. ఈ రెండున్నూ దరిద్రం గారి రెండు ముఖాలు. కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో నేర్చుకొన్న విద్యలో, జీవితానికి పనికొచ్చేది చాలా స్వల్పమని, పెద్దలు చెబుతూ ఉంటారు. నాకయితే ఆ విద్యను గురించి ఏమీ తెలీదు. కానీ - జీవితం నేర్పిన పాఠాల్లో, పనికి రాని పంక్తి ఒక్కటి కూడా ఉండదని నేననుకొంటున్నాను. దేన్ని గురించైనా తెలుసుకునే ప్రయత్నం చేయడం మంచిదే! కానీ మన ఆయుస్సెంత? ఈ స్వల్ప కాలంలో, మనం తెలుసుకొనే దెంత? "తెలుసు కోవడం" అన్న ఈ ప్రయత్నాన్ని, నాకు వెలుపలగా ఉన్నవాటితో కాక, నాతో ప్రారంభించడం మంచి దను కొంటున్నాను. ముందు నేనేమిటో నాకు స్పష్టంగా తెలియాలి. ఆ తరువాత, నా చుట్టూ ఉన్న వాటిని గురించి తెలుసుకోవడం ప్రారంభించి వచ్చు. నేను 'ఫలానా' అని స్పష్టంగా తెలిసి పోయాక, మిగిలిన వాటిని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గురించి తెలుసుకొన వలసిన అవసరం ఉండక పోవచ్చు. ఏం ఉండకపోతే? నష్టమేముంది? నేనెవరో నాకు స్పష్టంగా తెలిస్తే చాలదా? అదేదో తెలియకుండానే, మిగిలిన వాటిని గురించి తెలుసుకొని మాత్రం ఏం ప్రయోజనం బావగారూ?" అన్నాడు భరద్వాజ.

నిరాడంబరమైన అతని వ్యక్తిత్వానికి రెండు సంఘటనలు ఉదాహరణలు మాత్రమే !

భరద్వాజ అప్పుడప్పుడు, అనుకోకుండా, యధాలాపంగా చేసే కొన్ని కొన్ని పనులవల్ల, మనస్సు జివ్వుమని తిమ్మిరెక్కి పోతుంది. ఆషామాషీగానో అవసరంగానో, దేన్ని గురించో మాట్లాడుతూ మాట్లాడుతూ, ఓ కిటికీ రెక్కను అలా తెరుస్తాడు. మన చూపులు, ఆ కిటికీలోంచి అవతలకి దూకుతాయి. ఆ చూపులు వాలిన చోట మనకో అద్భుత దృశ్యం కనబడుతుంది. అలాంటి వాటిని అంతకు ముందు, మనం ఎన్నింటినో చూసి ఉంటాం. కానీ వాటిల్లో మనకు "అద్భుతం" కనిపించదు. మరి - ఇప్పుడెందుకు కనిపించినట్టు? భరద్వాజ ఆషామాషీగా అంటూన్న మాటల ద్వారా, అక్కడి దృశ్యంలోని అనుపానుల్ని మనకు పరిచయం చేసి, ఆ తరువాతనే కిటికీ రెక్కలను తెరచి, మన చూపులను ఆ దృశ్యం మీదికి మళ్ళిస్తాడు. అతను - కనిపించేలా తెరిచింది కిటికీ రెక్కలనే కావచ్చు గానీ, కనిపించకుండా మనసు రెక్కల్నీ, గుండె రెక్కల్నీ తెరిచా డనిపిస్తుంది !

అందుకు ఉదాహరణం - మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకమే !

భరద్వాజది వేదనా భరితమైన జీవితం. ఈ వేదన, అతని హృదయాన్ని కరుణరస భరితం చేసింది. అందుకే ఇప్పుడతనిలో, హరితమూ, పరిమళమూ, అశ్రుబిందువూ, వేణు తయంలా కలిసి పోయాయి.

భరద్వాజ హృదయ కవాటాలు, సజ్జనుల కోసం, సద్భావాల కోసం, ఎల్లప్పుడూ తెరచే ఉంటాయి.

ఇక ప్రవేశించండి !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీదొక ఆర్త హృదయం

— డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి

పేరు, వేషం, పుస్తకం పేరు ఐతరేయం, అన్నీ వెనుకకు లాగేవి. మధ్య యుగాలకు మరల్చేవి. కాని మనిషి ఆధునికుడు. ఆకాశవాణిలో మలచబడిన వాడు. ఆర్ద్రిత హృదయములో దాచుకొన్నవాడు. లేమి, చిన్ననాటి అవస్థలు, ఆకట్లు, వియోగాలు ఆయనకు మూల సంపత్తి. ఆర్తి సాగరములో ఈదేవాడు. తరంగ ఆఘాతములలో తల్లక్రిందులై పెరిగి పక్వమైన వాడు. పెక్కు అనుభవాలను, భావాలను సేకరించుకొని సాహిత్య కావ్యాలు అల్లినవాడు. లేఖా సాహిత్యముకన్న భిన్నమైన డైరీ సాహిత్యానికి ఇతనే ఆద్యుడని చెప్పాలి. ఎవరినో అనుసరించలేదు. తనదైన ముద్రను వేసికొని నిబ్బరముగా సాహిత్య పీఠముమీద కూర్చొన్నవాడు.

3 సంవత్సరాల వియోగ దుఃఖ కాన్వాస్‌పై, అనేక విభిన్న చిత్రువుల గీసికొన్నవాడు. ప్రకృతిని ప్రేమించి, అట్టడుగున జీవించే మానవుల అభిమానించి, ప్రపంచానికి ఇంటి కప్పువలె మెరిసే ఆకాశాన్ని, విహరించే మబ్బులను తిలకించినవాడు.

ప్రేమలో పల్లవించిన శోకము శ్లోకమైనది. రామచరితగా సృష్టించింది గంగాతీరమున. చలువరాతి అందాలగోపురమై, అమ్లాన కమనీయ సౌందర్య పుష్పగుచ్ఛమైనది యమునాతీరమున.

ఎన్నెన్ని సంస్థలు, ధర్మశాలలు, ఆసుపత్రులు, బడులు యీ దుఃఖ పునాదులమీద నిర్మింపబడినవో !

ప్రేమ, దుఃఖము అవసరము హృదయాన్ని ప్రేరేపించడానికి, కల్పనాలోకాన్ని సృష్టించడానికి. శాశ్వత వియోగమైన మరణము నాశనము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేసేదే కాదు సృష్టించేదికూడ‘మరణము లేకుంటే జీవితములో ఆనందమేమిటి’ అంటాడుగాలిబ్.‘మృత్యు మాధుర్యాన్ని కలిపితివి జీవితములో’అంటాడు రవీంద్రుడు.‘వెనుక వచ్చి ముందు పోవుట యింకొక సభలో స్వాగతమిచ్చుటకా’ అన్నాడు యువకవి చనిపోయినప్పుడు రవీంద్రుడు.

మరణం స్మరణయైనది.

మృతి స్మృతియైనది.

ఆగష్టు 1వ తేదికి మూడు సంవత్సరాలైనది భరద్వాజకు దారావియోగమై. దుఃఖించాడు. విలపించాడు.తట్టిన భావాలను, కల్పనలను డైరీకి ఎక్కించాడు. మూడు సంవత్సరాలలో మూడు కావ్యాలు“నాలోని నీవు, అంతరంగిణి, ఐతరేయం” వెలికి వచ్చాయి. శోక నేపథ్యములో అనేక చిత్రములను రచించాడు. ఆకాశాన్ని చుక్కలను మబ్బులను అనేక కోణాలనుంచి చూచాడు. వాటి నన్నిటిని కుప్పగా ఒక్కచోట చేరిస్తే, విచిత్రమైన చిత్రమేయగుతుంది. ఆకసపు సొబగులను వాక్యాల అద్దములో చూపించాడు. ‘సిరా వరద’ అన్నాడు చీకటిని.

జీవన సమరము తోనే ఆయన సాహిత్యముతో పరిచయము. అంతకు ముందు ఎన్నో ఎన్నో, సందో సందో వ్రాశాడు. అవి నాకు తెలియవు. జీవనసమరము క్రొత్త ప్రక్రియ. చిన్న చిన్న వృత్తులవారి జీవితాలను, వారి కష్టసుఖాలను నేరుగా అడిగి వ్రాసిన చిత్రాలు. నాకు తెలియని సందులలో తిరుగుచున్నట్లనిపించింది. నేను ఎప్పుడూ వెళ్ళని ఇరుకు గొందులుగా ఉండినాయి. విజయవాడ సభలో ప్రసంగించాను. అదే పేరుతో దీర్ఘ కవిత వ్రాశాను. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది భరద్వాజకు. ఆనాటి నుండి ఆయన భాష పెరిగింది. భావాలు లోతును పొందాయి. కల్పనలు ఉన్నత గిరి శిఖరాలపై ఎగిరాయి. వ్యాకరణ ఉపమలను వాడాడు. కాళిదాసు వలె, అక్షరానికి అక్షరం చేరితేగాని పదం కాదంటాడు. సమాన అంతస్థులో, చరణాలు తేటగీతివలె ఉండాలిగాని, కంద పద్య చరణాలవలె ఉండరాదంటాడు. ఈ చమత్కారాలు రమ్యంగా ఉంటాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూడు సంవత్సరాలు దాటాయి. మూడు పుస్తకములు వచ్చాయి. ఈ కావ్యత్రయము చాలదా? నిత్య కృష్ణ పక్షమా? ముఖారిరాగం మాని ఆనంద భైరవిలో రాగాలు తీసేదెప్పుడు? ఇటీవల భవభూతిని - చదువు చున్నట్లున్నాడు భరద్వాజ. విషాదమూర్తియైన రాముని వర్ణించిన కవిని, "ఎంత బాగా వ్రాశాడు భవభూతి" అంటాడు. కళ్ళల్లో ముక్కులో నీరు కారే రాముని చూడాలని లేదు. శోకముతో బాధపడే రామ చరితయైన ఉత్తర రామాయణము చదవాలనే కోరిక నాకు పోయింది. కళ్యాణ రాముడు, కోదండ రాముడు చిత్ర కూటమిలో పట్టాభి రాముని చూడాలనే కోరికేగాని, దిగులు కుప్ప, ఆర్తి విహ్వలుడు, దుఃఖ దంష్ట్రుడు దాశరథిని చూడాలని లేదు. పట్టాభి రాముడుతోనే సమాప్తము చేశాడు రామాయణాన్ని వాల్మీకి. ఉత్తర రామాయణమనే మాటలోనే ఉన్నది రామాయణము కాదని.

అట్టమీద త్రిశూలధారియైన ఈశ్వరుని బొమ్మ వేశాడు. ఆయన జీవిత హాలాహలాన్నంతా మూట కట్టి గొంతులో దాచి వేశాడు. నాగభూషణుడై ఢమరుక హస్త భూషణుడై తాండవమాడిన నటరాజు. ఢమరుక వాద్యాలే లయ విశేషాలయ్యాయి. రంగేశుడై నృత్య వివిధ భంగిమల ప్రదర్శించాడు నటరాజు.

నీకు భాష యున్నది వ్రాశావు. భావాలు కల్పనలు ఉన్నవి. కావ్యాలు ప్రచురించావు. సన్మానాలు పొందావు. కాని వ్రాయలేని, కావ్యాల ప్రచురించలేని, తల్లులు, భార్యలు, కుమార్తెలు, ఆత్మీయులు చనిపోగా, ఎన్ని లక్షల మంది భాషకు మించిన మౌనముతో విలపించిరో ఎన్నడైనా విచారించావా? నిద్రా భంగమైన రాత్రిళ్లు, ఒంటరిగా కూర్చున్న పగటి పూట చుట్టాల స్మృతిస్మృతి హృదయ కవాటాలకట్టి దిగులుతో ఏమీ తోచని స్థితిలో గుండె బరువుతో ఆగిపోయేకో నీకు తెలియదా? ఆ లక్షల మంది ఆర్తులలో నీవూ ఒకడవు. నీకు భాషా చాతుర్యమున్నది. భావాలు క్రుమ్మరించావు. అలా చేయలేని వారి కను రెప్పల తడిని చూచి ఓదార్పును పొందు. ధైర్యమును పూను!

విషాద తిమిర గుహ నుండి బయటికిరా! వెలుగును, వెన్నెలను, వసంతన్ని చూడు డైరీలు వ్రాయి కాని ఆనంద కావ్యాలు వ్రాయి. శిశిర వేషాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తీసివేయి. ఆమని వెచ్చదనానికి స్వాగతము పలుకు. దక్షిణ సమీరాలతో సంభాషించు.

కాల ధన్వంతరి గమ్మున కూర్చొని లేడు. అమృత హస్తాలతో నీ దిగులు అక్షరాలను, బొమ్మలను తుడిచి వేశాడు. నీ గుండెగాయాలు మానినవి. హృదయాన్ని వికసింపచేసి, శత పత్రాల పరిమళము వెదజల్లాలి. నీ నైపుణ్యము, చతురత ఇతోధికముగా ముమ్మందు చిగిర్చి, పుష్పించి, సౌరభములు నలు దిక్కుల వ్యాపించాలి. వయస్సుతో కూడ ప్రతిభ పెరగాలి. ప్రశస్తి పొందాలి.

విషాద అర్జునుడు దేవదత్తమును పూరించే విజయుడు కావాలి!

ఆనందం, శుభమస్తు !

(1989 ఆగష్టు 1వ తేదీ మంగళవారం నాడు బెంగుళూరు విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖ వారి ఆధ్వర్యాన డాక్టర్ రావూరి భరద్వాజగారి 'ఐతరేయం' గ్రంథా విష్కరణ సభలో, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి ఉపన్యాస సారాంశం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నమస్కారం

ఈ నాలుగవ స్మృతి కావ్యాన్ని ఈ రూపంలో తీసుకురావడానికి సహకరించిన శ్రీ బి. కె. రావు గారికి, అడిగిన వెంటనే తమకు గాఢంగా తెలిసిన భరద్వాజను కొత్త కోణం నుంచి మనందరకూ పరిచయం చేసిన జస్టిస్. జి. రామానుజులు నాయుడు గారికి, బెంగుళూరులోవి తమ ఉపన్యాస సారాంశాన్ని ముద్రించుకొనడానికి అనుమతించిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి, గ్రంథంలోని ఆత్మీయతను ముఖ చిత్రంగా మలిచి యిచ్చిన డాక్టర్ బాపు గారికి, అన్నింటా నాకు అంద దండలుగా నిలబడిన మిత్రుడు వాడ్రేవు పురుషోత్తం గారికి, కృతజ్ఞతాభి వందనాలు.

5-3-90 త్రిపురనేని సుబ్బారావు

హైదరాబాద్-890 సంపాదకుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నా జీవితాన్ని భాస్వంతం చేసిన

కాంతమ్మకు

ఆమెను శ్రీమతిగా ప్రసాదించిన

ఈశ్వరునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ రచయితవే
మరికొన్ని రచనలు

నాలోని నీవు
అంతరంగిణి
ఐతరేయం
పాకుడు రాళ్ళు
కాదంబరి
శ్రీరస్తు
సౌందరనందం
ఇనుపతెర వెనుక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రభూ !

నేను నిన్నేమీ అడగడం లేదు. నాకేమీవద్దు. నాకేమీ అవసరం లేదు. అడిగిన ప్రతీదీ నువ్విచ్చావు ఇస్తున్నావు. నువ్విచ్చినప్పుడు, సంతోషంతో గంతు లేస్తాను. నీగురించి దిక్కులు వెలిగేలా కీర్తిస్తాను. ఇచ్చాక, నువ్వయినా మరిచిపోవాలి. కానీ, నువ్వలా చేయవు. నువ్విచ్చిన కానుకలచుట్టూ అల్లు కొనిపోయాక, వాటిలో నేను మునిగిపోయాక, ఆ వరాలను నీవు తీసేసు కొంటావు నాకు తెలీకుండానే ! అప్పుడు నీమీద కోపంవస్తుంది. లోకే శ్వరుడిపైన నిన్ను పడతిడతాను. అసలు నిన్నేమీ అడగలేదనుకో, అడిగినా నువ్వివ్వలేదనుకో, ఇచ్చినా నేను పుచ్చుకోలేదనుకో, ఇవ్వనిదాన్ని నువ్వెలాగూ తీసుకోలేవు గనక, నిన్ను తిట్టవలసిన అవసరమూ నాకుం డదు. అసలీ బాదరబందీలన్నీ నీతో నేను పడలేను. నీ వాక పేచీకోరువు. అవీ ఇవీ ఆశచూపి, నన్ను మభ్యపెట్టాలని చూస్తున్నావు. ఉన్న బరువులనే వొదిలించుకొంటూ నేను తేలికపడుతున్నాను; తేలితేలి నీవద్ద కొద్దామనీ, నిన్ను నావాణ్ని చేసుకొందామనీ !

.... అంతదాకా దేదీప్యమానంగా వెలుగుతూ వెలుగుతూన్నదీపం, ఆమెను చూస్తూనే, మెత్తగా ఆవలించి కన్నుమూయడానికి సన్నద్ధమవుతోంది.

"అదేమిటి ? నేను రాగానే తగ్గిపోతున్నా వెందుకు ?" అన్నదామె రవంత ఆశ్చర్యపోతూ.

"ఈ కుటీరాన్ని కాంతిపూరితం చేయడానికి, ఇద్దరం వెలగవలసిన అవసరం లేదు సోదరీ !" అన్నది దీపం నవ్వుతూ ....

(1-1-89 ఆదివారం)

"నువ్విప్పుడేగదా, ఆ కుటీరందాకా వెళ్ళావు ! అంతలోనే అక్కడినవ్వులన్నీ హఠాత్తుగా ఆగిపోయాయేం? దుఃఖం జ్వలించిపోయిందేం? ఇన్నిటికీ - అస లక్కడేం జరిగింది ? నువ్వేంచేశావు ?" అన్నాడతను

తల వొంచుకొని పోతున్న ఆ సుందరి అతని మాటలు విని, ఆగిపోయింది. అతన్ని తేరిపార చూసింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఇదివరకు, నిన్నెక్కడా ఎప్పుడూ చూడలేదు. ఓ సౌందర్యరాశీ ! నువ్వెవరివి ?" అన్నాడతను, ఓ అడుగు ముందుకు వేసి.

ఆమె కూడా, చప్పున ఒక్కడుగు వెనక్కు వేసింది.

"ఈశ్వర సందేశం అందించి వస్తున్నాను. నేను ప్రభు దూతికను" అన్నదా సుందరి తల దించుకొని.

"ప్రభు సందేశం ఆనందహేతువు కావాలిగదా ! మరి వారంతా దుఃఖిస్తున్నారెందుకు?" అన్నాడతను.

"అందుకొన్న వారికి ఆనంద హేతువే ! మిగిలిన వారికి మాత్రం కాదు" అన్నదా సుందరి తల ఎత్తకుండానే.

"అలాంటి ఆనందం నాకూ అనుభవించాలని ఉంది" అన్నాడతను ఆశగా, ఆమెవంక చూస్తూ.

ఆమె నవ్వి పోబోయింది.

"ఇంతకూ నువ్వెవరివో చెప్పనేలేదు. నీ రాకపోకలు రహస్యమా ?"అన్నాడతను ఆమెను అనుమానంగా చూస్తూ.

"ఎంతమాత్రం కాదు. ప్రభు దూతికనని చెప్పానుగదా !" అన్నదామె వెళ్ళబోతూ.

"పేరు ?" అన్నాడతను.

ఆమె ఆగి వెనుదిరిగింది.

"మృత్యువు" అన్నది అతన్ని పరిశీలించి చూస్తూ.

"ఓ దయామయీ ! నీ రాకకోసం ఎదురుచూస్తున్నాను. నన్నెప్పుడనుగ్రహిస్తావు ?" అన్నాడతను చేతులు జోడిస్తూ.

"ఈశ్వరేచ్ఛ!" అన్నదామె ముందుకు సాగారిపోతూ.

(2-1-89 సోమవారం)

"ఇలాచూడు!" అన్నారెవరో పైనుంచి.

అతను తల వొంచుకొన్నాడు చప్పున. అతనిప్పుడు ఆకాశంవేపు చూడడం లేదని, అతన్ని పిలిచిన వారికి తెలియదు. ఒకవేళ చూశాడో, ఏడ్చేస్తాడు, ఆమె కళ్ళు గుర్తుకొచ్చి. ఇప్పుడూ అదే జరిగింది అతను ఆకాశంవేపు చూశాడు. కళ్ళనిండా, కళ్ళనిండా, కళ్ళనిండా నీళ్ల నింపుకొన్నాడు. అతన్ని చూసి, అతని కన్నీళ్ళనుచూసి. మూలగా ఉన్న దీపం కూడా ఏడ్చేసింది. ఆ దీపానికి అతనూ తెలుసు. ఆమెగామా తెలుసు, వారి ప్రేమానురాగాలూ తెలుసు. అప్పుడెప్పుడో ఓసారన్నాడతను -

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అందరూ మెత్తని చేతులతో కౌగలించుకొంటారు. నీవేమో, నీ నవ్వులతో ఆలింగనం చేసుకొంటా" వని.

ఆమాట తలుచుకొని తలుచుకొని, తనలో తాను, చాలాసార్లు నవ్వుకొన్నదా దీపం. అతనంటే ఆదీపానికి చాలా ఇష్టం. అతను చదివిందంతా ఆ దీపమూ చదివింది. అతను రాసిందికూడా, తొలిసారిగా ఆ దీపమే చదివేది. అతనికి వెలుగునిస్తున్నందుకు, అది తరచుగా గర్వపడుతుండేది. అతను రాతిరంతా దుఃఖపడడం, లోకానికి తెలీదుగానీ, దీపానికి తెలుసు. అతన్ని ఊర డించుదామని గుంజుకులాడేది, రుంజుకులాడేది. కానీ - పాపం—ఎటూ కదలలేకపోయేది. తనలోతనే కుమిలిపోయేది. ఇప్పుడూ అదే జరిగింది. అతన్నిచూసి, అతని కన్నీళ్ళనుచూసి, వెలగడం కూడా మరిచిపోయింది దీపం !

బయటి ఆకాశం ఆక్రోశిస్తోంది బాధతో ..

(3-1-89 మంగళవారం)

....తూరుపు తలుపులు తెరుచుకొని, వెలుగులు చిమ్ముకొంటూవచ్చి, పడమటి వాకిలిగుండా వెళిపోతున్నాడు సూర్యుడు ఎప్పటిలాగానే ! కమ్ముకొస్తున్న చీకట్లను చిదిలింపచేస్తూ మినుకు గీతాలను పాడుకొంటున్నాయి తారకలు పూర్వంలాగానే ! వెన్నెల ధారలు నా లోపలా వెలుపలా చిందిపడుతున్నాయి మామూలుగానే ! వసంత గ్రీష్మాలూ, హేమంత శిశిరాలూ, నన్ను పరా మర్శించి పోతున్నాయి యధాపూర్వంగానే ! కాలం తరుగుకొస్తోంది శరీరం శిధిలమయిపోతోంది. జ్వలిత శీతల మృత్యు స్పర్శ, నన్ను నిశ్చలితం చేయకముందే - ఒక్కసారి నిన్ను చూడనీ ...

"అలా ఉన్నావేం ?" అన్నాడు పవనుడు.

మేఘ కన్య మాట్లాడలేదు.

"నేనంటే కోపమా ? నామీద అలిగావా ?" అన్నాడు మరింత లాలనగా.

"అమ్మను చూడాలని ఉంది !" అన్నది మేఘకన్య.

"ఇక్కణ్నించికూడా కనబడుతూనే ఉందిగదా! " అన్నాడతను.

"దూరంనించికాదు - దగ్గరగా - తాకేంత దగ్గరగా వెళ్ళిచూడాలనుకొంటు న్నాను" అన్నది మేఘకన్య తల ఎత్తకుండానే !

"రా వెడదాం!" అన్నాడు పవనుడు

గాలితరగా, వానచినుకూ, అప్పుడు నేలమీది కొచ్చాయి.

చిన్నీ ! నీవు నా వానచినుకువు. నేను - నీ గాలి తరగను

(4-1-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రా చిన్నీ రా ! నా కోసం రా ! !
నేను మొక్కనయినప్పుడు - నీవు చిగురులాగా రా !
నేను పూవునయినప్పుడు - నీవు పరిమళంగా రా !
నేను మబ్బునయినప్పుడు - నీవు మెరుపులాగా రా !
నేను నిశినయినప్పుడు - నీవు శశిలాగా రా !!
రా చిన్నీ రా ! నా కోసం రా !!
నేను మూగినయినప్పుడు - నీవు మాటగా రా !
నేను అంధుణ్నయినప్పుడు - నీవు చూపుగా రా !
నేను రాయినయినప్పుడు - నీవు శిల్పిగా రా !
నేను అడవి నయినపుడు - నీవు హరితంగా రా !!
రా చిన్నీరా ! నాకోసం రా !!
నేను వేణువయినప్పుడు - నీవు సరిగమగా రా !
నేను అక్షరమయినప్పుడు - నీవు కావ్యంగా రా !
నేను శిశువునయినప్పుడు - నీవు అమ్మగా రా !
నేను శివుడినయినప్పుడు - నీవు పార్వతిగా రా !!
రా చిన్నీ రా ! నా కోసం రా ! !

* * *

"ఎవరది ?" అన్నాడతను అడుగుల చప్పుడు విని.
"తిమిరచ్ఛాయను !" అని - వినిపించింది.
"ఎక్కడికి పోతున్నావ్ ఒంటరిగా, ఈ నిబిడాంధకారంలో ?" అన్నాడతను.
"ప్రాతస్సంధ్యా సముద్రం వేపుకు" అన్నదామె.
"అయ్యో ! అటు వెళ్ళకు. నురుగులు చిమ్మే కాంతులలో నువ్వు మునిగిపోతావు !" అన్నాడతను
"అందుకే - ఆకాంతి సముద్రంలో మునిగిపోయి - నా స్వామిలో కలిసిపోయేందుకే - నేను వెళుతున్నాను" అన్నదామె ముందుకు పోతూ....

(5-1-89 గురువారం)

ప్రభూ !
నువ్వేమయినా ఇవ్వగలవు. ఎన్నయినా ఇవ్వగలవు. కానీ మేము మాత్రం స్వల్పమైనవీ, అల్పమైనవీ, నిన్నడుగుతూ ఉంటాం ! మా అల్పత్వాన్ని చూసి, నీ వెప్పుడూ కోపగించుకోవా ? మేమడిగితే, నిన్ను నీవే ఇచ్చుకొంటావు గదా ! సకల లోకాధీశ్వరుడివైన నిన్ను అడగకుండా, నీవు అలవోకగా రాల్చే, చిన్నచిన్న విదిలింపులకోసం మేము పాకులాడుకుంటే, నీకు నవ్వు రాదా ప్రభూ ?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనంతా కరిగిపోయి, పెదవులుగా మారిపోయి నీపాదాలను చుంబించాలని ఉంది నాన్నా ...

(6-1-89 శుక్రవారం)

ప్రభూ !
ఈ ప్రపంచం మీద ప్రీతితో, నేను పునర్జన్మను అర్థించడం లేదు. మరణానికీ, మరు జన్మకూ మధ్యగల వ్యవధిలో, నిన్ను చూసే - మహోన్నతో ద్విగ్నమైన, అభివ్యక్త్యా తీతమైన, అనుభం కోసమే, నేను మళ్ళీ మళ్ళీ పుట్టాలనుకొంటున్నాను. ఆ వొక్క వరాన్ని నాకివ్వు.
ప్రభూ !
ఎక్కడి నుండి వచ్చానో తెలీదు. ఎందు కొచ్చానో తెలీదు. ఎక్కడి కెళ్ళాలో తెలీదు. ఎప్పుడు వెళ్ళాలో తెలీదు. నిన్ను నమ్ముకొన్న వాణ్నిగదా! మరీ ఇంత మాయ ముసకలో, నన్నుంచితే ఎలా స్వామీ? ఇంక దేన్ని గురించి తెలుసుకొనే వ్యవధీ నాకు లేదు. కనీసం నీ గురించి నా కయినా చెప్పక పోతే ఎలా నాన్నా? నిన్నడిగే హక్కు నాకున్నది. ఒకేవొక ప్రశ్న అడు గుతున్నాను చెప్పు నాన్నా! నేనెవరిని? నేనెవరిని?? నేనెవరిని??? .

(7-1-89 శనివారం)

నక్షత్రాలను నిదురపుచ్చి, నిబిడతిమిరం మీంచి, మెలమెల్లగా విన వస్తున్న అడుగుల చప్పుడు, నీదేనని నాకు తెలుసు.
క్షీరపథం ఆవలితీరం నుంచి, సన్నగా వినబడుతున్న ఆ పాట, నా కోసం నీవు గానం చేస్తున్నదేనని నాకు తెలుసు.
కారునల్లని కాల మేఘాల అంచుల నిండా, మెరుపుల పొడులను చల్లింది నీ చూపులేనని నాకు తెలుసు. నేనిక్కడ సిద్ధంగా ఉన్నాను. రా! నన్ను నీహృదయానికి హత్తుకో. నీతోకి తీసుకో ....

(8-1-89 ఆదివారం)

ప్రభూ !
ముగిసి పోతోం దనుకొంటున్న క్షణంనించే, నీసృష్టి ఆరంభమవుతోంది. విలయ విధ్వంసంలోంచే విమలాంకురం మోసు లెత్తుతోంది. మృతంలోంచి అమృతం. మరణం లోంచి జననం. మరణమే మరో జనన మవుతోంది. ఏది నాకు 'సత్యం'గా తోస్తోందో అదే మరొకరికి 'మాయ'గా అనిపిస్తోంది.
"ఈశ్వరుడు మాయ!" అంటాడతను.
"కాదు" అంటాన్నేను.
ఈ సత్యా సత్యాల చర్చల చుట్టూ, సమూహాలుగా చేరి, ఆసక్తిగా వింటారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మా శబ్ద చమత్కారాలతో శ్రోతలు ఉద్రూతలూగి పోతారు. చర్చించు కొంటున్న అతనూ నేనూ, మీకళ్ళ ముందే రాలిపోతాం. కానీ ఈశ్వరుడు సత్యమో అసత్యమో తేలదు. వాదోప వాదాలు, చర్చోప చర్చలు – ఈ సత్యా సత్యాల మీది ముసుగును ఎప్పటికీ తొలగించలేవు; ఒక్క అనుభవంతప్ప

క్షితిజంలోకి జారిపోతూ పోతూ, నిశా గృహ కవాటాలను తెరిచాడు మరునాడు. అక్కడ నవ్వు కొంటూ నుంచుని ఉన్నది శశిరేఖ...

(9-1-89 సోమవారం)

"నువ్వీ పిట్టల్లో, చేమల్లో ఎందుకు తిరుగుతున్నావ్?" అన్నదామె.

"ఆ చివురులోనూ, ఈ మొగ్గలోనూ నిన్ను చూస్తున్నాను గనక!" అన్నాడతను.

"నువ్వీ కొండల్లో కోనల్లో ఎందుకు తచ్చాడుతున్నావ్? " అన్నదామె.

"ఆ రాయిలోనూ, ఈ రప్పలోనూ, నీవు కనబడుతున్నావు గనక!" అన్నాడతను.

"నువ్వీ దిక్కులతో చుక్కలతో ఎందుకు మాట్లాడుతున్నావ్?" అన్నదామె.

"ఈ దిక్కుగారూ, ఆ చుక్కగారూ, నీ అంత అందంగానూ మాట్లాడుతారు గనక!" అన్నాడతను.

"మరి - నువ్వీ దుఃఖంలో ఎందుకున్నావ్ కన్నా?" అన్నదామె.

"నువ్వెందులోనూ కలిసి పోయావుగనక!" అన్నాడతను ఏడ్చేస్తూ...

(10-1-89, మంగళవారం)

"ప్రభు దర్శనం కోసం వచ్చాం!" అన్నారు భక్తులు.

"ప్రభువు లేరు" అన్నాడు దేవదూత.

"ఎందుకట్లా? మే మొస్తున్నామని ముందుగానే చెప్పామే!" అన్నారు భక్తులు, గొణుక్కొంటూ.

"ప్రభువుకు అదీ తెలుసు" అన్నాడు దేవదూత.

"వారి కోసం మేము, పూవులూ కాయలూ తెచ్చాం" అన్నారు భక్తులు.

దేవదూత నవ్వాడు.

"మీరు, పూవులూ కాయలూ తెంపుకొచ్చిన, తీవెలూ చెట్లూ, తమ బిడ్డలను కోల్పోయి నందుకు బాధతో ఏడుస్తున్నాయి. వాటిని వోదార్చడం కోసం ప్రభువు వెళ్ళాడు" అన్నాడు దేవదూత ...

(11-1-89 బుధవారం)

"ఎలా ఉంది ఢిల్లీ?" అన్నది కాలువ, నన్ను ఆప్యాయంగా పలకరిస్తూ.

"చల్లగా ఉంది - నేను భరించలేనంత చల్లగా" అన్నాను.

"ఎందుకని?" అన్నది కాలువ, అమాయికంగా నన్ను చూస్తూ.

"అన్ని రాష్ట్రాల భవిష్యత్తు, దేశ భవిష్యత్తు, ఢిల్లీ చేతుల్లో ఉంది. కోట్లాది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రజల్ని ఉద్ధరించేందుకు మాత్రమే పదవులలో కొచ్చిన మన ప్రియతమ నాయకులు, మన సంక్షేమం కోసం, అక్కడ చర్చలు జరుపుతారు. సంప్రదింపులు, రాయబారాలు, గోష్ఠులు, సభలు, ఊరేగింపులు, సమ్మెలు, కుట్రలు హత్యలు జరుపుతారు. ఈ హడావుడులకు తట్టుకోలేక వేడెక్కిన ఢిల్లీ నగరం దహించుకు పోకుండా, ఈ చల్లదనం కమ్మేస్తూ ఉంటుంది" అన్నాను.

"వానలు కూడా ఎక్కువేనని విన్నానే!" అన్నది కాలువ.

"జడిపకొట్టి రోజులకొద్దీ, ధారాపాతంగా, వర్షాలు పడక పోతే, ఏం జరుగుతుందో తెలుసా? ప్రజా సంక్షేమం కోసం, ఏడాది పొడవునా జరిగిన మోసాలు, వాగ్దానాలు, చట్టాలు, శాసనాలు, కుంభకోణాలు, ముఠాల మార్పిడులు, కొండలాగా పేరుకు పోయి, ఢిల్లీ నగరం గబులెత్తి పోతుంది. ఈ చెత్తనంతా ఎత్తి వేయడం మానవ మాత్రులకు సాధ్యం కాదు. అందుకే, జడిపట్టి వానలు కురుస్తాయి" అన్నాను.

కాలువ గారు, నావైపు ఆశ్చర్యంగా చూశారు.

"మరి - మిటమిటలాడే ఎండ లెందుకొస్తాయి?" అన్నారు కాలువగారు.

"వానకు తడిసి తడిసి, నానిపోయిన నగరం, ఫెళ ఫెళ లాడుతూ, ఆరడానికి అపాటి ఎండలు కూడా అవసరమే! నీకు తెలీదేమో మరి - అక్కడ - సూర్యుడు కూడా భయపడుతూ, భయపడుతూ ఉదయిస్తాడు. వీలైన ప్రతిసారీ, మబ్బుల మాటున ముఖం దాచుకొంటాడు. తొరతొరగా వెళిపోతాడు. అక్కడ ప్రతి రాత్రీ గజ గజలాడి పోతూనే ఉంటుంది. ఏ దోపిడీలను, దహనాలను, మాన భంగాలను, రక్తపాతాలను, ఆర్తనాదాలను, తాను దాయవలసి వస్తుందోనని, ప్రతి నిశీధమూ హడలి పోతూ ఉంటుంది!" అన్నాను.

"ఇన్నిటికీ మీ ఆరోగ్యం ఎలా ఉందో చెప్పారు గాదే!" అన్నది కాలువ విషయాన్ని తప్పిస్తూ.

ఢిల్లీని గురించిన మరి కొన్ని వివరాలు వినడం, దాని కిష్టం లేదని నాకిట్టే తెలిసిపోయింది ...

(12-1-89 గురువారం)

"బొత్తిగా ఇటు కేసే రావడం లేదేం?" అన్నదా తీగె, నా భుజాన్ని మృదువుగా తడుతూ.

"ఊహ్నో లేను. నువ్వు క్షేమంగా ఉన్నావా?" అన్నాను.

"ఇదిగో - ఇల్లాగా!" అన్నదా తీగె, గాలికి అటూ ఇటూ ఊగిసలాడిపోతూ.

"ఎవరో దోవంట అనుకొంటూ పోతుంటే విన్నాను."

"ఏమని?"

"హస్తినాపురంలో ఉన్న బిల్డింగుల్ని సంవత్సరం పొడవునా, బాగుచేస్తూ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగు వేస్తూ ఉంటారట. నిజమేనా?" అన్నదా తీగె.
"నిజమే! పార్లమెంటు, సచివాలయం, వివిధ మంత్రిత్వ శాఖల భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల గోడలకు క్షుణ్ణంగా తెలుసు; తమ మధ్య జరుగుతున్న దేమిటో. అబద్ధాలు వినీ వినీ; అక్రమాలను చూసీ చూసీ; కుట్రలనూ కుహకాలనూ భరించీ భరించీ; ఆ గోడలు కూడా విసుగెత్తి పోవడం సహజం! అక్కడి అతి రహస్యాలను, బయటికి కక్కేస్తాయేమోనని, పాలక వర్గాలకూ, అధికార వర్గాలకూ, చచ్చేటంత భయం! అందుకే ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేస్తూ కొత్త కొత్త రంగుల్ని వాటికి దట్టంగా పామేస్తూ ఉంటారు, వాటి నోళ్ళు బిగుసుకు పోయేలాగా" అన్నాను.
నమ్మండి! ఆతీగె అక్షరాలా నొచ్చుకోవడం చూశాక, నాకే 'అయ్యో! పాప' మనిపించింది ..
(13-1-89 శుక్రవారం)
"మీ మనుషులు చేయలేనిపని చేస్తున్నందుకు. నాకు చాలా గర్వంగా ఉంది" అన్నదా చెట్టు, మూడున్నర వారాల తరువాత నన్ను చూస్తూ.
"ఏమిటా పొగరు? మనిషికీ నీకూ సాపత్యమేమిటి?" అన్నాను.
"మీలాంటి మనుషులంతా కలిసి, మీలోంచి, మీవంటి మనిషినే దూరంగా తరిమేశారు. ఆమెకిప్పుడు నేనే ఆశ్రయమిచ్చాను" అన్నదా చెట్టు నన్ను అపహసిస్తూ. ఆ చెట్టు మొదట్లో, ఓ పిడికిలంత మనిషి, పిట్టలాగా వొదిగి ఉండడం కనిపించింది నాకు
"మీరు చేయవలసిన పనిని, చేయనందుకు విచారిస్తున్నాను. అదే సమయంలో ఓ సత్కార్యం చేసే అవకాశాన్ని కలిగించినందుకు, ఈశ్వరునికి, ధన్యవాదాలు చెప్పుకొంటున్నాను" అన్నదా చెట్టు ఆకు మునివేళ్ళతో ఆ ముసలవ్వను గోముగా నిమురుతూ
"నువ్వెవరివి? ఎందుకిలా పదే పదే నా దగ్గర కొస్తున్నావ్?" అన్నాడతను ఆమె వేపు చూస్తూ,
"నాపేరు సుషుప్తి" అన్నదామె అతన్ని జాలిగా చూస్తూ "నేను చాలా కాలంగా వొస్తున్నాను. కానీ నన్ను నీవు కన్నెత్తి కూడా చూడడం లేదు."
"ఈ దోషం నాది కాదు. ఆమెగారు నాస్మృతి పథంలో కొచ్చి, నీకూ నాకూ మధ్యగల దూరాన్ని - మరింతగా పెంచారు" అన్నాను.
"ఆమె తేనప్పుడే వొద్దామని, ఎదురు చూస్తూ కూచున్నానిక్కడ. ఆమె నీ జ్ఞాపకాల్లోంచి పోదు. అంతదాకా నేనురాను" అన్నది సుషుప్తి అతన్ని చూసి నవ్వుతూ ...
(14-1-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"కన్నా ! నేనిక్కడ సుఖంగా ఉన్నాననుకోకు. ఈశ్వర సాన్నిధ్యంలో ఉంటేనేంగాక, నా మనసంతా, నీతోనే ఉన్నదయ్యా ! నీక్కావలసినవేవీ ఇక్కడ లేవు. అవన్నీ నీలోనే, నీతోనే, అక్కడే ఉండిపోయాయి. నాకేం కావాలి కన్నా నీవు తప్ప ! నిన్ను నాకు దూరంచేసి, నిన్నూ నన్నూ ఏడిపిస్తున్నాడు ఈశ్వరుడు. నేను లేని శూన్యాన్ని భరించలేకనే, నీవు దిక్కుమంటున్నావని నాకు తెలుసు. నిన్ను ఓదార్చే వారెవరూ ఇప్పుడు లేరు కన్నా! నేను - రావడానికి ముందు, చాలా చేదుల్ని, కన్నీళ్ళను, నిశ్శబ్దంగా దిగమింగావు; పరమశివుడు హాలాహలాన్ని మింగినట్లుగా. రానున్న ఈ నాలుగు రోజులూ, మనసును నెమ్మదించుకో. నిన్ను నీవే వోదార్చుకో. నీవాఖైదు లోంచి రాలేకపోతున్నావు. నేనీ బంగారు కోటలోంచి బయటపడలేక పోతున్నాను. నీవో దురదృష్టవంతుడివి. నేనో శాపగ్రస్తురాలిని .. " అన్నదామె దిగులుగా.

చిన్నీ !

నా సమాధిని పాలరాళ్ళతో ఎవ్వరూ కట్టరని నాకు తెలుసు. నీ సమాధి పక్కనే, నా సమాధిని కడితే నా కంతే చాలు. నీ జ్ఞాపకాలమధ్య నేనుంటే చాలు. మన మిత్రులనూ, పిల్లలనూ, నేనదే కోరుతున్నాను.

కారు మొయిళ్ళు ఆకాశంనిండా అల్లుకుపోయాయి. చుక్కలదీపాలు కూడా ఆరిపోయాయి. నీవు నా గొంతు గుర్తించగలవని, నీకు నచ్చిన గీతాన్ని ఆలాపిస్తున్నాను. గాలి విసురుకు, నా పాట ముక్కలు చెక్కలయి పోతోంది. నీ కోసమని వెలిగించిన పన్నీటి దీపం ఆరిపోకుండా గుండె మూలన దాచాను. హృదయ కవాటాలను, వారగా తెరచి ఉంచాను నీవొస్తావని ....

(15-1-89 ఆదివారం)

"నీకన్నా నేనే ముందు పోవాలి కన్నా ....ఉండు....నన్ను చెప్పనివ్వు మరి. ఎందుకంటే - నా చిన్నతనమంతా-సుఖంగా గడిచిపోయింది నాన్నా ! నీ దగ్గరి కొచ్చాక - నా కసలేదిగులూ లేదు. నన్నిలాగే, నవ్వుకొంటూ నవ్వుకొంటూనే పోనీ:మా అమ్మ - గంపెడు పసుపుకుంకుమలతో,లక్ష్మీ దేవిలాగా వెళ్ళిపోయింది నన్నూ అలాగే వెళ్ళనీ" అన్నదామె, చూపులతోనూ, మునివేళ్ళతోనూ అతన్ని నిమురుతూ.

అతని కన్నుల్లో నదులు పొంగాయి.

"కన్నా ! నీ చిన్నతనమంతా, నిప్పులమధ్యనే గడిచిపోయిందయ్యా ! అందులో కాగికాగి నిగ్గుతేలావు. నీవూ నేనూ లేకపోతే పిల్లలు ఏమయిపోతారో నన్నదే నా దిగులు. అందుకోసమైనా, నువ్వింకా ఉండాలి. లేకపోతే,కలిసే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెళ్ళేవాళ్ళం. పిల్లలందర్నీ ఒక ఒడ్డుకు చేర్చాక వాచ్చేసెయ్యి. అందాకా-నేను లేనన్న బాధను తట్టుకొనగల గుండె ధైర్యాన్నివ్వమని, భగవంతుణ్ణి వేడుకొంటున్నాను" అన్నదామె రెండు చేతులనూ జోడించి.

ఆమె పొట్టలో తలదూర్చి, పసివానిలా ఏడ్చాడతను.

"నీ కింత చాకిరీచేసి, ఈ జన్మలోకూడా కాస్త పుణ్యం సంపాదించుకొందామనుకొన్నాను. నా కర్మ కాలిపోతే, నీ చేతనే చేయించుకొంటున్నాను" అన్నదామె, కాళ్ళను వొళ్లో ఉంచుకొని, మందు రుద్దుతున్న భర్తవేపు కన్నీళ్ళలోంచి చూస్తూ.

"నువ్వేజన్మలోనో, తక్కువ నోములు నోచుకొని ఉండాలి. అందుకే నా లాంటి వాడికి ఇల్లాలి వయ్యావు. నేనేమో, మోయలేనంత పుణ్యం చేసుకొని ఉంటాను; నిన్ను భార్యగా పొందడానికి !" అన్నాడతను వెక్కిళ్లపడుతూ.

"నువ్వు నా బంగారుకొండవు కన్నా !" అన్నదామె అతని తడి చెంపల్ని సున్నితంగా రాస్తూ ....

(16-1-89 సోమవారం)

నా క్కాస్త దారి ఇవ్వండి - నా చిన్ని దగ్గరకు నన్ను వెళ్ళనివ్వండి
ఆమె చూపుల వెన్నెలలో నన్ను తడవనివ్వండి
ఆమె నవ్వుల వెలుగులలో నన్ను మునగనివ్వండి
ఆమె నుదుటిమీద నన్ను కుంకుమను దిద్దనివ్వండి
ఆమె పాపిటలో నన్ను సిందూరం అద్దనివ్వండి
ఆమెను కన్నారా తని వారా నన్ను చూడనివ్వండి
ఆమెను చూస్తూ చూస్తూనే నన్ను చనిపోనివ్వండి
దయచేసి, నా క్కాస్త దారి ఇవ్వండి
నా చిన్ని దగ్గరకు నన్ను వెళ్ళనివ్వండి ....

(17-1-89 మంగళవారం)

నీ వడిగినవన్నీ నీ కొస్తాయో రావో తెలియదుగానీ, అడగడంద్వారా నీవు పోగొట్టుకొంటున్నది; నీవు పొందేదానికన్నా ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది - ఒక్క ఈశ్వరుని విషయంలో తప్ప ....

చిన్నీ ! నా కిప్పుడు క్షణంకూడా తీరుబాటు లేదు. పగలంతా నీ గురించి కలలుకంటూ ఉంటాను. రాత్రంతా ఆ స్వప్నశకలాలను ఏరుకొంటూ ఉంటాను.

నీ వున్నంతకాలం, నా జీవితం వైభవోపేతం, నీ అనంతరం నా జీవితం శోభా దరిద్రం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అందరం ఈ వొడ్డునుండి ఏడుస్తున్నామే తప్ప, ఆ వొడ్డుదాకా ఎవ్వరమూ రాలేదు. మీ నాన్న రాలేదు.
నీ తోడ బుట్టినవారు రాలేదు. నీ కన్న బిడ్డలు రాలేదు.
ఆఖరుకు నేనూ రాలేదు. ఇదీ లోకమంటే ! వీరూ మనుషులంటే !
నా కున్న వొకే వొక ఆయుధం ఆత్మవిశ్వాసం
నీ కున్న వొకే వొక ఆభరణం ఆత్మగౌరవం
నా ఆయుధం ఎన్నడూ వెనుకకు తగ్గలేదు
నీ ఆభరణం ఎప్పుడూ మెరుగు కగ్గలేదు ....

(18-1-89 బుధవారం)

... "మంచి వర్ణ చిత్రాన్ని చూస్తున్నంత సేపూ,మంచి కవిత్వాన్ని చదువుతున్నట్టుగా ఉండాలి. మంచి కవిత్వాన్ని చదువుతున్నంత సేపూ, మంచి సంగీతం వింటున్నట్టుగా ఉండాలి. మంచి సంగీతం వింటున్నంత సేపూ, మంచి తైల వర్ణ చిత్రాన్ని చూస్తున్నట్టుగా ఉండాలి. అదీ సరైన కొలబద్ద" అన్నాడతను.
ఆమె ఓ క్షణ కాలం ఆలోచించి నవ్వింది. "ఒకవేళ - ఈ మూడూ ఒకేసారి తటస్థ పడినప్పుడెలా ఉండాలి కన్నా ?" అన్నదామె, అతన్ని చూస్తూ.
అతను-ఒలిప్తకాలం ఆలోచించాడు.
"అప్పుడేమో - నిన్ను - చూస్తున్నట్టుగా ఉండాలి చిన్నా!" అన్నాడతనూ నవ్వేస్తూ ....

(19-1-89గురువారం)

ప్రభూ :
నిన్ను చూస్తుంటే, నాకొక్కోసారి చెప్పలేనంత నవ్వొస్తూ ఉంటుంది. ఎవరి వినోదంకోసం, నువ్వీ సృష్టిని చేశావో తెలీదు. మనిషిని సృష్టించావు సరే - వాడిలో ఎంతో క్రూరత్వాన్ని కూడా ఇరికించావు. వాడే మోయలేనంత అహంకారాన్నీ, అజ్ఞానాన్నీ కూర్చి కూర్చి పెట్టావు. కుమ్మరినీ, మట్టినీ మరిచిపోయిన కుండకూ, ఈ మనిషికీ తేడా లేకుండా చేశావు. అదీ నీ వినోదం. నీ కయితే, అది వినోదమేగానీ, నాలాంటి అల్పజీవికి, ఇదో - జవాబు దొరకని ప్రశ్నలాగా తయారయి కూచుంది ....

(20-1-89 శుక్రవారం)

ఆ గొప్ప సౌందర్యం, ఎన్నివందల సంవత్సరాలుగా, ఆరాయిలో నిద్రపోతున్నదో మనకు తెలియదు. శిల్పి వొచ్చి, నిద్రలేపి, చూపించిందాకా,మనకంటికి అదొక బండరాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీణ తీగల్లో నిద్రపోతున్న అద్భుతమైన రాగాలకు, మునివేళ్ళతో, వైణికుడు తట్టిలేపకపోతే, ఆ తీగలు మనకు ఉత్తి లోహపుదారాలుగానే కనబడతాయి. సౌందర్యం సృష్టిలోని ప్రతిదానిలోనూ ఉంది. మనం చూడగలగాలి, అనుభవించగలగాలి. అలా చూపేందుకూ అనుభవించేందుకూ, మనకో మాధ్యమం కావాలి శిల్పిలాగా వైణికునిలాగా. గొప్ప శిల్పంలో బండరాయినీ, గొప్ప వీణా వాదనంలో, లోహపు దారాలనూ మాత్రమే చూడగలిగినవారు, "అదృష్ట వంతులు". వారి కే సమస్యలూ, ఏ ఆరాటాలూ, ఏ తపనలూ ఉండవు....

(21-1-89 శనివారం)

"నేను చాలా కాలంగా చూస్తున్నాను; లేదా, యుగయుగాలుగా అనుకో; నేను పుట్టినప్పణ్నించీ ననుకో: నిన్ను చూస్తున్నాను" అన్నది క్షితిజం.

"అలాగా! నాకు తెలీదు. నే నెప్పుడూ, నానిరీక్షణను కాలంతో కొలుచుకోలేదు. కొలుచుకోవాలన్న స్పృహ కూడాలేదు. నీవన్న యుగయుగాలూ, నాముందు నుంచి ప్రవహిస్తున్న ఈ క్షణాల శకలాలూ నాకొక్కలాగానే ఉన్నాయి.నీవన్న దాకా నేనెంతో 'కాలం' నుంచి నిరీక్షిస్తున్నట్టు కూడా తెలియదు" అన్నాడతను.

"ఎవరికోసం నీ నిరీక్షణ? ఎవరికోసం నీ నిరీక్షణ?" అన్నది క్షితిజం.

"నాక్కావలసిందేదో నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. నాకు తెలిసినదాన్ని-పోనీ-నాకు తెలుసు ననుకొంటున్నదాన్ని -నేను అక్షరాల్లోకి, శబ్దాల్లోకిమార్చి చెప్పలేకపోతున్నాను. నా అధీనంలోని ఏ శబ్దమూ, ఏ వర్ణమూ, ఏ సౌంజ్ఞా, ఏ ప్రతీకా, అభివ్యక్తం చేయలేని సాంద్రీకృతమైన ఒకానొక ఆర్తి, నన్ను నిలువునా ఆవహించుకొని ఉంది.ఒక వాచ్యాతీత దివ్యశోభా సందర్శనంకోసం, ఒక అవేల పరిష్వంగ పారవశ్య సంస్పర్శనానందం కోసం నేను నిరీక్షిస్తున్నాను." అన్నాడతను.

"నీకది లభిస్తుందా? దాన్నిపొందగలనన్న ఆత్మ విశ్వాసం నీకున్నదా?" అన్నది క్షితిజం అతన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ.

"ఎంతకాలంగా ఉన్నానో, ఎక్కడున్నానో కూడా తెలీని అహాయికుణ్ని. నీ ప్రశ్నకు సమాధానం చెప్పలేను.

అన్నాడతను తలవొంచుకొని.

ఇప్పుడక్కడ, అతను లేడు. ఆ క్షితిజమూ లేదు.

"ఓ కొత్త నక్షత్రం వెలిసింది." అన్నారు ఖగోళశాస్త్రవేత్తలూ, తత్వశాస్త్ర వేత్తలూ....

(22-1-89 ఆదివారం)

నిరీక్షణం !

ఎంతమంచి పదమో అది! ఎంత అద్భుతమైన పదమో ఎలా చెప్పడం? అంతు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేని కాలం పొరల అట్టడుగున, ఏ మధుర క్షణంలోనో, ప్రభువు పెదవులపై విరిసిన, హాసరోచిస్సులకోసం, అనంత విశ్వంలోని గాఢతిమిర నిరీక్షణం; అప్పుడే ఉదయించిన మధురనాదం కోసం, లోకాలోకాల నడుమ పేరుకు పోయిన నిశ్శబ్ద నిరీక్షణం;హరిత వర్ణోద్భాసిత ఆభరణాలతో వొచ్చే వసంతం కోసం, ప్రకృతి కాంత నిరీక్షణం; విద్యున్మాలా భారంతో, భేరికానాదాలతో, హర్షోద్రిక్తమైన వర్షాగమనంకోసం వసుంధర నిరీక్షణం; ఆకాశపు నీలాలనూ, దశదిశలనూ పులకితం చేసే పాటకోసం విహంగ నిరీక్షణం;తనను సంపూర్ణంగా అద్భుతంగా, అనన్యంగా, అతిలోక సుందరంగా చిత్రించగలిగిన మహా కవి కోసం, శతాబ్దులుగా వేచిఉన్న అలోక సౌందర్యమయ భావరేఖా సముచ్చయ నిరీక్షణం; వ్యక్తాతీతమైన, ఆనంద వివశమైన క్షణాన, తనను చేరి, తనలో లోలోపల రూపును సంతరించుకొంటున్న బిడ్డకోసం,మాతృమూర్తి నిరీక్షణం; ప్రభు దర్శనం కోసం, అడవిలో, మురికిలో, దుమ్ములో, చలిలో, వానలో, ఎండలో నిలిచిన భక్తుని నిరీక్షణం; చీకటిలోంచి, తుఫానుగాలుల్లోంచి, ప్రాణాలను సైతం తెగించి, తన దగ్గరకొచ్చే ప్రియుని గాఢాలింగనంకోసం, నదీ తీరాన వొంటరిగా నిలిచిన ప్రియురాలి నిరీక్షణం; లో - ఎంతబాధ! ఎంత ఆవేదన! ఎంతక్షోభ !! కానీ - ఆబాధలో, ఆవేదనలో, క్షోభలో, ఎంతహాయి! ఎంత ఆనందం చిన్నీ! అది అనుభవానికే తప్ప - అక్షరాలకు, తెలియదుగాక తెలియదు...

(23-1-89 సోమవారం)

ప్రభూ !

నన్నొకతీయని వంచనకు లోను చేశావు. ప్రేమరశ్మిలో తడిసి తనిసి ఆనంద తాండవం చేస్తున్నప్పుడు, హఠాత్తుగా నా చుట్టూ తమోభిత్తికలను సృష్టిం చావు. నేనిప్పుడా చీకటిగోడల మధ్య బందీని. నీకిదొక వినోద క్రీడ. నాకు జీవన్మరణ సమస్య. నా వయస్సు 34 సంవత్సరాలే! అతిలోక వైభవాల మధ్య బతికిన ఆ సంవత్సరాలలోనే, నేను జీవించినట్లు. మిగిలిన కాలమంతా నేను చనిపోయినట్లు. నా శరీరం వయస్సు ఎంతయినా కావచ్చుగానీ, నా జీవి తం వయస్సు మాత్రం. ఆ 34 ఏళ్ళే! ...

(24-1-89 మంగళవారం)

ఓ నూతన ప్రాణమా! ఓ జీవ కణమా! నువ్వెందుకలా తొందర పడుతున్నావ్? ఏం చేదామని ఇక్కడి కొస్తున్నావ్? ఈ లోకం సంగతి నీకింకా తెలీదు. నిన్ను తనలో దాచుకొన్న నీ అమ్మగానీ, నీ కోసం మురిసిపోతున్న నీ నాన్న గానీ, నీకీ సత్యం చెప్పిఉండంటే-ఓ గర్భస్థ శిశువా, నీవీ నరకంలోకి రావు. ఈ భూమి వసుంధర లాగా లేదిప్పుడు. దీన్నిండా - కుట్రలు, దగాలు, మోసాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిండి పోయాయి. ఆకాశం నిర్మలంగా ఉన్నదనుకొనేవు పొరబాటున. నక్షత్ర యుద్ధ సన్నాహాలతో, అది - మహా కోలాహలంగా ఉంది. ఈర్ష్యా ద్వేషాలు, మాకు ధమనులు, సిరలుగా మారాయి. మా వొంటినిండా అధికార దాహం పారుతోందిప్పుడు. మోసం మాకిప్పుడు హాసమయి పోయింది. దళాజ్ఞాలుగా, వాగ్దానాల వానలు కురిపిస్తున్నాం. అభయహస్తాల ముద్రలతో ఈ దేశం నిండి పోయింది. మా తాజా అబద్ధం 'ఆయుధవిసర్జన'. మా నిత్యాబద్ధం 'విశ్వశాంతి' అసత్యాలు, అక్రమాలు, అన్యాయాలు, అధర్మాలు, అక్రమార్జనలు, అవినీతులు మానభంగాలు .... మాబతుకుల నిండా నిండిపోయాయి. ఓశిశువా! ఓదైవాంశమా! ఓస్వర్లోకవాసీ! ఓనూతన ప్రాణమా!! దయచేసి ఈ కూపంలోకి రాకు. నీవున్న చోటనే కరిగిపో ....

(26-1-89 గురువారం)

చిన్నీ!

అన్నిటికీ విలువలు నిర్ణయించగల మనుకోవడం పెద్ద అబద్ధం. చాలా వాటిని గురించి అసలేమీ మనకు-కనీసం నాకు-తెలియదు. మెత్తని నేలలోంచి, మెల్లగా తలెత్తి చుట్టూ చూసి, ఆశ్చర్యంతో కిలారించిపోయే చిన్న మొక్కలోని ఆశ్చర్యానికీ; బురదలోంచి, అద్భుతంగా వికసించిన పద్మపత్ర వర్ణ మృదుత్వానికీ; ఆకాశంలో విరిసిన హరివిల్లును చూసి, వెర్రిగంతులేసే బాలుని ఆనందానికీ; చంద్ర కిరణం పడి, మెరిసి, ఎగసి, ఉత్సాహంతో తీరాన్ని తాకి, నురుగులు కింద మారిపోయిన తరంగ సౌందర్యానికీ; కాళ్ళతో తన్నుతో, కదులుతో, కదుపుతో, పాలు తాగుతూన్న పసి బిడ్డకేసి చూసే తల్లి కళ్ళల్లోని వెలుగుకూ; ఎవరు మాత్రం ఏం విలువ నిర్ణయిస్తారు?

దీప్తి మంతమైన నీ హాసానికీ, కరుణార్ద్రమైన నీ చిత్తానికీ, నేను మాత్రం ఏం విలువ కట్టాను, నన్ను నేను అభినందించు కోవడం తప్ప, నీకు అభివాదం చేయడం తప్ప. వీటికి ఎవరూ ఏ విలువలూ నిర్ణయించ లేరు, ఆఖరుకు ఈశ్వరుడు కూడా!

ప్రభూ!

'జ్ఞానోదయం' అంటే మరేమిటో ననుకొన్నాను. అదింత సులభ సాధ్యమని నాకూ తెలీదు మొన్న మొన్నటి దాకా! ఏముందీ? నీవున్నావని తెలుసుకొనగలగడం, అలా తెలుసుకొనేలాగా నన్ను నీవు అనుగ్రహించడం, నీ అనుగ్రహాన్ని పొందే అర్హతను సంపాదించు కోవడం! ఇంతే గదా! నేనిప్పుడా ప్రయత్నం లోనే ఉన్నాను ...

(27-1-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జన్మించడం, జీవించడం, మరణించడం తప్ప-ఇంకే ప్రయోజనమూ మనిషికి లేకపోతే, ఈ మూడు క్రియలూవృథా! ఇవిగాక, వీటికి అతీతంగా ఉన్నదేనినో సాధించాలన్నదే ఈశ్వర నిర్ణయం కాకపోతే, ఆ ఈశ్వరుడు నాకన్నా మూర్ఖుడయి ఉండాలి.

తనను తెలుసుకొనడానికీ, తనను కలుసుకొనడానికీ చాలా మార్గాలు తెరిచి ఉంచాడు ఈశ్వరుడు. వాటికి అందుణ్నాయి, ఈశ్వరుణ్ని వొక మాయల పకీరుగా నాకై నేనే చిత్రించుకొన్నాను; నేను చూడగలిగిందీ, చూసి అవగాహన చేసుకొన గలిగిందీ అంతే గనక!'ఇది నా అశక్తత' అని, నేననుకోలేదు. అనుకోనందుకు నేను విచారించనూ లేదు. పైగా-ప్రభువు ఉనికినే శంకించాను. అనుక్షణం, అన్నింటిలోనూ ఆనంద తాండవం చేస్తున్న ఈశ్వరుణ్ని చూడపలసి వస్తుందేమోనని, నన్ను నేనే మూసి వేసుకొన్నాను చాలా కాలం. ఇప్పుడిప్పుడే తెలుస్తూ ఉంది; లోపం నాదిగానీ, ప్రభువుది కాదేమోనని! నా మీద దయతో, జాలితో, ఓకుదుపుకుదిపి, కళ్ళు తెరిపించాడు ఈశ్వరుడు కొంచెం కొంచెంగా. ఆ మహా తేజోరూపుని సమీపిస్తున్న కొద్దీ, నేను మూర్ఛపలుపోతున్నానిప్పుడు ...

నాకు-ఇద్దరు తల్లులు. ఒకరేమో-నన్ను కని, లోకం మీదికి విసిరేశారు. మరొకరేమో-లోకంలో తిరుగుతున్న నన్ను చూసి, కనికరించి, మీ ముందు నిలిపారు.

నా మొదటి తల్లి పేరు-లేమి
నా రెండవ తల్లి పేరు-కాంతం
నాకిప్పుడు భయమేస్తున్నది; నా దరిద్రం, నా కాంతం, నన్ను ఆదరించకపోతే, నేనేమయి ఉండే వాణ్నోనని!

(28-1-89 శనివారం)

నన్ను నేను ఆవిష్కరించుకోవడం కోసం, నన్ను నేను చూసుకోవడం కోసం, నేనెంత తపన పడుతున్నానో, నాకూ-మరో ముగ్గురు నలుగురు మిత్రులకూ తెలుసు, బతికున్న కాలంలో కాంతమ్మ గారికి తెలుసు. ఒక అంతులేని తృష్ణ అహరహం, నన్ను వెంటాడుతూ ఉంటున్నది. నా క్కావలసిన దాని కోసం, నేనింకా అన్వేషిస్తూనే ఉన్నాను. ఒక ఉపశమన వాక్యం, ఒక ఓదార్పు పలుకు కారుణ్యమయమైన ఓస్పర్శ, కన్నీటిని తుడిచివేసే ఓ మృదు హస్తం, ఓలాలి పాట నాకిప్పుడు కావాలనిపిస్తున్నది. ఇవి దొరకవు. దొరకవని నిర్ధారణ అయినప్పుడు, దుఃఖం పుక్కిలింతలవుతుంది. నా మొదటి తల్లి "లేమి నన్ను విడిచినట్లేవిడిచి, మరలా నన్నాశ్రయించింది. నా రెండో తల్లి కాంత"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బతికున్నంత కాలం; ఈ పరంగా నాకు లోటులేదు. .

(29-1-89 ఆదివారం)

నాకు తెలీని ఏదూర ప్రాంతాలనుంచో, ఒక దివ్యప్రపంచం నాలోకి ప్రవేశించింది. అది - మంచు ముసుగులోంచి కనిపించే అద్భుత కాంతిపుంజంలాగా ఉంది. అక్కడెక్కడా సూర్యుడు కనిపించడు. కానీ, ఉన్నాడని వెలుతురు ద్వారా తెలుస్తూనే ఉంది. తరుణ గాయనీ గాయక బృందమెక్కడా కనిపించదు. కానీ గాలికూడా కందిపోయేటంతటి సున్నితమైన గానం వినబడుతూనే ఉంది. ఆ ప్రపంచం, వర్తుల ఇంద్రచాప పరివేష్ఠితమైన సుందర స్వప్న రాశిలా ఉంది. అక్కడున్నవన్నీ చిన్న చిన్న కలల తునకలు-రంగుల సీతాకోక చిలకల్లాగా, నిశ్శబ్దంగా కదులుతో, దూకుతో, ఎగురుతో, ఎన్నెన్నో రూపాలను సంతరించుకొంటో తిరిగి తిరిగి కరిగిపోతో ఉన్నాయి. ఆ రూపాలు ఒకేక్షణాన, నాకు తెలిసినట్టుగానూ, తెలియనట్టుగానూ ఉన్నాయి. అవి- ఎప్పుడో వొకప్పుడు, నీరూపం సంతరించుకొన్నప్పుడు, నిన్నభినందిస్తూ, పూలమాలలతో అలంకరించుదామనుకొంటున్నాను. కాని - నావి రిక్తహస్తాలు. తోటనుండి పూలుతెచ్చేలోగానే నీరూపం వెలిసి, మెరిసి, మాయమవుతుందేమోనని నా భయం ! అందుకే నన్ను నేనే పుష్పహారంగా మార్చుకొన్నాను నీమెడనుండి పాదాలదాకా వాలిపోయే మహత్తర క్షణంకోసం, ఎదురు చూస్తున్నాను...

(30-1-89 సోమవారం)

తలో దిక్కునుండీ వచ్చిన, ఆ అయిదుగురూ స్వర్గద్వారంముందు కలుసుకొన్నారు. తలుపులు మూసి ఉన్నాయి.

"ఎవరు మీరు ?" అన్నాడు దేవదూత.

"నేను యోధుణ్ని. యుద్ధంలో పోరాడుతూ, పోరాడుతూనే చనిపోయాను. ప్రాణాలను కాపాడుకొనే అవకాశాలు చాలా లభించాయి. అయినా - మాతృదేశంకోసం, నిస్సంకోచంగా పోరాడుతూనే, రణరంగంలోనే ప్రాణాలు కోల్పోయాను" అన్నాడా సైనికుడు రొమ్ము విరుచుకొంటూ.

దేవదూత, రెండవ వాని వేపు చూశాడు.

"నేను వ్యాపారిని. అందరూపదింట వొక వొంతు లాభాలను మాత్రమే ధర్మకార్యాలకు వినియోగిస్తున్నారు. నేను ఐదింట వొక వొంతు లాభాన్ని కేటాయిస్తున్నాను. ఈ లెక్కన, నూటికి ఇరవై వంతులవుతుంది. మిగిలిన వారు పది వంతులు మాత్రమే ఇస్తున్నారు. నేను - అంతకు రెట్టింపు మొత్తాన్ని స్వామి కార్యాలకు వ్యయం చేస్తున్నాను" అన్నాడావ్యాపారి వినయంగా,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"తమరేం చేస్తుంటారు? అన్నాడు దేవదూత మూడవ వ్యక్తి వేపు తిరుగుతూ.
"నేను భక్తుణ్ని, స్వామి పూజారిని కూడా. అంతకు ముందు వేరేచోట ఉండి, ఉదయ సాయం కాలాల్లో స్వామి సన్నిధికి వస్తూ ఉండేవాణ్ని, రాను రాను— స్వామి పట్ల భక్తి పెరిగింది. నా నివాసాన్ని దేవాలయంలోకే మార్చుకొన్నాను స్వామిని అర్చిస్తూ, నీతులు ధర్మాలూ బోధిస్తూ, తుదిక్షణం దాకా అక్కడే ఉన్నాను." అన్నాడు భక్తుడు.

"తమ సంగతి అడగడంలో ఆలస్యమయింది. నన్ను మన్నించండి." అన్నాడు దేవదూత వినయంగా, నాలుగవ వ్యక్తి వేపు తిరుగుతూ.

"నన్ను ఎరగక పోవడం క్షమించరాని నేరం! అయినా ప్రథమ తప్పిదంగా మన్నిస్తున్నాం! నేను మహారాజునని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదను కొంటాను. స్వల్పంగా ఉన్న నా రాజ్యాన్ని పెంచాను. కోశాగారం నిండా సంపదలు నింపాను. అన్నదానం చేశాను. సత్రాలు నిర్మించాను. ప్రజలను నా బిడ్డలుగా భావించాను." అన్నారు ప్రభువులు మీసాలు మెలివేస్తూ.

అయిదవ వ్యక్తి, వీరందరికీ రవంత దూరంగా, తలవంచుకొని నిలబడ్డాడు. దేవదూత అడగక ముందే, అతను చెప్పడం సాగించాడు. "బాబూ! నాకేమీ లేదు. నేనేమీ చేయలేదు. అసలిక్కడికొచ్చే అర్హతలేవీ నాకు లేవు. నన్ని క్కడకు ఎవరు తీసుకొచ్చారో, ఎందుకు తీసుకొచ్చారో నాకు తెలియదు. ఎక్కడో ఏదో పొరబాటు జరిగి ఉండాలి. దయచేసి నన్ను తిప్పి పంపించండి!" అన్నాడతను దీనంగా. దేవదూత కాస్త గొంతు పెంచాడు.

"మూర్ఖుడా! జీవిత చరమ లక్ష్యం ఇదే! ఇంతకు మించిన దేపుయినా ఉన్నదను కొంటున్నావా?"

అతను చేతులు జోడించాడు.

"స్వామీ! నాకేమీ తెలియదు. నన్ను వదిలేయండి. నేను పేదవాణ్ని. దయా మయులైన వారిని యాచించి, బతుకుతున్నాను బాబూ! నాకు లభించిన దాని లోంచి, ముందుగా ఓకుక్కకు పెడతాను. తరువాత - కదల లేని కుష్ఠు రోగికి పెడతాను. ఆతరువాత కళ్ళులేని కబోదికి పెడతాను. వీరందరికీ పోగా మిగి లిన దాన్ని నేను తింటాను. ఇప్పటికే ఆలస్యమయింది. నా స్నేహితులందరూ నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు. నన్ను పంపించండి!" అన్నాడతను చేతులు జోడించి.

స్వర్గ ద్వారం తెరిచి, అతన్ని లోపలకు పంపించాడు దేవదూత.
"అన్యాయం. అధర్మం, అక్రమం. ఆశ్రిత పక్షపాతం నశించాలి." అని కేకలు వేశారు మిగిలిన నలుగురూ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఇశ్శో! పెద్దగా అరవకండి! నేచెప్పేది వినండి.. ఆ మహారాజు గారూ, ఈ సైనికుడూ, తమ తమ కర్తవ్యాలను నిర్వహించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలివ్వడమే సైనికుని విధి. ప్రజలను కన్న బిడ్డలుగా చూడడమే పాలకుని విధి. విధి నిర్వహణం తప్ప, అదనంగా వారు చేసిందేమీ లేదు. ఈ వ్యాపారి-స్వామి సేవలో కూడా, లాభాలు శాతాలు మరిచిపోలేక పోయాడు. ఈ భక్తుడు-దేవాలయానికి తన నివాసం మార్చుకొన్న మాట నిజమే! ధర్మాలు, నీతులు బోధించిన మాట కూడా నిజమే! కానీ బోధించడంతో తన బాధ్యత తీరిపోయిందనుకొన్నాడు. మచ్చు కోసమన్నా, వొక్కదాన్ని ఆచరించ లేదు. ఇక-ఆ చివరి వ్యక్తి సంగతి. అత గాడికి స్వర్గం సంగతి తెలియదు. స్వామి పేరు కూడా విన్నట్టు లేదు. నోరు లేని కుక్కను, నిస్సహాయులను,తన స్నేహితులన్నాడు. తన కోసం, యాచించి తెచ్చుకొన్న దాని లోంచే, ముందుగా వారికి పెట్టి, మిగిలిన దాన్ని మాత్రమే తాను తీసుకొన్నాడు. స్వర్గం - నిస్వార్ధపరులైన త్యాగుల కోసం మాత్రమే!" అన్నాడు దేవదూత.

(31-1-89 మంగళవారం)

ప్రభూ!

నీవు సంపదలిచ్చావు. నేనువద్దన్నాను. నీవు పదవులిచ్చావు. నేను కాదన్నాను. నీవు సుఖాలను నాముందు రాశిపోశావు. నేను తిరస్కరించాను. వీటికోసమని, నీ చుట్టూ మూగిన వారు, నన్ను అహంకారిగానూ, ఉన్మాదిగానూ చిత్రిస్తున్నారు. నేను నవ్వుకొన్నాను. వీటన్నింటినీ తోసిపుచ్చుతున్న నన్ను చూసి, నీవూ నవ్వుకొన్నావు; నేనెందుకంత నిరాసక్తంగా ఉన్నానో నీకు తెలుసు! ఈ అల్పకానుకలిచ్చే అత్యల్పసుఖాల కోసం, అనల్పమైన నీ దర్శనానందాన్ని నేను వొదులుకోలేనుస్వామీ! నీ వెక్కడుంటావో నాకు తెలుసు అందుకే-నేను - నిరంతరావేదనను కోరుకొంటున్నాను: ఓదార్చడం కోసమన్నా నీవు నాతో ఉంటావుగనక. నిన్ను నాబందీని చేసుకోవడానికి నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే! ...

(1-2-89 బుధవారం)

ప్రభూ !

"నేను"ఉన్నాను గనుకనే"నీవు"ఉన్నావు. నేనంటూ లేకపోతే, నాకు సంబంధించినంతవరకూ"నీవు"కూడాలేవు. నాకెప్పటికీ అందనంత దూరంలో, నేనెప్పటికీ తెలుసుకోలేని నిగూఢతలో, నేనెప్పటికీ చేరుకోలేని దూరంలో నీవున్నావనుకో అప్పుడు నీవున్నా లేకున్నా నాకొక్కటే గదా! ఈ సంశయాన్ని రహితం చేయడంకోసమే, లోకానికి తెలియజేయడం కోసమే నన్నొక సాధనంగా చేసు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొన్న వనుకొంటున్నాను. ప్రభూ! ఇది నా విజయం కాదు - నీదే! ....

(2-2-89 గురువారం)

"మీ జీవితం సార్థకమయింది" అన్నారు జగన్నాధరావుగారు. ఆయనగారి మంచి తనాన్ని లోలోపలే మెచ్చుకొన్నాను. "నా జీవితం సార్థకమయిందని మీరంటున్నారు. వ్యర్థమయి పోయిందని, నే ననుకొంటున్నాను. ఇంతకన్నా ఫలప్రదంగా, ఉపయుక్తంగా, జీవించలేక పోవడం నా దురదృష్టం! నా ఆలోచనలకు, ఆశయాలకు, పూర్తిభిన్నంగా బతకవలసి వచ్చినప్పుడు, నే ననుభవించిన నరకయాతన ; మరింక ఎవ్వరూ అనుభవించకూడదని, నేను కోరుకొంటున్నాను. బతుకంతా, సంఘర్షణలతోనే గడిచి పోయింది. కొంపెంగా స్థిమితపడే దశలో, ఆమెగారు నన్ను ఒంటరిని చేసి వెళ్ళారు. ఇది-మరొక రకమైన బాధ. నాలోని రెండు విభిన్నమైన స్వభావాల మధ్య, ఒక సంకుల సమరం జరుగుతున్నది. "శాంతి" అన్నది, నేను వాంఛిస్తున్న సుదూర లక్ష్యమేగానీ, నాకు అందుబాటులో ఉన్నది మాత్రం కాదు" అన్నాను వారితో. జగన్నాధరావుగారు నా వేపు ఎంత ఆర్ద్రంగా చూశారని!

(4-2-89 శనివారం)

మనిషికి వెలుపల, చాలా అడ్డంకులు, అవరోధాలు, అగడ్తలు ఉన్నాయి. ఇవి కనబడుతూ ఉంటాయి. వీటికన్నా శక్తివంతమైనవి, మనిషిలోపల చాలా చాలా ఉన్నాయి- సులభంగా కనబడకుండా. వాటిని చూసేందుకు, అంతర దృష్టి కావాలి. వాటిని తొలగించుకొనేందుకు విశేషమైన కృషికావాలి. ఆ కృషిలో విజయం సాధించినప్పుడు, కాలాతీతమైన, ఒక దివ్యస్థితి అనుభూతమవుతుంది. ఆ స్థితిలో కాలవాహిని - భూత, వర్తమాన, భవిష్యత్తులన్న మూడు భాగాలుగా కనిపించదు. అంతా "ఏకం" గానే గోచరిస్తుంది. అప్పుడీ శబ్దాలు, రేఖలు, రంగులు, అంటూ ఉండవు. అవన్నీ కరిగిపోతాయి. అప్పుడు "ద్వైతం" ఉండదు. "అద్వైతం" మాత్రమే ఉంటుంది. ఈ అద్వైతం తేజోమయం. అదే సత్యం, అదే సత్వం, అదే ద్రష్ట, అదే దృశ్యం! అనుభవంతో తప్ప, అక్షరంతో అందుకొనలేని దా స్థితి ..

(5-2-89 ఆదివారం)

"ఈలోకం మాయ" అంటున్నాడు వేదాంతి. అతని కది సత్యం.

"ఈలోకంలో తనూ భాగమేగనుక, ఈ మాటలన్న వేదాంతి కూడా, మాయ అయిఉండాలి. మరి-"మాయ" అయిన వేదాంతి చెప్పేది. 'మాయాతీతం' ఎలా అవుతుంది? మాయలోపుట్టి, మాయలో పెరిగి, మాయ మధ్య నిలిచి, మాయ మాయగా జీవిస్తున్న వేదాంతి, ఈ మాయా ప్రపంచానికి వెలుపలగా ఉన్న మాయాతీతమైన పరమసత్యాన్ని ఎలా చూడగలుగుతున్నాడు"? అంటున్నాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హేతువాది, అపహాస్యంగా వేదాంతివేపుచూస్తూ. ఒకప్పుడు - హేతువాదిలో నాకు సత్యం గోచరించింది. ఇప్పుడు వేదాంతిలో నాకు సత్యం కనబడుతున్నది. ఎందుకని? జీవితంలోకి రకరకాల అనుభవాలు ప్రవహించాయి గనకా, లోపలా వెలుపలా దూరాలు ప్రయాణం చేశానుగనకా (చేశానని అనుకొంటున్నాను. ఇలా అనుకోవడం కూడా "మాయ" లో ఒక భాగం కావచ్చు; కాకపోనూ వచ్చు) అలా అనిపిస్తున్నది. అన్నింటినీ హేతువు దర్శనీయం చేయలేదు. హేతువు ద్వారా మనకు తెలిసేది, మనకున్న పరిమితి సాధనాల ద్వారా మనం తెలుసుకొనగలిగినంత మేరకే పరిమితం. ఈ హేతువు మన సంస్కారం లోంచి వస్తుంది. ఆ సంస్కారం ఎదిగినప్పుడూ, విస్తృతమయినప్పుడూ, "హేతువు" అన్న సాధనం నిరుపయోగమవుతుంది...

(7-2-89 మంగళవారం)

"మీ బాధ్యతలన్నీ తీరిపోయాయి. మీరొచ్చిన పనులన్నీ అయిపోయాయి. మీరింక ఉండనవసరం లేదు." అన్నారు కృష్ణమూర్తిగారు నవ్వుతూ.

నాకూ నవ్వొచ్చింది.

"లేదు బాబు గారూ! నే నేమనుకొంటున్నానంటే, ప్రతి కన్నీటి బిందువులో నే నున్నాను, ఉంటాను. ప్రతి ఆకలికేకలో నే నుంటాను, ప్రతి ఆర్తనాదంలో నే నుంటాను, ప్రతి క్షుభిత హృదయంలో నే నుంటాను; ఈ రూపంలో కాకపోవచ్చు, ఈ పేరుతోనూ కాకపోవచ్చు, ఎలా ఉంటేనేంగాక-నేను ఉన్నట్లే! అశ్రువాహినులు ఇంకిపోయాయనుకోండి; ఆకలి కేకలు అణిగిపోయాయనుకోండి; ఆర్తనాదాలు అస్తమించాయనుకోండి; అప్పుడు నేనుండను. ఉండకపోయినా నష్టమేమీలేదు. మానవజాతి సుఖశాంతులతో వర్ధిల్లాలేగానీ, నేనులేకపోతే మాత్రమేం?" అన్నాను కృష్ణమూర్తిగారితో.

చిత్రం! కృష్ణమూర్తిగారితో, ఉదయపునడకలో, నే మాట్లాడిన భాషవేరు. ఇక్కడ రాసిన భాషవేరు. ఇంతకన్నా తేలిక భాషలో, ఇవే ఆలోచనలను వారితో పంచుకొన్నాను. రాయబోయే సరికి, మాట్లాడిన సాదాసీదా భాష రావడం లేదు. ఇంతకాలంగా అవీ ఇవీ రాస్తూనే ఉన్నానా? కాస్త కృతకంగా తప్ప సహజంగానూ, మాట్లాడింది మాట్లాడినట్లుగానూ రాయలేకపోతున్నాను. "ఓ మంచి వాక్యం రాయడానికి, నాకింకా చాలా కాలం పడుతుంది". అనుకోవడం అందుకే ....

(13-2-89 సోమవారం)

"ఈనాడు" కెళ్ళాను. 8వ తేదీన ప్రసారమయిన దూరదర్శన్ కార్యక్రమాన్ని చాలా మంది అభినందించారు. నేనెంత నెగ్గిలి పోయానో, నాకూ ఈశ్వరునికీ తెలుసు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"....ఒక్కో ప్రశంసా వాక్యమూ! ఒక్కో చెంపదెబ్బలాగా నన్ను బాధపెడుతున్నది. ఒకప్పుడైతే ఉబ్బిపోయే వాణ్ణి. తబ్బిబ్బయి పోయే వాణ్ణి. "అవునేమోసుమా!" అనీ, అనుకొనే వాణ్ణి. ఇటీవల నేనలా అనుకోవడం లేదు ... ఓ సత్యం చెప్పనా? రచయితగా నేనింకా జన్మించ వలసి ఉంది. ఆ జన్మావతరణకు, ఇవన్నీ పురుటి నొప్పుల్లాంటివి."

(14-2-89 మంగళవారం)

....తిరుపతి కొస్తే, నాకు స్వామి గుర్తుకు రాడు; కాంతం గుర్తుకొస్తుంది. ఆమెగారింకా ఉన్నట్లూ, ఆఖరు ఇద్దరి కోడళ్ళనూ వెంట తీసుకొని, మెల్లగా, అటూ ఇటూ తిరుగుతున్నట్లు నాకనిపిస్తుంది. నానిండా నిండిపోయి, తాను తప్ప నాకింకేమీ మిగలకుండా, ఆమెగారెలా చేయగలిగింది? ఆ రహస్యమేమిటి? ఆమెగారి అందమూ, చదువూ కూడా చాలా సామాన్యమేనే!

అంత స్సౌందర్యం - అదీ ముఖ్యం. ఆ సౌందర్యం మామూలు కంటికి కనిపించదు. అంతర్నేత్రానికే కనబడుతుంది. దురదృష్టవశాత్తూ, చాలా మంది నేత్రాలు, బాహిర సౌందర్యాన్నే గుర్తించ లేక పోతున్నాయి. ఇక అంత స్సౌందర్యమన్నది, ఈ స్థాయి మనుషులకు, ఒక వెర్రి కేకలాగ వినబడుతుంది. ఉన్మాదం లాగా కనబడుతుంది. అక్కడెక్కడో మనస్సు లోలోపల, సౌందర్య స్పృహ ఉంటే తప్ప, బయటి ఆకారాలు కూడా కనపడవు. ఈ స్పృహ ఒక సముదాత్తమైన స్వప్నం లాంటిది. ఆ స్వప్న ప్రపంచాన్ని, అక్షరాలలోకి ఆహ్వానించ గలిగిన వాడు కవి, రచయిత అవుతాడు. రేఖలలోకి రంగులలోకి తీసుకురాగలిగినవాడు చిత్రకారుడవుతాడు. నాదంలోకి పట్టుకు రాగలిగినవాడు సంగీతకారుడవుతాడు. ఇవన్నీ నటరాజ మహాద్భుత తాండవకేళికి, ప్రత్యక్ష వ్యాఖ్యానాల వంటివి ...

7970

ప్రతిదీ మనకు తెలిసినట్టే ఉంటుంది. ప్రతిదీ, ప్రతి వారికీ అర్థమయినట్టే ఉంటుంది ఆవ్యక్తి స్థాయిని బట్టి, అతనికి సంబంధించినంత వరకూ, అది నిజం కూడాను. కానీ - అసలైన నిజం, అతని అవగాహనకు, ఆమడల దూరంలో ఉంటుంది. నా విషయం లోనూ అదే జరిగింది, జరుగుతోంది. నా అదృష్టం వల్ల, నేనెంత అజ్ఞానినో ఇప్పుడిప్పుడే తెలుసుకొంటున్నాను.

(15-2-89 బుధవారం)

శబ్దం, ఒక భావాన్ని మేలుకొలుపుతుంది. శబ్దాన్ని ఆనుకొని ఉన్న నిశ్శబ్దం మరో భావాన్ని తట్టి లేపుతుంది. అలాగే - మాట, ఒక స్థితిని తెలియ చేస్తుంది. మాటను వెన్నంటి ఉన్న మౌనం మరో స్థితిని వెలిగిస్తుంది. ఆ నిశ్శబ్దమూ, ఈ మౌనమూ, తెలియ చేసే భావమూ, స్థితీ, స్వతహాగా వాటిల్లో లేవు. వాటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముందున్న శబ్దంలోనూ, మాటలోనూ ఉన్నాయి. ఈ శబ్దాన్నీ, మాటనూ, ఆచితూచి ప్రయోగించినప్పుడు మాత్రమే, ఆశబ్దం వెనుకనున్న నిశ్శబ్దము, ఆ మాట వెనుకనున్న మౌనము, అద్భుతంగా ప్రతిస్పందిస్తాయి.
... ఉదయమూ, సాయం కాలమూ, చాలా దూరాలు తిరిగొచ్చాను; ఒకప్పుడు నేను కాంతమ్మగారూ తిరిగిన ప్రదేశాలు. అక్కడి పూల మొక్కలు, తీవలు పచ్చిక బయళ్ళు, గాలి, కొండలు, నీలం రంగులు, లోయలు, కాలి బాటలు చలువ జల్లులు, ఆమె కోసం వెదుకు తున్నట్లనిపించింది నాకు. ఆమెను పదే పదే పిలుస్తున్నట్లనిపించింది ....

(17-2-89 శుక్రవారం)

నానిండా, పరిసరాలనిండా, సంగీతం లాగా వెన్నెల కురుస్తోంది. ఆమె జ్ఞాపకం వచ్చింది. ఆమె గుర్తుకొస్తే "నేను" నేనుగా మిగలను.

సూర్య కాంతిని చీలుస్తున్న చెట్ల ఆకులనీడల్లో జారగిలబడి, అమ్మ పాడే పాటకు, మాగన్నుగా పట్టే నిదురలాగా ఉంటుంది. రంగు రంగుల మబ్బుల పదవల మీద, వెన్నెలకు మెరిసిపోతున్న హిమ వాహినుల్లో, నిశ్శబ్దంగా తేలి పోతున్నట్లుంటుంది. ఆద్యంత రహితమైన విశ్వమంతటా అలముకొన్న ఆనందమంతా బిందువులయి అత్తరులో తేలి పోతున్నట్లుగా ఉంటుంది. అర ణ్యాన్ని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్న వసంతం లాగా ఉంటుంది. అక్ష రాక్షరంలో మినమినలాడే కవిత్వం లాగా, రసమయమైన వాక్యంలాగా, ప్రాణ స్పందనం లాగా ఉంటుంది.
ఆమె - నా దేవత, నావరం, నా అదృష్టం, నా కాంతం.

(18-2-89 శనివారం)

"మనందరం దొంగలం. అబద్ధీకులం. వంచకులం. నటులం. కాకపోతే 'శాతం' తేడాలు మాత్రం ఉంటాయి. మన ఆంతర్యాలను సర్వ నగ్నంగా మన మెప్పుడూ బయట పడనివ్వం: ఆఖరుకు మన బతుకుల్ని కాంతులతో నింపేవారి దగ్గరైనా. మన రక్తాన్ని చీల్చుకొని, మనలోంచి నచ్చిన బిడ్డల దగ్గ రైనా. ఇంకెవరితోనూ, ఎప్పుడు పంచుకోనివీ, పంచుకోలేనివీ, మనలో చాలా ఉన్నాయి. వాటిని ఎప్పుడూ బయట పడనివ్వం. కానీ, అటువంటి వేవీ లేనట్లు అద్భుతంగా నటిస్తాం. అతికేలాగ అబద్ధాలు చెబుతాం. ఇతరులను వంచిస్తాం. మనకు అణు రహస్యాలు తెలుసు. ఆకాశం గురించి, అవనీతలం గురించి, అగాధ సముద్రాలను గురించి, ఎన్నెన్నో తెలుసు. మనల్ని గురించి మాత్రం మనకు తెలీదు. మనిషిని గురించి తెలియదు. మనిషి - తెలియనీయడు, తెలుసు కోడు. తెలుసుకొనలేడు. తెలుసుకొంటున్నది మనిషి గనకా, తెలుసుకొనవల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సింది కూడా మనిషిని గురించే గనకా, ఈ క్లిష్టత తప్పదు. మనల్ని గురించి మనం తెలుసుకొనడానికొక్కడా, మనలో ఉన్న నిగూఢతత్వ మేదో అడుగడుగునా అడ్డుపడుతూ ఉంటుంది. అందుకని అది సాధ్యం కాదు. ఆపని - మనల్ని గురించి తెలుసుకొనే పని - ఇంకో ప్రాణి చేసి నప్పుడు మన అసలు సిసలు స్వరూప స్వభావాలు యధా రూపంలో బయట పడతాయి." అన్నాను ఆచార్య ఆత్రేయతో. అతనూ అంగీకరించాడు ....

(19-2-89 ఆదివారం)

మహా కావ్యంలోని ఏ పంక్తిని స్పృశించినా, ఒక గుప్తస్మృతి ఆవిష్కృత మయినట్లే, నీ గురించిన ఏ చిన్న జ్ఞాపకమైనా, నన్నొక సముజ్వలమైన దీప్తిలో ముంచి వేస్తుంది.

అందరూ కళ్ళతో చూస్తారు. నేనా - నా మొత్తం శరీరంతో నిన్ను చూస్తాను. నిన్నింకా ఇంకా ఇంకా .... చూస్తూ చూస్తూ చూస్తూ ... ఉండి ఉండి ఉండి లయించి, లయించి లయించి ... అదమ్మా చిన్నీ నా కోరిక.

ఎండలోంచి, గాలిలోంచి, నేలలోంచి, జీవధారలు బీజంలో ప్రవేశించి, మొక్కగా మారినట్లే. నీ లోంచి, నీ లోంచి, నీ లోంచి "నీవు" నా లోకి ప్రవ హించి, ప్రవహించి, ప్రవహించి, నన్నొక మనిషిని చేశావు చిన్నీ ....

(20-2-89 సోమవారం)

"చిన్నీ ! నాకు ఆకాశం అవసరం లేదు. దాన్ని నక్షత్రాలకూ, మేఘాలకూ, వదిలివేశాను. నాకు స్వర్గం అవసరంలేదు. దాన్ని సుఖలాలసులకు వదిలి వేశాను. నాకు భూమండలంకూడా అవసరం లేదు. దాన్ని నదీనదులకు, సము ద్రాలకు, మహారణ్యాలకు, పర్వతాలకు, పంటచేలకు, వీటన్నింటికోసం నరుక్కువచ్చే మనుషులకూ వదిలివేశాను" అన్నాడతను.

"మరేం కావాలి ?" అన్నదామె నవ్వుతూ.

"తెలీదా ? నిజంగానే తెలీదా? ఇన్నేళ్లుగా నన్నెరుగుదువుగదా ! నాకేం కావాలో కూడా తెలీదా చిన్నీ ?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"ఇప్పుడేం కావాలో తెలీదు" అన్నదామె కొంటెగా నవ్వుతూ.

"నీవు కావాలి, నీవు కావాలి, నీవు కావాలి, నీవు, నీవు, నీవు, నీవు-ఆ నీవు లన్నీ కావాలి" అన్నాడతను.

"ఇంకా ?" అన్నదామె మరింతగా నవ్వుతూ.

"ఈశ్వరదర్శనానంతరం, భక్తునికి-కోరుకోడాని కేమీ ఉండనట్లే, నీ తరువాత కూడా, కోరుకోదగినవేమీ నాకు లేవు" అన్నాడతను.

"నువ్వెంత మంచివాడివి కన్నా !" అన్నదామె.

(21-2-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిన్న మొన్నటిదాకా, అదంతా గొడ్డుబెడారి. ఉత్త ఇసుక సముద్రం. ఎక్కడా ప్రాణస్పందనం గోచరించదు. ఈ రోజు ఉదయమే, మళ్ళీ వెళ్ళానక్కడికి. ఇప్పుడది పూర్వంలాగా లేదు. అంతులేని ఇసుక సముద్రానికి బదులుగా, మెత్తని వెండి తువ్వర - ఇంతెత్తున పేరుకుపోయి ఉంది తెల్లగా మెరిసిపోతూ. ఆశ్చర్యం వేసి అలా నాలుగడుగులు వేశానో లేదో-ఛన్నున వెన్నెల అడుసులోకి కూరుకుపోయాను. నేనింతదాకా "వెండితువ్వర" అనుకొన్నది "వెన్నెల తుప్పర" అని, అప్పటిదాకా నాకూ తెలీదు.

నిర్జీవమైన, సౌందర్యరహితమైన ఇసుక సముద్రం నిండా, వెన్నెలను విరజిమ్మి, అందాలతో, వెలుగులతో నింపిన చంద్రునికి కృతజ్ఞతలు చెబుదామని తలెత్తి చూశాను. తొ్రరిబోయిన చందమామ నవ్వుతున్నాడు నన్ను చూసి. తాను వెన్నెలగా కరిగి, లోకాన్ని వెలుగులతో నింపాడు; తరిగి పోతున్నా నన్న దిగుల్లేకుండా ....

(22-2-89 బుధవారం)

అందుకే నే నా గదిలోకి వెళ్ళను
వెళ్ళానా - మెరిసే ఆమె కళ్ల కనబడతాయి
తీయని ఆమె గుసగుసలు వినబడతాయి
ఆమె మెత్తని పాదముద్రలు కొత్తగా కనబడతాయి
ఆమె సరికొత్త గాజుల చప్పుళ్ళు మెత్తగా వినబడతాయి
శబ్దాలమధ్య నిశ్శబ్దంలాగా ఆమె నవ్వు వినబడుతుంది
అక్షరాక్షరంలో జీవ్వున చిమ్మే కవిత్వంలా ఆమె రూపం కనబడుతుంది
అందుకే - నే నా గదిలోకి వెళ్ళను

ఒకప్పుడది నా బ్రహ్మలోకం, నా వైకుంఠం, నా కైలాసం; నా వాగ్దేవి, నా శ్రీదేవి, నా ఉమాదేవి నాతో ఉన్నప్పుడు. ఇప్పుడదేమిటో నాకు తెలియదు. అందుకే - నే నిప్పుడాగదిలోకి వెళ్ళను ....

(23-2-89 గురువారం)

ఆమె గాజు ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఎదురుగా అతను కనిపించాడు నవ్వుతూ.

"చాలాసేపు నిద్దురపోతాసన్నావు గదా! అప్పుడే లేచావేం?" అన్నాడతను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అలా అనే అనుకొన్నాను. కానీ - నాకు బాగా చలి వేసింది. ఎందుకనో తెలీదు ఆ చలికి గజగజ లాడిపోయాను. మెలకువ వచ్చింది. అపును గానీ - నువ్విక్క డేం చేస్తున్నావు కన్నా ? అలా కొత్తగా, ఏదోలాగా కనబడుతున్నావేం ?" అన్నదామె.

"నిదురపోతున్న నిన్ను చూస్తూ కూచున్నాను" అన్నాడతను నవ్వుతూ.

"ఆ చూపుల చల్లదనానికే, నాకు మెలకువ వచ్చి ఉండాలి" అన్నదామె.

"కావచ్చు. నిన్ను చూస్తూ చూస్తూ చూస్తూనే, నేనూ, కొత్తవాడినయి ఉండాలి" అన్నాడతను మరోసారి నవ్వుతూ ...

(24-2-89 శుక్రవారం)

"ఆ అమ్మాయి, అబ్బాయి, వొకరినొకరు ముట్టుకోకుండా, ఓ వారంరోజుల పాటు కలిసిమెలిసి తిరిగారు. మొదటి మూడు రోజుల్లోనే, వారిని వీరూ, వీరిని వారూ, 'ఘణ్ణం'గా అర్థం చేసుకోవడం పూర్తయిపోయింది. మిగిలిన నాలుగు రోజులూ, ఊరికే కూచోవడమెందుకొని, ఒకరినొకరు గాఢంగా ప్రేమించేసు కొన్నారు. ఎనిమిదో రోజున పెళ్ళి చేసుకొన్నారు. రెండు వారాలపాటు ఝామ్మంటూ, ఆనందసాగరంలో మునుగుతూ, తేలుతూ, మళ్ళీ మునుగుతూ, మళ్ళీ తేలుతూ, మళ్లీ మళ్ళీ మునుగుతూ, మళ్ళీ మళ్ళీ తేలుతూ రాత్రింబవళ్ళు తేడా లేకుండా సుఖపడ్డారు" అన్నాను.

"తరువాత ఏమయింది ?" అన్నారు కృష్ణమూర్తిగారు.

"నాకూ తెలీదు. నేను రాయదలుచుకొన్న దింతవరకే రాసిందీ ఇంతవరకే !" అన్నాను.

"నా కర్థంకాలేదు" అన్నారాయన

"ఆరవై రెండేళ్ళుగా నేనీ ఇంట్లో ఉంటున్నాను. ఇదెప్పుడు కూలిపోతుందో, ఎందుకు కూలిపోతుందో నాకు తెలియదు. కూలిపోయాక నేనెక్కడికి వెళ్ళాలో అంతకన్నా తెలీదు. కానీ - మూడు రోజుల్లోనే, వారిద్దరూ వొకరినొకరు 'ఘణ్ణం'గా తెలుసుకొన్నా మనుకొన్నారు" అన్నాను.

మరి - అలా ఎందుకు రాశారు ?" అన్నారు కృష్ణమూర్తిగారు

"అలా అర్థం చేసుకొన్నవారూ, చేసుకొన్నామనుకొంటున్నవారూ నా చుట్టూ ఉన్నారు గనక" అన్నాను. ఆయన - నన్ను పిచ్చివాణ్ణి చూసినట్టుగా చూశారు. అప్పుడనిపించింది నాకు - నిజంగానే నేను పిచ్చివాణ్నే మోనని ....

(25-2-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముడతలు పడిన నీలం తివాచీలాగా, సముద్రం పరుచుకొని ఉంది. తెరచాప, చుక్కాని, తెడ్డులేని, అతుకుల పడవలో, అతను ప్రయాణమయ్యాడు. తరంగాలు అతనిమీద కసితో తిరగబడ్డాయి. తిమింగిలాలు వెంటపడ్డాయి. ఉప్పుగాలులు ఉక్కిరి బిక్కిరి చేశాయి. అతను మూర్ఛితుడయినాడు.

అప్పుడో అద్భుతం జరిగింది.

అప్పుడో నూతన స్పర్శ, అతని నెన్నుదుటిమీద వాలింది. అప్పుడో కొత్త గొంతుక అతని అంతరాంతరాలను పలకరించింది.

అప్పుడో కొత్త వెలుగు, అతని అణువణువునూ కాంతిమయం చేసింది.

అప్పుడతను మూర్ఛనుండి తేరుకొన్నాడు.

ఎదురుగా, కొత్తగా, మెత్తగా నవ్వుతోన్న ఆమె కనిపించింది.

"ఓ కరుణామయీ ! ఎవరు నీవు ? పేరేమిటి ? ఎక్కడినుంచి వచ్చావు ? ఎందు కొచ్చావు ?" అన్నాడతను వినయంగా తలవొంచి.

ఆమె జాలిగా నవ్వింది; అతని జుత్తును నవ స్తూ.

"నువ్వు కాస్త గడుసువాడివయ్యా ! నా పేరులో పిలుస్తూనే, మళ్ళీ పేరడగు తున్నావెంచుకూ ? ఈశ్వరుని దగ్గరినించి,. నీ కోసమని వస్తున్నాను" అన్న దామె. అతన్ని అక్కున చేర్చుకొంటూ.

"నా బతుకొక శిలారణ్యం లాంటిది.ఇందులో కెందుకొచ్చావు ?" అన్నాడతను ఆశ్చర్యంగా ఆమెను చూస్తూ.

"నేను రాలేదు. ప్రభువు వంపించాడు. ఎందుకు వంపించాడో స్వామికి తెలుసు. బహుశా నిన్ను—"అని సగంలోనే ఆగిపోయిందామె అతని కన్నీరద్దుతూ.

"నేనొక శాపగ్రస్తుణ్ని" అన్నాడతను తల వొంచుకొని.

"ఇప్పుడు కాదు" అన్నదామె నవ్వుతూ.

"నీవొక చిన్మయమూర్తివి" అన్నాడతను.

ఆమె నవ్వింది.

"అదీకాదు. నేను నీ చిన్న నయ్యా !"

"ఎప్పుడో, ఎక్కడో, ఎందుకో దోవ తప్పాం.ఇప్పుడు మళ్ళీ కలుసుకొన్నాం" అన్నాడతను ఆమెలో కలిగిపోతూ.

(26-2-89 ఆదివారం)

"నే నిప్పుడే గతంలో కెళ్ళొచ్చాను. వస్తూ వస్తూ రోజుల్ని,గంటల్ని,నిమిషాల్ని, సెకన్లని మూట గట్టుకొచ్చాను. నిత్యాచలితాలైన ఆ కాలశకలాలను, నిశ్చలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తాలను చేశాను" అన్నాడతను.
"ఎందుకట్లా?" అన్నదామె.
"వాటినిండా నీవున్నావు గనక. నీవే - ఉన్నావు గనక"
"కన్నా!" అన్నదామె కన్నీళ్ళతో.
"నీవూ, నీ ఈశ్వరుడూ కలిసి నన్ను మోసం చేశారు. దగా చేశారు. వంచిం చారు" అన్నాడతను కోపంతో, దుఃఖంతో.
"నేను నిమిత్త మాత్రం. అప్పుడెప్పుడో నీవద్ద కెళ్ళమన్నాడు ప్రభువు వచ్చాను. తిరిగి తనవద్దకు వచ్చేయమన్నాడు. ఆ జగత్పిత వద్దకెళ్ళాను. నాదేందోష ముంది కన్నా!"
"నీవూ దూరమయి, నీజ్ఞాపకాలూ దూరమయితే, నేనేమయిపోవాలి చిన్నీ! నువ్వెలాగూరావు రాలేవు కూడా. రావాలని నీకున్నా, నీ ఈశ్వరుడు రానీడు. కనీసం నేనన్నా నీ దగ్గర కొద్దామంటే, అదీపడనివ్వడంలేదు. ఇంక నాకు మిగిలింది నీ జ్ఞాపకాలు తప్ప ఇంకేమున్నాయమ్మా?" అన్నాడతను కన్నీరుగా కరిగిపోతూ. "అన్నీ ఉన్నాయి. నీకు లేనిదేముందికన్నా? నేనయినా, నీకు తెలిసిన'నేను'గా లేనేమోగానీ, మరొకలాగా లేనా కన్నా? నేను లేనిదెక్కడా, నన్ను నీవు చూడనిదెక్కడయ్యా?" అన్నదామె, అతన్ని అక్కున చేర్చు కొంటూ ...

(27-2-89 సోమవారం)

... అనుభవమూ నేనే అయి, అనుభవిస్తున్నదీ నేనే అయితే, నాకూ నా అను భవానికీ తేడా ఎక్కడుంటుంది? ఆపాటి తేడా కూడా ఆరెండింటి మధ్య కరిగి పోతే, 'అనుభవిస్తున్నాను. ఆనందిస్తున్నాను. సుఖపడుతున్నాను. దుఃఖపడు తున్నాను.' అన్న స్పృహ ఎక్కడ మిగులుతుంది? ఈ అనుభవాలు, అను భూతులు, సంవేదనలు నీకు కావాలా? 'ద్వైతం'గా ఉండిపోవాలి, వీటన్నిం టినీ నీలో కలుపుకొన్నప్పుడూ, వీటన్నింటినిండా, నీవే అయిపోయినప్పుడూ, ఇవన్నీ నీవే అయిపోయినప్పుడూ, నీవే ఇవన్నీ అయిపోయినప్పుడూ అప్పుడు "నీవు"మిగలవు. "ఇవి" మిగలవు. 'అవి' మిగలవు అప్పుడది 'అద్వైతం' అవుతుంది. చెప్పమని అడుగుతున్నదీ, చెబుతున్నదీ, చెప్పేది వింటున్నదీ, అంతా నీవే!

నీకే అనుమానం కలుగుతుంది. ఆ అనుమానానికి నీవే సమాధానం వెదుక్కొని పట్టుకొంటావు. ఆ సమాధానం మననం చేసుకోవడం ద్వారా, ఎదుగుతున్నదీ, విస్తరిస్తున్నదీ కూడా నీవే అవుతావు.
నేనెంత గింజు కొంటేనేం, మధన పడితేనేం, నా మనసులో ఉన్నదాన్ని మాటల్లోకి మార్చలేకపోతున్నాను. నా ఆలోచనలను, అక్షరాలలోకి తీసుకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాలేకపోతున్నాను. నాకు అందుబాటులో ఉన్న సాధనాలు దుర్బలమైనవి. నా సమకాలీనులు, నా ముందు తరంవారు, నన్నో అసమర్థునిగా, అశక్తునిగా భావిస్తే నాకు బాధలేదు. నా పదాలుచూసి, ఆ పదాలను పేర్చుకొంటూ నేనల్లిన వాక్యాలను చూసి, ఈ వాక్యాలసాయంతో నేను రూపొందించుకొన్న ప్రతీకలను చూసి, ప్రతీకలను మాత్రమే చూసి, మెచ్చుకొన్నారంటే నేను ఘోరంగా ఓడిపోయానన్నమాటే! ఈ ప్రతీకల సాయంతో, నేను సూచించదలచిన వన్నీ మరుగున పడిపోయాయంటే, నేను చేతగాని రచయితనన్నమాటే!

ఒక్కో భావాన్ని అదుపులోకి తెచ్చుకొని, భాషలోనికి ఇమిడ్చేసరికి, ఆ భావంలోని చైతన్యం, సొగసు, పరిమళం, ఇగిరిపోయి, ఎగిరిపోయి అడుగున పిసరంత మాత్రం మిగులుతోంది. ఆ కాస్తకే నన్ను అభినందిస్తూ ప్రోత్సహిస్తున్నారు సహృదయమిత్రులు. మొత్తం - నా భావప్రపంచాన్ని, సమగ్రంగా వారి ముందుంచగలిగితే, నా జన్మ ధన్యమయినట్లే!

కానీ - నా కాపని చాతకావడం లేదు ..

(28-2-89 మంగళవారం)

ముళ్ళల్లో చిక్కుకుని, వొంటి నిండా గాయాలయి, పేలికలుగా చిరిగిపోయి, ముక్కలుగా విరిగిపోయి, నీడలుగా రాలిపోయిన వెలుతురులో, నా దోవ అంతర్ధాన మయింది. ఇప్పుడే నా కరదీపిక కనులు మూసింది. ఇక్కడెక్కడో నన్ను నేను పోగొట్టుకొన్నాను.

కాలభిత్తిక మీద జ్ఞాపకాల వలువల్ని ఆరేస్తున్నాను. నా అశ్రు జలపాతా లిప్పుడు ఎండి పోయాయి.

వెలుతురే లేని చీకటి పొదల మధ్య,అంతర్ధానమైన దోవలో నడుస్తూ, నడుస్తూ నన్ను నేను పారేసుకొన్నాను.

నే నిప్పుడు విశ్వాసాన్ని పోగొట్టు కొన్నవాణ్ని
నే నిప్పుడు ఆత్మను పోగొట్టు కొన్నవాణ్ని
నే నిప్పుడు అన్నీ పోగొట్టు కొన్నవాణ్ని

"నాకిప్పుడు ఏకాంతం కావాలి!" నవ్వుతోన్నట్టుగా అడిగింది అరుణతార.

కానీ - ఆనవ్వు నిండా విషాదమే చిమ్మి కొడుతోందని నాకు తెలుసు.

"నీవడిగింది 'ఏకాంతం?' అన్న ప్రశ్న గనక అయితే, నేనేమిటో నీకు తెలియ లేదను కొంటాను. కాక 'ఒంటరితనం' అన్న అర్థంలో నయితే. నన్నింకా అర్థం చేసుకోలే దనుకొంటాను. ఓ అరుణ తారా! నీక్కా వలసింది 'ఏకాంతం' కాదు; 'నా కాంతం' అన్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"మన్నించు" అన్నది అరుణతార తలవంచుతూ....

(2-3-89 గురువారం)

ఎక్కడో ఏదో అద్భుతం జరిగి, మళ్ళీ నేను చిన్నవాడి నయిపోతే ఎంత బావుండును!

ఏ దేవతలో కరుణించి, పారేసుకొన్న నా పసితనాన్ని తిరిగి నాకు ప్రసాదిస్తే ఎంత బావుండును!

చిరిగి పోయిన నా చిరునవ్వులన్నీ మళ్ళీ చిగురిస్తే ఎంత బావుండును!

కాలిపోయిన నా కేరింతాలన్నీ కువ కువ లాడుతూ నన్ను కమ్మేస్తే ఎంత బావుండును!

అప్పుడు నా కొండతో నేను కబుర్లు చెబుతాను
అప్పుడు నా మబ్బు నీడలతో నేను నేస్తం కడతాను
అప్పుడు నా చెరువుగాలి నాకు ఈలలు నేర్పుతుంది
అప్పుడు నా గాలి గోపురం నన్ను తనలో దాచుకొంటుంది
అప్పుడు మర్రి ఊడలు నా కోసం ఉయ్యాల లవుతాయి
అప్పుడు నా ఆకాశం నీలంగా నా కోసం దిగి వస్తుంది
అప్పుడు రాగి ఆకులు నా కోసం బూరలయి పోతాయి
అప్పుడు-

డబ్బు, అసూయ, యుద్ధం, కుట్ర, మోసం, దగా, వంచన, తాగుడు, వ్యభిచారం, వ్యాపారం, ఉండవు. రేడియోల, దూరదర్శన్‌ల, పుస్తకాల, పత్రికల కాలుష్యాలుండవు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మనుషుల్ని పాడుచేయవు. "మహాకవుల" మహాకవితలు చదవలేక వినలేక మరణయాతనలు పడే దురవస్థ లుండవు. బతుకు భయం ఉండదు. మరణ భయం ఉండదు. భగవంతుడు లాంటి అమ్మ ఎదమీద జోల పాటలా బతికేయొచ్చు.

పసిడి కల లాంటి నా పసితనం మళ్ళీ నాకొస్తే ఎంత బావుండునో!

(3-3-89 శుక్రవారం)

'నీకో వరమిస్తాను. ఒక్కటేవరం. కోరుకో!" అన్నాడు ప్రభువు.

"నాకు చాలా కావాలి" అన్నాడతను.

అతని పేరాశకు ఆశ్చర్యపోయాడు ప్రభువు. ఏమనుకొన్నాడో గానీ, సన్నగా నిట్టూర్చాడు.

"నీకు చాలా ఇచ్చాను. నీవడిగినవీ, అడగనివీ ఇచ్చాను. నీ అర్హతలనుమించి నీకిచ్చానని నలుగురూ నన్నాడిపోసుకొన్నారు. అయినా నీకు తృప్తిలేదు...సరే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అడుగు. ఏం కావాలో ఎన్ని కావాలో అడుగు! నీ వడిగినవన్నీ ఇస్తాను" అన్నాడు ప్రభువు.
"నీవు ప్రభువువు. నేను ఆశ్రితుణ్ని. నీవు దాతవు. నేను పరిగ్రహీతను. నిన్ను తప్ప నేను మాత్రం ఇంకెవరినడుగుతాను? నాకు కాంతం కావాలి. కాంతం కావాలి. కాంతం కావాలి. కాంతం కావాలి..."
"కన్నా!" అన్నాడు ప్రభువు నీళ్ళు నిండిన కళ్ళతో. ఆ పైన ప్రభువు కూడా మాట్లాడలేకపోయాడు ...
(4-3-89 శనివారం)

నీవు నేను ఒకరినొకరం చూసుకొన్న ఆ క్షణం; నీలోంచి నాలోంచి, నాలోకి నీలోకి దివ్యానందం వెలిగిన ఆ క్షణం;
నిన్నూ నన్నూ ఒకే వెలుగు తీయగా స్పర్శించిన ఆక్షణం;
నేను కరిగి నీవయి, మరల కరిగి నేనయి తిరిగి కరిగి నీవయి నేనయి
కలిసి కరిగి మేనయి, మనమయిన ఆ క్షణం; అదే, అదొక్కటే, ఆక్షణ మొక్కటే నాకు సత్యం ...
(5-3-89 ఆదివారం)

"నే నా తీరం అంచున అలలాగా తిరిగాను. కల లాగా కరిగాను. నేనా వెలుతురులో చూపులను శుభ్రం చేసుకొన్నాను. నే నామబ్బుల కంచెలమీద ఊపిరిని ఆరేశాను. నేనా సప్తస్వరాల మూలమూలల్లోకి వినికిడిగా విస్తరించాను. నేనా రుతువుల్లోకి వెలుతురుగా చొచ్చుకు వెళ్ళాను నీ కోసం!" అన్నాడతను.
ఆమె నవ్వింది.
"అసత్యమనుకొంటున్నావా చిన్నీ!" అన్నాడతను.
"ఓ రకంగా కాదు. మరో రకంగా అవును." అన్నదామె వెలుతురులో కరిగిపోతూ, కలిసిపోతూ ...

(6-3-89 సోమవారం)

"ఇంటినిండా సువాసనలు గుబాళించిపోతున్నాయి - ఒక్క ఆ గదిలో తప్ప. ఆ పురుటి గదిలోంచి కిరోసిను వాసనొస్తోంది. ఆ ఇల్లాలు ఆడపిల్లను కన్నదన్న మాట" అంటూ ప్రారంభించా నొక వాక్చిత్రాన్ని.
"అక్కడ జరుగుతున్న అన్యాయాలను చూసి, మొక్కలు మండి పోయాయి. చెట్టు చేమలు మాడి పోయాయి. మబ్బుల గుండెలు ఎండిపోయాయి. అందుకే అవి ఒక్క కన్నీటి చుక్కనైనా రాల్చలేకపోతున్నాయి. అక్కడి కొండలు కూడా కరిగి కరిగి ఇసకగా మారిపోయాయి. ఇప్పుడక్కడ అన్యాయం చేయడానికీ అనుభవించడానికీ, ఒక్క మనిషి కూడా లేదు. అది-ఉత్త ఎడారి"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని రాశాను చివరన.
ఎక్కడో దూరంగానో,దగ్గరగానో, లోనించో వెలినించో తెలీకుండా వినబడు తున్న ఆ చప్పుడు ఏమిటో ఇప్పుడే తెలిసింది; అవి - నా కలలు విరిగిపోతున చప్పుళ్ళని ...

(7-3-89 మంగళవారం)

అలసిన సంధ్యాదేవి నుదుటి బొట్టులాగా, నెలవంక మెరుస్తోంది పడమరగా. గగన వీధిలో, ఏ గొప్ప వారింట్లోనో పెళ్ళి జరుగుతోంది. ఉరుముల వాద్యాలతో, మెరుపుల బాణా సంచాతో, చినుకుల పూలతో, హోరెత్తిపోతోంది ఆకాశమంతా. తడిసిపోతామన్న భయంతో, చుక్కలు సైతం బయటకు రావడం లేదు ...

(10-3-89 శుక్రవారం)

... నీవు ఉన్నప్పుడు తప్ప, నీవు లేనప్పుడు నేనూ లేననీ, నీతో ఉన్నప్పుడు తప్ప, నీతోలేనప్పుడు నేనేమీకాననీ, నాకు మరోసారి గుర్తుకొచ్చింది.
చెట్లకే ముళ్ళుంటాయనుకొంటాం. అవి కనబడతాయి. వాటిని విరిచేస్తాం. లేదా దూరంగా ఉంటాం. కొంతమంది మనుషులనిండా, మనుసులనిండా, మాటల నిండా ముళ్ళుంటాయి. వాటిని విరిచేయలేం. దూరంగా జరిగీ ఉండలేం ...

(11-3-89 శనివారం)

నేనో ఆకాశపుతునకనయిపోవాలి. పారదర్శకమైన పవనాంకురాన్నయిపోవాలి. అప్పుడే కనులు విప్పిన చిన్నారి మొగ్గనయిపోవాలి. సుగంధపు శిశువునయిపోవాలి. కనురెప్పల కిటికీల్లోంచి చెక్కిళుల మీదికి తొంగిచూసే, స్వప్న బిందువు నయిపోవాలి. దూరలోకాల నుంచి వినిపించే ఆనంద గీతాన్నయిపోవాలి. మంచులో తడిపిన మందార పూవునయి పోవాలి. ఉత్తమ లక్ష్యాన్నయి పోవాలి. తృష్ణనయి పోవాలి. తృప్తినయిపోవాలి. ప్రభూ! ఇవన్నీ అయిపోవాలని నేనెందుకు కోరుకొంటున్నానో నాకు తెలుసు.
వెన్నెల తుప్పరపడి, ఆకాశమార్గమంతా తడిసిపోవడంవల్లనే, మబ్బులకాళ్ళు జారిపోతున్నాయేమోమరి! అలవాటయిన తోవలోకూడా, తిన్నగా నడవలేక, అటూ ఇటూ తూలిపోతున్నాయి...

(12-3-89 ఆదివారం)

... ఓ మునిమాపువేళ మెల్లగా పలకరిస్తూ, తీయగా, గోముగా, నిన్నాలింగనం చేసుకొనేందుకోసం, నేనోసందెగాలి తరగనయి పోదామనుకొంటున్నాను. నీ వేపు చూసేందుకూ చూపులతో నిన్నలంకరించేందుకూ నన్ననుమతించు. ఇన్ని వందల వేల లక్షలసార్లు నాకు గుర్తు కొస్తున్నావుగదా! నే నెప్పుడూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీకు జ్ఞాపకమే రానా?...

(13-3-89 సోమవారం)

చిన్నీ ! "నీవు" నీవుగా పూర్ణంగా, నీవంతా కూడా వొద్దు. నీ పేరులోని ఓ అక్షరం కనబడితే చాలు-ఏ పదంలోనో, వాక్యంలోనో; నాకు నీవే కనబడతావు; నిదురలోయల్లోంచి జాలువారే స్వప్నవాహినిలాగా, మంచు పొగల్లోంచి పాకుతూవొచ్చే చంద్రకిరణంలాగా, ఎండను తాకి రంగులుగా చీలిపోతున్న వాన జల్లుల్లాగా, మరుపుల మడతల్లోంచి, మేలుకొంటున్న అందమైన ఆలోచనలాగా, నాకు నీవే కనబడతావు.

నాకు తెలీకుండా, నాలోకి నీవెప్పుడన్నా తొంగి చూడు. అక్కడ నీ రూపం నీకే కనబడుతుంది. నీ రూపంచుట్టూ భక్తితో ప్రదక్షిణం చేస్తున్న ఆర్తగీతం వినబడుతుంది.

చిన్నీ ! ఆ గీతాన్ని నేనే !!!

(14-3-89 మంగళవారం)

చిన్నీ ! ఎప్పుడో ఎందుకో జ్ఞాపకం వొస్తావు హఠాత్తుగా; సత్యంలాగా, సత్కార్యంలాగా, సద్భావంలాగా, సన్మిత్రత్వంలాగా, సదానందంలాగా, సంతృప్తిలాగా - నాకు జ్ఞాపకం వొస్తావు. వాటిని నీతో పంచుకొందామని, అప్పుడు చూస్తాను నీ కోసం నాకు ఆ పక్కనా ఈ పక్కనా. అప్పుడు "నీవు" నీవుగా నాకు కనిపించవు. నిన్నెవరో ఎప్పుడో నా నించి దాచివేశారని అప్పుడు గుర్తొస్తుంది ఆకస్మికంగా. క్షణంలోని సగంలోని సగంలోనే, ఉరుకులతో, పరుగులతో తీరాలను దాటుతూ, హోరెత్తిపోయే మంటల ప్రవాహంలాగా మారిపోతాను ...

(15-3-89 బుధవారం)

"నిన్ను చూసి చాలా కాలమయింది. ఏ జన్మజన్మాంతరాల కిందటవో చూసినట్టుంది" అన్నాడతను.

"లేదు కన్నా ! క్షణం కిందట కూడా చూశావు. ఇప్పుడూ చూస్తున్నావు. ఎప్పట్నించో-నాకు తెలీని కాలంనుంచీ, నాకు గుర్తులేని కాలంనుంచీ; నన్ను చూస్తున్నావు !" అన్నదామె

"నువ్వెక్కడున్నావు? ఎక్కడ? ఎక్కడ?" అన్నాడతను ఆర్తితో.

"నన్ను నీవు అన్నిచోట్లా చూస్తూ చూస్తూనే, ఎక్కడని అడిగితే, ఏం చెప్పనయ్యా?" అన్నదామె.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అప్పుడు - మనంకలిసి ఉన్నప్పటి ఓ సంవత్సరం - ఇప్పుడు నాకో సెకనుతో సమానం.
ఇప్పుడు - నీవు దూరమైన ఇప్పుడు - ఓ సెకను, నాకో సంవత్సరంతో సమానం. మనం కలిసి ఉన్నది 34 సెకనులు మాత్రమే!
మనం విడిపోయి 8 కోట్ల 26 లక్షల 84 వేల 8 వందల సంవత్సరాల యింది - ఇప్పుడు ఇంకా పెరిగింది - పెరుగుతోంది - పెరుగుతూ పెరుగుతూ ఉంటుంది కూడా.

ఈ దేశ కాల వైవిధ్యాన్ని "సాపేక్ష సిద్ధాంతం" అని గాపును అంటారు. నా కివేమీ తెలియవు. అయినా నాకేం తెలుసు గనక - ఇది తెలీదని బాధపడ డానికి? దీనిని సోదాహరణంగా బోధపరచేందుకే, ఈశ్వరుడు నిన్ను దూరం చేశాడా చిన్ని ....

(16-3-89 గురువారం)

ఒక ప్రశ్నకు జవాబు చెప్పుకోవడమూ, చెప్పుకొనలేకపోవడమూ సమస్యకాదు. మనం జవాబు చెప్పుకోలేనంతటి క్లిష్టమైన ప్రశ్న ఎదురు కావడమే మన అదృష్టం. అలాంటి ప్రశ్న ఎదురు కావడమంటే, మన వికాసానికి, మన అభ్యుదయానికీ, దోహదం లభించడమన్నమాట!

"ప్రత్యుత్తరం దొరకని ప్రశ్న" అంటూ ఏదీ ఉండదనుకొంటాను. కొన్ని ప్రశ్నలకు సులభంగా జవాబు దొరుకుతుంది. మరికొన్నింటికి, కాస్త ఆల స్యంగా దొరుకుతుంది. ఇంకొన్ని ప్రశ్నలకు నాకు జవాబు దొరకదు. ఇంకె వరినన్నా అడుగుతాను. వారు చప్పున జవాబు చెబుతారు. నాకు దొరకని ప్రత్యుత్తరం వారికెలా దొరికింది?

ప్రతి ప్రశ్న తాలూకు ప్రత్యుత్తరమూ, ఆ ప్రశ్నలోనే ఇమిడి ఉంటుంది; వివ రంగానో, సంక్షిప్తంగానో, పైపైగానో, లోపలిగానో. ప్రశ్నలోపలి పొరల్లో దాగొని ఉన్న జవాబును వెదికి పట్టుకొన గలగాలి. అదీ ముఖ్యం!

ఈశ్వరుడూ అంతే! "ఎక్కడ?" అన్న ప్రశ్నలోనే జవాబూ ఉంది "ఇక్కడే!" అని. ఎక్కడ చూస్తే అక్కడే, ఎప్పుడు చూస్తే అప్పుడే కనిపిస్తాడు ఈశ్వరుడు కొందరికి. ఇంకొందరికి దేవాలయంలో, మసీదులో, చర్చిలో, క్షేత్రంలో, తీర్థంలోనే కనబడుతాడు. మరి కొందరికి ఎక్కడా ఎప్పుడు కనబడడు. అంతే! చేయగలిగిందేమీ లేదు ...

(17-3-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాగం కావాలి. ఆప్యాయత కావాలి. ఆత్మికమైన స్పర్శ కావాలి. ఆర్ద్రమైన పిలుపు కావాలి. పలచగా వీచే పైరగాలి కావాలి. వెన్నెల చినుకులు కావాలి. హరివిల్లు కావాలి. హరితం కావాలి. తేనెతొలకరి కావాలి. పరిమళ శకలం కావాలి. ఉషోదయం కావాలి. ఇవన్నీ కావాలి; ఇలాంటి వన్నీ కావాలి. ఇలాంటి వన్నీ ఉన్నవన్నీ నాకు కావాలి. లేదా - ఆమె నివ్వు చాలు ....

(18-3-89 శనివారం)

"మీకు నాకు పోలికల్లేవు. మీవి సారవంతమైన భూములు సేద్యంలోని మెలకువ లన్నీ తెలిసిన ఆధునిక కర్షకులు మీరు. అందుకే అద్భుతమైన పంటలు పండించి రాసులు పోశారు. మీకు పనికిరాని బంజరు భూముల్లో చవిటి నేలల్లో నేను అడుగు మోపాను. నాకు నీటి వసతి లేదు. వ్యవసాయ పనిముట్లు లేవు. నా పర్రల్లో, నేను వేళ్ళతో దున్నాను. నా కన్నీళ్ళూ, నాచెమటా, నాపోలాల్లోకి పారించాను. ఏవో పిచ్చి మొక్కలు పెంచుకొన్నాను. పిచ్చి పంటలు పండించు కొంటున్నాను. మీతో పోటీ పడట మన్న ఆలోచనే నాకు రాదు. అలా మీరను కోవడం, నాకు గర్వకారణం, మీకు చిన్నతనం. నా కే మున్నదని మీతో పోటీ పడతాను చెప్పండి?

"నేను మహా నాటకాలు, మహా కావ్యాలు, మహా నవలలు, మహా కథలు, మహా వ్యాసాలు రాయలేదు; రాయలేను కూడా. మీరు (అందరి ముందు) ప్రస్తావించని వ్యభిచారిణులను గురించీ, (కనబడుతున్నా) పట్టించుకోని అలగా జనం గురించీ రాశాను. కనక - మీరచనల్లో కనిపించే రంగులు, మెరుపులు పరిమళాలు, నారచనల్లో ఉండవు. కనక - నేను పోటిదారును కాను" అన్నాను"——" గారి బంటుతో ...

(19-3-89 ఆదివారం)

చిన్నీ!

నేను వెలుగు నయ్యాను నిన్ను తనివారా చూదామని
నేను మాట నయ్యాను నీ పెదవులను సుతారంగా తాకుదామని
నేను బాట నయ్యాను నీ పాదాలను శిరసా ధరించుదామని
నేను గాలి నయ్యాను నిన్ను గాఢాలింగనం చేసుకొందామని
నేను నీడ నయ్యాను ఎప్పుడూ నీతోనే గడుపుదామని
నేను నీ వయ్యాను నీలో, నన్ను నేను చూసుకొందామని
నీ కోసం నేను చాలా చాలా అయ్యాను, చాలా చాలా చాలా అవుతాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీ కోసం నేనింకా ఏమైనా, ఏమైనా ఏమైనా అవుతాను. అయినా ఏం లాభం చిన్నీ!
నన్ను దుమ్ముకూ దూగరకూ అప్పగించి
నన్ను మండుతున్న మంచు మంటలకు అప్పగించి
నన్ను నిశ్చల నిశ్శబ్ద దిశలకు అప్పగించి
నన్ను పీలికలుగా చీల్చివేసే నిశలకు అప్పగించి
నన్ను ఇక్కట్ల చీకట్లకు అప్పగించి
నన్ను నరుక్కొని కొరుక్కునే ఏ కాంతానికి అప్పగించి
చిరునవ్వుతో వెళ్ళి పోయావు
అక్షరారణ్యం లాంటి నా జీవితంలోకి,
గుప్పెడు వసంత గీతంలాగా తొంగిచూశావు
అంతులేని శిశిరంతో నన్ను శరస్నానం చేయిస్తున్నావు. అయినా - దేశం కాని దేశంలో, కాలంగాని కాలంలో నీ కోసం నిరీక్షిస్తూనే, ప్రతీక్షిస్తునే, ఎదురు చూస్తునే చూస్తునే చూస్తునే ఉంటాను; నిన్ను మన్నులోనూ మిన్నులోనూ వెదికే కన్నుగా నన్ను నేనే మార్చుకొన్నాక...

(20-3-89 సోమవారం)

సమస్త జ్ఞానేంద్రియాలు శక్తి వంచన లేకుండా చెప్పి, మళ్ళీ చెప్పి, మళ్ళీ మళ్ళీ చెప్పి, ఆపైన చెప్పడంచేత కాక మూగ పోతాయి. అవి-మూగవయి నప్పిన్నించీ, ఆలోచనం విప్పారడం ప్రారంభ మవుతుంది. అవగాహన ప్రారంభ మవుతుంది. ఈ "అవగాహన" విస్తరించిన కొద్దీ, జ్ఞాన కాంతుల ప్రసరణం కూడా పెరుగుతుంది. ఈ ప్రకారణం "మనకు ప్రాప్తం ఉన్నంత వరకు" పెరుగుతుందని, ఇప్పుడను కొంటున్నాను. అంత దాకా తెలియని దాన్ని గురించి, ఆకాంతి వెల్లువలో అప్పుడు తెలుసుకొంటాం. ఒకప్పుడు, "అంతా తెలుసు" ననిపించింది. తరువాత "తెలుసుకొన వలసిందింకా ఉన్నది" అనిపించింది. ఇప్పుడేమో "ఏమీ తెలియదు" అనిపిస్తున్నది. ఈదశ కూడా దాటిన తరువాత "ఎప్పటికే ఏదీ తెలుసుకో లేను" అనిపిస్తుంది. ఇంకొంచెం ముందు కెళ్ళాక, "తెలుసుకొంటున్నది నేను. ఆ తెలుసుకొంటున్నది కూడా నా గురించే! నాకూ, నేను తెలుసుకొంటున్న దానికీ తేడా లేదు" అన్న స్థితి వొస్తుం దనుకొంటాను. నేనిప్పడే నాలుగవ దశకు —"ఎప్పటికీ ఏదీ తెలుసుకో లేను" దశకు సమీపంగా ఉన్నాను ...

(21-3-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తుతులకు ప్రభువు లొంగుతాడని మన మనుకోవడం చాలా సహజం; మనం అలానే లొంగిపోతాం గనక, ఈశ్వరుడూ అంతే ననుకొంటాం. మన బలహీనతలనూ; అవగుణాలనూ, ఈశ్వరునిలోనూ మనం చూస్తాం; ఇంకోరకంగా చూడడం మనకు రాదు గనక.

సత్కార్యాచరణం మానేసి స్తుతులతో,నుతులతో మనం సంతృప్తి పడతామేమో నన్న భయంతోనే ఈశ్వరుడు, పరిమితమైన పద సంపద నిచ్చాడు. మనకున్న సమస్త భాషా సంపదలన్నీ కలసి ప్రభుపాద రజో వైభవంలోని సహస్రాంశాన్ని కూడా అభివ్యక్తం చెయలేవు.

తనను స్తుతించడం ప్రభువుకు ముఖ్యం కాదు; తను ప్రేమించే పనులను మనం చేయడం ముఖ్యం. అయినా మనం స్తుతులతో ఈశ్వరుని వశం చేసుకొందామనుకొంటామే గానీ, మన నిండా దయను నింపుకోవడం ద్వారా, ఈశ్వరానుగ్రహ పాత్రులం కావడానికి యత్నించం. మనకున్న అనేకానేక విలాస వస్తువుల్లో "భక్తి" కూడా ఒకటిగా మారిపోయింది. అది మనకున్నట్లు ఇతరుల ముందు ప్రదర్శిస్తాం. మనం మాత్రం దాన్ని పట్టించుకోం ....

(23-3-89 గురువారం)

ప్రభూ! నీవు దొంగవు. మాయగాడివి. ఎప్పుడో ఎందుకో, నువ్వున్నావని, అద్భుతమైన రీతిలో నాకు తెలియ చేస్తావు. ఆ రుచిమరిగి, దాని కోసం పదే పదే తపన పడతాను. రుచి చూస్తూ ఉంటాను. చివరకు –

ఆ అనుభవం లేకుండా బతక లేని స్థితిని కల్పిస్తావు. ఆమైకంలో పడి, కొంత కాలం అన్నీ మరిచి పోతాను. అప్పుడు – మిగిలిన వన్నీ అల్పంగానూ.అల్పాతి అల్పంగానూ కనబడతాయి, ఒక్క నీవుతప్ప. అప్పుడు నీ వెంట పడతాను. నువ్వేమో, నన్ను వేధించి బాధించి హింసించి, సంశయ గ్రస్తుణ్ని చేస్తావు. నీతో విసిగి వేసారి, వెనుదిరుగుతాను; నా పాత జీవితం వేపుగా. అప్పుడు- ఓ దివ్యాలింగనం నన్ను కదలనీదు. అదిగో - ఆ - అవ్యక్తానందా లింగనం కోసం, అభూతానుభవం కోసం, నేను ఎదురుచూస్తున్నాను. రా ప్రభూ! ఆ వొక్కటీ అనుగ్రహించు . .

(24-3-89 శుక్రవారం)

ప్రభూ! నేను మూగినయితే, మాటలతో కాక, మౌనంతో నిన్నారాధించే వాణ్ని నేను బధిరుణ్నయితే, నిన్ను గురించిన దూషణ భూషణలను గాక-శబ్దాతీతమైన నీ వాక్కునే విని ఉండేవాణ్ని. ఈ అల్పమైన జ్ఞానేంద్రియాలను నాకిచ్చి, అనగ్రహించగలిగిన స్వల్పాతి స్వల్పమైన రూపాలలోకి, నిన్నుసివే ఎందుకు కుంచించు కొన్నావు స్వామీ? ఇలా తప్ప - నీ అసలు సిసలు రూపంతో నా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముందుకొస్తే, నేను భరించలేను గనుకనే, నామీది జాలితో, నిన్ను నీవే ఇలా మార్చుకొన్నవా స్వామీ! నీదయకు నేనే మివ్వగలనయ్యా? నా దగ్గరేమున్న దయ్యా?

నడవవేని బిడ్డకు నడక నేర్పడం కోసం, తల్లి కూడా చిన్నచిన్న అడుగులు వేస్తుంది. కొంచెం సేపు బిడ్డ చేయి పట్టుకొంటుంది. ఇంకొంచెం సేపు చేయి వదులుతుంది. తనుకూడా తూలుతూ తప్పటడుగులు వేస్తుంది బిడ్డ కోసం. అలాగే - నీవూ నా కోసం, నేను తెలుసుకొనగల రూపాలలోకి, నిన్ను నీవు మార్చుకొన్నావా స్వామీ?

(25-3-89 శనివారం)

ఈ రోజు వేకువ నడకలో నాకు - రెండు నెలవంక లెదురయ్యాయి. రెండు హరివిల్లు లెదురయ్యాయి. రెండు దరహసా లెదురయ్యాయి. రెండు నమస్కారాలెదు రయ్యాయి. నా చిన్నికీ, నా ఈశ్వరునికీ వాటిని వెంటనే పంచేసి నేను మాత్రం "నేను"గానే మిగిలిపోయాను.

"అన్నీ రెండేసి చొప్పున వొచ్చాయిగనక బతికిపోయావు. ఒక్కొక్కటే అయితే ఏం చేసే వాడివి?" అన్నది వేకువ, నాతోబాటు గునుకు పరుగుతీస్తూ, నావేపు ఆసక్తిగా చూస్తూ.

వేకువగారు, ఆ ప్రశ్ననన్నెందు కడిగిందీ నాకిట్టే అర్థమయిపోయింది. అర్థమయ్యాక నవ్వూ వచ్చింది.

"ఏం చేసే వాడినో తెలీకనే నన్నడుగుతున్నావా వేకువా ? ఏవేవి ఎన్నేసి వొచ్చినా, నేను మాత్రం అట్టి పెట్టుకోను. ఈశ్వరునిలో కలిసిపోయిన చిన్నికిచ్చే వాణ్నే. చిన్నిలో ఉన్న ఈశ్వరుని కిచ్చేవాణ్ని. ఇప్పుడా ఇద్దరి మధ్య తేడా లేదుగనకా - ఆ ఇద్దరిలో ఎవరికిచ్చినా, రెండు వారికీ ఇచ్చినట్టే గనకా... వింటున్నావా నా ప్రియమైన వేకువా! వింటున్నావా?" అన్నాను.

ఓనిమిషం పాటు వేకువ ఉలకలేదు. పలకలేదు.

"నాన్నా! ఆ ఇద్దరి మధ్య మాత్రమే కాదు; ఏ ఇద్దరి మధ్యా తేడా లేదయ్యా! ఆ ఇద్దరిలో ఎవరికిచ్చినా రెండవ వారి కిచ్చినట్లేనన్నావు. ఎక్కడున్న ఎవరికిచ్చినా, అంతటా ఉన్న ఆ ఒక్కరికిచ్చినట్లేనని, నే ననుకొంటున్నాను. నేను పొరబాటుపడానంటావా కన్నా?" అన్నది వేకువ.

నన్నెవరో కదిలించి, విదిలించి, కుదిలించినట్లయింది.

"లేదు. నీవన్నదే నిజం. ఆ నిజాన్ని నేను తెలుసుకోలేకపోయాను. ఆ సత్య సందర్శనం కోసం నేను చేస్తున్న ప్రయాణం, ఫలప్రదం కావాలని నన్నాశీర్వదించు" అన్నాను వేకువగారి ముందు తల వొంచుతూ ...

(26-3-89 ఆదివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రభూ! మహా భక్తులు, మహా జ్ఞానులు, మహా కవులందరూ కలిసి, నిన్ను-నిన్ను కాకుండా చేశారు. అందరికీ అందుబాటులో ఉండేనిన్ను, ఎవ్వరికీ (కొద్ది మందికి తప్ప- అనాలేమో)అందనంత దూరాల్లోకి విసిరిపారేశారు.అలా చూస్తే ఇలా కనిపించే నిన్ను, ఏంచేసినా కనిపించని రూపంలోకి మార్చేశారు. నీవు నా వాడివని నాకు బాగా తెలుసు. ఈ రహస్యం తెలియని వీరందరూ, నీకూ నాకూ మధ్య, అడ్డుగా నిలబడ్డారు. నిన్ను తమ "వశం" చేసుకోవడం కోసం, వీరుపడేపాట్లు చూస్తుంటే నాకు నవ్వొస్తోంది. నువ్వెంతో సులభంగా చిక్కుతావుగదా, వీరందరూ నీకోసం ఎందుకంత అవస్థపడతారు స్వామీ? 'దయా హృదయంలో ఉంటా'నని నీవే అన్నావుగా నాన్నా! నీకోసం- కేవలం నీ కోసమనే-ఇప్పుడు నా గుండెనిండా దయను నింపుకొంటున్నానుస్వామీ! ..

(27-3-89 సోమవారం)

ప్రభూ! నాకో వెలుగురేఖను ప్రసాదించు దోవ స్పష్టంగా తెలియడానికి. నాకో మార్గదర్శిని ప్రసాదించు నన్నా దోవలోనే నడిపించడానికి. నీ గురించి, ఏమైనా చెప్పవచ్చు. ఏమిచెబుదామన్నా, నాకు తెలిసిన ప్రతీకలు దుర్బలమైనవి. నాకు కొత్త ప్రతీకలను ప్రసాదించు. నీ గురించి ఎంతయినా రాయవచ్చు. ఏమీ రాయడానికయినా, నాకు తెలిసిన భాషలు నిరుపయోగాలు. నాకు కొత్త భాషలను ప్రసాదించు.

నీవెలా ఉంటావో నాకు తెలుస్తూనే ఉంది.

"ఇలా ఉంటావు" అని, మరొకరికి చెప్పేందుకు, నిన్ను ఉదాహరించడం తప్ప ఇంకోదోవ లేకుండా చేశావు.

ఈ అన్నింటిలోనూ నీవున్నావు. నీవు మాత్రం 'నీవు'గానే మిగిలిపోతున్నావు. ఇవన్నీ నీవే, వీటికి వెలుపలానీవే! నీవు కానిదీ. నీవు లేనిదీ ఎక్కడా ఏదీ లేదు ...

(28-3-89 మంగళవారం)

చిన్నీ! జ్ఞాపకాల తెరల్లోంచి మెత్తగా మేలు కొంటున్న ఆనందరేఖవు. అవనీ తలం నుండి, ఆకాశానికి ఎగసిన గాలి కెరటానివి. నా నిండా చిక్కగా పరుచుకొన్న అకుపచ్చని నీడవు. మబ్బుల్లోంచి మనస్సులోనికి ప్రవహించిన స్వప్నానివి. అందమైన ఆవేదనవు. నా అగస్తినావి. నా ఓల్గావు. నాధెరిసావు. నీ నేత్ర క్షేత్రాల్లో అశ్రువులు మొలకెత్తడం, నాకెందుకో "అసహజం" అనిపిస్తుంది. ఈ రోజు వేకువ నడకలో, నీవు పదే పదే గుర్తుకొచ్చావు.

ప్రశాంతంగా కునుకుతున్న ఆ కాలువ వేపుగా, గాలి కూడా తొంగిచూడడం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేదు; అలలు కదిలినా నిద్రాభంగమవుతుందేమోనని! ఒంటిగా కొమ్మ మీద కుచున్న ఆ పావురాయి, అందమైన ఆర్తగీతంలాగా ఉంది. దాని వొంటినిండా దిగులు దోబూచులాడుతోంది. నీకు మల్లే, అదీ - తన జంటను పోగొట్టుకొన్న దేమో పాపం! ఆ చిన్న పూలమొక్క నన్ను చూస్తూనే కావలించుకొని ఏడ్చేసింది; ఆ పక్కనే ఉన్న ఎండిపోయిన మరో మొక్కను చూస్తూ.
ఇవన్నీ కలిసి నిన్ను గుర్తుకుతెచ్చి, నన్ను తుంపులు తుంపులు చేశాయి ...

(29-3-89 బుధవారం)

చిన్నీ! నేనిక్కడికెందుకొచ్చానను కొంటున్నావు? అంతుదరీ లేని ఆకాశంలోకి, వెండి కాంతుల భుజాల మీదికి, ఇంద్రధనుస్సుల శిరస్సుల మీదికి, మెరుపుల కోనల్లోనికి, ఉరుముల లోయల్లోనికి, ఈ ఎత్తుల్లోనికి నేనెందు కొచ్చానను కొంటున్నావు నీ కోసం తప్ప! ఈ చంద్రునితో నాకేమీ పనిలేదు. ఈ గ్రహాలతో, ఉపగ్రహాలతో, ఒంటరి చుక్కలతో, తారల జంటలతో, నక్షత్ర రాసులతో, నక్షత్ర మేఘాలతో, వాటి మిలమిలలతో, గలగలలతో, గుసగుసలతో, విస విసలతో నాకేమీ పని లేదు; నువ్విక్కడున్నావని తప్ప, నీవు నాతో ఉన్నంత కాలమూ నే నెప్పుడూ వీటిని తలచుకోలేదు. నే నెప్పుడూ వీటిని చూడలేదు. ఇన్నీ, ఇవన్నీ, ఇంకొన్నీ, నీలోనే చూస్తుండేవాడిని గనక. నేనింతదూరం రాలేదు. ఇప్పుడయినా రాకనే పోదును; నువ్విక్కడదాకా రాకపోతే, వొచ్చి వీటన్నింటినీ శాశ్వతం చేయకపోతే - వీటితో నాకేం పని చిన్నీ !....

(30-3-89 గురువారం)

చిన్నీ !
నాకా దోవంటే ఇష్టం - అది నిన్నూ నన్నూ నడవనిచ్చింది. నాకా చెట్టంటే ఇష్టం - అది నీకూనాకూ నీడ నిచ్చింది. నాకా మైదానమంటే ఇష్టం - అది నిన్నూ నన్నూ మాటాడుకోనిచ్చింది.
నాకా క్షణమంటే ఇష్టం - అది నిన్నూ నన్నూ గిరిజా శంకరులుగా మార్చింది ....

(31-3-89 శుక్రవారం)

....ఇదివర కెవరన్నా ఎదురుపడి, "నీకింతటి వైభవం ఎలా లభించిం" దంటే, నీవేపు చూసేవాణ్ని. ఇప్పుడెవరిని చూపించను ? ఇంకెవరినో చూపించిగానీ, ఇంకెవరిపేరో చెప్పిగానీ నిన్నవమానించడం నాకుచాతకాదు. అందుకే నాకిప్పు డేవైభవాలూ, ఏ సన్మానాలూ అవసరం లేదంటున్నాను. అయినా ప్రభువు ఇస్తున్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనెప్పుడూ నిదురకు దూరంగానే ఉన్నాను; అప్పుడేమో నీవు నాతో ఉన్నావన్న ఆనందంతో నిదురపోలేదు. ఇప్పుడేమో నీవు నాకు దూరమయ్యావన్న దుఃఖంతో నిదుర పోలేకపోతున్నాను. వెరసి అప్పుడూ ఇప్పుడూ, ఎప్పుడూ నేను నిదురకు దూరంగానే ఉన్నాను ...

(1-4-89 శనివారం)

"..నేను పెరిగినట్టుగా పైకి కనపడుతున్నాను. లోపల మాత్రం చాలా తరిగి పోయాను. ఏదో సంపాదించానంటున్నారు. కానీ చాలా పోగొట్టుకొన్నాను. ఎన్నెన్నో మానుకొన్నాను. నిర్భయంగా నిజం చెప్పడం మానుకొన్నాను. నిర్మలంగా నవ్వడం మానుకొన్నాను. నిరపేక్షంగా ప్రేమించడం మానుకొన్నాను. నిస్సంకోచంగా సహాయ పడడం మానుకొన్నాను. మంచితనం పోగొట్టు కొన్నాను. దయాగుణం పోగొట్టుకొన్నాను. ఆప్యాయతను పోగొట్టుకొన్నాను. ఇంకా చాలా వాటిని కూడా ... అదృష్ట మేమిటంటే పూర్తిగా మాత్రం కాదు." అన్నాను కృష్ణమూర్తి గారితో.

".. మీతో గుండె విప్పి చెబుతున్నాను. డబ్బు, కీర్తి, అధికారం, స్వార్థం లాంటి వేవీ కలియని అంశాలను, నేనింకా పూర్తిగా అర్థం చేసుకోలేక పోతున్నాను. పై పెరుగుదలకన్నా, లో పెరుగుదల అవసరం. ఈ రెండవది, నన్ను బాగుచేస్తుంది. భగవంతునికి మరింత సమీపంగా నన్ను చేరుస్తుంది" అన్నాను డాక్టర్ స్వామి గారితో.

కృష్ణమూర్తి గారు, స్వామి గారు, నొచ్చుకోవచ్చుగానీ, నిజం మాత్రం ఇదే గదా! భగవంతుడా! వీరి అభినందనలను అందుకొన గల అర్హతలను నాకు ప్రసాదించు.

(2-4-89 ఆదివారం)

చిన్నీ ! పసితనం ఎరగని చిన్నతనం నాది. పసితనం వదలని చిన్నతనం నీది. ఆనాటి ఆకుపచ్చని అమాయికత్వం నీలో ఇంకా పదిలంగానే ఉంది. ఆలనాటి తెలివెన్నెల వ్యక్తిత్వం నీలో ఇంకా భద్రంగానే ఉంది. నీ కనులనిండా దయ, నీ నవ్వునిండా దయ, నీ మాటనిండా దయ, నీ మౌనంనిండా దయ, నీ మదినిండా దయ, నీ అణువణువునా దయ. నీవు దయామూర్తివి!

నీకు చీకటంటే భయం. ఏకాంతమంటే భయం, ఇప్పుడా చిన్న చీకటి సమాధిలో, ఏకాంతంగా ఉండేందుకెంత భయపడుతూంటావో నాకు తెలుసు. తోడుగా నేనుంటే, కటిక చీకటయినా మనకు తెలీదు. శాశ్వతంగా నీ దగ్గర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొచ్చేయాలని, నేనెంత వేగిర పడుతున్నానో, నీకూ తెలుసు. కానీ నాకింకా, ఈ దేహవాసశిక్ష పూర్తికాలేదు. అందాకా. ఉదయ సాయంకాలాలు, నీ దగ్గరి కొచ్చిపోతూ ఉంటాను, పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకొనేందుకు ...

(3-4-89 సోమవారం)

కన్నా ! నా కింకా చిన్నతనం పోలేదయ్యా ! ఎవరెవరో వొచ్చి, నిన్ను మబ్బుల్లో నిలిపి మాట్లాడుతుంటే, నా కాశ్చర్యం వేస్తుంది; నిజంగానే, నువ్వంత ఎత్తుగా ఉన్నావా - అని అనుమానంవేసి, నీవేపు చూస్తాను, ఏదో పనున్న దానిలాగా అక్కడిదాకా వచ్చి. వారున్నంత సేపూ, వారి మాటలు వింటున్నంత సేపూ, నీవేమో - ఎత్తుగా,ఎడంగా,నాకందనంతదూరంగా ఉన్న ట్లనిపిస్తుంది నాకు. వారలా చీడీలు దిగుతూదిగూతూండగానే, వారి అడుగుల చప్పుళ్ళను నిశ్శబ్దం తుడిచివేస్తూ వేస్తూండగానే, నువ్వు మళ్ళీ మామూలు కన్నయ్యవయి, నా ముందు కొచ్చినప్పుడనిపిస్తుంది; నీవెక్కడా తప్పిపోలే దనీ, నన్ను వెదుక్కుంటూ నేరుగా నా వద్దకేవచ్చావనీ.... చిన్నపుడు నేను ఇష్టంగా ఆడుకొన్న దంతపు బొమ్మను,ఎవరికీ అందకుండా దాచుకొనేదాన్ని; ఈలు ముక్కలి మధ్యా, నెమిలి కన్నుల మధ్యా, రంగు రంగుల తళుకురేకుల మధ్యా. హఠాత్తుగా గుర్తుకొచ్చి నిదురలోంచి ఉలిక్కి పడిలేచి, ఆ బొమ్మను చూసుకొనే దాన్ని. నువ్వు నా కిష్టమైన ఆదేవుని బొమ్మ లాంటి వాడివి. నిన్ను నీవు మరిచిరాసు కొంటున్నప్పుడో, నిశ్శబ్దంగా చదువుకొంటు న్నప్పుడో, పసివాడి లాగా ముడుచుకొని బబ్బున్నప్పుడో గుర్తుకొస్తావు. ఏదో వొంకతో వచ్చి, చూపులతోనే పరామర్శించి పోతూ ఉంటాను. దేవుని బొమ్మకు గోరు ముద్దలు తినిపించిన అలవాటు నాకింకా పోలేదు. గోరు ముద్దలు తిన డానికి నీవూ, తినిపించడానికి నేనూ అలవాటు పడిపోయాం; నిన్న మొన్నటి దాకా. ఇప్పుడేమో - ఇద్దరి మధ్యా, దాటలేనంత దూరం. ఆ దూరం నిండా, మంచు కనీళ్ళు కురుస్తున్న నీలి మేఘాలున్నాయి కన్నా. .

(4-4-89 మంగళవారం)

దోవకు అసింటా ఇసింటా ఉన్న మొక్కలన్నీ మానులన్నీ; నేను తలొంచు కొని పోతున్నా సరే - పనిమాలా పలకరించేవి; ఆ కబురూ ఈ కబురూ చెప్పేవి, నన్నూ అడుగుతుండేవి, ఆ మధ్య దాకా. అవి - పెదవి విప్పక చాలా కాల మయిందని హఠాత్తుగా గుర్తుకొచ్చి పలకరించాను. బోసిగా మౌనంగా ఉండి పోయా యెందుకో. నా దిగులు బరువుతో నేనూ అటుకేసి వెళ్ళలేదు. ఇవాళ్టే వెళ్ళాను. చెట్ల నిండా, చెట్లలోపునిండా, ఉత్సాహం, ఉద్వేగం, తొందర,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చివుళ్ళేత్తు తున్నాయి. రెమ్మలకు చివురుల నద్దుతున్న ఓ కొమ్మ నడిగాను "ఏమిటిదంతా? ఎందుకిదంతా?"అని. మొగ్గలను తురుముకొంటున్న మరోకొమ్మ నడిగాను ఏమిటని. ఓక్షణ కాలం నా వేపు ఆశ్చర్యంగా చూసింది. "మూర్ఖుడా! వసంతం వస్తునట్టే తెలియదా? గాలి నడిగినా, మబ్బు నడిగినా చెప్పేవేనే!" అంటూ తన పనిలోకి వెళ్ళి పోయింది.

అవును. అలాంటి రుతు వొకటి ఉండాలి. ఆమెగారు ఉన్నన్ని రోజులూ, ఆ రుతువు మాతోనే ఉండేది. ఆమె వెళ్ళి పోయాక, నా చిరునామా కూడా మరిచి పోయి ఉంటుంది వసంతం. నేనెంత సిగ్గు పడ్డానని - అల్లాగ - ఆ కొమ్మ నడిగి నందుకు!.,.

(5-4-89 బుధవారం)

చిన్నీ! నీ గురించి నాలో పొంగు లెత్తుతున్న ఆలోచనల్ని అక్షరాల నిండా నింపి, ఆ పూర్ణాక్షరాలను,నీకు కానుకగా ఇద్దామను కొన్నాను ఈ ఉగాది నాడు. కానీ ఏం లాభం? నా ఆలోచనల వెల్లువలోకి జారిపడి, అక్షరాలన్నీ కొట్టుకు పోయాయి. ఇప్పుడు నా దగ్గర, ఆలోచనలే తప్ప, అక్షరాలేమీలేవు. నేనిప్పుడు. అక్షరాలా నిరక్షరాస్యుణ్ని.

నీవూ, నేనూ మాట్లాడు కొనేందుక్కూడా భాషకావాలా?మన మనో భావాల దాపులకూడా ఈ భాష రాలేదని నాకు తెలుసు. ఇంతకన్నా కన్ను నయం. ఈ రెండింటి కన్నా "మౌనం" మరీ శక్తివంతమైన వాహిక. అందుకే - మనం మామూలు భాషను వొదిలేసి, మౌనంతో మరింత స్పష్టంగా మాట్లాడు కొంటున్నాం . .

(6-4-89 గురువారం)

నిదుర పోతున్న నీడలాగా ఉంది ఆకాశం - ఈ వేకువన. చుక్కలు మొగ్గ ల్లాగా ఉన్నాయి ఈ వేకువన. ఎన్ని లక్షల అడుగుల గుర్తులో అలికి వేశాయి ఈ బాటను. అయినా ఆమె పాదాల ముద్రలను నేను గుర్తిస్తాను - అవి పద్మ పత్రాల్లాగా ఉంటాయిగనక.

ఎన్ని లక్షల చూపుల తీగలో అల్లుకు, పోయాయి బాటకు ఆ వేపునా ఈ వేపునా. అయినా, ఆమె చూపులను నేను గుర్తిస్తాను - అవి దయాపూరితాలు గనక.

ఎన్ని లక్షల నవ్వుల మొగ్గలు రాలిపోయాయో బాటకు ఆ పక్కనా ఈ పక్కనా. అయినా - ఆమె నవ్వును నేను గుర్తిస్తాను - ఆ నవ్వు నిండా, అప్సరాంగనల మునివేళ్ళ స్పర్శలుంటాయి గనక.

తన అన్వేషణలో శ్రీరామ చంద్రుడెక్క డ శ్రమపడతాడోనని, అతని శ్రమను సులభతరం చేసేందుకు సీతాదేవి - తోవ పొడవునా ఆభరణాలను జారవిడిచి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట్లుగానే, నీవున్న చోటును ఇట్టే పోల్చుకోవడం కోసం - నా కయి - నీ వొది లిన గుర్తులే గదా ఇవన్నీ!

(7-4-89 శుక్రవారం)

"నువ్వెక్కడుంటావు ? అక్కడయినా నువ్వెప్పుడుంటావు ?" అన్నాడతను ఆమెను చూస్తూ.

"నీ వెప్పుడు కావాలంటే అప్పుడు, నీవు వెళ్ళగలిగిన ప్రతిచోటా, నీవు చూడ గలిగిన ప్రతిచోటా నేనున్నాను. నీవు వెళ్ళలేని చూడలేని చోట్ల కూడా నేనున్నాను. నీవీ పరిసరాలలో చిక్కుకు పోయావు. వాటికి బందీవయ్యావు. ఈ స్థల కాలాలు చాలా ఇరుకు. ఇందులోంచి నిన్ను తప్పించాలని ఈశ్వరుడు సంకల్పించాడు. ఆ సంకల్ప సాధనకు నేనొక చిన్న సాధనాన్ని. నామీది అనురాగంతో, వెర్రిగా నన్ను వెదుకుతూ, ఇది వరకు తెలీనిచోట్లకు కూడా నీవు వస్తావనీ, ఆ అన్నిచోట్లా, అన్ని వేళలా, నన్ను చూస్తావనీ, ప్రభువుకు తెలుసు. నన్ను చూడడమంటే, మరేం లేదు కన్నా - నిన్ను నీవు చూసుకోవడమన్నమాట. ఈశ్వరుని వేపుగా ఇంకొంచెం జరగడమన్నమాట.జరిగి జరిగి జరిగి - అంతా ఈశ్వరీయమేనని గ్రహించడ మన్నమాట" అన్నదామె.

(8-4-89 శనివారం)

"నువ్వెందుకు పుట్టావ్?" అన్నాడతను.

"నీకోసం" అన్నదామె.

"నువ్వెందుకిలా వచ్చావ్ ?" అన్నాడతను.

"నీకోసం" అన్నదామె.

"నువ్వేమిటి వెదుకుతున్నావ్?" అన్నాడతను.

"నీ కోసం" అన్నదామె.

"అంతా నా కోసమే అయితే, ఇంకా - నీకోసమంటూ నువ్వెక్కడ మిగిలా వమ్మా ?" అన్నాడతను.

"ఎందుకు మిగల్లేదు ? నీ అంతటా నేనేగదా ! నువ్వున్నంతకాలం నేనే ఉన్నట్లేగదా!" అన్నదామె.

అతని కళ్ళు చెమర్చాయి.

"నువ్వంటూ ఇక్కడున్నావు గనక, నేనిక్కడి కొచ్చాను గానీ, లేకపోతే నాకేంపని కన్నా ?" అన్నదామె, అతని తలను వక్షానికి హత్తుకొంటూ ...

(9-4-89 ఆదివారం)

నేను కోరుకొన్న జీవితం వేరు. నాకు లభించిన జీవితం వేరు. నాక్కావలసి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నట్లుగా, నేను జీవించలేకపోయాను, జీవించలేకపోతున్నాను. ఇంకొకరి కోసం, వారి మెప్పుదలకోసం, ఇష్టంలేని పనిచేయడంకన్నా మించిన శాపం ఇంకేమీలేదు.
ఆవేదనగానీ, ఆనందంగానీ, అనంతమైనవి !
ఈరెండింటినీ ఎవరికివారు అనుభవించవలసిందే !
అలా అనుభవిస్తున్నప్పుడు కలిగే అనుభూతులు వేరు. వాటినే మరొకరితో కలసి పంచుకొంటున్నప్పుడు కలిగే అనుభూతులువేరు. ఇల్లాగా - పంచుకొన డానికి ఒక విశ్వాసి కావాలి. నీమాట విన్నా, నీగాలిసోకినా, పరవశంతో పొంగు లెగసే ఒక ప్రేమ హృదయం కావాలి. ఓ అద్భుతమైన, అనురాగపూరితమైన, దయాసిక్తమైన స్పర్శకావాలి. ఇవేవీలేకపోవడం, లేకుండా బతకవలసిరావడం, దరిద్రంకన్నా హీనం. కాంతమ్మగారి మరణానంతరం నేనిట్లాగే బతుకుతున్నాను గదా ...
(11-4-89 మంగళవారం)
ప్రభూ ! నేనేమో నీకోసం బయలుదేరాను. నాకు తెలసిన అన్నిచోట్లా వెతికాను, నాకు అనుమానమున్న చోట్ల కూడా వెదికాను. మహానుభావులు చెప్పిన చోట్లకూడా వెదికాను. నీవు కనిపించలేదు. విసుగెత్తింది. నీ మీది ఆశను వొదులుకొన్నాను. నీతో నాకున్న అవసరాలనూ వొదులుకొన్నాను. అప్పుడు తెలిసింది నాకు, నీవున్న తావు నా లోనే ఉన్నదని. మిగిలిన అన్నితావుల్లూ చూశానుగానీ, నా లోకి మాత్రం నేను చూసుకోలేదు. నేనాపని చేయలేనేమో ననుకొని నువ్వక్కడ దాక్కున్నావు. చివరికి - ఆ పనీ చేశాను. ఇప్పు డెక్కడకు పోతావయ్యా" అన్నాడతను.
ప్రభువు నవ్వాడు.
"కన్నా! నేనుంటాననుకొన్నచోట్లను నీవు వెదికినట్లే, నేనుండ దగినచోటు కోసం నేనూ వెదుకుతున్నాను. ఇప్పుడే నా క్కాస్తచోటు కనిపించింది నీలో." అన్నాడు ప్రభువు ...
(12-4-89 బుధవారం)
ప్రభూ ! "నీవేదికాదో చెప్పగలంగానీ, నీవేదో చెప్పలేం" అని చాలా మంది పెద్దలనడం ఎంతవరకూ ఉచితమో నాకు తెలీదు. ఇవన్నీ నీవే అయినప్పుడు, వీటన్నింటిలోనూ నీవూ ఉన్నట్లేగదా ! వీటికి అతీతంగా, దూరంగా, ఇంకె క్కడో నీవుంటా వనుకోవడమంటే, నిన్ను సరిగ్గా అర్థంచేసుకొనలేకపోతున్నా మన్నమాటేగదా !
అసలు సంగతేమిటంటే, ఉన్న అయోమయమంతా మాలోనే ఉందయ్యా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాలో ఉన్న చిక్కులన్నీ నీ కాపాదించి, నిన్నో "చిక్కుముడి" క్రింద చిత్రించి పారేశాం. నీ చుట్టూ పాశాలు పరిచి, నిన్నందులో ఇరికించి పారేశాం. మా పాశాల్లోంచి, చిక్కుముడుల్లోంచి, బయటపడలేక, నీవు గిజగిజలాడ వలసిందేగానీ, మేంమాత్రం సుఖంగానే ఉన్నాం !

నీ కర్మగాలి నీవు మాపాలబడ్డావు. చచ్చినట్టు అనుభవించు. ఇప్పటికయినా నా మాట వింటే బాగుపడతావు. నిన్ను అదేపనిగా కీర్తించేవారు, నీనించి ఏదో ఆశిస్తున్నారని తెలుసుకో ! నీపేరూ ఊరూ తెలీకుండానే, తలవకుండానే, నీవిష్టపడే పనులు నిశ్శబ్దంగా చేసుకొంటూ పోయేవారు, నీమీది ప్రేమతోనూ, గౌరవంతోనూ చేస్తున్నారని తెలుసుకో. నీవు పదికాలాలపాటు పచ్చగా ఉండాలంటే, వీరు ముఖ్యంగానీ, భజంత్రీలు కాదయ్యా ! ఈసంగతి ఇప్పటి కన్నా గ్రహించు బాగుపడతావు !

కాదుగానీ ప్రభూ ! ఒక్క సంగతి చెప్పు ! ఈ విషయాలన్నీ నీకు తెలుసా ? తెలిసే, ఈ భక్తనటుల పిచ్చిచేష్టలుచూసి, నీవూ నవ్వుకొంటు న్నావా ? నీమీది అభిమానంతో నేను నోరుచేసుకోవడమేగానీ - సకల లోకేశ్వ రుడివైన నీకు - మా అల్పత్వాలు తెలియవని అనుకోవడంలోనే, మా అల్ప త్వం తెలిసిపోవడం లేదా స్వామీ ! మనసు ఉండబట్టలేక ఏదో అన్నాను. ఏమీ అనుకోకు ...

(13-4-89 గురువారం)

చిన్నీ ! ఇవ్వాళ నా జీవితంలో వేకువ మొలిచినట్లుగా ఉంది. ఆ దిక్కునుంచి మంచి తనం, ఈ దిక్కునుంచి దయ, మరో దిక్కునుంచి సౌజన్యం. ఇంకో దిక్కునుంచి అనురాగం, ఆ మూల నుంచి ఆప్యాయత, ఈ మూల నుంచి అనునయం, ఇంకోమూలనుంచి లాలిత్యం, మరో మూలనుంచి లావణ్యం - కొంచెం కొంచెంగా సేకరించి, సంపుటీకరించి, నిన్నుగా మలిచాడు ఈశ్వరుడు నా కోసం !

అనేక జన్మలుగా నేను పదిలపరుచుకుంటూ వచ్చిన ఒక తీయని తృష్ణకు, ఒక నిశ్శబ్దకాంక్షకు, ఈ జన్మలో నీవు, బాహ్య స్వరూపానివి ! అలవి మాలిన నీ మంచితనం, నన్ను నీకు వశుణ్ని చేసింది. నన్ను పరవశుణ్ని చేసింది ! నీవో రంగుల వానవు. నేనా వానలో తడిసిన మొండి చెట్టును. చిన్నీ ! ఇవ్వాళ నా మనసులో పొద్దుపొడిచినట్లుగా ఉంది; (తిథులప్రకారం) నీ పుట్టిన రోజుగనక ..,

(14-4-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శబ్దంలోనూ, నిశ్శబ్దంలోనూ నీవే
నైరూప్యంలోనూ, సారూప్యంనూలో నీవే
కాలంలోనూ, కాలం వెలుపలా నీవే
ఇక్కడ, అక్కడ, ఎక్కడెక్కడైనా నీవే
అవునుగానీ - మనలో మాట - ఇంకెక్కడా అనునుగానీ
నీవు లేనిదెక్కడో, ఎప్పుడో చెప్పరాదా ?
ఏ నిమిషాని కా నిమిషం, కొత్తగా మెరిసే నీ కళ్ళను
ఎన్నిసార్లు చూపులతో అద్దుకొన్నానో నీకు తెలుసు
నా అంతరంగంలోనికి మెత్తగా నడిచి వచ్చిన
నీ సుతిమెత్తని చరణాలకు,
మనసులోనే పారాణి నద్దానని నీకు తెలుసు
అలవిమాలిన నీ ముగ్ధత్వం నన్ను వివశుణ్ని
చేసిందనీ నీకు తెలుసు.
అవును చిన్నీ!
నా గురించి నీకు చాలా చాలా తెలుసు
నీ గురించే నాకేమీ తెలీదు ...

(15-4-89 శనివారం)

"ఈ గోడకు - ఖరీదైన ఫ్రేం తగిలించారు బాగానే ఉంది గానీ, ఫోటోలేదేం?" అన్నాడు ఆగంతకుడు.
"ఒకప్పుడీ ఫ్రేములో, ఒక పార్వతి, మరో పరమ శివుడూ ఉండేవారు." అన్నాడు ఇంటి యజమాని ఖాళీ ఫ్రేము వంక చూస్తూ.
"ఏమయ్యారు, ఆ ఫోటోలోని వారిద్దరూ?"
"ఆమెను తలచుకొంటూ తలచుకొంటూ, ఆయన తరిగి పోయాడు. తరిగి పోతున్న ఆయనను చూస్తూ ఆమెగారు కరిగి పోయారు. ఆ ఇద్దరూ పోయి కూడా చాలా సంవత్సరాలయింది. అయినా - ఈ ఫ్రేమును మాత్రం - తన జీవితాంతమన్నా ఉంచమన్నాడు మానాన్న. ఆయన మాటను కాదనలేక, అలానే ఉంచాను" అన్నాడు ఇంటియజమాని.
"వారిద్దరూ మీకేమవుతారు?"
"ఆ ముసలాయన, మా తాత గారి తండ్రి గారు ... మా నాన్న పేరు రమా కాంత్. ఆయన నాన్న పేరు గోపిచంద్. ఈయన నాకు తాత. ఈ తాతగారి నాన్న పేరు భరద్వాజ. నేనిప్పుడు చెబుతున్నది ఆయనను గురించే! మా ముత్తాత - ఆరోజుల్లో - ఏవో రాస్తుండే వాడుట. చాలా పుస్తకాలూ వచ్చాయిట.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనొక్కటీ చదవ లేదు. ఆ మధ్యదాకా, పాత కాగితాల్లో ఆయన పుస్తకాలున్నట్టు గుర్తు. ఇవన్నీ మాతాత గారు నాతో చెబుతుండే వారు. మా ముత్తాత గారి భార్య పేరు కాంతమ్మ గారుట. ఆమె గారంటే, మా ముత్తాత గారికి వల్ల మాలిన అభిమానమూ, గౌరవమూనట. మాతాత గారు, మానాన్న గారు-ఈ ముత్తాతను గురించి అప్పుడప్పుడు చెబుతూ ఉండే వారు. నా పేరు కూడా - మా ముత్తాత పేరే!" అన్నాడు ఈ భరద్వాజ, ఖాళీ ప్రేమువంక చూస్తూ...

(16-4-89 ఆదివారం)

ఆ వేళ్ళకూ, ఆలోహపు తీగెలకూ ఉన్న సంబంధం నాకు తెలియదు. శాపగ్రస్తాలయి, దశాబ్దాలుగా ఆతీగలలో నిదుర పోతున్న సంగీత ఝరులన్నీ ఆ వేళ్ళ స్పర్శలతో శాప విముక్తాలయి మనలోకి ప్రవహిస్తాయి.

తీగలను తాకిన వేళ్ళు కనిపించవు - దూరంగా ఉన్న వారికి! కానీ తీగల సంతోష రవాలు వినపడతాయి. తుప్పరగా ఉన్నంత కాలమూ, మంచుకేమీ విలువ లేదు. ఏ సున్నితమైన వేళ్ళో, ఆ తుప్పరను అలా కూర్చి, ఇలా మార్చి, పూవుగా మలుస్తాయి. వేళ్ళు కనిపించవు గానీ, వేళ్ళల్లోంచి వొదుగుతూ వచ్చిన 'మంచు పూవు' కనబడుతుంది.

చిన్నీ ! నేను నా సంగీతాన్ని పోగొట్టు కొన్నాను
నా మంచుపూవును పోగొట్టు కొన్నాను
నిన్నూ పోగొట్టు కొన్నాను ...

(17-4-89 సోమవారం)

ప్రభూ! నీకన్నా మేం తెలివయిన వాళ్ళం. నీకు అమ్మ అయ్య లేరని మాకు తెలుసు. నిన్ను మేం ఏంచేసినా, నువ్వెవరితోనూ చెప్పుకోలేవని మాకు తెలుసు. అందుకే - చీటికీ మాటికీ నిన్ను వాడుకొంటూ ఉంటాం. మేము చేసే ప్రతి అన్యాయాన్ని, అక్రమాన్ని, నీ పేరు మీదుగా చెలామణీ చేసుకొంటాం. నీవేమో, మాకన్నా ముగ్ధుడివి. అన్నింటికీ తలవొంచి భరిస్తున్నావ్! ఈ సమస్త సృష్టికీ నీవే కారణమని, నమ్మపలుకుతాం. డబ్బు కోసం, కామం కోసం, పదవుల కోసం,అధికారం కోసం,మాస్థాయిలో మేము నరుక్కుచస్తాం. నీవుకారుణ్య హృదయంలో ఉంటావని చెబుతూనే, మా గుండెల్ని బండరాళ్ళను చేసుకొంటాం "అంతా నీవే అంతటా నీవే !" అంటూనే దేశాలకిందా, మతాల కిందా, కులాలకిందా, శాఖలకిందా, ముక్కలయి, చెక్కలయి, తునాతునకలయి పోతాం ! ఇదయ్యా నాయనా మేం బతుకుతున్న తీరు ...

(19-4-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎప్పుడూ ఏదో వొకదాన్ని కోరుకోవడానికీ, ఆ కోరుకొన్నదాన్ని పొందడం కోసం నానా పాట్లు పడడానికీ అలవాటుపడ్డాం. మన అవయవాలూ, ఆలోచనలు, అదే గాడిలో కొట్టుకుపోవడానికి, శతాబ్దాలుగా అలవాటుపడ్డాయి. ఈ అలవాటును జీవితంలో వొకభాగంగా చేసుకొన్నాం మనం. అందుకు భిన్నంగా ఆలోచించడం, మనలో చాలామందికి చేతకాదు. అలా ఆలోచించాలన్న ఆలోచన రావడమే వింతగా విడ్డూరంగా కనబడుతుంది.
ఏదో వొకదాన్ని లక్ష్యంగా ఎంచుకొని, ఆ లక్ష్యసాధనకోసం తపించి తపించి జయించినప్పుడు కలిగే తృప్తి. ఉద్వేగభరితంగానూ, ఉత్తేజకరంగానూ ఉండేమాట అక్షరాలా నిజం !
"ఏదో వొకటి కావాలి" అన్న కోరికను కూడా జయించినప్పుడు కలిగే స్థితి ఎలా ఉంటుంది?
ఈశ్వరుడు - నన్నాదిక్కుగా నడిపించుగాక....

(20-4-89 గురువారం)

చెప్పదలుచుకొన్న విషయాన్ని, చెబుదామనుకొంటున్నంత శక్తివంతంగా, అందంగా, నచ్చేట్టుగా, చెప్పలేకపోతున్నాను. లోపంనాదే! నా విషయాభివ్యక్తికి అనుకూలంగా ఉండేభాషను, నేను ఎన్నుకొనలేకపోతున్నాను. నా అసమర్థతకు నా చేతగాని తనానికి, నేనెంతో సిగ్గుపడుతున్నాను.
భార్యాభర్తల మధ్య సరే - ప్రేయసీ ప్రియుల మధ్య ఏభాష ఉపయోగపడదు. మాటలులేవు. ఉండవు. ఉన్నాదొరకవు. అందుకే - ఒకరినొకరు చూసుకొని, చూసుకొంటూ చూసుకొంటూనే ఉంటారు; కాలంలోంచి, దేశంలోంచి వెలికి వచ్చి. చూసుకొంటూ చూసుకొంటూనే, ఎప్పటికోనవ్వుకొంటారు. పూలు విచ్చుకొన్నంత అందంగా, నిశ్శబ్దంగా, నవ్వుకొంటున్నామన్న సంగతికూడా తెలీకుండా! ఆ చూపుల్లో నవ్వుల్లో చిన చిన్న స్పర్శల్లో అన్నీ తెలుస్తాయి - జన్మాంతరగాథలతో సహా! ఈ చూపులో, నవ్వులో స్పర్శలో, ఉద్రేకం ఉండదు ఆ మహోన్నత స్థాయి నుండి, ఎందుకో ఎప్పుడో దిగజారిపోతారు. అప్పుడు శరీరాలు అవసరమవుతాయి ...

(28-4-89 శుక్రవారం)

స్త్రీ పురుషుల మధ్యగల సంబంధాన్ని నిర్వచించడంలో, స్త్రీలూ పురుషులూ భిన్నమైన ప్రమాణాలను పాటించడం నాకెంతో విడ్డూరంగా తోస్తున్నది - చాలా సంవత్సరాలుగా. ఇష్టా నిష్టాలతో నిమిత్తం లేకుండా; డబ్బు, పదవి, చదువు, ఉద్యోగంలాంటి వాటికే ప్రాధాన్యతనిచ్చి, చేసుకొన్న వివాహాలన్నీ నా దృష్టిలో, అక్రమ సంబంధాల క్రిందనే లెక్క.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఓ అమ్మాయి - తన కులంవాడనీ, తక్కువ ఖరీదుకు దొరికాడనీ, తనకు బొత్తిగా ఇష్టంలేని వాడిని పెళ్ళాడి వాడితో కాపరం చేయడం, నాకు - అక్రమ సంబంధంగానే కనపడుతుంది. ప్రస్తుతం, ఈ పదాలకున్న నిర్వచనాలు పూర్తిగా మారిపోవాలి. అక్రమ సంబంధమంటే, గతిలేక పెళ్ళాడినవాడితో కాపరం చేయడమన్నదే అసలైన నిర్వచనం.

ఈ సంగతులన్నీ నాకెందుకు గుర్తుకొచ్చాయో, నేనీ పేజీలో పేరుతోసహా రాయలేను. ఉదయపు నడకలో నాకు '—' గుర్తుకొచ్చింది. ఈ సంవత్సరమో, మరో సంవత్సరమో ఆమెకూ పెళ్ళవుతుంది - ఎవడితోనో. వాడు - ఆమె కోరుకొన్నవాడుకాదు. ఆమెకోసం అంగలార్చినవాడిని 'కులం - చదువు-వయసు' అన్న కారణాలతో ఆమె తోసి పుచ్చింది. మళ్ళీ అతగాడంటే లోపల చచ్చేంత ఇష్టం. ఆ ఇష్టాన్ని బలవంతాన చంపుకొని, లేదా అణచుకొని, తన కులంవాడితో, చవగ్గా దొరికిన వాడితో, కళ్లు మూసుకొని కాపరం చేయడం అక్రమ సంబంధం కాదా? వ్యభిచారం కాదా? ...

(30-4-89 ఆదివారం)

నా అదృష్టమేమిటంటే, ఇంకేదో, ఏదేదో అయిపోకుండా రచయితను కావడం! రాయడమన్నది నాకో జీవనక్రియగా మారిపోయింది.

నాకేమో కాసిని అక్షరాలూ, కాసిని పదాలూ తెలుసు. 'నాకు తెలిసిన పదాల నిండా, పదాలలోని అక్షరాలనిండా, నాలోని ఆపేక్షను, అనురాగాన్ని నింపుకొన్నాను - ఇప్పుడు కాంతమ్మగారు లేరు కనక. అంచాత - నేనేం రాసినా, నేనేం మాట్లాడినా, ఆమెను గురించి రాసినట్టూ, ఆమెను గురించే మాట్లాడినట్టూ ఉంటుంది.

చిన్నీ! నీ ప్రతిమాటా, ప్రతిచేతా, ప్రతికదలికా, నాకో అద్భుత ప్రపంచంలా కనబడుతుంది. ఆ గొప్ప ప్రపంచాన్ని చాతనయినట్టుగా, అక్షరబద్ధం చేయడం తప్ప, నాకేం తెలీదు. మామూలు వాళ్లు 'ఆహా' అంటున్నారు. "మంచివాళ్ళు - మరీ మంచివాళ్ళు" సెగ లెగసిపోతున్నారు. నేనేం చేయనమ్మా?

(1-5-89 సోమవారం)

నీవు నిదురపోతున్న నీడలాగా ఉంటావు. సంతోషాల సెలయేరులాగా ఉంటావు. ఓ అందమైన క్షణం, అతిలోకమైన సంగీతంలా మారి, ఆత్మనిండా అల్లుకుపోయినట్టుగా ఉంటావు. అలవిమాలిన అనురాగంలా ఉంటావు. అందమైన దిగులుగా ఉంటావు. మననును అలముకొన్న శరజ్జ్యోత్స్నలాగా ఉంటావు. మన మధ్యగల అతిబలీయమైన బంధమూ, అతిబలహీనమైన బంధమూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాక్కుచే ! అది - ఒకరంటే ఒకరికిగల మితిమీరిన ఇష్టం ...

(2-5-89 మంగళవారం)

చిన్నీ ! నీగురించి ఎక్కువగా రాశాననీ, అతిగా రాశాననీ చాలాచాలా రాశాననీ, రాస్తున్నాననీ, నన్నెరగని వారంటున్నారు.

"రాయవలసిందేదో రాశావు. రాయడం ఆపు. ఇక చాలు" అని, నన్ను కొద్దిగా ఎరిగిన వారంటున్నారు.

నన్ను నేను కూడా పూర్తిగా ఎరుగనుగనక, "ఏదో కొంత రాశాను." అని అప్పుడప్పుడూ నేనూ అనుకొంటున్నాను.

"ఇన్నేళ్ళ సాహచర్యంలో, ఆమెను గురించి ఇంతకు తప్ప రాయడానికింకేమీ లేదా ? ఇంకేమీ తెలీదా ? ఇంకేమీ తెలుసుకోలేదా ? అలా తెలుసుకోనందుకు నువ్వేమీ సిగ్గుపడడం లేదా ? " అంటున్నాడు ఈశ్వరుడు, నా అంతర్నేత్రాలను విప్పుతూ.

నా అజ్ఞానానికి సిగ్గుపడుతూ తలవొంచుకొన్నాను...

(3-5-89 బుధవారం)

ఈ చీకటికి ఎంత ఆకలని! కోట్లాది నక్షత్రాలు, వెలుగు చినుకుల్ని, వెలుతురు వానల్ని కురుస్తూనే ఉన్నాయి. కాంతులను కుమ్మరిస్తూనే ఉన్నాయి. ఈ ప్రకాశమంతా ఎక్కడ ఇంకి పోతున్నదో తెలీదు.చీకట్లు మాత్రం ముసురు కొంటూనే ఉన్నాయి - ఈలోకాన్ని.

చుట్టూరా చీకట్లు ముసురుకొన్నప్పుడు మాత్రమే నేరం జరగదు. చిక్కని చీకట్లో మనస్సు చిక్కుకొన్నప్పుడూ, ఆలోచననిండా అంధకారం ఆవరించినప్పుడూ నేరం జరుగుతుంది !

చంద్రుడు గాయపడ్డాడేమో పాపం ! ఈరోజు నన్ను చూడడానికి ఏవేళప్పుడూ రాలేదు.

చీకటిలో ఉన్నాంగదా, .వెలుతురువేపు వెడదామని అన్ని వేపులా వెదుకుతాం. తూరుపులోంచి పాకుతూ వొస్తున్న వెలుతురు కనబడుతుంది. ఆ వెలుగును అందుకొందామని, ప్రాగ్దిశగా ప్రయాణం సాగిస్తాం. మనం నడుస్తుంటూనే ఉంటాం. వెలుతురు మనల్ని ముంచేసి, పడమరకు వెళిపోతుంది. మళ్ళీ మనకు చీకటి మిగులుతుంది - మన అల్పయత్నాలను వెక్కిరిస్తూ కొక్కిరిస్తూ ...

(4-5-89 గురువారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక మనిషి మరో మనిషికివ్వగలిగిన గొప్పవరం ఎదుటివారిని ప్రేమించడం. పొందగలిగిన గొప్పవరం 'ప్రేమ'. ఇవిరెండూ నాకు పుష్కలంగా లభించాయి.

ఒక మనిషి మరో మనిషి పట్ల చేయగల గొప్ప నేరం, నమ్మించి మోసం చేయడం. 'ఆ—' ఆపని చేశాడు ....

(5-5-89 శుక్రవారం)

ఆకాశాన్నే కాదు; ఆత్మను కూడా అప్పుడప్పుడు మేఘాలు కమ్ము తుంటాయి. అశ్రు వర్షంతో గానీ, ఈ మేఘాలు భార రహితం కావు.

ఈ సమాధి తడి తడిగా ఉన్న కారణం, నాకొక్కడికే తెలుసు - నా కన్నీళ్ళన్నీ ఇక్కడే గదా వాలికి పోయాయి!

"ఏమిటి వెదుక్కుంటున్నావ్?" అన్నాడా బాటసారి.

"నేను పారేసుకొన్న దాన్ని!" అన్నాడతను.

"ఏం పారేసుకొన్నావు?" అన్నాడా పథికుడు, ఒక క్షణం ఆగి.

"నన్ను పారేసుకొన్నాను!"

"ఎప్పుడు?"

"తెలీదు!"

"ఎక్కడ?"

"తెలీదు!"

"ఎందుకు?"

"అదీ తెలీదు" అన్నాడా ఆర్తుడు తలవొంచుకొని.

"ఏమీ తెలీదా?" అన్నాడా పథికుడు, ఓ అడుగు ముందుకు వేస్తూ.

"తెలుసు కొందామని ప్రయత్నిస్తున్నాను. తెలుసు కొనాలన్న ఈతపన, నన్ను నిలువునా దహించి వేస్తున్నది"

"ఐతే - ఈ ప్రయాణం ఆపకు. నాతోరా!" అన్నాడా మార్గదర్శి, ఈ దీనుణ్ని కూడా తనతో తీసుకుపోతూ ....

(6-5-89 శనివారం)

ఏ ఇద్దరు మనుషులూ ఒకటి కాదు. రూపు రేఖలలో తేడాలుండడం సరే - అంత రంగాల్లోనూ అలవిమాలిన తేడాలున్నాయి. భౌతిక ధర్మాలు, అవసరాలు, దాదాపుగా ఒక్క లాగా ఉండ వచ్చుగానీ,ఆంతరికంగా, ఒక్కో మనిషీ, ఒక్కో పపంచం. ఒక మనిషే అనేక ప్రపంచాలు. ఒక్క మనిషిని గురించి చాలు -

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంకేమీ మిగలకుండా, రాయడం - వేయి మంది మహారచయితలకూ, కవుల కూ_డా సాధ్యం కాక పోవచ్చునని, నే నిప్పడను కొంటున్నాను ....

(9-5-89 మంగళవారం)

వేకువ నడకలో కృష్ణమూర్తి గారు స్వర్గ ప్రస క్తి తీసుకొచ్చారు. "బతుకు వేరు. భావన వేరు. బతుకు బండ రాయిలా మారినప్పుడు, భావన బంగారు పూలు విరబూస్తుంది; విరబూయ వచ్చు. తమ జీవితమంతా, బాధల్లో ఇరుకుల్లో, ఇరుల్లో, ఉరుకుల్లో, దుఃఖాల్లో, కన్నీళ్ళలో, నిరాశల్లో నలిగి నలిగి అవసి పోతున్నప్పుడు; మనస్సులో మెదులుతుంది - 'వీటన్నింటికీ సంబంధం లేని మరో ప్రపంచమే ఉంటే బావుండునే!'అని! ఆ మరో ప్రపంచమే స్వర్గం. ఈ లోకంలో తనకు అందుబాటులో లేని వాటన్నింటినీ, ఆ ప్రపంచంలో కల్పించుకొని, వాటి మధ్య తను సుఖపడుతున్నట్టుగా భావించు కొన్నాడు. ఇప్పుడున్నంత అందంగా, హాయిగా, అంటే - ఇప్పుడు మనకు తెలిసినంతగా అనుకొందాం - మొదణ్ణించీ స్వర్గం ఉండేది కాదేమోనని, నా అనుమానం. ఒక్కో భావుకుడు, ఒక్కో అందాన్ని, సదుపాయాన్ని, వసతిని, ఈ స్వర్గానికి చేరుస్తూ వచ్చారు. ఇప్పుడందరూ 'అదేకావా'లని కోరే స్థితికి దాన్ని తీసు కొచ్చారు. మానవునిలోని భోగలాలసతకు, భావుకతకు, ఈ స్వర్గం ఒక ఉదాహరణ." అన్నాను కృష్ణమూర్తి గారితో ....

(10-5-89 బుధవారం)

లోకాలలోని లావణ్యాలన్నీ కూడ బలుకొ్కని, ఒక్కటయి, ఆమె లాగా రూపెత్తినట్లుంటుంది నాకు. ... పాడడం ఆగిపోయాక కూడా, ఏ పాటయినా వినపడుతున్నదంటే, అది నిస్సందేహంగా గొప్ప పాటయి ఉండాలి!

చిన్నీ! నీవు భౌతికంగా దూరమయి పోయాక కూడా, మనసుకు మరీ దగ్గరవు తున్నావంటే, నీవు మరీ గొప్పదానివయి ఉండాలి. ఎన్ని కష్టాలో స్తేనేం, నష్టాలో స్తేనేం; బాధలు దుఃఖాలు మునురుకొంటేనేం; నీ కన్నుల్లోని కాంతి, పెదవుల మీది నవ్వు - ఎప్పుడూ మసకేసి పోలేదు. అందుకే - నువ్వంటే, ఈశ్వరుడంత ఇష్టం ...

(11-5-89 గురువారం)

నేనికదే సాటి. దేన్నీ మరొక దానితో పోల్చకూడదు. కానీ, అలా పోల్చ కుండానూ జరగదు. వెన్నెలతో నిండిపోయిన ఆకాశాన్ని 'పాలకడలి'తో పోలుస్తాం. అందమైన పెదనిని 'నెలవంక'తో పోలుస్తాం. మనం గాఢంగా అభిమానించే వారిని గురించీ, అభిమానించే వాటిని గురించీ, చెప్పవలసి వచ్చి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నప్పుడు, ఎక్కడెక్కడి పోలికలూ తెస్తాం. ఇది మన వాత్సల్యాభిమానాలను తెలియ చేస్తుందే గానీ, యథార్థాన్ని చెబుతుందా? నిజానికి దగ్గరగా తీసుకెళ్ళ వచ్చు. నిజం వేపుగా వేలు చూపించవచ్చు. కానీ, 'నిజం' మాత్రం కాదు. ఒకదాన్ని, ఆవొక దానితోనే పోల్చాలి. అది ఉచితం. ఒక దాన్ని మరొక దానితో పోలుస్తున్నామంటే, ఆ వొకదాని విలువలోనూ, మరొక దాని విలువ లోనూ, కొంత తరుగూ మరి కొంత మెరుగూ, చేరక తప్పదు. ఏదీ మరొక దానికి తుల్యం కాదు, కాబోదు.

చిన్నీ! నీకు తుల్యం నీవుగాక మరెవరున్నారమ్మా! నీవు గుర్తుకొచ్చావా - ఒక అవశత నన్ను ఆవరిస్తుంది. ఒక వివశత నన్ను ముంచి వేస్తుంది. నీవూ నేనూ వేరు వేరు కావడం ఓ తుఫాను వంటిది. ఎప్పుడో ఎక్కడో, ఏ రూపం లోనో మళ్ళీ మనం కలుసుకొనగల మన్న ఆశాదీపం, మినుకు మినుగ్గా వెలుగు తోంది నాలో - ఈ ఉప్పెనకు తట్టుకొని ...

(12-5-89 శుక్రవారం)

"ఎప్పుడో కనుమరుగైన కాంతమ్మ గారి కోసం, ఇంకా ఈ ఏడుపురాతలేమిటి!" అన్నారుట ఎవరో అన్నపూర్ణాదేవి గారితో.

"ఏడవకుండానూ, ఏడుస్తూనే రాయకుండానూ ఉండలేను గనక - అలారాస్తు న్నానని వారితో చెప్పండి!" అన్నాను దేవి గారితో.

గడియకోమారు, గొంతు గడియలను కదుపుతూ, తోసుకొంటూ వొస్తాయి నీ గురించిన ఆలోచనలు; ఆలాపనలయి, మీటలయి, పాటలయి. ఆకాశపు నీలాల్లోంచి, నక్షత్రాల కాంతుల్లోంచి, తేలుతూ నా కోసం వొచ్చే నిన్ను అర్చించ డానికి, ఇంతకు మించిన పూజాద్రవ్యా లేవీ నా దగ్గర లేవు మరి! నేనేం చేయ నమ్మా? ...

(13-5-89 శనివారం)

నాకో క్షణం ఏకాంతం కావాలి. ఎన్నాళ్ళుగానో, ఎన్నేళ్ళుగానో అందరినీ (అబద్ధం - కొందరిని మాత్రమే) చూస్తున్నాను. అన్నింటినీ (ఇదే అబద్ధమే - కొన్నింటిని మాత్రమే) చూస్తున్నాను. అందరిని గురించీ, అన్నిటిని గురించీ (అంతో ఇంతో) తెలుసు కొ(ంటు)న్నాను. కానీ - నన్ను నేనెప్పుడూ చూసుకో లేదు. నన్ను నేనెప్పుడూ తెలుసుకోలేదు. ఇప్పుడిప్పుడే నాకా కోరిక కలుగుతోంది. అందుకే అందరినీ దూరదూరాలలోకి పంపించి వేస్తున్నాను. పంపినా పోని వారికి, దూరదూరంగా జరుగుతున్నాను. అందుకే అన్నింటినీ, ఆసింటాగా, ఇసింటాగా తోసివేస్తున్నాను. తోసినా కదలని వాటికి, నేనే కదిలి దూరమవుతున్నాను. వెలుతురును పంపించి వేస్తున్నాను. పంపగా మిగిలిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చీకటిని పంపించి వేస్తున్నాను. దృశ్యాన్ని పంపించి వేస్తున్నాను. స్పష్టంగా మిగిలిన అదృశ్యాన్ని కూడా పంపించి వేస్తున్నాను. నిదురను పంపించి వేస్తున్నాను. నిదుర తోపాటు వేలాపల్లా వొచ్చే కలలను పంపించి వేస్తున్నాను. నేనుండడానికి అవసరమైనంత స్థలాన్ని ఉంచుకొని, మిగిలినదాన్ని పంపించి వేస్తున్నాను. నన్ను నేను చూసుకొనడానికి, తెలుసుకొనడానికి అవసరమైన క్షణకాలాన్ని ఉంచుకొని, మిగిలిన కాలాన్ని పంపించి వేస్తున్నాను. అప్పుడు నాలోకి నేను చూసుకొన్నాను. నేనేమిటో తెలుసుకొందామని! ఆ క్షణంలో కువకువలాడుతూ నీవే కనిపించావు చిన్నీ! నా కోసం నేను వెదుక్కుంటుంటే నాకు బదులు నీవెందుకు కనిపించావమ్మా? ఈ సంగతి నాకిప్పుడు విడమరిచి చెప్పు కాంతమ్మా! నీవూ నేనూ వేరు వేరు కాదా? ప్రశ్నిస్తున్న నేను తోనే, ప్రత్యుత్తరంగా నీవు కూడా ఉన్నప్పుడు, ప్రశ్న వేరూ ప్రత్యుత్తరం వేరూ కాదు గదా! రెండూ వొక్కటే గదా!

(14-5-89 ఆదివారం)

ఎక్కడో ఎందుకో పుడుతుంది. చుక్కల్లోంచి, మబ్బుల్లోంచి, కానల్లోంచి, కోనల్లోంచి, నదుల్లోంచి, మైదానాల్లోంచి, పచ్చని పొలాల్లోంచి, పైరగాలుల్లోంచి, వేకువలోంచి, వెలుతురులోంచి, వెన్నెలలోంచి, జనపదాల్లోంచి, జనపథాల్లోంచి, ... ఇంకా నాకు తెలీని చాలా వాటిల్లోంచి అందాలను అందుకొంటూ, అద్దుకొంటూ, గుడిసుడులు తిరుగుతూ, వొచ్చి వొచ్చి అక్షరాల మీద వాలి, సోలి, అలసట తీర్చుకొంటుంది - ఓ ఆలోచన!

అంత దాకా, నిద్రాజడంగా, అక్షరాలలో పడి ఉన్న ప్రాణ శక్తి, అప్పుడు మేలు కొంటుంది. మేలుకొన్నాక అక్షరాలన్నీ పదాలుగా వాక్యాలుగా జత కడతాయి; రంగు రంగుల మంచు ముత్యాలుగా మెరిసిపోతూ. ఈ రంగుల ముత్యాలను ఏర్చడంలో, కూర్చడంలో, అద్భుతమైన హారంగా మార్చడంలోనే - రచయిత సంస్కారమూ, నేర్పరితనమూ, కళాసక్తీ కనబడతాయి. - వీటికి తోడుగా ఆ దండకు, రెక్కలు కూడా అమరుతాయి. ఆ రెక్కలను, గాలిలోకి, నింగిలోకి, నీలోకి, నాలోకి, చాచుకొంటూ, తాను సంతరించుకొన్న అందాలను మనందరకూ పంచి పెడుతూ ఉంటుందా రచన. ఆ శ్రీని నూర్చుకొంటూ, అంతరంగాన్ని చీల్చుకొంటూ, కాల్చుకొంటూ, వొచ్చిన రచన మాత్రమే కొన్ని రోజుల పాటయినా మిగులుతుంది.

(15-5-89 సోమవారం)

తన పక్కగా వెడుతూ వెడుతూ, ఆసుకోకుండా తనను చూసి, ఆపుకోలేని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తమకంతో క్షణకాలం ఆగి, ఏదో పని ఉన్న దానిలాగా తనను తాకిన మేఘ కన్యకు; గుప్పెడు వెన్నెల పూశాడు చంద్రుడు. ఆ స్పర్శతో మేఘ సుందరి తనువెల్లా జలదరించింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు ముందుగా తెలబోయింది. తరువాత మురిసి పోయింది. ఆ తెలుపు ఈ మురుపు కలిసి మేఘాన్ని జిగుమనీ వెలిగించాయి మెత్తగా. పట్టరాని ఉద్వేగంతో గాలి అలల మీద తేలి తేలి పోయింది. అలా - దూరమవుతున్నందుకు విలవిల్లాడి పోయింది. గిలగిల్లాడి పోయింది. దుఃఖించింది. ఆ దుఃఖతిమిరం, పొర్లి పొర్లి తుళ్ళి తుళ్ళి, ఆమె నిండా కమ్ముకోగా, కాల మేఘంగా మారి, చినుకులుగా నేల రాలి పోయింది ...

(16-5-89 మంగళవారం)

నేను గాయకుణ్ని కాను. చాలా విషయాలు తెలియనట్లే వాదధమూ నాకు తెలీదు. అయినా, అప్పుడప్పుడు కూని రాగాలు తీస్తూనే ఉన్నాను; నేనెక్కడున్నానో నలుగురికీ తెలియడానికీ, నాకు నేను తెలియడానికీ!

చిన్నీ! నీ గురించి నా గుండె నిండా, మనసు నిండా, వానిండా నిండి పోయిన అతిలోకానుభవ ప్రపంచానికి, ఒక విషాదమైన ఆవిష్కరణమే ఇటీవలి నా పుస్తకాలు 'నాలోని నీవు -' 'అంతరంగిణి'- 'ఐత రేయం'. ఉక్కిరి బిక్కిరవుతున్న అనుభవాలు, నీ గురించి క్రిక్కిరిసిన జ్ఞాపకాలు, నీవు నా మీద వర్షించిన అవ్యయమైన వాత్సల్యాలు తప్ప - అందులో ఏమున్నాయి గనక! ఓమూగి పాటగా, నిరాడంబరంగా నాలోకి వచ్చి, నీ నిశ్శబ్ద హాసాలతో నన్ను అభిషేకించి, అనురాగాలతో చివురెత్తించి, వసంతాన్ని హత్తి, కన్నీటి పాటగా, కాలంలో కరిగిపోయిన నీ స్మృతి ముద్రలు, నా నిండా నిండి పోయాయి - మిలమిల లాడుతూ ...

(18-5-89 గురువారం)

'నూతన సృష్టి' అన్న మాట వినబడిందా - నాకిప్పుడెంతో సిగ్గుగానూ నవ్వుగానూ ఉంటుంది. ఎందుకని? 'ఏదీ నూతనం కాదు' అని ఇప్పు డనుకొంటున్నాను గనక. నేను అనదలచుకొన్న దేదో స్పష్టంగా అనలేక పోతున్నానని, నాకు తెలుస్తూనే ఉంది. నా గొడవేమిటంటే - మనం దేన్నీ కొత్తగా సృష్టించడం లేదు. నేను చూసిన ఒక దృశ్యం, ఒక అనుభవం, ఒక అనుభూతి, ఒక అందం మొదలైనవన్నీ మొదటి నుండీ అందులో ఉన్నాయి. నేను చేసిన పనల్లా 'అందులో అవి ఉన్నాయి' అని, కనుక్కోవడం మాత్రమే! అలా కనుక్కొంటూ పోయిన కొద్దీ, కొత్తవీ, సరి కొత్తవీ, నాకు కనపడుతూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉంటాయి. అలా కనిపించడమన్నది, నేనెన్నుకొన్న కోణాన్ని బట్టీ, నా సంస్కారాన్ని బట్టీ ఉంటుంది.

వాల్మీకి మహాకవి పుట్టక ముందు నుంచీ సంధ్యలున్నాయి. కానీ, ఆయన మాత్రమే, సాయం సంధ్యను కట్టు కట్టిన పుండులాగా ఉన్నదనగలిగాడు. కాళిదాసు మాత్రమే, మేఘాల చేత లోకోత్తరమైన సందేశాన్ని పంపించ గలిగాడు. మాళవిక పాదాలలో అపూర్వమైన సౌందర్యాన్ని చూడ గలిగాడు. నే ననడం - ఆ సాయంసంధ్యలోనూ, ఆ మేఘాలలోనూ, ఆ పాదాలలోనూ ఉన్న అందాలను, ఆ మహాకవులు చూడగలిగారనీ, నేను చూడలేక పోతు న్నాననీ. దీన్ని 'ఆవిష్కరణం' అనవచ్చు గానీ, 'నూతన సృష్టి' అన వచ్చునా - అని! అనవచ్చునేమో తెలీదు. తెలుసు కోవాలి.

(19-5-89 శుక్రవారం)

"ఈ తోటలోని పూలన్నీ ఏమయ్యాయి ?" అన్నది రాజపుత్రి. బోసిగా ఉన్న తోటను ఆశ్చర్యంగా చూస్తూ.

చెలికత్తెలెవ్వరూ కిక్కురు మనలేదు.

"తోట మాలిని పిలవండి !" అన్నదామె కోపంతో ఊగిపోతూ.

"రాజపుత్రీ !" అని పిలిచి క్షణకాలమాగి, తలవొంచుకొన్నదా చేటిక. "తోట మాలికి మన పిలుపులు వినిపించవు, వినిపించినా రాకపోవచ్చు !"

"ఎందుకని ?" అన్నది యువరాణి.

ఏదో చెప్పబోయి, చెప్పలేక ఆగిపోయింది చేటిక.

"నేను పిలిపించినా రాడా ? స్వయంగా పిలిచినా రాడా ?" అన్నదామె కోపం గానూ, ఆశ్చర్యంగానూ.

ఆమె గొంతులోని అహంకారాన్ని గుర్తించింది చేటిక.

"అతనిప్పుడు అర్చనలో నిమగ్నుడై ఉన్నాడు దేవీ !" అన్నది మెల్లగా.

"అర్చనలోనా ?" అని కాస్త నెమ్మదించుకొన్నది యువరాణి. "ఎవరి అర్చనలో ?"

దూరంగా ఉన్న తోటమాలి వేపు చూసింది చేటిక. యువరాణి కూడా అటు వేపు చూసింది. దోసిళ్ళతో, అక్కడక్కడ పూలు కుప్పలుగా పోస్తూ, ఆ పూల కుప్పలను కళ్ళకద్దుకొంటున్న తోటమాలి కనిపించాడు.

"ఆదేమిటి ? ఆ వెర్రివాడలా ఎందుకు చేస్తున్నాడు ? అన్నది యువరాణి, అతన్ని అపహసిస్తూ.

"పచ్చికను తాకి, తమ మృదు పాదాలు హత్తిన ముద్రలను, తోటమాలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూలతో పూజిస్తున్నాడు యువరాణీ !" అన్నది చెలికత్తె.
యువరాణి కళ్ళనిండా, కళ్ళనిండా, కళ్ళనిండా మెరుస్తూన్న అశ్రువులే !

(21-5-89 ఆదివారం)

చిన్నీ ! అవనీతలం నిండా నీ స్మృతి బీజాలను వెదజల్లుతున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
వాయుమండలం నిండా, నీ గురించిన సంగీతాలను నింపుతున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
ఆకాశ ఫలకం మీద నక్షత్రాక్షరాలతో నీ గురించిన పాటలు రాస్తున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
రానున్న తరాల వారికి -
ధరా మండలం నిండా, వాయు మండలం నిండా, వియన్మండలం నిండా, నీవే, నీవే, నీవై కనపడతావు; ఆహ్లాదకరమైన ఆకుపచ్చని అరణ్యం లాగా, అతిలోక మోహనమైన సంగీతం లాగా, అపురూపమైన అచ్చపు కావ్యం లాగా...

(22-5-89 సోమవారం)

ఒకప్పుడు - ఎవరికన్నా, ఏదన్నా ఉపకారంచేస్తే "దాన్ని గురించి వారు పదే పదే చెప్పుకోరేం?" అనుకొనేవాణ్ని. ఆ తరువాత ——
"ఇంకొకరు చెప్పుకోవడం కోసమని, ఉపకారం చేయడంలో స్వార్థమూ మాలిన్యమూ ఉన్నాయి. వారు - పైకి చెప్పుకోనవసరం లేదు. లోపల అనుకొంటే చాలు" అనుకొనే వాణ్ణి. ఆ దరిమిలా ——
"లోపల అనుకోవడం, అనుకోక పోవడం, వారి సంస్కారానికి వొదిలేయడం మంచిది. నే నీ ఉపకారం చేశానని ఈశ్వరునికి తెలిస్తే చాలు" అనుకొన్నాను.
ఇప్పుడేమో ——
"ఈశ్వరునికయినా ఎందుకు తెలియాలి? తెలియకపోతే మాత్రం నా కొచ్చిన నష్టమేముంది? మరొకడు గుర్తించడం గుర్తించక పోవడమన్నది - ఆఖరుకు ఈశ్వరుడే కాని - చాలా అల్పవిషయం. నేను 'మంచి' దనుకొన్నదేదో, నా శక్త్యానుసారం, తల వొంచుకు చేసుకుపోవడమే, నా కర్తవ్యం" అనుకొంటు న్నాను.
ప్రభూ ! ఈ కర్తవ్య నిర్వహణలో నా ధైర్యాన్ని సడల నీకు ...

(23-5-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిన్నీ ! కన్ను తెరిచినా, మూసినా బుసబుస లాడుతున్నాయి కారుచీకట్లు. రుస రుస లాడుతున్నాయి, కఠిన వాయువులు. కత్తి విసురుల్లాంటి వాయుతరంగాల్లోంచి, చీకటి కదలికలుకూడా వినపడేటంతటి నిశ్శబ్దంలోంచి, అంతరాంత రాంత రాంతరాల్లోని నిశ్శబ్దంలాంటి చీకటిలోంచి, వేకువలాంటి శబ్దం నీ కోసం ఉదయిస్తున్న వేళ —

ఒకానొక అతిలోక శీతల స్పర్శ, నన్ను అనుగ్రహించింది. ఆ స్పర్శను రూపు రేఖలుగా మార్చినప్పుడు నీవయిపోయావు కాంతం. ఇప్పుడా స్పర్శ అస్తమించింది. మళ్ళీ నేను, చీకటిలోని నిశ్శబ్దంలాగా, నిశ్శబ్దంలోని చీకటిలాగా, చీకటి నిశ్శబ్దాల్లోని శూన్యంలాగా ...

(24-5-89 బుధవారం)

చిన్నీ ! ఒకప్పుడు - నా చుట్టూ ఉన్న వారందరూ నన్ను బాధిస్తున్నప్పుడు' బాధించడం కోసమే వారందరూ నా చుట్టూ చేరినప్పుడు, వారి నుండీ వారి బాధల నుండీ తప్పుకోలేక గిజగిజలాడి పోతున్నప్పుడు, అందరి అపహాస్యపు చూపులూ బాకుల్లాగా నన్ను చీలుస్తున్నప్పుడు, వారి మాటల ఈటెలు కుమ్మి కుమ్మి నన్ను చీరేస్తున్నప్పుడు, ఒక్క దానివే - నీ వొక్క దానివే వాత్సల్యామృత ధారలతో నన్ను అభిషేకించావు; నా గాయాలు కని విని.

అప్పుడు నాకు ఈశ్వరునితో నిమిత్తం లేక పోయింది; నిన్ను వరంగా నాకిచ్చినందుకు, కృతజ్ఞతలు చెప్పుకోవడానికి తప్ప.

ఇప్పుడు, నీవూ ఈశ్వరుడూ వొక్కటయి, నన్ను కాగ బెడుతున్నారు. నేను ఎవరితో చెప్పుకోనమ్మా ...

(25-5-89 గురువారం)

నేను ఎన్నో ఉద్రేకాలను అదుపు చేసుకొన్నాను. మరెన్నింటినో దూరంగా తరిమి వేశాను. ఎన్నెన్నెన్నెన్నింటికో దూరంగా జరిగాను. ఒక్క నీ విషయంలోనే వోడి పోయాను; నీజ్ఞాపకాలను అదుపు చేసుకోలేక, నీ వాత్సల్యానికి దూర దూరం కాలేక.

ప ద మాటల్లో కూడా చెప్పడం సాధ్యపడని,క్లిష్టమైన విషయాన్ని మౌనంతో లేదా ఒక మాటతో, విశదంగా, అందంగా చెప్ప వచ్చునని నీనుంచే నేను నేర్చుకొన్నాను.

ఎండి పోయిన ఆకు మీది చివరి కన్నీటి చుక్క, చెట్టు తల్లిదా? చివురు బిడ్డదా? తెలీదు. ఏమీ ఏమీ తెలీదు. తెలుసుకో లేదు.

ఉభయ సంధ్యలను అంత అందంగా ఎవరు దిద్దుతారో తెలీదు. పక్షుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూలతో పూజిస్తున్నాడు యువరాణీ !" అన్నది చెలికత్తె.
యువరాణి కళ్ళనిండా, కళ్ళనిండా, కళ్ళనిండా మెరుస్తూన్న అశ్రువులే !

(21-5-89 ఆదివారం)

చిన్నీ ! అవనీతలం నిండా నీ స్మృతి బీజాలను వెదజల్లుతున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
వాయుమండలం నిండా, నీ గురించిన సంగీతాలను నింపుతున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
ఆకాశ ఫలకం మీద నక్షత్రాక్షరాలతో నీ గురించిన పాటలు రాస్తున్నాను; నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని.
రానున్న తరాల వారికి -
ధరా మండలం నిండా, వాయు మండలం నిండా, వియన్మండలం నిండా, నీవే, నీవే, నీవై కనపడతావు; ఆహ్లాదకరమైన ఆకుపచ్చని ఆరణ్యం లాగా, అతిలోక మోహనమైన సంగీతం లాగా, అపురూపమైన అచ్చపు కావ్యం లాగా...

(22-5-89 సోమవారం)

ఒకప్పుడు - ఎవరికన్నా, ఏదన్నా ఉపకారంచేస్తే "దాన్ని గురించి వారు పదే పదే చెప్పుకోరేం?" అనుకొనేవాణ్ని. ఆ తరువాత —
"ఇంకొకరు చెప్పుకోవడం కోసమని, ఉపకారం చేయడంలో స్వార్థమూ మాలిన్యమూ ఉన్నాయి. వారు - పైకి చెప్పుకోనవసరం లేదు. లోపల అనుకొంటే చాలు" అనుకొనే వాణ్ణి. ఆ దరిమిలా —
"లోపల అనుకోవడం, అనుకోక పోవడం, వారి సంస్కారానికి హొదిలేయడం మంచిది. నే నీ ఉపకారం చేశానని ఈశ్వరునికి తెలిస్తే చాలు" అనుకొన్నాను.
ఇప్పుడేమో —
"ఈశ్వరునికయినా ఎందుకు తెలియాలి ? తెలియకపోతే మాత్రం నా కొచ్చిన నష్టమేముంది ? మరొకడు గుర్తించడం గుర్తించక పోవడమన్నది - ఆఖరుకు ఈశ్వరుదే కానీ - చాలా అల్పవిషయం. నేను 'మంచి' దనుకొన్నదేదో, నా శక్త్యానుసారం, తల వొంచుకు చేసుకుపోవడమే, నా కర్తవ్యం" అనుకొంటున్నాను.
ప్రభూ ! ఈ కర్తవ్య నిర్వహణలో నా ధైర్యాన్ని సడల నీకు ...

(23-5-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిన్నీ ! కన్ను తెరిచినా, మూసినా బుసబుస లాడుతున్నాయి కారుచీకట్లు. రుస రుస లాడుతున్నాయి, కఠిన వాయువులు. కత్తి విసురుల్లాంటి వాయుతరం గాల్లోంచి, చీకటి కదలికలుకూడా వినపడేటంతటి నిశ్శబ్దంలోంచి, అంతరాంత రాంత రాంతరాల్లోని నిశ్శబ్దంలాంటి చీకటిలోంచి, వేకువలాంటి శబ్దం నీ కోసం ఉదయిస్తున్న వేళ —

ఒకానొక అతిలోక శీతల స్పర్శ, నన్ను అనుగ్రహించింది. ఆ స్పర్శను రూపు రేఖలుగా మార్చినప్పుడు నీవయిపోయావు కాంతం. ఇప్పుడా స్పర్శ అస్త మించింది. మళ్ళీ నేను, చీకటిలోని నిశ్శబ్దంలాగా, నిశ్శబ్దంలోని చీకటిలాగా, చీకటి నిశ్శబ్దాల్లోని శూన్యంలాగా ...

(24-5-89 బుధవారం)

చిన్నీ ! ఒకప్పుడు - నా చుట్టూ ఉన్న వారందరూ నన్ను బాధిస్తున్నప్పుడు, బాధించడం కోసమే వారందరూ నా చుట్టూ చేరినప్పుడు, వారి నుండీ వారి బాధల నుండీ తప్పుకోలేక గిజగిజలాడి పోతున్నప్పుడు, అందరి అపహాస్యపు చూపులూ బాకుల్లాగా నన్ను చీలుస్తున్నప్పుడు, వారి మాటల ఈటెలు కుమ్మి కుమ్మి నన్ను చీరేస్తున్నప్పుడు, ఒక్క దానివే - నీ వొక్క దానివే వాత్స ల్యామృత ధారలతో నన్ను అభిషేకించావు; నా గాయాలు కని విని.

అప్పుడు నాకు ఈశ్వరునితో నిమిత్తం లేక పోయింది; నిన్ను వరంగా నాకిచ్చి నందుకు, కృతజ్ఞతలు చెప్పుకోవడానికి తప్ప.

ఇప్పుడు, నీవూ ఈశ్వరుడూ వొక్కటయి, నన్ను కాగ బెడుతున్నారు. నేను ఎవరితో చెప్పుకోనమ్మా ...

(25-5-89 గురువారం)

నేను ఎన్నో ఉద్రేకాలను అదుపు చేసుకొన్నాను. మరెన్నింటినో దూరంగా తరిమి వేశాను. ఎన్నెన్నెన్నెన్నింటికో దూరంగా జంగాను. ఒక్క నీ విష యంలోనే వోడి పోయాను; నీజ్ఞాపకాలను అదుపు చేసుకోలేక, నీ వాత్సల్యానికి దూర దూరం కాలేక.

పద మాటల్లో కూడా చెప్పడం సాధ్యపడని,క్లిష్టమైన విషయాన్ని మౌనంతో లేదా ఒక మాటతో, విశదంగా, అందంగా చెప్ప వచ్చునని నీనుంచే నేను నేర్చుకొన్నాను.

ఎండి పోయిన ఆకు మీది చివరి కన్నీటి చుక్క, చెట్టు తల్లిదా? చిగురు బిడ్డదా? తెలీదు. ఏమీ ఏమీ తెలీదు. తెలుసుకో లేదు.

ఉభయ సంధ్యలను అంత అందంగా ఎవరు దిద్దుతారో తెలీదు. పక్షుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గొంతుల్లో అంత మంచి సంగీతాలను ఎవరు పొదుగుతారో తెలీదు. మండి పోయే వెలుతురును వడకట్టి వెన్నెలగా ఎవరు శీతలీకరిస్తారో తెలీదు. నీవెవరో తెలీదు. నేనెవరో తెలీదు. ఏమీ ఏమీ, ఏమీ తెలీనే తెలీదు.

(29-5-89 సోమవారం)

మైదానం నిండా, చెట్ల నిండా, పొదల నిండా, కాలవ నిండా చీకట్లు వేళ్ళాడుతున్నాయి గుబులు గుబులుగా.
ప్రాతస్సంధ్య, మసక మసగ్గా వెలుగులను ఊదుతోంది ఆకాశం మీదికి. క్షణాలు మెరుస్తూ తూలి పోతున్నాయి, అరుస్తూ కూలి పోతున్నాయి, నిమిషాల్లోకి దూకి ఆత్మహత్య చేసుకొంటున్నాయి.
ఓ నిగూఢవాంఛ నిశ్శబ్దంగా కరిగిపోయి, శరీరమంతటా అలుముకొన్నాక, నీనిండా పొరలుగా కమ్ముకొన్న నాచూపులను మెల్లగా వొలుచుకొన్నాక, చిప్పిల్లే నీ తడిపొడి నవ్వులతో, నన్ను నేను నింపుకొందామని నీ ముందు కొచ్చాను.
అందేంత దూరంలో నీవున్నావని తెలుసు.
ఎందుకనో అందుకొనలేక పోతున్నాను
నిన్ను విందామనుకొన్నప్పుడు కనపడతావు
నిన్ను చూదామనుకొన్నప్పుడు వినపడతావు
నీ అవసరం లేనప్పుడు అందుబాటులో ఉంటావు
అవసరం ఉన్నప్పుడు అందనంత దూరంలో ఉంటావు
నీవు కనపడతావు కనపడవు. వినపడతావు. వినపడవు. అందుతావు, అందవు.
ఏది జీవితం? ఏది మృత్యువు?
సరిహద్దు రేఖకు అవలగా నీవు, ఈవలగా నేను
నీవు మరణించినట్లు, నేను జీవించినట్లు, నే ననుకొంటున్నాను.
నేనే మరణించినట్లు, నీవే జీవించినట్లు నీవూ అనుకొంటున్నావేమో నాకు తెలియదు.
ఎవరి నడగను? ఎవరు చెబుతారు?

(30-5-89 మంగళవారం)

ఎందుకో తెలీదు. ఎక్కడో తెలీదు. కాంతుల్ని విరజిమ్మే ఓ గాజు గోళం బద్దలయి, ఆ అద్దం ముక్కలన్నీ చెల్లా చెదరయినట్టుగా, ఆకాశం నిండా, చుక్కల మిలమిలలు.
ఆ చుక్కలను చూస్తున్నప్పుడే, చూస్తూ చూస్తూన్నప్పుడే, నీకోసమూ చూశాను - నీవెక్కడన్నా కనబడతావేమోనని!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నువ్వెక్కడే ఉన్నావేమో? ఉన్నా నేను చూడలేక పోతున్నా నేమో? ఇంకెక్కడన్నా ఉన్నావేమో? ఏదీ తెలీదు. ఏమీ తెలీదు.

నీవు జ్ఞాపకం వొచ్చావా—

నిప్పుల ఆనకట్ట మీంచి దూకే, జ్వాలా ప్రవాహంలాగా మారి పోతాను. నా కారణంగా, నా పరిసరాలన్నీ ఉష్ణ మండలాలుగా మారిపోతాయని కావచ్చు; రోజంతా మబ్బులు, ఆవరించుకొనే ఉన్నాయి ఆకాశం నిండా. సూరీడు కూడా అప్పుడప్పుడు తొంగి చూశాడే తప్ప, మబ్బు తెరల మాటు నుండి వెలికి రానేలేదు ...

(2-6-89 శుక్రవారం)

మన ఆర్థిక స్థితి: మన వ్యక్తిగత జీవితాన్నీ, సామాజిక జీవితాన్నీ అడుగడుగునా ప్రభావితం చేస్తూనే ఉంటుంది. ఈ ఆర్థిక స్థితిని రాజకీయాలు నిర్ణయిస్తాను. ఈ సత్యాన్ని మరిచి పోయిన రచయిత మూర్ఖుడైనా కావాలి, గొప్ప వంచకుడైనా కావాలి ...

మిగిలిపోయిన అన్నం మెతుకుల్ని, కెలుకుతోన్న బొజ్జింక వేపు చూస్తున్నాను అది వెనక్కు జరుగుతోంది. ముందుకు వొస్తోంది. ఈనెల్లాగా ఉన్న ముందు కాళ్ళతో, అన్నం మెతుకులను కదుపుతోంది. ఆ మెతుకుల్ని, బొజ్జింకను మెల్లగా కాగితం మీదికి చేర్చి, వెనక గది మూలన ఉంచాను ఉదయం. తిరిగి సాయంకాలం చూశాను. మెతుకులు లేవు. బొజ్జింకను, ఓ సాలీడు కరిచి పట్టుకొని ఉంది. సాలీడు నిండా చీమలు మునురుకొని ఉన్నాయి.

ఓ బొజ్జింకకు ఇంత తిండి పెట్టానన్న సంతృప్తి నాకు దక్క లేదు. దాన్ని సాలీడుకు మేతగా వేశాను. సాలీడును, చీమలకు మేతగా వేశాను.

మనుషుల్లోనూ అంతే! బలవంతుడు, బలహీనుణ్ని; మేధావి, అమాయికుణ్ని; తినేస్తున్నాడు ...

(3-6-89 శనివారం)

ఓ అందమైన ఆలోచన మాత్రమే కాదు; ఓ పసందైన పదమే కాదు; ఏదీ ఉత్తుత్తినే రాదు, ఏదీ ఉత్తుత్తినే కాదు ...

కిరణాల పదును కత్తులను విసిరి, జలాలను ఆవిరి నలునులుగా చీరేస్తున్నాడు సూర్యుడు. అంతదాకా, జలోపరి భాగాన్ని మాత్రమే తాక గలిగిన వాయువు, నీటి నలుసుల్ని, ఆకాశంలోకి విసిరేస్తోంది. అయినా ఆ జలకణాలు భయపడ లేదు. అన్నీ కూడబలుక్కొని మేఘంగా మారాయి. చినుకులుగా ఏకమయ్యాయి. ధారలుగా మెలుచుకు పోయాయి. ప్రచండమైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శక్తితో, తిరిగి భూమిని చేరాయి.
ఓ చిన్న విత్తనం మొలకెత్తడం వెనక ఎంతటి జీవన సమరం? ఆ మొక్క ఎదగడం వెనక ఎంత తపన! ఎదిగి పూవును ప్రసవించడం మాటున ఎంత తృష్ణ! అందుకే ఏదీ ఉత్తినే రాదనడం: పుట్టుక మాత్రమే కాదు; మరణం కూడా ఉత్తుత్తినే రాదు.

తపనలోంచి, తపస్సులోంచి, మంటలోంచి, మధనంలోంచి, సంవేదనలోంచి, సంక్షోభంలోంచి, కసిలోంచి,దీక్షలోంచి వొస్తాయి - ఏవైనా. కల్ప వృక్షమూ, కాలకూట విషమూ, అమృతమూ, అగ్నీ ఈ మధనంలోంచే వొచ్చాయి.

మనం పైపైన చూస్తే చాలదు - లోపలకు, లోలోపలకు, లోతులకు, లోతోతులకు, చొచ్చుకొని,చొరుచుకొని పోవాలి.అప్పటికయినా 'కాస్త' తెలుసునని పిస్తుంది గానీ, సంపూర్ణంగా ఏదీ ఎప్పటికీ తెలీదు, తెలుసుకో లేను.
నేను అల్పుణ్ణి. తెలుసుకొన వలసింది అనల్పం:

(4-6-89 ఆదివారం)

వేకువ పండి రోజుగా ఫలిస్తోంది. ఆ మునిపొద్దు వేళ నిద్దుర లేచిన గడ్డిపూలు సంతోషంతో పరిమళాలను చిమ్ముతున్నాయి గాలి నిండా. పక్షుల మెత్తని గొంతుల మాటున, దాగున్న పాటలన్నీ మేలుకొని వెలికురుకు తున్నాయి. నాకప్పుడని పించింది - మనిషిగా కాక, ఇంకేదో లాగా పుడితే ఎంత బాగుం డునో - అని!

గాలి తరగనయితే; మహారణ్యాల మీద పేరుకు పోయిన మాదక పరిమళాలను, గిరి శిఖరాల మీది స్వచ్ఛతను, లోయల్లోని చీకటిని, సముద్రాలను, నదీ నదాలను, పూల తోటలను, ఎడారులను, మబ్బులను, తాకి, చూసి ఉందును. ఎన్నో నిట్టూర్పులను మోసి ఉందును. సంగీతంగా మారి ఉందును. స్వామిని ఆలింగనం చేసుకొని ఉందును.

వెలుగు నయితే; అనూహ్యమైన దూరాలలోని, నక్షత్ర మండలాలను, నక్షత్ర మేఘాలను, గాఢ తిమిరాలను; వీటన్నింటికీ ఆవలగా ఉన్న నూతన లోకాలనూ, ఈ సమస్త లోకాలనూ సృజించి, వినోదం చూస్తున్న ప్రభువునూ స్పృశించి ఉందును.

ఎందుకూ కొరగాని మనిషిగా పుట్టి, ఈ నేలకు, ఈ గాలికి, ఈ పినరంత వెలుగుకు, బందీనయిపోయాను ...

(5-6-89 సోమవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

... కాలం అన్ని వ్యథలనూ కప్పి వేస్తుందంటారు. నా విషయంలో అదీ అబద్ధమయి పోయింది. నీ జ్ఞాపకాల ముట్టడి నుండి నన్నెవరూ రక్షించ లేక పోతున్నారు - అప్పుడప్పుడు - ఈశ్వరుడు తప్ప ... ఎక్కడెక్కడి శబ్దబిందువులూ గునగునలాడుతూ నాలోకి వొచ్చి, పదాలయి, వాక్యాలుగా మారి, జాలులుగా రూపొంది,ప్రవాహంగా పెరిగి,నానిండా నిండి, పొంగి, పొరలి, మహాధృతంగా వెలి కురుకుతాయి, అప్రయత్నంగా ... ఓ మంచి మలుపుతో కథా శరీరం పులకరించి పోయినట్లుగానే, నీ రాకతో నా జీవితమూ పులకరించింది. బంగారు మడుగయి పోయింది ...

(6-6-89 మంగళవారం)

ఇన్నేళ్ళొచ్చాయి గదా! వెలుగులూ, నీడలూ, కొంతకు కొంతయినా చూశాను గదా! మనిషి లోతులు లోయలు; ఎడారులు, శాద్వలాలు; పూల తోటలు, కాలి బాటలు; శృంగాలు, శిఖరాలు; కొంచెం కొంచెంగానైనా తాకి చూశాను గదా! "ఇక చాలు" అన్న తృప్తి కలగడానికి బదులుగా, భయంకరమైన అసంతృప్తి, నన్ను దహించి వేస్తున్నది. నా సమయమంతా "తెలుసు కోవడం" అన్న ఆ వొక్క పనికే వినియోగించ గలిగితే, ఎంత బావుండును! కానీ – ఆకలి, ఆర్థికం, ఆరోగ్యం, కలిసి నన్ను పక్కకు గుంజి పారేస్తున్నాయి ... కొంత మంది అదృష్ట వంతులలో ఈ క్రియ తొందరగా సమసి పోతుంది. కొంత మందిలో పెరిగి పెరిగి దహించి వేస్తుంది. నేనిప్పుడి దశలో ఉన్నాను. నాకు తెలిసినంత వరకూ, ఇది సరైన మార్గమే: ...

(7-6-89 బుధవారం)

42 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా, నా దేశ ప్రజల్లోని అధిక సంఖ్యాకులు, దారిద్ర్య రేఖకు దిగువగా, పురుగుల కన్నా హీనంగా బతుకుతున్నారు. కారణం - ప్రజలు కాదు; ఈ ప్రజలకు నాయకత్వం వహిస్తున్న రాజకీయ నాయకులు.

నాకో విషయం చచ్చి గీపెట్టినా అర్థం కావడం లేదు. ప్రజల కన్నా, ప్రజా సేవకులు, ప్రజా నాయకులు, సుఖ భోగాలతో ఎలా ఉండగలుగు తున్నారో నాకు అంతు చిక్కడం లేదు. ప్రజలు మట్టి కొట్టుకు పోతున్న సమయంలోనే, ప్రజా సేవకులు మింట మెరిసి పోతున్నారు.

రాజకీయం, ప్రజా సేవ అన్న పదాలు - వాటి అర్థాలను లక్ష్యాలను ఎప్పుడో కోల్పోయాయి. ఇప్పుడవి వాణిజ్య స్థాయి నందుకొన్నాయి. 'ప్రజా సేవ' లాభసాటిగా ఉండే వ్యాపారమయి పోయింది. ప్రజల అమాయికత్వం, ఈ వ్యాపారానికి తిరుగులేని పెట్టుబడి. "మిమ్మల్ని ఉద్ధరిస్తాం" అన్న నినాదంతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాయకులు, ప్రజల్ని మోసగిస్తున్నారు. తాము బతికేస్తున్నారు ...

(9-6-89 శుక్రవారం)

మనస్సు, మండే కొలిమిలాగా ఉండాలా? మంచుకోనలాగా ఉండాలా? నేను మాత్రం కొలిమి లాగానే ఉండాలని కోరుకొంటున్నాను. మంచుకోన చేసేపని, అన్నింటినీ చల్లబరచడం. అ కోనలోని, గాలికూడా ఘనీభవించి పోతుంది. అక్కడి ఆలోచనలుకూడా, అచేతనాలయి, గడ్డకట్టి పోతాయి.
మండే కొలిమి ఇందుకు ఫక్తు వ్యతిరేకం. ఇది - అన్నింటినీ వెచ్చబరుస్తుంది. అన్నింటినీ కరిగిస్తుంది. అచేతనాలైన రాలురప్పలు కూడా, సచేతనాలవుతాయి. జిడ్డురికే బండరాళ్లయినా, భాస్వంతా లవుతాయి. అలాగా భాసిస్తూ భాసిస్తూనే, భస్మ మవుతాయి.
నేను మాత్రం ముది భావం లాగా, మంచు కోనలో మునుచుకు పోయి బతికేయాలను కోవడం లేదు. జ్వలిస్తూ, లయించిపోవా లనుకొంటున్నాను ...

(10-6-89 శనివారం)

మీరంతా దయామయులు. ఇంతవరకూ - ఎన్నింటికో నన్ను మన్నించారు. దయచేసి, ఇప్పుడూ నన్ను మన్నించండి. నేనిలానోరు చేసుకోవడం, మీకు తెలీదని కానేకాదు. నిజానికి - మీకు - చాలా తెలుసు. మీకు చాలా చాలా తెలుసునని నాకూ తెలుసు. అయినా - మీ ముందీ సాహసం చేయడానికి మీ మంచితనం కొంత కారణమయితే, నా అజ్ఞానం మరి కొంత కారణం! అజ్ఞానం తప్ప - అహంభావం కారణం కాదని మనవి చేస్తున్నాను.
ఇసుకపర్ర వసుంధర కావడం తెలుసు
పుచ్చిన విత్తనం పచ్చగా మొలకెత్తడం తెలుసు
చీకటి చినుకులు వెలుతురు వాన కావడం తెలుసు
కొండ వాగు వియద్గంగ కావడం తెలుసు
ముళ్ళచెట్టు పళ్ళ చెట్టు కావడం తెలుసు
ఆమె నాతో ఉంది గనక . . .

(11-6-89 ఆదివారం)

నల్లపలక మీదికి విసిరేసిన తెల్ల అక్షరాల్లాగా, ఆకాశం నిండా చెల్లా చెదరయిన నక్షత్రాలే ఈ ఈ వేకువన. అక్కడక్కడా దొంతులు దొంతులుగా మబ్బులు. వాటిమీద వొద్దికగా నిదరపోదా మనిపించింది.
నీవు గుర్తుకొచ్చావు. ఇంకేదీ నా స్వాధీనంలో ఉండదు.
చిన్నీ ! ఏ అక్షరాల్లోకీ వొదగని అందమైన ఆలోచనలాగా ఉంటావు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏ రేఖలకూ అందని అపురూపమైన రూపంలాగా ఉంటావు. ఏ రంగులకూ చిక్కని అవధిలేని అనుభూతిలాగా ఉంటావు. ఎక్కడెక్కడి సౌజన్యాలూ, ఒక్కచోట గుమికూడినట్లుగా ఉంటావు.
అచ్చు తప్పుల్లాంటి అనారోగ్యమే లేకపోతే, అచ్చమైన మహా కావ్యంలాగా ఉంటావు . .

(13-6-89 మంగళవారం)

నిన్ను చూదామని ఈ ఉదయం శ్మశానానికి కొచ్చినప్పుడు
నీ మట్టి ఇంటి తలుపుల్ని మెల్లగా నేను తడుతున్నప్పుడు
ఎండ - చినుకు చినుగ్గా కురుస్తోంది మబ్బు మీంచి
హరితం - చల్లచల్లగా కంపిస్తోంది చెట్టు మీంచి
కెరటం - ఉలికి ఉలికి పడుతోంది ఒడ్డుమీంచి
చివురు - భయం భయంగాచూస్తోంది ముళ్ళ మీంచి
ఈ ఉదయం నిన్ను చూదామని శ్మశానాని కొచ్చినప్పుడు
నీ మట్టి ఇంటి తలుపుల్ని మెల్లగా నేను తడుతున్నపుడు
ఉప్పు నీళ్ళూరుతున్నాయి కళ్ళల్లోంచి
వెక్కిళ్ళు దుముకుతున్నాయి గుండెల్లోంచి
ఒక్క పాటా పెగలడంలేదు కంఠంలోంచి
ఒక్క మాటా రావడంలేదు పెదవుల మీంచి
ఈ ఉదయం నేను నీ మట్టి ఇంటి కొచ్చినప్పుడు
నవ్వుతూ నాకెదురుగా నీవు నుంచున్నపుడు . . .

(14-6-89 బుధవారం)

అందరికీ నా మీద కోపంగానే ఉంది.
అన్నిటికీ నా మీద కోపంగానే ఉంది. మామ్మూలుగా ఆరింటికి అస్తమించవలసిన సూర్యుడు, ఆవ్వేళ ఐదున్నరకే అస్తమించాడు. ఆకాశం నిండా అలముకొనవలసిన సందె వెలుగు, అవ్వేళ చెప్పకుండానే ఆబ్సెంట్ అయింది. నిండు నూరేళ్ళుంటానని చేతిలో చెయివేసిన జీవితం, సగకాలం దాటకుండానే చేతిని తీసేసుకొంది. నూటికి నూరు మార్కులిస్తాడనుకొన్న లోకేశ్వరుడు, యాభయ్ నాలుగు మార్కులిచ్చి ముఖం తప్పించాడు. సుఖాంతం కావలసిన నాటకాన్ని దుఃఖాంతం చేశాడు దర్శకుడు. ప్రహేళికలా సాగుతున్న జీవితం కాస్తా, అర్ధాంతరంగా అదృశ్య మయిపోయింది. నిచ్చెనెక్కాననుకొంటున్న పిచ్చి పావును, పాము కరిచేసి ఆఖరిగడిలోకి తరిమేసింది. సాగుతూ, సాగారుతూ ఉన్న సరసమైన గీతం, సగం దాకావొచ్చి స్తంభించి పోయింది. కామాలను దూకేస్తూ పరుగులు తీస్తున్న వాక్యం, పూర్ణ బిందువును చేరకుండానే ప్రశ్నా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ర్శక చిహ్న మయిపోయింది.
అప్పుడు నా చుట్టూ పేరుకొన్న చీకటి పొగల్ని, ఇప్పటికీ, ఏ వెలుతురూ కడి గేయడం లేదు. అప్పుడు నా చుట్టూ ముసురుకొన్న మంచు మబ్బుల్ని, ఈ నాటికీ, ఏ వెచ్చదనమూ కరిగించడం లేదు.
అందరికీ నా మీద కోపంగానే ఉంది.
అన్నిటికీ నా మీద కోపంగానే ఉంది . . .

(15-6-89 గురువారం)

"నేను భాషను, నీవు వ్యాకరణానివి. నేను పద్యాన్ని. నీవు కవిత్వానివి" అన్నాడతను ఆమెవేపు చూస్తూ.
ఆమె కళ్ళు చిట్లించింది.
"కొంపదీసి కాదాయేమిటి?" అన్నాడతను ఆమె కన్నుల్లోకి అనుమానంగా దిగులుగా చూస్తూ.
అతన్ని చూసి అతని గొంతులోని దిగులుకు చూసి, ఆమె మురిసి పోయింది.
క్షణం క్రితం చిట్లించిన ఆమె కళ్ళు, ఇప్పుడు నవ్వుతున్నాయి.
"నువ్వేదో నాకు తెలీదు. నేనేదో అంతకన్నా తెలీదు, నువ్వూ, నేనూ, అదో ఇదో ఏదో వొకటి అయి ఉండడం మాత్రం - నీ అంత, నా అంత నిజం కన్నా !" అన్నదామె, అతను రాసి పడేసిన కాగితాలను వరసగా సర్దుతూ.

కుంకుమ చేను తగలబడి పోయినట్టు
సంగీతం నిలుపునా చిరిగి పోయినట్టు
కావ్యంలోంచి కవిత్వం జారిపోయినట్టు
చందమామ చచ్చి చచ్చి పోయినట్టు
నా కనిపించింది నీవు నాతో లేవని, ఎందుకో గుర్తుకొచ్చిన ఈ వేళ . . .

(16-6-89 శుక్రవారం)

మూగికాంతుల్ని అనులునులుగా వొంటికి చుట్టు కొంటూ, మసక మబ్బుల్ని పక్కలకు జరుపుకొంటూ, ఉషాకన్య ఆప్యాయంగా నన్ను పలకరిస్తున్నప్పుడను కొంటాను, ఇప్పటిదాకా మేలుకొనే ఉన్నానని; నిన్ను అవలోకిస్తూ.
ఎక్కడినుంచో రెక్కలు చాచుకొంటూ, ఓ సుతిమెత్తని పదంవొచ్చి, నా పెదవుల మీద తీయగా వాలిపోతున్నప్పు డనుకొంటాను - నేను, యిప్పటిదాకా మౌనంగా ఉన్నానని; నిన్ను అలకిస్తూ.
గాలితరగ నున్నితంగా నా శరీరాన్ని మీటుతున్నప్పుడు, రంగులపిట్ట వలయాలు తిరుగుతూ పాడే ఉదయగీతం మంచులా నన్నలముకొంటున్నప్పుడను కొంటాను - నేను, మేకువ నడకలో ఉన్నానని; నిన్ను ఆలోచిస్తూ . . .

(17-6-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముసలి చీకటిదాటి,మసక వెలుగునుతాకి, గాలిగొంతుక నుండీ, జాలి - జాలుగ జారి, ననుచూసి తనదారి, మార్చుకొని దూసుకొని వచ్చిన ఓ పాట, నన్ను చూస్తూనే,గప్పుమని వొళ్ళు విరుచుకొంటూన్న కాలవ,చివుళ్ళ చినుకుల్ని చిలకరిస్తూ, పలకరిస్తూన్న పచ్చని చెట్టు, గుసగుస లాడుతూనే గునుకు పరుగు తీస్తూన్నగాలి తరగ - ఈనాటి ఉదయపు నడకలో నా కెదురు పడ్డాయి.

ఓ చిన్న కన్ను ఎన్ని చిత్రాలు చేస్తుందో ఎలా చెప్పడం? ఎంతని చెప్పడం? ఆ కన్ను - అలా విడిగి విప్పారిందా, సూర్యుడు కనపడతాడు. అతగాడు ఊదే కాంతుల తువ్వర పడిన మహారణ్యాలు కనపడతాయి. మహాసముద్రాలు కనపడతాయి. ఆ సముద్రాలను, జలాలతో నింపుతున్న నదీనదాలు కనపడతాయి. వాటికి ఆ వొంచనా, ఈ వొంచనా పరుచుకొన్న పచ్చని మైదానాలు, పొలాలు కనపడతాయి. ఈ మైదానాలనిండా, పొలాలనిండా, కమ్మిన, మానవ సమూహాలు కనపడతాయి. ఈ సమూహాలు తయారించిన అద్భుత నిర్మాణాలు, చేసే రణాలు, దారుణాలు, సృష్టించిన గ్రంథాలు, శిల్పాలు కనపడతాయి. గుడిసెలు కనపడతాయి. ఆకలి చావులు కనపడతాయి, సమ్మెలు కనపడతాయి. తుపాకి కాల్పులు కనపడతాయి.

అదే కన్ను, అలా మూతపడి పోయిందా, నీ మట్టుకు నీకేమీలేవు; రంగురంగుల చీకట్లు తప్ప ...

(18-6-89 ఆదివారం)

నే నేదీ మరిచిపోలేను, నే నెవరినీ మరిచిపోలేను. కడుపునిండా అన్నంతిన్నట్టూ, వొంటినిండా గుడ్డలువేసుకొన్నట్టూ, నాకు నేను ఊహించుకొని ఉర్రూతలూగి పోయిన రోజులను మరిచిపోలేను. నన్నలముకొన్న ఆకలిని మరిచిపోలేను. ఆకలయినప్పుడు, ఇంత అన్నం ప్రసాదించిన అమ్మలనూ, నాన్నలనూ మరిచిపోలేను. చెప్పులు తొడుక్కున్న కాళ్ళవేపూ, గడియారం పెట్టుకున్న చేతివేపూ, ఆశగా, అసూయగా, సూటిగా, చాటుగా చూసిన రోజులను మరిచి పోలేను. నన్ను అగ్గిగుండాల్లోకి పడతోసిన వారిని మరిచిపోలేను. మసి గుంట లాంటి నా బతుకును, హేమకుండంగా మర్చిన నిన్నూ మరిచిపోలేను చిన్నీ! నీ పాదం తాకినప్పుడు -

ఎక్కడెక్కడి వసంతాలూ ఎడారుల నిండా వాలి పోతాయి. ఎక్కడెక్కడి పాటలూ, పక్షుల గళాల గూళ్ళల్లోకి చేరుకొంటాయి. ఎక్కడెక్కడి వర్ణాలూ ఇంద్ర ధనుర్వలయాలై బారులు తీరి కూచుంటాయి.ఎక్కడెక్కడి మొలకలూ, మొక్కలూ హరితచ్ఛందంలో కవిత లల్లుతాయి. రాలు, పూలయి పోతాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాగాలు రంగు రంగుల దుస్తుల్ని ధరిస్తాయి. కదలి వేవు కదులుతున్న నదులు, కలల్లోకి ప్రవహిస్తాయి. అచేతనాలు, చేతన కేతనాలను ఎగుర వేస్తాయి, నీ పాదరజం సోకినప్పుడు అందుకు ప్రత్యక్ష సాక్షిని నేనే !

(19-6-89 సోమవారం)

. . . నా గోల భరించలేకా, నీ దుఃఖాన్ని చూడలేకా నిన్ను నాకూ, నన్ను నీకూ, ఈశ్వరుడు మళ్ళా ఇచ్చాడా సరే సరి ! ఇవ్వడనుకో, ఇవ్వలేడనుకో, ఈ పాటి చిన్న సహాయాన్ని కూడా చేయలేని ఈశ్వరుడు మనకు మాత్రం దేనికి ?

ఇలా నువ్వూ నేనూ, ఇంకా మనలాంటి వాళ్ళం అందరమూ కలిసి, తరిమి కొట్టామనుకో, అడిగే దిక్కులేకుండా పోతుంది ఈశ్వరుడికి . . .

(20-6-89 మంగళవారం)

నువ్వేం చేస్తావో నాకు తెలీదు. ఇన్నేళ్లగానైనా, తెలుసు కొనలేని దివ్యాంశ మేదో నీలో ఉంది. నీవు గుర్తుకొస్తే చాలు — పొడి కళ్ళనిండా తడి అలము కొంటుంది. అలాగా - తడిపొరలు, పొడికళ్ళనిండా నిండిపోయాక, నీవు మరింత స్పష్టంగా అందంగా కనపడతావు. అంటే - కన్నీట స్నానం చేసిన కళ్ళకు గానీ నీవు కనపడవన్న మాట !

ఒకప్పుడు - కన్నీరెట్టుకోవడం, బలహీనతకు చిహ్నమనుకొనేవాణ్ని. ఇప్పు డేమో - ఈశ్వరుడిచ్చిన గొప్పవర మనుకొంటున్నాను. ఎందుకేమిటి ? నిన్ను దగ్గరగా బిగ్గరగా తడి కళ్ళతో చూడవచ్చు గనక !

నన్ను చుట్టిన గాలినిండా పచ్చదనం పరుచుకొన్నప్పుడు
నన్ను ముట్టిన నేలనిండా వెచ్చదనం కమ్ముకొన్నప్పుడు, సంపెంగ వాసనలా నీవు నా కెదురుగా నుంచున్నప్పుడు, నా మాటలన్నీ మరుపు మలుపులో మాయ మైనప్పుడు, నేర్చిన అక్షరాలన్నీ అలసటలో అంతర్ధానమైనప్పుడు కూడా, నేను విచారించ లేదు; "కాంతం" అన్న రెండక్షరాలు, రెండు దివ్యనేత్రాలుగా నాతోనే ఉన్నాయి గనక !

నా ఆలోచనల బీజాలను అనుభవ క్షేత్రంలో చల్లాను. అవి - చచ్చీ చెడి మొలకెత్తాయి. మొక్కలయ్యాయి. ఈ చిన్నచిన్న మొక్కలను, పెద్దపెద్ద చెట్లతో పోల్చకండి. పిచ్చివో, ఎచ్చివో, అవన్నీ అసలైన మొక్కలు.
నా సొంత మొక్కలు దేశవాళీ మొక్కలు. అంతేగానీ - ఇంకే స్వదేశీ విదేశీ మహావృక్షాలకూ, అంటుకట్టినవి మాత్రం కావు ...

(21-6-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అలవాటు తప్పిన అలికిడి విని, కిటికీ రెక్కలు తెరిచాడతను. అద్దరినుండి తొంగిచూస్తున్న కాసిని చూపులు కనిపించాయి. మెరిసిపోతున్న కూసిని నవ్వులు కనిపించాయి. చిందిపోతున్న పిడికెడు అనురాగాలు కనిపించాయి. పొంగి పోతున్న దోసెడు వాత్సల్యాలు కనిపించాయి. చిటచిట లాడిపోతున్న చిటికెడు చిరుకోపాలు కనిపించాయి.

"ఇక వెడుతున్నాను" అన్నదామె కన్నీటి చుక్కలా మారిపోతూ.

"అప్పుడేనా ?" అన్నాడతను దుఃఖంలా కరిగిపోతూ.

"ఇక్కడికొచ్చి, చాలా సేపయింది. ఇప్పటిదాకా 'అక్కడ' నీకోసం ఎదురు చూశాను. చూసీ, చూసీ, చూసీ, నా చూపులన్నీ అలసిపోయాయి. అలసిన చూపులు నిన్ను చూడలేకపోతున్నాయేమోనని, అనుమానం వేసింది. కనీసం నీ అడుగుల చప్పుడన్నా వినపడుతుందేమోనని, చెవులు దొరగిలచేసుకొని విన్నాను. ఎవరివో తప్ప, నీ అడుగుల సడి విన రాలేదు. నేనిష్టపడే నీపిలుపూ వినరాలేదు. నువ్వేమయినావోనని, వల్లమాలిన దిగులు వేసింది కన్నా! మరింక దుఃఖం ఆపుకోలేక పోయాను. నీకోసం బయల్దేరాను. కానీ నడవలేను. ఎలా ఇక్కడిదాకా వచ్చానో నాకే తెలీదు. భయంభయంగా నీ గదిలోకి తొంగి చూశాను. నా ఫోటో వేపు, కన్నీటితో చూస్తున్న నీవు కనిపించావు. నీ పనులు మానుకోమని కాదుగానీ, రోజు మొత్తంమీద, నాకోక్షణంపాటైనా కనిపించి, ఓ మాట వినిపించి పోతూఉండూ. నువ్వు అస్థిమితంగానైనా ఉన్నావని, నన్నూ అనుకోనివ్వు. నేనిక్కడినుండి కోరుకొంటున్నది కూడా అదే!" అన్నదామె కన్నీరొత్తుకొంటూ.

అంటూనే, అలా అంటూనే, అంటూ అంటూనే, అతన్ని చూస్తూనే, చూస్తూ చూస్తూనే ఆమె కదిలిపోయింది. కదిలి పోతూ పోతూనే కరిగిపోయింది :

(22-6-89 గురువారం)

ఆ మబ్బును ఎవరేమన్నారో పాపం - చిన్న బుచ్చుకొంది. నల్లబుచ్చుకొంది. మిగిలిన మబ్బులన్నీ దూర దూరంగా వెళిపోయాయి. తానొక్కతే మిగిలి పోయింది. బిక్కుబిక్కుగా అటూ ఇటూ చూసింది. అలా చూస్తున్నప్పుడే నన్నూ చూసి ఉండాలి. మెల్లగా, మెల్ల మెల్లగా నావేపుగా వస్తోంది. దగ్గరగా వచ్చాక పలకరింతామనీ, చేతనయిన సాయంచేసి, ఓదార్చుదామనీ అనుకొన్నాను. అల్లంత దూరంలో ఉండగానే దుఃఖం ఆగక ఏడ్చేసిందా పిచ్చి తల్లి ! ఏడుస్తూనే, ఏడుస్తూ ఏడుస్తూనే, ఏడుపులో కలిసిపోతూనే, మొత్తం -

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తానే ఏడుపయి పోయింది. ఆ బంగారు తల్లి దుఃఖాశ్రువుల్లో నిలువునా తడిసి పోయాను ఈ సాయంకాలం!.

ఎవరికీ తెలియని జీవిత సత్యాలేవో నాకు తెలుసునని నేనెప్పుడూ అనుకోలేదు. నిజానికి - చాలా మందికి తెలిసిన పాటి కూడా నాకు తెలీదు. కాకపోతే, వారేమో పైకి చెప్పలేకపోతున్నారు. నేనేమో - నాకు చేతనయిన పద్ధతిలో, కొంచెం కొంచెంగానైనా చెప్పడానికి, యథాశక్తిగా ప్రయత్నిస్తున్నాను.

ఎప్పుడన్నా నాలోని మాటలన్నీ మూగివయిపోతాయి. అప్పుడు - నేనో మౌన గీతాన్నయి పోతాను.

ఎప్పుడన్నా నాలోని రేఖలు రంగులు చెరిగిపోతాయి. అప్పుడు - నేనో అదృశ్య చిత్రాన్నయి పోతాను.

(23-6-89 శుక్రవారం)

ఎప్పుడన్నా అనుకొంటాను 'నీవు దేవత' వని. చప్పున కాదనీ అనుకొంటాను, నీవు నా సహచరివి గనక. నిన్ను 'దేవత' అనడానికి నాకొక్కటే అభ్యంతరం చిన్నీ! నీవు దేవతవయి పోయాక - నేనేమిటి కావాలి? ఆ ప్రత్యుత్తరానికి, నేను పూర్తిగా అనర్హుణ్ని. అయితే - దైవాంశమైన దయను ఎదనిండా నింపుకొన్న మంచి మనుషుల్ని, అప్పుడప్పుడు అక్కడక్కడ చూసిన వాణ్ని. అలా నేను చూసిన వారితో నన్ను పోల్చుకొని కన్నీరు పెట్టుకొన్నాను. సిగ్గుతో తల వొంచుకున్నాను. నేను చాలాచాలా సామాన్యుణ్నని నాకు తెలుసు. నీవు - అచ్చంగా దేవతవనీ, నాకు తెలుసు ...

(24-6-89 శనివారం)

మహాక్రూరుని మనస్సులాగా వాతావరణం ఉడికిపోతూ ఉంది. యుద్ధానంతర రణస్థలిలాగా, ఆకాశం ఎర్రగా భయంకరంగాఉంది. గాయాలతో విలవిల్లాడి పోతున్న వీరుల్లాగా మబ్బులు నెత్తురోడుతున్నాయి. అటూ ఇటూ మెల్లగా పొర్లుతున్నాయి.

శాంతి దూతలాగా, అప్పుడొచ్చాడు చంద్రుడు ఆకాశం మీదికి. వస్తూనే వెన్నెల సంప్రదింపులను చల్లగా ప్రారంభించాడు. మెల మెల్లిగా ముందుకు జరుగుతూ, జరుగుతూనే, తన జ్యోత్స్నా ప్రబోధాన్ని సాంద్రీకృతంచేశాడు. ఇప్పుడు - సహృదయుని హృదయంలాగా, వాతావరణం ప్రశాంతంగా ఉంది. చల్లగా ఉంది. తెల్లగా ఉంది. నెత్తురోడుతున్న మబ్బులన్నీ తెల్లని శాంతికపోతాలయి, దిక్కుదిక్కులకూ పరుగులు తీస్తున్నాయి.

నాకింకా గుర్తున్నది చిన్నీ!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీవు నేను, ఆ తోటలోకి వస్తామని తెలిసి, వాయుదేవుడు, తోటనంతా ఊడ్చి పోవడం నాకింకా గుర్తున్నది. తోటనూ, తోటలోని బాటనూ, వానదేవుడు చినుకులతో కడగడం నాకింకా గుర్తున్నది. అక్కడిక్కడి పాటల్ని ఏరు కొచ్చుకొన్న పక్షులు - తమ గొంతులకు వాటిని అంటుకట్టుకోవడం నాకింకా గుర్తున్నది. ఎక్కడెక్కడి రంగుల్నీ, వాసనల్నీ తమ వొంటినిండా పూవులు అద్దుకోవడం నాకింకా గుర్తున్నది.

అటూఇటూ వోసారిచూసి, ఎవ్వరూ లేరని రూఢిచేసుకొన్నాక, నా భుజాన్ని మెత్తగా తాకిన నీ మునివేళ్ళ చిలిపి స్పర్శకూడా నాకింకా గుర్తున్నది. గుండె గుసగుస విన్నా 'కన్నా !' అంటూ పలికే దానివి గదా! నేనిన్ని సార్లు పిలిచినా, ఇప్పుడు పలకవేం చిన్నీ ? రాలిపడే నక్షత్రాన్ని చూసినా, జాలిపడే కళ్లుగదా నీవి! నావేపు వొకసారన్నా చూడవేం చిన్నీ ?

(25-6-89 ఆదివారం)

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రధాన లక్షణం వ్యాపారం. ఈ వ్యాపారాభివృద్ధికోసం అది, సమాజంలోని అన్ని మూలలనూ తడివి చూస్తుంది. అన్ని మూల్యాలనూ తాకి చూస్తుంది. కొత్త అవసరాలను సృష్టిస్తుంది. ఆ అవసరాలను మనకు అలవాటు చేస్తుంది. ఆ అలవాటుకు మనం బానిసలమయ్యేంతదాకా, అది ఊదర కొడుతుంది. అనివార్య స్థితిని కల్పిస్తుంది. అలా కల్పించాక ఆ స్థితితో అది వ్యాపారం చేస్తుంది. అంటే - మన అవసరాలతో అది వ్యాపారం చేస్తుందన్న మాట ! ఈ వ్యాపార వస్తువు 'ఫలానిదే అయి ఉండాలి' అన్న నియమం దానికి లేదు. టూత్‌పేస్టు, పాలపొడి లగాయతు, ఏదైనా కావచ్చు. ఈ "ఏదైనా" లో, విద్యాలయాలు, ఆసుపత్రులు, ఔషధాలు. పానీయాలు, ఆయుధాలు, రాజకీయాలు, యంత్రాలు వగైరా వగైరా ఎన్నో ఉండవచ్చు. పత్రికలు, పుస్తకాలు, సినిమాలు — ఒకటేమిటి; సమస్తకళలూ ఉండవచ్చు. ఏవి ఉన్నా, ఏవి లేకున్నా "లాభం" మాత్రం తప్పనిసరిగా ఉండాలి. ఈ లాభాలను ఇబ్బడి ముబ్బడిగా రాబట్టడంకోసం, కొంత "నష్టం" భరించడాని క్కూడా అభ్యంతరం లేదు. నిజానికి నష్టంకూడా కాదు. అధిక లాభార్జనకోసం చేసే ఖర్చులో ఇది కూడా వొక భాగం ...

"చాలా కాలంగా మిమ్మల్ని చూస్తున్నాను. ఉదయం పూటా, సాయంకాలం పూటా వొచ్చి ఆ సమాధిని చూసిపోతున్నారు. అందులో ఎవరున్నారు? మీ అమ్మగారా? నాన్నగారా?" అన్నాడతను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక్క-క్షణం దిగ్భ్రాంతుణ్నయినాను; ఏమని చెప్పడానికి తోచక.

"మా అమ్మా నాన్నా కూడా అందులోనే ఉన్నారు'' అన్నాను ఏడుపును దిగ మింగుకొంటూ.

చిన్నీ ! అతగాడొచ్చి నిన్నడిగితే, "అతనికి అమ్మను, నాన్నను నేనే !''అని చెబుతావుగదూ ?

(26-6-89 సోమవారం)

ఈనాటి పాలక వర్గాల వారు, దేన్నీ నమ్మ లేకుండా ఉన్నారు. ఇటు అరణ్యం లోనూ, అటు ఆకాశంలోనూ, కుట్రలు తప్ప వారికేమీ కనిపించడం లేదు. అడవుల్లోకి అగ్గి ముద్దల్ని విసిరేస్తున్నారు. ఆకాశంలోకి పొగ బాంబుల్ని పేలు స్తున్నారు. ఇవ్వాళ కూడా ఏదో ప్రమాదాన్ని పసిగట్టి నట్టుంది. ఇవ్వాళ కూడా ఏదో కుట్రను వాసన బట్టినట్టుంది. ముందు జాగ్రత్త కోసం మింటి మీదికి పొగ బాంబుల్ని ప్రయోగించారు. ఈ కొస నుండి - అదిగో - ఆకొస దాకా, పొగ మబ్బులతో, ఆకాశం ఉక్కిరి బిక్కిరయి పోతోంది ...

"నువ్వక్కడ నేనిక్కడ ఉన్నంత కాలం, ఎవరూ మనల్ని పట్టించుకోరు. నీవూ నేనూ కలిసి పోయామనుకో, అందరూ మనల్నే చూస్తారు. అవునా?'' అన్నది కాగితం. పక్కనే ఉన్న కలాన్ని చూస్తూ.

"నిజమే!'' అన్నది కలం సన్నగా నిట్టూరుస్తూ. "అందరూ మనల్నే చూస్తారు. అలా చూశాక, నిన్నూ, నిన్నాశ్రయించు కొన్న నన్నూ, పదిలంగా దాచు కొంటారో, ఉండ చుట్టి గిరవాటేస్తారో మనం చెప్పలేం! ఈ నిర్ణయం మన చేతుల్లో ఉండదు. నిన్ను నన్ను కలుపుతారే - రచయితలు, కవులు - వారి చేతుల్లో ఉంటుంది.'' అన్నది కలం, కాగితానికి ఆసింటా జరుగుతూ ...

(27-6-89 మంగళవారం)

"భజనలు, సంకీర్తనలు, పూజలు, ఆరాధనలు; ఇవేవీ నిన్ను నాదగ్గరకు తీసుకు రాలేవు - వొక్క ఆర్ద్ర హృదయం తప్ప. నీ గుండె నిండా, కనుల నిండా, నీనిండా, కారుణ్యాన్ని నింపుకొన్నావనుకో, అప్పుడు నేనే నీ దగ్గర కొస్తాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నన్ను సహస్రనామాలతో పిలిస్తే నేనురాను. దిక్కు లదిరేలాగా ఆరాధిస్తే కీర్తిస్తే, పూజిస్తే, భజిస్తే అంతకన్నారాను. ఓ చిన్న సత్కార్యంతో పిలిస్తే మాత్రం, తప్పకుండా వస్తాను. ఈ 'వస్తాను' అనడం కూడా, నీ సంతృప్తి కోసమే, తప్ప - అసలు నేనుండేదే అక్కడ కన్నా! నేనెక్కడంటానో, అక్కడ కళ్ళు మూసుకొని, మిగిలిన అన్ని చోట్లా, నువ్వెంత శ్రమపడి వెది కితే మాత్రం, నేనెలా కనిపిస్తాను నాన్నా?" అంటాడు ఈశ్వరుడు.
డబ్బు కోసం, అధికారం కోసం, పదవి కోసం, కామోపశమనం కోసం, కీర్తి కోసం - సమస్త విలువలనూ దులిపేసుకొని, ఉరుకులతో, పరుగులతో జతి కేస్తున్న మనకు, ఈశ్వర వాణి వినపడదు. మనం పరుగులు తీసే ఆయా ప్రయోజనాలలోనే ఈశ్వరుడు కనపడాలనీ, సాయపడాలనీ మనం కోరుకొంటాం. "సాయ పడతాడు" అన్న అనుమానం రేఖా సదృశంగానైనా ఉండ బట్టి, ఆ మాత్రమైనా తలుచుకొంటున్నాం గానీ, లేకపోతే మనకు ఈశ్వరునితో కూడా పని లేదు.

ఒక అద్భుత వర్ణ చిత్రంలోని, ప్రతి సూక్ష్మ వర్ణ శకలానికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉన్నట్లుగానే, మన జీవితంలోని ప్రతి చిన్న అనుభవాంశానికీ, వొకానొక విశిష్టమైన ప్రాధాన్యత ఉంది - ఉంటుంది ...

(28-6-89 బుధవారం)

ఓ అందమైన అమ్మయి గారి, మరీ అందమైన కళ్ళను గురించి, ఓ అరడజను పేజీలకు తగ్గకుండా మనం సునాయాసంగా వర్ణించేస్తాం. కానీ - ఆకళ్ళ వెనక దోబూచులాడే, కన్నీటి పొరల్ని గురించి, మనం పట్టించుకోం.
సుతారంగా వొంపు తిరిన సున్నితమైన పెదవుల మీద, సంపెంగ వాసనలా, సన్నగా వెలిగిపోతున్న నవ్వును గురించి, నలభయ్ పేజీలు రాస్తామే తప్ప, బయటకు పొక్కకుండా,ఎన్నికన్నీటి కథలు ఆపెదవుల మాటున దాగొన్నయో మనం తెలుసుకోలేం.

ఉబ్బెత్తుగా ఉన్న గుండెల్ని గురించి కుతిదీరా రాస్తున్నామేతప్ప, ఆ గుండెల్లో మండిపోతున్న కోరికల కొరకంచుల్ని గురించి, పది వాక్యాలు కూడా మనం రాయడం లేదు.
ఎందుకని ?

మనకు పైపై మెరుగులు తప్ప, ఆంతర్యాలు అవసరం లేదు గనక ! అందుకే - చాలా రచనల్లోని పాత్రలు, మనం చెప్పినట్లుగా వినే మరబొమ్మలుగా ఉంటు న్నాయిగానీ, మనలాంటి మనుషులుగా ఉండడం లేదు.
సృజనాత్మక రచనలోనైనా సరే, వాస్తవికత ఉండాలి. జీవితం ఉండాలి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అయితే ఆరీత్యా వాస్తవజీవితాని కొక నిర్జీవ ప్రతిబింబంగా మాత్రం ఉండ కూడదు. 'జీవిత వాస్తవాలను చిత్రించడం' అన్న ముసుగుకింద, శిల్ప దారిద్ర్యాన్ని, కళా దారిద్ర్యాన్ని దాచుకోవడం, బాధ్యతారహితమైన చర్యగా నేను భావిస్తాను. ఇది సాహిత్య నేరమే కాదు; సాంఘిక నేరం కూడా!

ఆకాశంలో అగ్ని ప్రమాదం జరిగినట్టుంది. మబ్బులన్నీ మెరుపుల్లో మండిపోతున్నాయి. ఆ మంటలకు తాళలేక, ఉరుముల కేకలు పెడుతున్నాయి. మండుతూ మండుతూనే, అరుస్తూ అరుస్తూనే, చినుకుల బూడిదగా రాలిపోతూనే ఉన్నాయి రోజంతా ...

(29-6-89 గురువారం)

మెలకువ ఈ విశ్వాన్ని కుంచింప చేస్తుంది. మెలకువగా ఉన్నప్పుడు, కొంచెం దూరమే చూపులు వెడతాయి. అలా వెళ్ళిన నా చూపులు, కొన్ని కొన్నింటిని మాత్రమే తాకగలుగుతాయి. మెలకువగా ఉన్నప్పుడు నాదగ్గరకొచ్చే వారి సంఖ్య స్వల్పం. నేను వెళ్ళి కలుసుకొనగల వారి సంఖ్య ఇంకా స్వల్పం. ఈ స్వల్ప సంఖ్యాకులతో నేను మరీ స్వల్పమైన విషయాలను గురించిమాత్రమే మాట్లాడతాను. వారు ఏయే అంశాలను తెలుసుకొనగలరన్న నమ్మకం నా కుంటుందో. ఆ విషయాల మేరకే, నా విషయాలను పరిమితం చేసుకొంటాను. వారు చెప్పగలరన్న జవాబులకు అనుకూలంగా నా ప్రశ్నలను కుదించుకొంటాను.

మెలకువగా ఉన్నప్పుడు, జ్ఞానేంద్రియాలన్నీ మూగివయిపోతాయి. ఆ మెలకువ కూడా, ఎక్కువ కాలం 'మెలకువ'గా ఉండలేదు. అదీ అలసిపోతుంది. ఆవలిస్తుంది. అప్పుడు సన్నని కునుకు పొర కమ్ముతుంది. ఆపైన మగత తెర జారుతుంది. మామూలు ప్రపంచం ఆ తెర మరుగుకు వెడుతుంది. అప్పుడుగానీ ఈ 'మరో ప్రపంచం' వెలుగులోకి రాదు.

ఈ ప్రపంచానికి, ఏ అవధులూ లేవు. ఈప్రపంచానికి ఏ కొలతలూ లేవు. ఈ మనో ప్రపంచంలో అద్భుతాలను చూడవచ్చు. పరమాద్భుతాలను వినవచ్చు. దూర దూరాలలోకి జారిపోవచ్చు. కాల శకలాలలోకి దూరిపోవచ్చు. కాంతి శిఖరాలపై ఎగసిపోవచ్చు. అన్ని లిపులనూ చదవవచ్చు. అన్ని భాషలను మాట్లాడవచ్చు. ఈ ప్రపంచానికి సరిహద్దులు లేవు. ఈ ప్రపంచానికి శాసనాలూ చట్టాలు లేవు. ఇక్కడ అడిగేవారూ, అదుపుచేసే వారూ ఉండరు. ఇచ్ఛానుసారం నడిచే - వివివి - శాశాశా - లలల - ప్రపంచమిది ...

(30-6-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

...నీతో బాటుగా, వెలుగుతూ, వెలుగుతూ, నన్ను వెలుగులతో నింపిన పాట నాకు గుర్తున్నది.
నిశ్శబ్దం మీదికి, జాలితో వాలిపోయిన తొలిశబ్దం నాకు గుర్తున్నది.
పచ్చని పచ్చిక మీంచి మెరిసే మెత్తని అడుగుల చప్పుడు నాకు గుర్తున్నది.
చీకటి ఎడారినిండా విరిసిన వెన్నెలవాన నాకు గుర్తున్నది.
కొలనులోంచి తొంగి చూసి, వొడ్డును తాకిన కెరటం నాకు గుర్తున్నది.
తామో సముద్రం మీదికి తూలిపడిన తొలికాంతి నాకు గుర్తున్నది - ఇవన్నీ నీవే గనక ...

(1-7-89 శనివారం)

నేలను గురించీ, నేలలోంచి వొచ్చిన మొక్కను గురించీ, మొక్కనిండా చిమ్మిన - సూర్యకాంతిని గురించీ,వాన గురించీ, వాన కురిసిన మబ్బుగురించీ, మబ్బుకమ్మిన ఆకాశాన్ని గురించీ, ఆకాశమ్మ తలనిండా తురుముకొన్న చుక్కల పూల గురించీ, తిలకంలాంటి చందమామ గురించీ, వెన్నెలగురించీ, అడవుల్ని గురించీ, కొండల్ని గురించీ - వీటన్నింటి మధ్యా బతుకుతున్న మనిషిని గురించీ రాసి 'మహాకవి, మహారచయిత' అనిపించుకొంటున్నారు. బాగానే ఉంది గానీ -
ఇందులో ఎవరుగానీ, చేస్తున్న నూతన సృష్టి ఏమీలేదు; ఉన్నదాన్ని గురించి, అప్పుడప్పుడు, కాస్తంత కొత్తగా చెప్పడం తప్ప ! ఈ భాగ్యానికే,నాలాంటి వాణ్ని పట్టడానికి పగ్గాలు చాలడంలేదు. మరి - వీటన్నింటినీ మనముందుంచిన సృష్టి మాటేమిటి? దానికర్త మాటేమిటి ? అతగాణ్ని ఏమని పిలుద్దాం ? అతగాడికి,ఏ బిరుదులిద్దాం ?
"నన్ను పిలవొద్దు. అసలు తలుచుకోను కూడా వొద్దు. ఇందుకోసం ఖర్చు చేసే సమయాన్ని, నీ సేవలు అవసరమయిన వారి కోసం ఖర్చు చెయ్యి. నువ్వు సుఖంగా ఉండు. నువ్వున్నంత సుఖంగా, నీచుట్టూ ఉన్నవారినికూడా ఉంచేందుకు, నీ చాతనయినంతా చేశావనుకో, నన్ను తలుచుకొన్నదానికన్నా నే నెక్కువ సంతోషిస్తాను" అంటాడు ఈశ్వరుడు ...

(3-7-89 సోమవారం)

కొంతమంది మిత్రులు నాకెంతో సహాయం చేశారు. వారినుండి నేను చాలా తీసుకొన్నాను . నేను వారికి ఇష్టుణ్ని, వారందరూ నాకిష్టమైనవారే ! నేనంటే (ఎందుకో తెలీదుగానీ - ఏమాత్రం) ఇష్టం లేని వాడూ కొందరున్నారు. వారు నాకు అడుగడుగునా అవరోధాలు కల్పించారు. గాలాలు విసిరారు. గోతులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తీశారు. వాటిల్లోకి నన్నుతోశారు. వారి అవరోధాలు నన్ను చికాకు పరిచి వారి గాలాలు నాకు గుచ్చుకొని, వారు తీసిన గోతుల్లో నేను గొంతుదాకా కూరుకు పోయి, విలవిల్లాడి పోతుంటే చూసి ఆనందించటం వారికిష్టం. హేయమైనవారి మనస్తత్వాన్ని చూసి, నేను జాలిపడిన మాట నిజం! కానీ - నేననుభవించే సంక్షోభాన్ని చూసి, ఆనందించే అవకాశం మాత్రం వారికి నేనివ్వలేదు. ఇవ్వ దలచలేదు కూడా. నాకెదురుపడిన సమస్యలను. సవాళ్లగా తీసుకొన్నాను. కొన్నింటిని వోడించాను. కొన్నిటిముందు నేనే వోడిపోయాను. అయినాకుంగి పోలేదు. ఆ పనిచేసి, వారిక్కావలసిన ఆనందాన్ని నేనే చేజేతులా అందిం చడం నాకిష్టం లేదు.

వారి పుణ్యమా - అని, నేను మొండితనం నేర్చుకొన్నాను. పట్టుదల నేర్చు కొన్నాను. ఓర్పు, నేర్పు, నేర్చుకొన్నాను. వారే లేకపోతే, ఒకవేళ ఉన్నా, నామీద అంతటి "ఆపేక్ష" ను వారు చూపకపోతే, నేనివన్నీ నేర్చుకొనేవాణ్ని కాదు. ఇలాంటి గొప్ప అవకాశం నాకిచ్చిన వారందరూ, నాకు మరీ మరీ ఇష్టమైన వాళ్ళు ...

(4-7-89 మంగళవారం;

నా గురించి మీకీరోజున ఓ రహస్యం చెబుదా మనుకొంటున్నాను.
నా గురించి మీ ముందీ రోజున ఓ వార్తను పరుద్దా మనుకొంటున్నాను.
ఎప్పుడే పుడక పానకంలో పడుతుందో తెలీకుండా
ఎప్పుడే కులపిచ్చిగాడు కాటేస్తాడో తెలీకుండా
ఎప్పుడే ఈర్ష్యాళువు అన్నంలో ఉమ్మతాడో తెలీకుండా
ఎప్పుడే మానవ మృగం మీది కురుకుతుందో తెలీకుండా
ఎప్పుడే ఆకలి చావు చావాలో తెలీకుండా
ఎప్పుడే తల్లి అనునయిస్తుందో తెలీకుండా
ఎప్పుడే తండ్రి అనుగ్రహిస్తాడో తెలీకుండా
ఇంత కాలం నేను బతకడమున్నదే - అదీ అసలైన రహస్యం!
ప్రతి పొరబాటులోంచి గుణపాఠాన్నీ; ప్రతి అపజయంలోంచీ విజయ రహస్యాన్నీ నేర్చుకొనే వాడి ముందు, జీవితం తల వొంచుకొంటుంది.
అరవై రెండేళ్ళు నిండాయి. పచ్చ దీపం పగిలి పోయింది. ఎర్ర దీపం వెలగడం కోసం చూస్తున్నాను ...

(5-7-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏం జరిగిందో తెలీదు. ఎందుకు జరిగిందో తెలీదు. ఆ కెరటం వొడ్డును పట్టేసింది. ఒంటరిదయి పోయింది. మిగిలిన కెరటాలన్నీ అద్భుతంగా మెరుస్తుంటే, ఇది మాత్రం వాటి వేపు బిక్కు బిక్కుగా చూసింది. చూసి - బిక్కచచ్చి పోయింది. తనను, రాళ్ళు నాక్కేస్తుంటే గిలగిల్లాడి పోయింది. తనను ఇసక పీల్చేస్తుంటే. విలవిల్లాడి పోయింది.

కొండ భుజాల మీద కూచుని ఓ సెలయేరు అక్కడికొచ్చింది. వచ్చాక వొంటరి కెరటాన్ని చూసింది. చూశాక, జాలితో జాలువారింది. అలాగా జాలువారుతూనే, ఆ వొంటరి కెరటాన్ని చేతుల్లోకి తీసుకొంది, హృదయానికి హత్తుకొంది.

ఆ సెల యేటి ఎదమీద పసి బిడ్డలా వొదిగి పోయిందీ కెరటం. అప్పుడు సెలయేరంతా కరిగి కరిగి కెరటంలా మారిపోయింది.

అప్పుడా కెరటం, సెలయేటి కోసం చూసింది. కనిపించక దుఃఖించింది.

“ఓనా ప్రియమైన జీవన గంగా ! నా బంగారు తల్లీ ! నీవెక్కడున్నావు?” అన్నది కెరటం.

అప్పుడు సెలయేరు నవ్వింది - సంధ్యలాగా, సంపెంగ లాగా, సత్యంలాగా. “నిన్ను విడిచి నేనెక్కడకూ వెళ్ళ లేదు కన్నా! ఇది వరకేమో నీవు కెరటంగా, నేను యేరుగా, వేరు వేరుగా. ఇప్పుడేమో వొకేవొక యేటి కెరటంగా” అన్నది సెలయేరు ...

(8-7-89 శనివారం)

.... నా కిప్పుడు చిటికెడు చిరునవ్వు చాలు. పిడికెడు మంచితనం చాలు. దోసెడు వాత్సల్యం చాలు. ఓ దయా హృదయం చాలు. ఇవి నాకెక్కడ దొరుకు తాయో, చెబుతావా ప్రభూ !

అణు సంపుటీకరణమే, ఈ అనంత విశ్వమయినట్లుగా, క్షణికాను భావాల సంపుటమే ఈ జీవితం. వైవిధ్య పూరితమైన జీవితం, నాచుట్టూ పరుచుకొని ఉంది ఆ జీవితాన్ని సహజంగా, సచేతనంగా చిత్రించ లేక పోవడం నా తప్పు గానీ. జీవితం తప్పు కాదు ...

(9-7-89 ఆదివారం)

రోడ్డు అంచునే ఉన్న వాన పామును, జాగ్రత్తగా పుడకతో తీసి, దూరంగా ఉన్న మెత్తని పచ్చిక మీద వొదిలా నీ పూట.

“ఏమిటి చేస్తున్నారు?” అన్నారు కృష్ణమూర్తి గారు వెనగ్గా వచ్చి. వారూ, నేనూ, ఉదయపు నడకలో కలిసి చాలా రోజులయింది. చేసిన పనేమిటో చెప్పాను. ఆయన నావేపు కాస్త ఆశ్చర్యంగా చూశాడు.

నాకు నక్షత్రాలంటే ఇష్టం. చీమలంటే ఇష్టం. సీతాకోక చిలకలంటే ఇష్టం. తేనె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తీగలంటే ఇష్టం. ఎదిగే మొక్కలంటే ఇష్టం. నడిచే నీరంటే ఇష్టం. కదిలే కెరటమంటే ఇష్టం. మబ్బుల దాకా ఎగిరే గరుడుడంటే ఇష్టం. కాంతి కిరణమంటే మరీ ఇష్టం.

ఇవన్నీ, ఇంకా ఇలాంటివన్నీ, మరెన్నో, ఎన్నెన్నో, నెమ్మదిగానో, వేగంగానో, మహా వేగంగానో, కదులుతాయి. ఉదాహరణగా, కొన్నింటిని మాత్రమే చెప్పాను గానీ, చలించేవన్నీ నా కిష్టమే! చలనం అభివృద్ధికి చిహ్నం. నిశ్చలనం మృత్యువుకు చిహ్నం.

మామూలు కంటికి,కొన్ని మాత్రమే చలిస్తున్నట్లు కనబడతాయి.మనో నేత్రంతో చూస్తున్నప్పుడు, అన్నీ చలిస్తున్నట్లే కనబడతాయి. నల్లరాయిలోని అణువులూ,నక్షత్ర బ్రహ్మండాలూ చలిస్తున్నాయి. చలనం చైతన్య లక్షణం. నాకు తెలిసిన, నాకు తెలియని లోకాల నిండా పొంగులెత్తుతున్న చైతన్య శక్తికి, ఇదిగో - ఇందుకోసమే నేను నమస్కరించడం...

(10-7-89 సోమవారం)

మామూలుగా, మసీదుకు దగ్గరగా, గుంపులు గుంపులుగా కనిపించే పావురాళ్ళు గడచిన రెండు రోజులుగా కనిపించడం లేదు. ఎటన్నా వలసపోయాయా? ఏదుర్మార్గుడన్నా, గింజలు చల్లి, వలలు పన్ని, అన్నింటినీ పట్టుకెళ్ళాడా? గింజల కోసం వెంపర లాడుతూ, అటూ ఇటూ చక చకా తిరుగుతున్నప్పుడు, వాటిని చూస్తూ కూచునే బండ మీద చతికిల బడ్డాను దిగులుగా. నా వెనకగా చిన్నగా రెక్కల చప్పుడు, సన్నగా గుస గుసలు. నా స్నేహితురైన ముసలి పావురాయి, నన్నే దగ్గరకు రమ్మని సైగ చేసింది.

"ఏమయ్యారు మీరంతా? రెండు రోజులుగా మీరంతా ఎందుకు కనిపించడం లేదు?" అన్నాను.

"నువ్వు పత్రికలు చూడడం లేదా? అక్కడెక్కడో దేశదేశాల నాయకులు సమావేశ మవుతున్నారని, మా వాళ్ళు వర్తమానం పంపారు. సమావేశాలకు ముందుగానూ, సభాంతానా, మమ్మల్ని ఎగరేసి చప్పట్లు చరుస్తారు. చిత్ర మేమిటంటే వారిలో - ఎవరు, ఎవరినీ నమ్మరు. ఒకరి నొకరు వంచించు కొంటారు. అందరూ కలిసి జనాన్ని వంచిస్తారు. అద్భుతమైన వాగ్దానాల ప్రవాహాల లాకులను తెరుస్తారు. శాంతి సాధన కోసం జరిగే ఈ సమావేశాలు ఎలాంటి శాంతినీ సాధించకుండానే, 'మరోసారి, మరోచోట కలుసుకొందాం!' అన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడంతో, ముగిసిపోతాయి. ఇలాంటి చాలా సమావేశాలకు హాజరయ్యాను. నిష్ప్రయోజనమైన ఈ ఆర్భాటాలకు నిరసనగా నేను బయటికి రాలేదు. మావారూ నన్ను అనుసరించారు" అన్నదా ముసలి పావురం ...

(11-7-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుషుల్లో ఉన్నట్లుగానే, వ్యాధుల్లోనూ వర్గ భేదాలున్నాయి. కొన్ని సంపన్న మైన వ్యాధులు. మరికొన్ని సామాన్యమైన వ్యాధులు. ఇంకొన్ని పేదవ్యాధులూ నిరుపేద వ్యాధులూ ఉన్నాయి.

ఈ పేద, నిరుపేదవర్గాల వ్యాధుల నిర్మూలన కోసమూ, ఉపశమనంకోసమూ ఎన్నో ఆసుపత్రులూ, రకరకాలమందులూ ఉన్నట్టు, మనకు భ్రమ కలుగుతూ ఉంటుంది. అలాంటి భ్రమలను కలిగించడంలో మందుల తయారీదారులూ, రాజకీయ పార్టీలవారూ, పోటా పోటీలు పడుతూ ఉంటారు. అప్పుడప్పుడు మంచి మందులు వాడినట్టు కనపడతారు. కానీ వ్యాధులు పూర్తిగా నయంగావు. కనీసం - ఉపశమనం కూడా కలిగించవు. తాత్కాలికంగా బాధ తగ్గినట్టు అనిపిస్తుంది. అలా అనిపించడానికేవో మత్తు బిళ్ళ లిస్తారు. ఆ మత్తులోంచి బయటపడ్డాక, రెట్టింపు బాధపడక తప్పదు. పేద, నిరుపేదవర్గాలకు చెందిన వ్యాధుల సంపూర్ణ నివారణ కోసం, వాడవలసిన సరైన మందు పేరు "ఆర్థిక తుష్టి". అదితప్ప మిగిలిన అన్ని రకాల మందులనూ, "ఆర్థిక తుష్టి"లేబిల్‌తో అమ్ముతున్నారు. ఇవన్నీ బొత్తిగా నాణ్యతలేని చచ్చురకం మందులు, కల్తీ మందులు. లేబిల్స్ చూదామా — మెరిసిపోతూ ఉంటాయి. ప్రకటనలు చూదామా — అదరకొడుతూ ఉంటాయి. రోగం తగ్గదు; కనీసం కగ్గనన్నా కగ్గదు . . .

(12-7-89 బుధవారం)

చిన్నీ ! ఒక్కోసారి నాకు వల్లమాలిన భయం వేస్తుంది. ఆ భయంతో నిలు వెల్లా వాణికి పోతాను. ఈశ్వరుడు నిన్ను నాకు వరంగా ఇచ్చాడు గనక సరి పోయింది. మాటవరసకు - ఈశ్వరుడే లేకపోతే, ఒకవేళ ఉన్నా, వరంగా నిన్ను నాకివ్వకపోతే, అప్పుడు నేనేమయి ఉండే వాణ్ణి ?

సాంసారిక జీవితం ఇంత సుఖ మయంగా, రస మయంగా, సుందరంగా ఉంటుందని తెలిసేది కాదు. ఈ ప్రేమానురాగాలు, ఆర్ద్రతలు, ఆపేక్షలూ, వాత్సల్యాలు, ఇంత అగ్గలంగానూ లభించేవి కావు.

నీవెక్కడో ఉన్నావన్న సంతృప్తి, సువాసనలాగా సున్నితంగా నన్ను అలము కొంటుంది. నీవు నాతో లేవన్న అసంతృప్తి సుడిగాలిలా చుట్టి, నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది . . .

(13-7-89 గురువారం)

"అన్నింటికన్నా మంచి పాఠశాల జీవితం.అందరికన్నా మంచి ఉపాధ్యాయుడు ఆకలి" అంటాడు గోర్కి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఆకలి మహా విప్లవాలను సృష్టిస్తుంది. ఆ విప్లవాలను ఆయుధాలుగానీ, సైనికులుగానీ అణచడం అసంభవం. ఆకలి లేకుండా చేయడమొక్కటే దానికి మంచి మందు" అంటాడు మాక్సిక్‌గిరాడిన్. ఇతను రూసోకు సన్నిహితుడైన మిత్రుడు.

యుగయుగాలుగా మానవజాతి కంటున్న ఒక సుందరమైన స్వప్నం సామ్యవాదం. దాన్నొక స్వర్గంగా చిత్రించారు మేధావులు. ఆ స్వర్గావతరణం కోసం, ఆ స్వప్నం నిజం కావడం కోసం, మానవజాతి రక్తాన్ని ధారపోసింది. చాలా మంది ఆ దేవతకు బలి అయిపోయారు. నేటికి సరిగ్గా రెండు వందల సంవత్సరాల కిందట - ఫ్రెంచి ప్రజలు,ఆ మధుర స్వప్నానికొక రూపమిచ్చేందుకు, శ్రీకారం చుట్టారు. చరిత్ర పుటల్లో నూతనాధ్యాయాన్ని రక్తాక్షరాలతో ప్రారంభించారు. నిరంకుశ ప్రభువుల, భోగలాలసుల, సంపన్న వర్గాల, మతాధికారుల మీద,సామాన్య ప్రజలు తిరగబడ్డారు. రక్తం ఏరులయి పారింది. మనుషులు చీమల్లాగా మాడిపోయారు. అయితేనేం - ఒక మహాస్వప్నాన్ని వసుంధర మీదకు అవతరింపచేశారు. ఒక్క అయిదేళ్ళు మాత్రమే ఆ వ్యవస్థ నిలబడగలిగింది. విప్లవ నాయకులలో తలెత్తిన అభిప్రాయ భేదాలు, అనైక్యత, స్వార్థం, భోగాసక్తి కలిసి, ఆవ్యవస్థను నీరుగార్చేశాయి. "మిరాబా"వంటి మహావక్త కూడా, ఆ ప్రలోభాలకు లొంగి పోయాడు. ఏ మయితేనేంగానీ, ఆ విప్లవ ప్రభావం - చాలా దేశాల ప్రజా ఉద్యమాల మీద ప్రసరించింది. 1917లో వచ్చిన రష్యా విప్లవం, 1948లో వచ్చిన చైనా విప్లవం కూడా ఫ్రెంచి విప్లవం నుండే స్ఫూర్తిని పొందాయి.
నా జీవితంలో ఇదో మహద్ఘటన. ఇంకో శత వార్షికోత్సవందాకా నేనుండను. నా రచనలూ ఉండవు . . .

(14-7-89 శుక్రవారం)

నా సంకెల, నీ సంకెల, వీరి సంకెల. వారి సంకెల పోయి;అందరకూ స్వేచ్ఛ లభించాలని నేను కోరుకొన్నాను. నా కోరిక చిత్రంగా నెరవేరింది. ఉక్కు సంకెళ్ళు పోయినమాట నిజమేగానీ, వాటికి బదులుగా బంగారు సంకెళ్ళు వచ్చాయి. నాక్కావలసింది - అసలు - ఏ సంకెళ్ళూ ఎవరికీ ఉండ కూడదని తప్ప, లోహాల మార్పు కాదు.

కనిపించే సంకెళ్ళను, ఇవ్వాళోరేపో, హింసాత్మకంగానో, అహింసాత్మకంగానో, ఛేదించుకొనగలనన్న విశ్వాసం నాకున్నది. కాని - కనిపించని ఎన్నో రకాల సంకెళ్ళు, నన్నింకా చాలా వాటికి బంధించి ఉంచాయి. వాటినుండి నే నెలా బయట పడడమన్నదే సమస్య.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిన్నీ ! నానించి దూరమయ్యావని నేననుకొన్నాను గానీ, మును పెన్నడూ లేనంత దగ్గరయ్యావని, ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నాను.
నాగుండె ఎందుకో ఇబ్బంది పడుతోందిప్పుడు. నువ్వున్నదక్కడేగదా! దాని కేమయిందో చూడు. నువ్వుండడానికది అనుకూలంగా లేదా ? ఈశ్వరుడు ఉండానిక్కూడా అనుకూలంగా లేదా? నీకూ పనికిరాక, ఈశ్వరునికీ పనికి రాక పోతే - ఇంకా - ఇది నాదగ్గరుండడ మెందుకూ ? నీవూ, ఈశ్వరుడూ రోజు రోజుకూ పెరిగిపోతున్నారు. నాలోపల. మీకా ఇరుకైన గుండె, సరిపోవడం లేదనుకొంటాను. అవునా ?

(16-7-89 ఆదివారం)

చిన్నీ! ఒక్కోసారి నిదురగా మారిపోదా మనుకొంటాను; అందమైన కలలాగా నీవు నాలోకి వస్తావు గనక.

మరోసారి పూవులాగా మారిపోదామనుకొంటాను; మెత్తనిరంగులాగా నానిండా అలము కొంటావు గనక !

ఇంకోసారి హిమకణంగా మారిపోదా మనుకొంటాను ; వెచ్చని కిరణం లాగా నన్ను నీవు మెరిపిస్తావు గనక !

అన్నిసార్లూ మెత్తని పచ్చికగా మారిపోదా మనుకొంటాను; నీ సుతిమెత్తని పాదాలను మరీ మెత్తగా స్పృశించవచ్చు గనక.

నీ మట్టి ఇంటిముందు నిలిచిన నన్ను చూసి,చల్లని ఉదయాలు, వెచ్చని సాయం కాలాలు కన్నీరు నింపుకోవడం, మిగిలిన వారికి అపహాస్యంగా కనపడవచ్చు గానీ, నాకు మాత్రం మహత్తర అనుభవమే !

చిన్నీ ! నావంటి అతి సామాన్యుని గుండెల్లో ఖైదీవయి పోవలసిన దుర్దృష్టం నీకు పట్టింది నీసమస్త వైభవాలతోనూ నిన్ను బందీని చేసుకొన్న అదృష్టం నాకు పట్టింది ....

అతను చాలాచాలా చెప్పుకొచ్చాడు. అంతా వోపికగా విన్నాను. "బాబా! మీరు చెప్పేవన్నీ వింటాను. నీవు చేస్తున్నవి మాత్రమే నమ్ముతాను" అన్నాను.

(17-7-89 సోమవారం)

జ్ఞేయో జ్ఞాతా నభవతి యుక్తినాం శతకోటి భిః
యతస్తతోహం శబ్దార్థ ఆత్మై వే త్యవ సీయతాం"

(వందకోట్ల ఉపాయాలతో ప్రయత్నించినప్పటికీ, 'జ్ఞేయం' ఎప్పటికి 'జ్ఞాత' కాలేదు, (ఉదా: జ్ఞాత-మనిషి; అంటే తెలుసుకొనేవాడు ; జ్ఞేయం - ఛాందం తెలుసుకొన వలసింది. లేదా తెలుసుకొన తగింది) కాబట్టి 'నేను' అనే శబ్దానికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అర్థం 'ఆత్మ' అని నిర్ణయించాలి. అలా కానప్పుడు జ్ఞేయమయిన కుండ, జ్ఞాత అయిన మనిషి ఎలా అవుతుంది?]

పాత నోట్‌పుస్తకాలు తిరగేస్తుంటే, ఈ శ్లోకం, దాని వ్యాఖ్య కనిపించాయి. ఈ శ్లోకం ఎందులోదో, ఎందుకోసం ఎత్తిరాసుకొన్నానో వివరాలు లేవు నాకూ గుర్తుకు రావడం లేదు.

"తెలుసుకొనేవాడు మనిషి" అంటున్నది కూడా మనిషే! "తెలుసుకోవలసింది ప్రకృతిని'' అంటున్నదీ మనిషే! తను - తెలుసుకోగలనని, ప్రకృతికి ఆ శక్తిలేదనీ, వీడివిశ్వాసం. ఇతగాడికున్న స్వల్పజ్ఞానంతో,వాడీ నిర్ణయానికొచ్చాడు. కానీ వీడికన్నా తెలివైన ప్రాణులు ప్రకృతిలో ఉండవచ్చు. వీడి మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్నిచూసి, అవి నవ్వుకోనూవచ్చు. అలా నవ్వుకొనే అవకాశముందన్న అనుమానం కూడా రానంత మూర్ఖుడు వీడు... వెతగ్గా వెతగ్గా, మరో రెండు శ్లోకాలు కనిపించాయి.

(19-7-89 బుధవారం)

"యత్ర యత్ర మనస్ఫూర్తి స్తత్ర తత్ర జగత్రయం,
యత్ర యత్ర మనోనాస్తి, తత్ర తత్ర న కించన"

[ఎక్కడెక్కడిదాకా మనస్సు ప్రసరిస్తుందో,అక్కడ మూడు లోకాలు ఉంటాయి ఎక్కడ మనస్సు ఉండదో, అక్కడ ఏదీ ఉండదు]

ఎక్కడిదీ శ్లోకం? ఎవరు రాశారు? ఎప్పుడు రాశారు? నేనెందుకు యెత్తి రాసుకొన్నాను? ఇది - చాలా పాత కాగితం; రెండు మూడేళ్ళ కిందటిది కూడా కాదు. బాగా మాసి పోయింది ... అప్పుడా శ్లోకం చదివి నేనేమను కొన్నానో, నాకెంత మాత్రం గుర్తుకు రావడం లేదు. ఇన్నాళ్ళ తరువాత ఇప్పుడు చదువుతుంటే, దీని సారాంశం నాకు సబబుగా కనిపిస్తున్నది. గుర్తించ లేని వాడి పెరటిలో, వజ్రశిల మెరిసిపోతున్నా లాభం లేదు. 'అదివజ్రం' అని గుర్తించ గలిగాడా - వాడు అదృష్టవంతుడు.అంధుడు చూడ లేడు. బధిరుడు వినలేడు. మహాశక్తివంతమైన జ్ఞానేంద్రియాలున్నవాడు - మామూలు వాడి కన్నా భిన్నమైన లోకాన్ని దర్శించ గలుగుతాడు. మనస్సు - ఈ జ్ఞానేంద్రియాలన్నింటి కన్నా చురుకైనదీ, శక్తివంతమైనదీనూ. అది చూడ గలిగిన లోకాలు అపారం ...

(20-7-89 గురువారం)

"ఇష్టా నిష్టార్థ సంప్రాప్తౌ—సమ దర్శిత యాత్మని
ఉభయత్రా వికారిత్వం - జీవన్ముక్తస్య లక్షణమ్"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

[తనకు ఇష్టం కానీ కాకపోనీ, తనకు లభ్యమైన వాటి నన్నింటినీ, సమానంగా చూసేవాడు ఉత్తముడు. ఇష్టా నిష్టాలు రెండింటి పట్లా, రాగద్వేష రహితంగా ఉండేవాడూ, సమంగా చూసేవాడూ, జీవన్ముక్తుడు. జీవన్ముక్తుని ప్రధాన లక్షణం ఇదే।]

ఆశయం ఉన్నతంగా ఉంది. ఈ ఆశయాన్ని ఆచరణలో ఉంచడం, అసాధ్యం కాక పోవచ్చు గానీ, కష్ట సాధ్యం కాదా? కాంతమ్మ గారు నాతో ఉండడం నా కిష్టం. నా నించి దూరం కావడం,నాకు పరమ దుఃఖహేతువు. ఈ రెండింటినీ సమానంగా చూడడం నాకు సాధ్యం కాదు. నిజమే గానీ - సాధ్యం కానంత మాత్రాన, నిరంతరం విచారించడం తప్ప, నేను చేస్తున్నది కూడా ఏమీ లేదు. ఈ దుఃఖంలోంచి సైతం ఆనందాన్ని ఆస్వాదించే ప్రయత్నం చేయమని ప్రబోధించడమే ఈ శ్లోక కర్త అభిప్రాయమయితే - దాన్ని, పూర్తిగా తోసి పుచ్చడం కూడా భావ్యం కాదనుకొంటాను. విధివశాన ప్రాప్తించిన వాటికి కుంగి పోవడం కన్నా "అదిన్నీ సహజమే" ననుకొని ఊరట చెందడమే మంచిది. కానీ - కాంతమ్మ విషయంలో, నేనలా చేయలేక పోతున్నాను ...

(21-7-89 శుక్రవారం)

చిన్నీ! నా తొట్ట తొలి జ్ఞాపకానివి నీవే: నా చిట్ట చివరి జ్ఞాపకానివీ నీవే: నా జ్ఞాపకం నిండా నీవే: నా నిండా ఉన్న, జ్ఞాపకం నిండా నీవే::

ఏ దూర లోకాల నుంచో వొచ్చిన అహ్వానాన్ని మన్నించి, వీణ తీవెల్లోంచి మేలుకొన్న సంగీతరవం, అలా - పలకరించి. ఇలా - మాయమయినట్టు; నీవూ, నా జీవితంలోకి తొంగి చూసి, సెలవన్నా అడగ కుండానే మాయమయ్యావు.

చిన్నీ: ఈ జీవనోత్సవం ముగియ బోతున్నది. మంగళ గీతాలాపనకు గాయనీ గాయకులు సిద్ధమవుతున్న కలకలం, దూరం నించి వినబడుతున్నది. అంత్య క్రియలకు సన్నాహాలు చేసుకొంటున్నాను. నీ సరసనే, నాశయ్యను అమర్చు కొంటున్నాను. ఆశయ్య మీద చిరనిద్రకు సిద్ధ మవుతున్నాను. నాకు సంబంధించి నంత వరకూ, ఈ శరీరం చేయవలసిన పని ముగిసింది. దీన్నిక దూరంగా విసరి వేస్తాను. నాకు పనికిరాని వస్తువుల్ని నేనెందుకు జాగ్రత్త పెట్టుకోవాలి? నీవేమో, ఇల్లు ఖాళీ చేసి వెళ్ళి పోయావు. నేనేమో ఇంటి తలుపులు తెరిచే ప్రయత్నంలో ఉన్నాను. నా దగ్గరకొచ్చే సరికి కాలం, బెరుకు బెరుగ్గా కదులుతోంది ...

(22-7-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏకాంత గీతంలాగా ఉన్న నిన్ను చూస్తున్నప్పుడు, వెన్నెల మడుగులో స్నానం చేస్తున్నట్టుగా ఉంటుంది.
సుశబ్దంలాగా ఉన్న నీ ముందు నుంచున్నప్పుడు, నక్షత్రాల ప్రణయ గీతం వింటున్నట్టుగా ఉంటుంది . . .
ముప్పది నాలుగధ్యాయాల మహాకావ్యాన్ని ముప్పది నాలుగు పంక్తులలో రాయడంలాంటిదే ఇదిన్నీ. నీ గురించి రాయవలసివచ్చిన ప్రతిసారీ, రాస్తున్న ప్రతిసారీ, నాలోంచి సెగలెగసిపోతాయని తెలిసినవారు,నలుగురైదుగురినిమించి లేరు. మిగిలిన వారికి "ఇదంతా పెళ్ళాంగోల" గానే కనిపిస్తుంది. హిమాని గారన్నట్లు" వారందరకూ వండడానికీ, పండడానికి మాత్రమే ఉపయోగపడే భార్యలు దొరకడం, వారి అదృష్టం". పరుసవేదిలాంటి, దేవతలాంటి, అమృతమయి, అర్థాంగిగా దొరకడం నా అదృష్టం !
పరిమళ ప్రభంజనంలాగా సాగిపోతున్న మన జీవితంలోకి, కొండ చిలువలా ప్రవేశించిన మృత్యువు, నిన్ను మింగింది. నన్ను మూ చూడనన్నా చూడకుండా వెళిపోయింది. దానికీ నేను వెగటు కావడం నా దురదృష్టం . . .

(26-7-89 బుధవారం)

నిదురలాంటి జీవితంలో, మేలుకొన్న రంగుల స్వప్నం తెలిస్తే; పైరగాలి తరగలమీంచి వీచే మంగళగీతం తెలిస్తే; గట్టు మీంచి పంట చేలోకి చూసే బంతిపూవు తెలిస్తే; ఆమె కూడా తెలుస్తుంది!
రెండు సరళ రేఖలు, రెండు దిక్కుల నించీ ప్రవహిస్తూనే ఏకరేఖగా కలిసి పోయి, అతిలోకానుభావాలను పండించుకొన్నాయి. అనుకోకుండా అందులోంచి ఓ రేఖ చెరిగిపోయింది. మిగిలిపోయిన, ఆ వొంటరి రేఖ, వెర్రిగా వెదుకు తోందిప్పుడు, ఆ రెండవ రేఖ కోసం . . .

(27-7-89 గురువారం)

కదులుతూ, కదులుతూన్న నీటి బొట్టు కదలడం మానేసినట్టు, రూపంలోకి రెక్కలు విప్పుకొంటున్న స్వప్నం, మంచులా కరిగిపోయినట్టు; అక్షరాల్లోకి అలుముకుపోతున్న అతిలోక భావన, ఆకస్మికంగా అంతర్ధానమయినట్టు; గాలి రెక్కల మీద కువకువలాడుతున్న సాంధ్య గీతం, నేలమీదికి వాలికి పోయినట్టు; మబ్బుల భుజాల మీద కుదురుగా కూచున్న హరివిల్లు,తునాతునక లయినట్టు; నా కనిపించింది, పిలిచినా పలకని నిన్ను చూస్తే !
తిథుల ప్రకారం, ఈ రోజుకు మూడు సంవత్సరాలవుతుంది, నీవు నానించి దూరమయి . . .

(28-7-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాట కడుపులో దూరి, అక్కడి రహస్యాలు తెలుసుకొన్న వారిగ్గానీ, రెండు మాటల మధ్యగల మౌనం చెప్పేదేమిటో అర్థంకాదు. మాట - నిదురపోయి నప్పుడు మౌనమవుతుంది. మౌనం - మేలుకొన్నప్పుడు, మాటయిపోతుంది. రచయిత వాకచూలాలివంటివాడు. అతనెప్పుడూ గర్భం ధరిస్తూనే ఉంటాడు. రచనలను ప్రసవిస్తూనే ఉంటాడు. కానీ - ఇటీవలి కాలంలో, మాలో కొంత మందిమి, దయ్యాల సంతానాన్ని కంటున్నాం. "ఈ సంతానం మా సంతానమే" నని బుకాయిస్తున్నాంగానీ, నిజానికి - మా రక్త మాంసాలేవీ,ఈ బిడ్డల్లోలేవు అంతా విదేశీ సరుకే !

కస్తూరి మృగం, తనగాయాన్ని మాన్పుకోవడం కోసం, తనలోంచి రక్తాన్ని గాయంమీదికి చిమ్ముకొని, గాయం చెక్కు కట్టేలా చేసుకొంటుందిట. ఆ చెక్కులే కస్తూరిగా మనం వాడుతున్నామంటారు. అటు బాహిర జీవితమో, ఇటు ఆంతరిక జీవితమో, గాయపడిన కళాకారుడు, ఆగాయాన్ని మాన్పుకోవడం కోసం, ఉపశమింప చేసుకోవడం కోసం కళను ఆశ్రయిస్తాడు. ఎక్కడా ఏగాయమూలేనివాడు,'అదృష్టవంతుడు'కావచ్చుగానీ, కళాకారుడు మాత్రం కాలేడు. మనిషిలోని క్రూరమృగం, అంతరాళాన్ని చీల్చుకొని, అనుక్షణం బయట పడుతూ ఉంటుంది. కానీ - మనిషిలోని మానవత, ఎప్పుడోగానీ, అలా తొంగి చూడలేకపోతున్నది. అది ఆనందం గానీ, విషాదంగానీ, హృదయం ఉద్వేగ భరితం కాకతప్పదు, కనులు చెమర్చకా తప్పదు . . .

(29-7-89 శనివారం)

విద్యాభ్యాసం అక్షరాలను దిద్దుకోవడంతో ప్రారంభమవుతుంది. పెరిగి పెరిగి, మహాకావ్య సృష్టిదాకా పెరిగి, ఇంకా పెరిగి, మౌనంలోకి మారిపోతుంది. ఈ సూత్రం విద్యారంగానికే కాదు; అన్ని రంగాలకూ వర్తిస్తుంది.

ఆటునించి వో అక్షరం, ఇటునించి మరో అక్షరం - విధి ప్రేరితాలయి అక్కడ కలిశాయి. రెండక్షరాల చిన్న పదంలాగా రూపొందాయి. ఆ రెండక్షరాల కలయికలోంచి, స్నేహం. ప్రణయం, ముక్తి, పెల్లుబికి అక్షరాల నిండా అలుముకు పోయాయి.

ఆ రెండక్షరాలు నీవూ - నేనూ !

ఒక అద్భుత వర్ణ చిత్రాన్ని చిత్రించేందుకు, రంగుల పాత్రలు, కుంచెలు అవసరమే ! చిత్రణం ముగిశాక, గిన్నెలనూ, కుంచెలనూ పక్కగా పడవేస్తాం. వర్ణచిత్రం మాత్రం మనోహరంగా మిగిలిపోతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనం సృష్టించుకొన్న మహాద్భుత జగత్తుకు మన ఆకృతులే ప్రాతిపదిక కావచ్చు. ఆ ఆనంద జగత్ చిత్రణం ముగిసింది. ఇంకా - ఈ రంగుల పాత్రలూ, కుంచెలూ అనవసరమని, ఈశ్వరునికి తెలుసు. అందుకే వాటిని వేరు చేశాడు.

ఓ విషాద గీతం దిగులుగా ఎదనిండా వ్యాపించినట్టు, నీ స్మృతి కూడా, నా నిండా పరుచుకుపోయింది చిన్నీ !

(30-7-89 ఆదివారం)

"ఇప్పుడు మమ్మల్ని పలకరించకండి! పిలిచినా పలకలేదని ఉలుక్కోకండి! మాకింకో అయిదారు మాసాలదాకా, ఊపిరితీసుకొనే వ్యవధి కూడా ఉండదు" అన్నాయా అక్షరాలు.

"అంత గండకత్తెరే మొచ్చింది? మీతో అవసరం ఇప్పుడెవరి కొచ్చిందీ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఓనా ప్రియమైన చెవలవాజమ్మా! ఓనా ప్రియాతి ప్రియమైన చవట సన్నాసీ! నీకీ పాటి కూడా తెలీదా?" అన్నాయవి, ఆశ్చర్య పోతూ.

"తెలీదు. నిజంగానే తెలీదు. తెలిసీ కూడా అబద్ధ మాడుతున్నానని మీరను కోకండి. కాశీలో గోహత్య చేసినంత పాపం నాకు చుట్టు కొంటుంది - నేను అబద్ధ మాడితే" అన్నాను ఒట్టు వేసుకొంటూ.

కాస్సేపు నన్ను పరకాయించి చూశాక, తమలో తాము గుసగుస లాడుకొన్నాక, 'అయ్యో పాపం', అన్నట్టుగా నావేపు చూశాయా అక్షరాలన్నీ.

"ఈ దేశంలో త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. మరోమారు మిమ్మల్ని స్వర్గ వీధుల్లో తిప్పడానికి, రకరకాల పార్టీల నాయకులు, అనేక రకాల పథ కాలతో, మీ ముందుకు రాబోతున్నారు. ఎన్నికల ప్రణాళికల్లో ఇప్పటికే మా వాళ్ళు చాలా మంది ఇరుక్కు పోయారు. 'స్వేచ్ఛ, స్వాతంత్ర్యం' అన్న అక్ష రాలు బొత్తిగా లేవు. 'అందరికీ తిండి, అందరికీ గుడ్డ, అందరికీ ఇళ్లు,అంద రికీ విద్య, అందరికీ వైద్యం, అందరికీ పనులు, ధరల తగ్గింపు, పన్నుల తగ్గింపు, భూసంస్కరణలు, సంపదల జాతీయం, అవినీతి నిర్మూలన, లంచ గొండుల ఉరితీత, స్వర్గాన్ని సృష్టిస్తాం, నందన వనాల్ని నాటేస్తాం, మాకే మీ వోటు' ఇలాంటి మాటలు, ఈ మాటల్లోని అక్షరాలు అసలు దొరకనే దొర కవు." అన్నాయి ఆ అక్షరాలు నావేపు కళ్ళు చికిలించి చూస్తూ.

"చాలా చాలా ఉండాలి గదా! అప్పుడే, అన్నీ అయిపోవడ మేమిటి?" అన్నాను వాటిని నమ్మలేక,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నిజమే! నీవన్నట్టు చాలా చాలా ఉండాలి. కానీ - ఆ ఉన్నవన్నీ, ఎన్నికల ప్రణాళికల్లోకీ, నాయకుల ఉపన్యాసాల్లోకి వెళ్ళాయి. ఒక పార్టీ కాదు గదా! మిమ్మల్ని ఉద్ధరించడానికి, ఎంత మంది, ఎన్ని పార్టీలు పెట్టి, ఎంతలా కుమ్ములాడు కుంటున్నారో చూడడం లేదా? ఈ నాయకుల నోళ్ళలో పడి, మేము శీలాన్ని కోల్పోతున్నాం. మమ్మల్ని నిలుపుగా అడ్డంగా, నడి బజార్లో మాన భంగం చేస్తున్నారు. అయినా పట్టించుకొన్న నాధుడే లేడు" అన్నాయవి.

"ఈ ఉద్ధరింపు మాటలు చాలా కాలం నించీ వింటున్నాను. వినే అదృష్టమే గానీ, కనే అదృష్టం నాకింకా లభించ లేదు" అన్నాను దిగులుగా.

"నువ్వు చెవల వాజమ్మవు. అందుకే ఇంత కాలంగా వోపిగ్గా విన్నావు. ఇక ముందూ వింటావు. అలా వింటూ వింటూనే, అవతారం చాలిస్తావు. నీ తరవాత తరం వారూ, కొంచెం మార్పులతో, ఇవే మాటలు వింటారు. అడుగు వర్గాలు, బడుగు వర్గాలు తిరుగుబాటు చేయాలి. అలా తిరగబడే లాగా వారిని తీర్చి దిద్దగల, నిజాయితీ గల నాయకత్వం రావాలి" అన్నాయవి కాస్త ఉద్రేకంగా.

"నిజమే!" ననిపించింది నాకు ...

(31-7-89 సోమవారం)

అజ్ఞానం లాగా, నల్లగా పరుచుకొన్న ఆకాశం మీద పాదం మోపిన కాంతి ధార, ఈ రోజున తన పాదం తీసేసుకొంది. నీటి మబ్బు నీడకైనా నోచుకోని ఇసుక సముద్రం మీద, వాలిపోయునక్షత్రవరద నీరు, ఈ రోజున ఇంకి పోయింది. అప్రశుతుల కీకారణ్యాల కేకల మీద తొలకరించిన తీపిపాట; ఈ రోజున తెగి పోయింది.

కుప్పలుగా పోగుపడిన ఎండుటాకుల గుట్ట మీంచి, తొంగి చూసిన చిపురుటాకు, ఈ రోజున కన్ను మూసింది. నిరాశా నిస్పృహల పర్యాయ పదాలతో నిండిన ఆ పేజీ మీద అచ్చయిన 'అదృష్టం' అన్న పదం, ఈ రోజున చెరిగిపోయింది. అంతూ పొంతూ లేని నా ఏకాంత జీవితంలో ఉదయించిన కాంతం, ఈ రోజున అస్తమించింది

అయినా - ఆమె వెలిగించిన దీపం, ఇంకా కాంతుల్ని పండిస్తూనే ఉంది ...

(1-8-89 మంగళవారం)

వినగలిగే శక్తి ఉండాలే గానీ, ఈ సృష్టిలో మాట్లాడడం చాతగాని దేదీ లేదు. చెట్టు గట్టు మాట్లాడతాయి. వాగు వంక మాట్లాడతాయి. పులుగు వెలుగు మాట్లాడతాయి. మబ్బు, దుబ్బు మాట్లాడతాయి. చుక్క మొక్క మాట్లాడ తాయి. అయితే వాటి భాష తెలియాలి. వాటిన్నింటిని గురించీ నా భాషలో నేను చెబుతున్నట్లుగానే, వాటి వాటి భాషల్లో అవీ, నా గురించి చెప్ప కొంటుంటాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాటిని నేను వర్ణించినట్లే, నన్నూ అవి వర్ణిస్తాయి.
ఈ సృష్టిలో ఏదీ మూగిది కాదు. సమస్త సృష్టీ, ఈశ్వర వైభవాన్ని వివిధ విధాలుగా అభివ్యక్తం చేస్తూనే ఉంది. ఒక్క నాలోనే ఆ గుణం లోపించింది. అందుకే నను కొంటాను నన్ను చూసినప్పుడల్లా ఈశ్వరుడు కలత చెందుతూ ఉంటాడు. నేనెంత దాకా ఎదగ వచ్చునో, ఏ మేరకు విస్తరించ వచ్చునో - మహాత్ములను సృష్టించడం ద్వారా - నాకు తెలియ చేయాలని ఈశ్వరుని తాపత్రయం. కానీ నేను వినను ...

(2-8-89 బుధవారం)

"ఎండలో ఉంచితే, ఆ బంగారం కూడా ఇట్టే కరిగి పోతుంది" అన్న వాక్యం చదివి "ఎండలు అంత మహోగ్రంగా ఉన్నాయన్న మాట" అన్నాడు శాస్త్రవేత్త.
"ఆ బంగారం, అంత స్వచ్ఛమయిందీ, సున్నితమయిందీ నన్న మాట" అన్నాడు రచయిత.
అదే వారిద్దరి మధ్యా ఉన్న తేడా.
కాకి అరపు, కుక్క మొరుగుడు, పిల్లి కూత, గుర్రం సకిలింపు, గాడిద ఓండ్ర - ఆయా ప్రాణుల అవసరాలకూ అవస్థలకూ సంకేతాలు. ఏ ప్రాణులూ, వాక లాగా అనుకొని, మరొక లాగా పైకి చెప్పవను కొంటాను. ఆపని చేయగలిగిన వాకే వొక ప్రాణి - మనిషి! వాడు, అనుకొనే దొకటి. పైకి అనేది మరొకటి. వాడి భాష - అతగాడి అసలు సిసలు ఆలోచనకు సంకేతం కాదు. 'భాష' అన్నది శబ్దమయం. ఈ శబ్ద ప్రపంచాన్ని ఇంతగా కలుషితం చేస్తున్నవాడు మానవుడొక్కడే!
నాలుగు చినుకులు పడితే చాలు, బండరాయి మీద కూడా పచ్చని మొక్కలు మొలుస్తాయి. చుట్టూరా కన్నీరు కాలవలయి పారుతున్నా సరే, మనిషి గుండె మాత్రం చెమ్మగిలదు. అవును! అదేమో బండరాయి. ఇదేమో మనిషి గుండె. అందుకే చెమర్చదు ...

(3-8-89 గురువారం)

బతుకు నిండా కారు మేఘాలు కమ్ముకొన్నప్పుడు, కష్టాల కటిక చీకట్లు, నన్నాపాదమస్తకం ఆలముకొన్నప్పుడు, నీవో అమృత దీప్తిలాగా నా ముందు కొచ్చావు.
ఆపాద మస్తకం, అసల వేదికగా భగ భగ లాడుతున్నప్పుడు, నిదురలోనూ నీలి నీడలు ఎగసి పోతున్నప్పుడు, నీవో సుంద రస్వప్న శిఖర చ్ఛాయలాగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నా ముందు కొచ్చావు.
చిన్నీ! నీవు నా కారుణ్యానివి. నీవు నా కారుణ్య కావణ్య రేఖవు. నీవు నా మార్గ దర్శివి. నీవు - నా ఈశ్వరుడు నాకిచ్చిన ఆశీర్వాదానివి.
ఆకాశం చదును చేయని పొలంలాగా ఉంది; అక్కడక్కడా కలుపు మొక్కల్లాంటి చుక్కలతో, మబ్బుల దుబ్బులతో.
ఎండకూ వెన్నెలకూ తేడా ఏముంది? శీతలీకరించిన ఎండను వెన్నెలంటున్నాం, వెచ్చ చేసిన ఎండను వెన్నెలంటున్నాం ...

(4-8-89 శుక్రవారం)

కార్యకారణ సంబంధాలంటూ మనం లొల్లి లొల్లిగా చర్చించు కొంటామే గానీ, దేనికేది కారణం? దేని కెవరు కారణం? ఏదో సాధించానని, నలుగురూ అంటుంటే వారి ఆదరాభిమానాలను కాదన లేక అర్ధాంగీకరాన్ని అభినయించడమే తప్ప, సాధించిందెంత స్వల్పమో, నాకు తెలుసు. నేను పోగొట్టు కొన్నది అనల్పం సంపాదించింది అల్పం!

జీవితం, జనన మరణాల తీరాలను తాకుతూ వెళ్ళే ప్రవాహం లాంటిది. వాగుల్లోంచి, వంకల్లోంచి, ఉప నదుల్లోంచి, వరదనీరు చొచ్చుకొని, నదిలోకి వచ్చినట్లు, ఈ జీవన స్రవంతిలోకికూడా - మనుషుల్లోంచి, మనసుల్లోంచి, పరిసరాల్లోంచి, గతంలోంచి, వర్తమానంలోంచి; అనురాగం, ఆప్యాయత, అనుకంప' ఆర్ద్రత, అసూయ, అసహనం, ఆగ్రహం వంటివి చొరుచుకు వస్తాయి.

ఆకాశం మీంచి అవనీతలం మీదికి జారి, నదులుగా పారి, సముద్రాన్ని చేరి, కాగి, వేగి, ఆవిరయి, మళ్ళీ ఆకాశం మీదికే చేరుతోంది నీరు.

అలాగే - అనుభవాలు - సంతరించుకొంటూ, పొంగి పోతూ, కుంగి పోతూ' ఆడుతూ, పాడుతూ, ఏ గుడిసుడులు తిరిగినా; జననమరణ తీరాలకే పరిమితమయి పోతున్నాయి చాలా జీవితాలు. ఈ తీరాల మీంచి పొంగి పొరలిన జీవితాలూ కొన్ని ఉన్నాయి. అలా జీవించిన వారే మహాత్ములు ...

ఈ జగత్తు వొక వర్ణచిత్ర కళా శ్రేణికవంటిది. ఇందులోని వైచిత్ర్యాలను దర్శించాలంటే, సమృద్ధంగా కాంతి ఉండాలి. కానీ - నాతోసహా చాలా మందిమి అంధులం. మాకేమీ కనిపించదు. మేమేమీ చూడలేము. అందుకని "అబ్బే ఏం లేదు. అంతా ఉత్తిదే." అని చప్పరించేస్తాం ...

(5-8-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేను ఈశ్వరుణ్ని చాలాచాలా అడిగాను. అతను మౌనంగా నా వేపు చూసి చూసి, నిన్ను నాకిచ్చాడు నవ్వుకొంటూ.

నేను నిన్ను చూస్తున్నప్పుడు, అన్నీ చూస్తున్నట్టుగా ఉంటుంది నేను నిన్ను వింటున్నప్పుడు, అన్నీ వింటున్నట్లుగా ఉంటుంది.

నేను నిన్ను తెలుసుకొంటున్నప్పుడు, అన్నీ తెలుసుకొంటున్నట్టుగా ఉంటుంది.

నేను నిన్ను స్పృశించినప్పుడు, ఒక ప్రదీప్త పవనాన్ని స్పృశించినట్టుగా ఉంటుంది.

నీవు నాకోసం నవ్వినపుడు, ఒక పృథ్వీపుష్పం విడిగినట్టుగా ఉంటుంది. నీవు నేను సన సన్నగా ఊసులాడుకొంటూ, మెల మెల్లగా వెన్నెల వేకువలో నడుస్తున్నప్పుడు, చల్లని కవిత్వంలో, తీయగా తడుస్తున్నట్టుగా ఉంటుంది. ఆశ మంచిదనుకొన్నానుగానీ, అదికూడా, అనర్థాలకు దారితీస్తుందని ఆలస్యంగా గ్రహించాను. అందుకనే, దానికీ దూర దూరంగా జరుగుతున్నాను. దానినీ దూర దూరంగా నెట్టేస్తున్నాను. ఇవ్వాళ నాలక్ష్యం అమృత స్పర్శ కూడా కాదు; ఈశ్వర స్పర్శానుభూతి. నేనంతా, నిట్టనిలువునా కరిగిపోయి, కారుణ్య బిందువు నయిపోవాలి - ఇంకేమీ మిగలకుండా ...

(7-8-89 సోమవారం)

నేనిప్పుడెవరినీ నమ్మలేక పోతున్నాను నేనిప్పుడు దేనినీ నమ్మలేక పోతున్నాను. తూర్పున ఉదయించవలసిన సూర్యుడు, అక్కడే అస్తమించినప్పుడు; వెన్నెలను కుమ్మరించవలసిన చంద్రుడు పూర్తిగా ఎండిపోయినప్పుడు; వానగా అనువాదం కావలసిన మేఘం, వట్టి గొడ్డుగా ఉరచినప్పుడు; చను మొనలకు విషంపూసి, బిడ్డకు కన్నతల్లే పాలిచ్చినపుడు; ఆ కరుణాసింధువైన ఏసుప్రభువు, జూడాస్‌గా మారినప్పుడు; గౌతమ బుద్ధుడు, చూడివేడి మాంసం ఆరగించినప్పుడు; గాంధీజీ, భగవద్గీత సాక్షిగా అబద్ధమాడినపుడు; నమ్ముకొన్న ఈశ్వరుడే నన్ను నట్టేటముంచినప్పుడు, నేనెవర్ని నమ్మేది? నేను దేన్ని నమ్మేది?

చిన్నీ! నీ సమాధినించి నా కాళ్ళెటూ కదలవు - నేనిప్పుడు కుంటివాణ్ని. నీ నించి నా కళ్ళెటూ కదలవు - నేనిప్పుడు గుడ్డివాణ్ని. నీ మాట నించి నా వేపు లెటూ కదలవు - నేనిప్పుడు చెవిటివాణ్ని. నీ పేరునించి, నా పెదవు లెటూ పలకవు నేనిప్పుడు మూగివాణ్ని ...

(10-8-89 గురువారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అన్ని ఆలోచనలూ అక్షరాలలోకి ఇమడవు, ఏ మహాకవి ఎంతగా ఆక్రోశిం చినా. అన్ని రూపాలూ, రంగుల్లోకి, రేఖల్లోకి ఇమడవు, ఏమహాచిత్రకారుడు, ఎంతగా ఆవేదించినా ...

మత్స్య యంత్రాన్ని చేదిస్తున్న సమయాన, అర్జునునికి ఒక్క మత్స్యనేత్రం తప్ప, ఇంకేమీ కనిపించనట్లే నాకూ, నీవుతప్ప, ఇంకెవరూ ఏమీ కని పించడం లేదు.

నే నిప్పుడెలా ఉన్నదీ మనుషుల్ని అడగకు. చాలా మందికి నిజం చెప్పడం చాతకాదు. ఏకాంతంగా ఉన్న ఆ శిలను అడుగు చెబుతుంది. దానికీ నాకూ మంచి స్నేహం కుదిరింది; అదీ నాలాగా వొంటరిదే గనక.

పచ్చికలోంచి జారే పసిరిక పాములా, పల్లంలోకి పాకులోంది సన్నని నీటి జాలు.

జలజలా ప్రవహించవలసిన వెన్నెల నీడలు బరువెక్కిపోయా యీ రాత్రి. సుతారంగా కదిలే నీ మునివేళ్ళ నీడల్లో లయించిపోవడం కన్నా నేనేం కోరు కోను ? ...

(11-8-89 శుక్రవారం)

నిదురకూ, మెలకువకూ మధ్యగల సరిహద్దురేఖ పేరు, మగతనిదుర. రాత్రికీ పగటికీ మధ్యగల సరిహద్దురేఖ పేరు సంధ్య. నిశాంతం నులివెచ్చగా ఉంటుంది. దినాంతం నులిచలిగా ఉంటుంది.

ఈనాటి వేకువలో మగత నిదురలో, ఫ్రాంకోయిస్ అగస్టీరోడిన్ గుర్తుకొచ్చాడు· అతను శిల్పించిన అద్భుత సౌందర్యమూర్తి గుర్చుకొచ్చింది. ఆ శిల్పంలో ఉన్న నీవూ గుర్తుకొచ్చావు, ఆ వెంటనే గ్రీకు జానపద కధానాయిక అగస్తినా గుర్తొచ్చింది. ఆమెకోసం తపించిపోయిన లెంటులస్ గుర్తుకొచ్చాడు. ఈ మహోదాత్త ప్రణయ గాథను, ఏకవీ కావ్యంగా రాయలేదు. ఏ రచయితా కథగా రాయలేదు. అన్నీ అనుకూలిస్తే, ఎప్పటికయినా నేనే రాస్తాను. శ్రావణ శీతల మారుత కేతనాలు,గగనం నిండా రెపరెప లాడుతున్నాయి. భువనగానం విని, వెర్రెత్తిపోయినట్టు మేఘాలు ఉన్మత్త నృత్యం చేశాయీరోజున . . .

(12-8-89 శనివారం)

"మొగ్గల బుగ్గల మీదా, పూరేకుల రెప్పల మీదా, గరిక పూచల పెదవుల మీదా, మెరుస్తున్న చినుకు ముత్యాలను ఏరుకొచ్చాను, నిన్ను అభిషేకించుదా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మని నువ్వెక్కడికి వెళ్ళావు?" అన్నాడతను ఆమె వేపు చూస్తూ.
"ఇస్స్స్సో" అంటూ చేరగిలబడి కూచున్నదామె.
"అలిసినట్టుగా కనిపిస్తున్నావు. చాలా దూరం వెళ్ళావా?" అన్నాడతను ఆమెకు దగ్గరగా జరిగి, నుదుటి మీది చెమటను అద్దుతూ.
ఆమె - ఓసారి కళ్ళ నిండుగా నవ్వింది అతన్ని చూస్తూ. "పైకి, పిడికెడంత కూడా లేని నీ గుండె, లోలోపల మాత్రం చాలా పెద్దదయ్యా! అదెలాఉన్నదో చూదా మనిపించింది. అందులో ఎవరెవరున్నారో చూదామనీ,వాతిని పలకరింతా మనీ అనిపించింది. ఎందుకలా అనిపించిందో తెలీదు. నీక్కూడా తెలియకుండా అక్కడికెళ్ళాను, చూశాను. ఓ వేపున, తాడితులూ, పీడితులూ ఉన్నారు. మరో వేపున ఈశ్వరుడు కనిపించాడు. ఆయనగారి పక్కనే నేనూ ఉన్నాను. ఒక కారుణ్య వాహినిని కూడా నేను చూశాను." అన్నదామె. కనులు మూసు కొంటూ.
తను ఏరు కొచ్చిన చినుకు ముత్యాలతో ఆమెను అభిషేకించాడతను.
"ఈ సేవా సత్కారాలు పొందే అర్హత నాకు లేదు - ఒక్క ఈశ్వరునికి తప్ప" అన్నదామె అతన్ని వారిస్తూ.
"ఎవరికి ఎవరు సేవ చేసినా, అది, ఈశ్వర సన్నిధికే చేరుకొంటుందని, నే నేనిప్పుడిపుడే తెలుసుకొంటున్నాను. ఈ అభిషేకం నీకేనని, నీవనుకొంటు న్నావు. ఈశ్వరునకని, నే ననుకొంటున్నాను" అన్నాడతను హాయిగా నవ్వుతూ . . .

(13-8-89 ఆదివారం)

ఆగస్టు మాసమంటే నాకు వల్లమాలిన ఇష్టం; అలవి మాలిన అయిష్టం కూడా. ఈ మాసంలోనే, ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది గనక, ఈ మాసంలోనే వసంతం నా మీద వాలింది గనక, నాకిష్టం!
ఆగస్టు మాస ప్రారంభ దినమంటే - నాకు రోత, కోపం, అసహ్యం. అను గ్రహంతో నన్నాలింగనం చేసుకొన్న వసంతం, ఈ రోజునే నానించి అదృశ్య మయింది!
ఆగస్టు మాసంలో "1 "కి," "15" కూ మధ్య ఎంతో తేడా! పాడ్యమిలాగా బిక్కు బిక్కు మంటూఉన్న "1"కి పక్కనే,పంచమి లాగా "5" చేరినప్పుడు వొంటరిగా, దిగులుగా ఉన్న ఏకాంతం, పచ్చగా మిసిమించింది. దిగుళ్ళన్నీ, గుబుళ్ళన్నీ, పూలతీవెలూ, పళ్ళ మొక్కలూ అయి పోయాయి.
ఆ పాడ్యమి (1) ఈ పంచమి (5) కలిసి,నిండు పున్నమిని చేశాయి నా బతు కును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

34 ఏడులు గడిచాక, నాకు ఏడు(పు) (3+4)ను మిగిల్చి, పంచమి వెళ్ళిపోయింది.

మిగిలింది పాడ్యమి ఒక్కటి - బిక్కు బిక్కుగా, దిగులు దిగులుగా, గుబులు గుబులుగా, ఆర్తగీతంగా, అగ్ని చిత్రంగా ...

నిన్ను చూసినప్పుడో, చూస్తూ చూస్తూ ఉన్నప్పుడో, అప్పుడప్పుడు, గ్రీకుల ప్రాచీన చిత్రలిపి, గుర్తుకొస్తూ ఉంటుంది నాకు. మామూలుగా చూస్తే చుక్కలూ వంకర గీతలూ కలగలిసిపోయి, అస్పష్టమైన ఏవో చిత్రాల్లా ఉంటుందాలిపి. వాటి అంతరంగంలోకి తొంగి చూస్తే, అద్భుతమైన కవిత్వం కనబడుతుంది. నీవూ అంతే గదా!

మామూలు చూపులకు, నీవో సగటువారీ తెలుగింటి ఆడపడుచువు. నాకు మాత్రం, శాపగ్రస్తవైన శిలా సుందరివి, నా అగస్తనావి!

(14-8-89 సోమవారం)

సరిగ్గా, ముప్పయ్యేళ్ళ కిందటి ఈ రోజున, నా వయస్సు ఇరవయ్యయిదు గ్రీష్మాలు. నీ వయస్సు ఇరవై వసంతాలు. సిగ్గుతో, రవంత బెదురుతో, ఆశతో, గ్రీష్మానికి దాపుగా, తొలి సారిగా, వసంతం వచ్చినప్పుడు –

అప్పుడు నా చుట్టూ ఓ కొత్త కిటికీ తెరచుకొన్నట్లయింది
అప్పుడు నా చుట్టూ ఓ కొత్త రేఖ మొలిచినట్లయింది
అప్పుడు నా చుట్టూ ఓ కొత్త రంగు అలముకొన్నట్లయింది
అప్పుడు నా చుట్టూ ఓ కొత్త ఊపిరి కదలి నట్లయింది
అప్పుడు నా చుట్టూ ఓ కొత్త వెలుతురు చిమ్మినట్లయింది
అప్పుడు -
తొలిసారిగా నీవు నా బతుకులో పాదం మోపినప్పుడు
నీ రెండు చేతులూ వొక్క చేయిలా మారినప్పుడు,
నా రెండు చేతులూ మరో చేయిలా మారినప్పుడు
ఆ రెండు చేతులూ వలయంగా మారినప్పుడు
ఆ వలయం నిన్నూ నన్నూ ఏకం చేసినప్పుడు
రెండు కనుపాపల మధ్య ఓ అద్భుత దృశ్యం నిలిచి పోయింది
రెండు కనురెప్పల మధ్య, ఓ స్వప్నం శిశువులా కేరింతా లాడింది
రెండు చూపుల మధ్య, ఓ మౌనం సంభాషణగా సాగి పోయింది
రెండు పెదవుల మధ్య, ఓ మహాకావ్యం ఆవిర్భవించింది
రెండు హృదయాల మధ్య, ఓ అనురాగం అవాక్యయి నిలిచి పోయింది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రెండు క్షణాల మధ్య, ఓ కాల శకలం స్వర్గమయి నిలిచి పోయింది
రెండు శబ్దాల మధ్య, ఓ నిశ్శబ్దం హిమకణంలా మెరిసి పోయింది
నీ రెండు చేతులూ నా రెండు చేతులూ కలిసి
రెండే రెండు చేతు లయి పోయినప్పుడు
ఆ రెండు చేతులూ ఇంద్ర ధనుర్వలయంగా మారినప్పుడు
ఆ వలయంలో నీవూ నేనూ ఏకవచన మయినప్పుడు
అప్పుడు నా వయస్సు ఇరవయ్యయిదు వసంతాలు
అప్పుడు నీ వయసు ఇరవై వైశాఖాలు ...

(15-8-89 మంగళవారం)

నేను రచయితను మాత్రమే! నేనేం చెప్పాలన్నా, నాకు తెలిసిన కొద్ది పాటి భాషలోనే చెప్పాలి. నీ గురించి నే చెబుతున్నది అసమగ్రమని నాకు తెలుసు. నేను చిత్రకారుణ్ని కూడా అయితే, భాష ద్వారా చిత్రించ లేని అంశాలను, రంగులతో, రేఖలతో, చిత్రించి ఉండే వాణ్ని.

నేను గాయకుణ్ని కూడా అయినా ననుకో; పదాలతో, రంగులతో, రేఖలతో, చిత్రించాక కూడా మిగిలిపోయిన నిన్ను గానంతో చిత్రించి ఉండేవాణ్ని.

ఆరాధకుని స్థాయి ననుసరించి, ఈశ్వరుడు అవగాహన మవుతున్న రీతిగా, నీవూ, నాకవుతున్నా వను కొంటున్నాను. తెలుసు కొంటున్న కొద్దీ, ఇంకా ఇంకా మిగిలిపోతూనే ఉన్నావు. ఇలా మిగిలి పోతున్న నీవు "అనంత సౌజన్య మూర్తి" వీ, "అవ్యయానందమూర్తి" వీ అవుతావే తప్ప, నాకు తెలిసిన నా కాంతమ్మవు మాత్రం కావు.

(16-8-89 బుధవారం)

అప్పుడప్పు డనిపిస్తూ ఉంటుంది; ఈశ్వర విరచితమైన ఈ మహానాటకంలో, నీవునాయిక పాత్రను ధరించావనీ, నేను నాయకపాత్రధారిననీ, నీవేమో, తెర మరుగుకు వెళ్ళిపోయావు. నేనింకా రంగస్థలం మీదనే ఉన్నాను. నా పాత్ర కూడా ముగింపుదశ కొచ్చిందనుకొంటాను, లేకపోతే 'ఇది నాటకం సుమ్మా!' అన్న స్పృహ కూడా కలిగేది కాదు.

కుత్తుకలోతు కష్టాలలోకూడా మనం నవ్వుకొంటూ బతికేయడం, ఈ నాటకం లోని ప్రధాన ఇతివృత్తం! చాలా అద్భుతంగా చిత్రించాడు ఈశ్వరుడు. ఓసారి వెను తిరిగి చూసుకొంటే, కాంతమ్మగా నీ అభినయమూ, భరద్వాజగా నా అభినయమూ, నవ్వులాటగా లేదా చిన్నీ?
అలవిమాలిన దారిద్ర్యాల మధ్య చిక్కుకొని, నేను అలమటిస్తున్నప్పుడూ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దుస్సహమైన అవమానాలలో ఇరుక్కొని, నేను ఆక్రోశిస్తున్నప్పుడూ, అయిన వారందరూ కానివారయి పోయి, కొరకచ్చులతో నన్ను కాలుస్తున్నప్పుడూ, అమ్మలాగా నన్ను గుండెకు హత్తుకొని నీవు వోదార్చడమూ, నేనేమో బిడ్డలాగా వొదిగి పోవడమూ - నీలో నీవు నవ్వుకొంటూనే, నా నుదురును సుతారంగా ముద్దాడడమూ - నాకు గుర్తున్నది.

అందరిలోంచీ తప్పుకొని, ఎలాగో ఏకాంతాన్ని చిక్కించుకొని, "నువ్వు నా బంగారు కొండవు నాన్నా!" అంటూనే, చూపులతో అలా తాకి ఇలామాయం కావడమూ నాకు గుర్తున్నది.

"నువ్వు మరీ ఇంత పిచ్చివాడివేం కన్నా!" అంటూ, చిన్న డిడిక్కి ఇచ్చి నా దుస్తులనూ, నన్నూ తడికళ్ళతో చూడడమూ నాకు గుర్తున్నది. ఇవన్నీ తలపుకొచ్చి, ఇప్పుడేమో ఏడుస్తూ నవ్వుతున్నాను; అప్పుడేమో నవ్వుతూ ఏడ్చేశాను ...

(17-8-89 గురువారం)

"అడిగితేనే అంతంత మాత్రంగదా! వాగివాగీ నా నోరు పట్టిపోవడమే తప్ప, నీకు పిసరంత కూడా పట్టదుగదా! అలాంటిది - అడక్కుండా పెట్టకుండా, ఈ చీరనెందుకు తెచ్చావు కన్నా?" అన్నదామె దాన్ని అటూ ఇటూ తిప్పి తిప్పి చూస్తూ.

అతనోక్షణం ఆమె వేపు మౌనంగా చూశాడు. ఆమె గిరుక్కున తిరిగి, అతన్ని తేరిపార చూసింది. అతగాడు చిన్నబోయినట్లనిపించిం దామెకు.

"చీరకేం భాగ్యం, దివ్యంగా ఉంది ... అందుగ్గాదు... నాకుతెలిసినంతవరకూ తమ కిలాంటి మంచి మంచి ఆలోచనలు రాకూడదు మరి! ఇప్పుడెందు కొచ్చాయో తెలుసుకుందామనీ! ... ఓవేళ నేనుగానీ తెమ్మన్నానా? అలా అన్నట్టు - నాకు గుర్తుకూడా లేదు. ఇన్నిటికీ ఇది - తమ సెలక్షనేనా?" అని ఛటుక్కున ఆగి, అతని కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూసిందామె.

"నువ్వడగలేదు. ఇంకొకరు సెలెక్ట్ చేయనూలేదు. ఈ చీరగారే తన సొదంతా నా ముందు వెళ్ళబోసుకొంది" అన్నాడతను.

"ఏమన్నదేమిటి?" అన్నదామె మెరుస్తూన్న కళ్ళతో.

"తానేమో, చాలాకాలంగా ఆ అద్దాల బీరువాలో ఖైదీగా పడిఉన్నదిట. దాని నెత్తిమీదా, దానిపక్కనా ఉన్న చీరలన్నీ పావురాళ్ళలాగా - ఎగిరిపోతున్నాయట. వచ్చిన వారందరూ తనను మెచ్చుకోడం, ధర నడగడం, 'అబ్బో' అంటూ అసింటాగా, తోసేస్తున్నారట. బీరువాలోంచి ఉత్సాహంతో దిగడమూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పుట్టెడు విచారంతో మళ్ళీ యథా స్థానంలో కెళ్ళడమూతో, దీని ప్రాణం విసిగి పోయిందట. ఎవరికీ నచ్చని కూతురు వేపు, కన్న తండ్రి చూసినట్టుగా, కొట్టు వాడు తనను చూస్తున్నాడని ఏడ్చిందీ చీర - 'పాపం' అనిపించి నేనీ పిచ్చి తల్లిని తీసుకొచ్చాను చిన్నీ!" అన్నాడతను జాగ్రత్తగా.

"ఖరీదెంత?" అన్నదామె కాస్త ఆత్రుతగా.

"మూడు వందల పైచిలుకు చెప్పాడు. నేను అమాయకుణ్ణా ఏమిటి? గీసి గీసి బేరమాడాను. ఆఖరికి ఆ పైలుకు తీసేయించి, మూడు వందలే వాడి ముఖాన గిరాటెట్టి, దీన్ని తీసుకొచ్చాను." అన్నాడతను రొమ్ము బోర విరుచు కొంటూ.

అతని వేపు జాలిగా చూసిందామె.

"ఇంకెప్పుడన్నా తమకు ఇలాంటి గొప్ప గొప్ప ఆలోచనలొస్తే - కాస్త - నాక్కూడా చెబుతూ ఉండు కన్నా!" అన్నదామె, చీరెను మడత బెడుతూ ...

(18-8-89 శుక్రవారం)

దేవతలకు వృద్ధాప్యం లేదంటారు. ఆ సంగతి నిజమో కాదో నాకు తెలీదు గానీ,నీకులేదని మాత్రం నాకు తెలుసు. నిన్నుతొట్ట తొలిసారిగా చూసినప్పుడెలా ఉన్నావో, చిట్టచివరి సారి చూసినప్పుడు కూడా అలానే ఉన్నావు; స్వర్ణ జల పాతంలా, హిమానీ నదంలా, విశాల విహాయసంలో ఏకాకిగా వెలిగిపోతున్న నక్షత్రంలా.

నీవు నాకర్థమయినట్టే అనిపిస్తుంది. నీ గురించి ఇంక తెలుసు కొనవలసిందేమీ లేనట్టే అనిపిస్తుంది. ఇంతదాకా తెలుసుకొన్నదేదో చెబుదామనుకొనే వేళకు అసలు నాకేమీ తెలియ దనిపిస్తుంది !

"అయ్యో! జీవితమంతా వృధా అయిపోయింది. ఆమె నాతో ఉన్నంతకాలమూ, ఆరాధించానే తప్ప అవగాహన చేసుకొందామన్న ఆలోచన కూడా నాకురాలేదు. నన్నూ నా వంశాన్నీ పునీతంచేసి, తన దారిన తను వెళ్ళిపోయాక,ఇప్పుడను కొంటున్నాను పొరపాటు చేశానని! కానీ ఏం లాభం?" అనుకొంటున్నా నిప్పుడు.

అలా అనుకొంటూనే, నాలోకి నేను ముడుచుకు పోతున్నాను. నాలోకి నేను కుంగిపోతున్నాను. అదిగో - అప్పుడనిపిస్తుంది మళ్ళా - దూర దూరంగా, మసక మసగా, ఏదో తెలుస్తూ తెలుస్తూన్నట్టుగా.

(19-8-89 శనివారం)

'స్పర్శ' అన్న రెండే రెండక్షరాల్లో ఎన్ని అర్థాలున్నాయో, ఎన్ని అనుభూతు లున్నాయో, ఏ పుస్తకమూ చెప్పలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏ రచయితా చెప్పలేడు, ఒక్క అనుభవం తప్ప.
ఒక స్పర్శ - పసి బిడ్డను నిదుర పుచ్చుతుంది
మరో స్పర్శ - కారుణ్యాన్ని మేలు కొలుపుతుంది
ఇంకో స్పర్శ - ఈశ్వర దర్శనానుభూతిని ప్రసాదిస్తుంది
చిన్నీ ! నే నివన్నీ అనుభవించాను, నీనించి
ఈ రోజు రాత్రికే ఊరెడుతున్నాను. బిడ్డలను జాగ్రత్తగా చూసుకోమని చెప్పడం
కోసం నీ దగ్గరికొచ్చాను.
అక్కడి నీడ పలకరించింది. జాడ పలకరించింది.
నేల పలకరించింది. గాలి పలకరించింది.
పాట పలకరించింది. బాట పలకరించింది.
వీటన్నింటికీ నీగురించి చెప్పాను. నీకేమో బిడ్డల్ని గురించి చెప్పాను ...
(20-8-89 ఆదివారం)

నీ గురించి, నా ఆలోచనల చుట్టూ ఆవరించిన మౌనాన్ని ఛేదించుకొని, ఆ ఆలోచనను పలకరించుదామని "మాట" తంటాలు పడుతోంది. "శబ్దం" గింజుకులాడుతోంది. ఈ తంటాలతో, గింజులాటతో అవి రెండూ అలసిపోతున్నాయే తప్ప, ఆలోచనకు - అల్లంత దూరంలోకి కూడా రాలేకపోతున్నాయి చిన్నీ! ఇప్పుడు ఏ అక్షరాన్ని తాకినా, జివ్వుమని కన్నీరెట్టుకొంటున్నది. ఇప్పుడు ఏ అక్షరాన్ని పలకరించినా, లబ్బుమని మొత్తు కొంటున్నది.
ఇప్పుడు నా కళ్ళనిండా కన్నీళ్ళే
ఇప్పుడు నా వేళ్ళనిండా కన్నీళ్ళే
ఇప్పుడు నా వేళ్ళు రాసే అక్షరాల నిండా కన్నీళ్ళే
ఇప్పుడు నా కళ్ళు చూసే దృశ్యాల నిండా కన్నీళ్ళే ...
(22-8-89 మంగళవారం)

నాకింకా గుర్తున్నది, ఆ నిమిషం నాకింకా గుర్తున్నది
మసక మసక వెలుతురులో, నీవు నిలబడడం గుర్తున్నది
రెప్పల తెరల మాటు నుండి నీ చూపులు,
మెత్తగా, మెల్లగా నాదాకారావడం గుర్తున్నది
భయంతో కంపిస్తోన్న, సిగ్గుతో నిశ్చలిస్తోన్న,
నీ అడుగుల తడబాటు గుర్తున్నది
నా ముని వేళ్ళు నీ చుబుకాన్ని పలకరించడం గుర్తున్నది
నీ అరచేయి నా పెదవులను వారించడం గుర్తున్నది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీ కనుల నిండా నీటి పొరలు జీరాడడం గుర్తున్నది
నిన్నూ నన్నూ వింతగా చూస్తున్న దీపకాంతి గుర్తున్నది
పాదాభి వందనం చేస్తూనే నీవు గుక్కిళ్ళు పడడం గుర్తున్నది
నీవు పార్వతివయి, నన్ను పరమ శివుణ్ని చేసిన ఆ నిమిషం గుర్తున్నది
ఈ గుర్తులన్నీ చచ్చిపోతే ఎంత బావుండు నమ్మా !

(23-8-89 బుధవారం)

నిన్ను చూస్తున్న ప్రతిసారీ, ఒక హిమ గీతాన్ని చూస్తున్నట్టుగా ఉంటుంది
ఒకసుసుపాతాన్ని చూస్తున్నట్టుగా ఉంటుంది
ఒక ప్రభాతం పరిపుశిస్తున్నట్టుగా ఉంటుంది
ఒక పసితనం పాడుతున్నట్టుగా ఉంటుంది.
నిన్ను చూస్తూ చూస్తూ, అదే పనిగా చూస్తున్నప్పుడు,
ఒక సుమపాతం, హిమ గీతాన్ని పరిమళిస్తూ,
పసి గొంతుతో పాడుతున్నట్టుగా ఉంటుంధి.
చిన్నీ ! నీవు నా ఓల్గావు !!
నేను నీ నికొలస్‌ను !!

(24-8-89 గురువారం)

ఆకాశాన్ని రెండు చేతులతోనూ పైకెత్తిన హెరాక్లిస్‌కు దాని బరువు తెలుసు.
ఏకాంతం ఎంత బరువుగా ఉంటుందో అనుభవిస్తున్న నాకు తెలుసు.
దేవతల స్వాధీనంలో అగ్ని ఉన్నప్పుడు, మానవలోకం ఎలాంటి అంధ కారంలో ఉన్నదో ప్రొమిథ్యూస్‌కు తెలుసు.
ఏకాంతం ఎంత దట్టమైన చీకటిగా ఉంటుందో,అనుభవిస్తున్న నాకుతెలుసు.తన ప్రత్యణువుతోనూ ప్రేమించిన ఆంటిగోన్ సుందరి తన కళ్ళముందే సజీవంగా సమాధి చేయబడుతున్నప్పుడు, అనుభవించిన మహాక్షోభ, ఎంత భయంకర మయిందో, రాజకుమారునికి తెలుసు. నిన్ను పూవులతో అభిషేకించిన చేతుల తోనే, నీమీద మట్టిని చిమ్ముతున్నప్పుడు, నాలో చెలరేగిన విషాదమయ సంక్షోభం ఎలా ఉంటుందో నాకు తెలుసు.
చిన్నీ ! నీవు నా ఆంటిగోన్ సుందరివి !
నేనొక నిస్సహాయ రాకుమారుణ్ని !!

(25-8-89 శుక్రవారం)

'జీవన సమరం' పుస్తకం గురించి శేషశాయిగారు ... తన సందేహాలను బయట పెట్టారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'జీవన సమరం' వంటి శీర్షికను, రామోజీరావుగారు, నాకప్పగించడమే నా అదృష్టం. అకారణంగా నా పాత ప్రపంచంలోకి, నేను మరోసారి కాలు మోపాను. అక్కడున్న నా అమ్మలనూ, నాన్నలనూ, అన్నదమ్ములనూ, అక్కచెల్లెళ్ళనూ ఆదరంగా పలకరించాను. గాఢంగా ఆలింగనం చేసుకొన్నాను. నన్ను గుండెలకు హత్తుకొన్న తల్లులూ, అక్కలూ అమ్మమ్మలూ, తాతయ్యలూ చాలామంది ఉన్నారక్కడ. నా బంధువర్గమంతా, అక్కడమరోసారి కనిపించింది నాకు. ఆ అధో ప్రపంచం, అంతో ఇంతో నాకు తెలుసు. తెలిసినదాన్ని తెలిసినట్టుగా, తెలియనిదాన్ని తెలియనట్టుగా రాశాను. కన్నదాన్ని, విన్నదాన్ని, ఉన్నదాన్ని, కన్నట్టుగా, విన్నట్టుగా, ఉన్నట్టుగా రాశాను.

నాకు - ఆ పుస్తకం కొత్త కిటికీలను తెరిచింది.
నా ఆలోచనల మీద కొత్త వెలుగుల్ని చిమ్మింది.
ఆ పుస్తకంలో దరిద్రుల్ని గురించి తప్ప,
దగాపడిన వారిని గురించి తప్ప,
ఇంకేమీ లేవన్న విమర్శలు నేనూ విన్నాను.
వారెవరూ తిరగబడ లేదన్న విమర్శలూ విన్నాను.
నిజమే! ఆ పుస్తకం నిండా అవే ఉన్నాయి.
ఆ పుస్తకంలో, నాయికా నాయకులైన వారి ప్రపంచంనిండా,
బతుకుల నిండా, దరిద్రంతప్ప, మోసపోవడంతప్ప,
ఆవేదనలు తప్ప, కన్నీళ్ళు తప్ప, ఇంకేమీలేవు.
నేనూ అవే రాశాను. అవి - వాస్తవ గాథలు తప్ప,
మరేమీకావు గనక, నేనేమీ చేయలేక పోయాను."
అన్నాను శేషశాయిగారితో.

(26-8-89 శనివారం)

ఓచిన్న శిలాజాత చిహ్నం వెనుక, ఒక మహాద్భుతమైన చరిత్ర మరుగుపడి ఉన్నట్టే, ఓ చిన్నరాతి పనిముట్టు వెనుక, ఒక మహోజ్వలమైన సంస్కృతి మాటుపడి ఉన్నట్లే, నీ నిట్టూర్పు వెనుక ఓ చిన్న అసంతృప్తి నీలో దాగొని ఉంటుంది. నీ నవ్వు వెనుక, ఓ సంతృప్తి తరంగం ఎగసి ఉంటుంది ... నేనొక వాల్మీకినయితే, ఒక "కాంతాయణం" రాసి ఉందును. నే నొక కాళిదాసు నయితే, ఒక "శ్రీకాంత సందేశం" రాసి ఉందును. నేనేమీ కాని మామూలు రచయితను చిన్నీ!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవధులెరుగని సానుభూతితో, ఎదుటివారిని అర్థంచేసుకొన్న వారితోనూ; అపకతవకలను మన్నించి, ఆదరంతో అక్కునచేర్చుకొన్నవారితోనూ; మనసులను కలబోసుకొన్న వారితోనూ; స్నేహామృతాన్ని జుబ్బనజూరలుగా పంచిపెట్టగల వారితోనూ; జీవితాన్ని పంచుకోగలగడం గొప్ప అదృష్టం!
భగవంతుడు నాకా అదృష్టాన్ని కాంతమ్మగారి రూపంలో ప్రసాదించాడు ...

(27-8-89 ఆదివారం)

పదాలకేం భాగ్యం! భాషనిండా వందల సంఖ్యలో, వేల సంఖ్యలో పదాలున్నాయి. ఒకప్పుడు, నాకీ పదాలకు అర్థాలుకూడా తెలిసేవికావు. రానురాను వాటిలో కొన్నింటికి అర్థాలు తెలిశాయి. తరువాత్తరువాత, అర్థాన్ని మించిన 'ఆత్మీయత' కూడా కనపడ సాగింది.

ఒక పదానికున్న అర్థం,దాని బాహ్య స్వరూపమయితే, ఆత్మీయత దాని అంత స్వరూపమనుకొంటాను. ఈ అంత స్వరూపం దాపుల్లోకి నేను వస్తూ వస్తూన్న సమయంలోనే, ఆ పదాలకున్న రంగులూ, నాకు గోచరం కాసాగాయి. ఒక్కొక్కపదానిది వొక్కొక్కరంగు. ఏరెండు పదాలరంగూ వొక్కలా ఉండదు. ఒకే రంగులా ఉండవచ్చుగానీ, ఛాయా భేదాలు కట్టుకు పోయినన్ని కనిపించేవి. ఒకపదానికున్న ఆ వొక్క రంగయినా స్థిరంకాదు. వాక్యంలో,ఆపదానికున్న స్థానాన్నిబట్టీ, దానికి అటూఇటూ ఉన్న పదాలనుబట్టీ, ఈపదవర్ణంలో తేడాలు కనిపించేవి. ఒక్కొక్కసారి బాగా మసకేసి పోవడమూ, మరోసారి ఉజ్వలంగా మెరిసిపోవడమూ నేను గమనించాను.

ప్రతిపదాన్నీ ఆవరించుకొని, ఒక నాదశక్తి - నిశ్శబ్దం కవచం మాటున దాగొని ఉంటుందని, ఇంకొంత కాలానికి తెలిసింది. ఆ నిశ్శబ్దాన్ని జాగ్రత్తగా నిదురలేపగలగాలి. అప్పుడా పదం, రంగుల నాదంతో మేలుకొని, ఆత్మీయంగా నీ ముందు నిలబడుతుంది!

చిన్నీ! నానిండా పెల్లుబుకుతున్న నీ స్మృతులను, అక్షరాలలోని కావ్యానిస్తున్న ప్రతిసారీ, తెల్లగా, లేత ఆకుపచ్చగా, పసుపు పచ్చగా, గులాబీ రంగుల్లో నాదాలను వొలకబోసే మెత్తని పదాలే నా ముందు బారులు తీరి నిలబడతాయమ్మా ...

(28-8-89 సోమవారం)

మహారాజు గారి ఒక్కగానొక్క కూతురైన ఓల్గా విశ్వసుందరి. ఆమె అందాన్ని చూసి, దేవతలు కూడా అసూయపడుతూ ఉండేవారు.
ఒకసారి ఓల్గా రాజ కుమారి, సరోవర విహారానికి వచ్చింది. దాని వొడ్డునే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూచున్న బెస్త యువకుడు, చేపలు పడుతున్నాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా, గాలానికి, చేప తగలడం లేదు.

ఓల్గా అతని తెలివితక్కువ తనానికి నవ్వుకొని, అతన్నిలా హెచ్చరించింది- "ఓ అమాయికుడా! ఎర లేకుండా, ఉత్తగాలాన్ని నీవెన్నిసార్లు సరస్సులోకి విసిరినా చేపలు పడవు. గాలానికి ఎరను గుచ్చు. నీటిలోకి గాలాన్ని విసురు.

ఎర కోసం చేపవచ్చి గాలానికి చిక్కుకొంటుంది" అన్నది ఓల్గా.

అతను రాజ కుమారికి వినయంగా నమస్కరించాడు.

"ఓ రాజపుత్రీ! మీ సలహాకు కృతజ్ఞుణ్ని. అమాయికమైన ఎరను, ఉక్కుకొక్కానికి గుచ్చలేను. ఆ ఎర తాలూకు బంధుమిత్రులు, దాని కోసం దుఃఖ పడతారు. ఎరను ఆశచూపి, చేపలను మోసగించలేను." అన్నాడు నికొలస్.

"మరి నీకు ఆహారమెలా?" అన్నది ఓల్గా.

"నా ఒక్కడి తిండి కోసం, ఒక చేపను చంపలేను. ఆ చేప కోసం మరో ఎరను చంపలేను. నాతిండి బాధలేవో నేనే పడతాను." అన్నాడు నికొలస్.

ఆ సమాధానం వింటూనే రాజపుత్రి చలించి పోయింది. అతన్ని మరోసారి తేరి పార చూసింది.

"ఓ పిచ్చివాడా! చేప దొరకదని కూడా, పదే పదే గాలాన్ని సరస్సులోకి ఎందుకు విసురు తున్నావ్?" అన్నది రాజపుత్రి.

"ప్రయత్నించినా చేపలు దొరకలేదని, నాకు నేనే సమాధానం చెప్పుకోవడం కోసం" అన్నాడు నికొలస్ చాలా మామూలుగా.

అతన్ని కన్నార్పకుండా చూసింది ఓల్గాం. ఒకానొక దివ్య సౌందర్యం, వెన్నెల లాగా, అతనిలోంచి, వెలికి చిమ్ముతోంది. ఆమె సరోవర విహారం విరమించి అంతఃపురాని కొచ్చాక, జరిగిన సంగతంతా తండ్రితో చెప్పింది.

"నాకా బెస్త యువకునితో పెళ్ళి ఏర్పాటు చేయించండి. అతన్ని తప్ప, ఇంకెవరినీ నేను వివాహం చేసుకోను" అన్నది రాజపుత్రి.

కూతురు పట్టుదల తెలిసిన మహారాజు,మంత్రిగారితో సంప్రదించి, ఒక ఉపాయం పన్నాడు.

"ప్రియమైన ఓల్గా! నీ కోరికను, ఒక్క షరతు మీద, నేనామోదిస్తున్నాను. ఆ సరస్సులో బంగారు చేపలున్నాయి. వాటిని కానుకగా ఇస్తే పెళ్ళాడతానని నికొలస్‌తో చెప్పు. బంగారు చేపలను పట్టి తెచ్చిన వాడు మహావీరుడే గదా! అలాంటి వాణ్ని పెళ్ళాడడానికి, నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు రాజు. ఓల్గాకు ఆ షరతు సబబుగానే ఉన్నట్టు తోచింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆరాత్రికి రాత్రే, ఒక గంప నిండా బంగారు చేపలను రహస్యంగా తీసుకెళ్ళి, సరస్సులో విడిచి పెట్టి వచ్చారు రాజ సేవకులు.

"నీటిలో తేలుతున్న బంగారు చేపలను నాకు కానుకగా తెచ్చిపెట్టు" అన్నది ఓల్గా.

"నేను చాలా కాలంగా ఈ సరస్సు దగ్గర కొస్తున్నాను. నాకెప్పుడూ బంగారు చేపలు కనపడ లేదు. ఇందులో ఏదో మోసం ఉంది." అన్నాడు నికొలస్.

ఓల్గా వినిపించుకో లేదు. ఆమె మీది గౌరవంతో,సరస్సులోకి దిగాడు నికొలస్. బంగారు చేపలు బుడుంగున నీళ్ళలో మునిగాయి. వాటి కోసం, నికొలస్ కూడా మునిగాడు. సరోవర గర్భంలో రహస్యంగా దాగొన్న క్షుద్ర దేవతలు, నికొలస్‌ను ఇనుప గొలుసులతో, పెద్ద రాతికి బంధించారు. అతని రాక కోసం ఓల్గా సుందరి ఆ సరస్సు వొడ్డున ఇప్పటికీ ఎదురు చూస్తూ ఉంది ....

నేనా ఓల్గా సుందరి శిలా ప్రతిమను చూశాను. ఆ కథనూ చదివాను. (1984లో సరిగ్గా ఈ రోజున, నేను రష్యాలో ఉన్నాను).

కాంతమ్మతో ఆ కథ చెప్పినప్పుడు, నావేపు చూస్తూ ఏడ్చేసిందామె ....

(31-8-89 గురువారం)

నా గురించి నాకే సరిగ్గా తెలియని,సున్నితమైన అనేక అంశాలు, మన మాటల మధ్యలో బయట పడుతూండేవి.అలాంటి అంశాలకు స్పష్టమైన రూపాల నివ్వడం కోసమే, అవగాహన చేసుకోవడం కోసమే, కబుర్లాడుతూ ఉండే వాణ్ణను కొంటాను చిన్నీ! .... వ్యక్తా తీతమైన, నిగూఢమైన, తాత్వికాంశంలోని మార్మికతను తొలగించి, క్లిష్టతను పరిహరించి, ఆ అంశాన్ని వ్యక్తం చేయడానికీ, అనుభూతం చేయడానికీ ఒక సాధకుడు పడే యాతన, నా అనుభవానికి దూరమయిందేమీ కాదు.

ఈనాడు నా చుట్టూ ముసిరిన వైభవాలన్నీ, నీవు వచ్చి పోయిన ఆ మధుర స్వప్నం తాలూకు ఆనవాళ్ళే గదా చిన్నీ !

ఈ రోజు సాయంకాలం, ఎర్రని మబ్బులను చూశాను పడమర దిక్కున. అలాంటి మబ్బులను చూసిన ప్రతి సారీ నాకు జ్ఞాపకం వస్తుంది; ఏ ప్రణయ హృదయమో తన తోడు కోసం ఆక్రోశించి ఆక్రోశించి; అలమటించి అలమటించి; తనను తాను గాయపరచు కొన్నదనీ, ఆ గాయంలోని నెత్తురు ఆవిరయి, అరుణ మేఘంగా మారిందనీ నాకని పిస్తుంది, నాకు జ్ఞాపకం వస్తుంది. ఆ జ్ఞాపకాల కావ్యాంతాన, నేను చేసిన కన్నీటి సంతకం, మన ఉభయులకూ తప్ప, ఇంకెవరికీ కనిపించదు చిన్నీ!

(1-9-89 శుక్రవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చల్లగా కనుల మీద బజ్జోని, రెప్పల తలుపులను మెల్లగామూసుకొన్నది నిదుర. నిదుర ఎద తలుపుల్ని మెత్తగా వొత్తిగించి, సుతారంగా లోని కొచ్చింది స్వప్నం. ఆ స్వప్నపుటంచు మీంచి నవ్వుకొంటో తొంగి చూస్తున్నది నీవేనని నాకు తెలుసు చిన్నీ !

ఎప్పుడో ఎందుకో ఓ ఇలకోడి కూస్తుంది. అప్పుడు ఉలిక్కిపడి నీకోసం చూస్తాను

ఎప్పుడో ఎందుకో ఓ పిచ్చి మబ్బు అరుస్తుంది. అప్పుడు భయంతో నీ చేయి కోసం వెదుకుతాను

ఎప్పుడో ఎందుకో ఓ పూవు నవ్వుతూ పలకరిస్తుంది
అప్పుడు, ఏమనాలో తోచక, నీవేపు తిరుగుతాను
ఎప్పుడో ఎందుకో ఓ పీడకల నా నిద్ర మీదికి దూకుతుంది
అప్పుడు 'అమ్మా!' అంటూ నీకేసి జరుగుతాను
అప్పుడు నా చూపులకు శూన్యం తగులుతుంది
అప్పుడు నా చేతులకు శూన్యం తగులుతుంది
అప్పుడు నా చెవులకు శూన్యం తగులుతుంది
అప్పుడు నా తనువుకు శూన్యం తగులుతుంది ...
చిన్నీ! నీవు నాకు బాగా తెలుసు ననిపిస్తుంది
నీవు నాకు బొత్తిగా తెలియ దనిపిస్తుంది
నీవు నాకు తెలుసునో లేదో, ఇప్పటికీ, తేలకుండానే ఉండిపోయా వమ్మా! ...

(2-9-89 శనివారం)

చిన్నీ! నిన్ను తప్ప నాకళ్ళు ఇంకెవరినీ చూడలేవు
నిన్ను తప్ప నేనిప్పుడెవరినీ గుర్తించలేను
నీవుపోసే లాల తప్ప, ఇంకేదీ నా మురికిని కడిగేయ లేదు
నీ గోరు ముద్దలు తప్ప, ఇంకేదీ నా ఆకలిని తీర్చలేదు
'కన్నా!' అన్న నీ పిలుపు తప్ప ఇంకేదీ నాకు వినిపించటం లేదు.
నీవు పాడే లాలి తప్ప ఇంకేదీ నన్ను నిదురపుచ్చ లేదు
నేనిప్పుడు దిక్కు లేని అనాథను
నేనిప్పుడు అందరినీ పోగొట్టుకొన్న అదృష్ట హీనుణ్ని. నీ చేయి పుచ్చుకొని సరదాగా నడవడం తప్ప, సొంతంగా తప్పటడుగులు వేయడం కూడా రాని వాణ్ని. నన్నిలా ఒంటరి నక్షత్రాన్ని చేసి ఎందుకు వెళ్ళి పోయావమ్మా? నీ వొడి లోనే కన్ను మూయాలని తప్ప నేనయినా ఏం కోరుకొన్నాను గనక !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీవు కలిసిన మట్టిలోనే కలిసిపోవాలని తప్ప, నే నయినా ఏం కోరుకొన్నాను గనక !

నీవు రంగుల పూవుగా విరిసినప్పుడు, పరిమళంగా నిన్నలము కొవాలని తప్ప,
నేనయినా ఏం కోరుకొన్నాను గనక !
నీ చివరి మాటను నేను విననన్నా వినలేదు
నీ చివరి చూపును నేను చూడనన్నా చూడలేదు
నీ చివరి శ్వాసను నేను తాకనన్నా తాకలేదు
నీ చివరి కదలికను నేను చూడనన్నా చూడలేదు
నే నిప్పుడు నా చివరి పాటను రాస్తున్నాను
నే నిప్పుడు నా చివరి పాటలోని చివరి చరణం రాస్తున్నాను
చివరి చరణం రాస్తూ రాస్తూనే, గొంతెత్తి పాడుతున్నాను.
పాడు కొంటూ పాడుకొంటూ నీ కోసం ప్రయాణమైనాను.

(3-9-89 ఆదివారం)

ఈ రోజు ఉదయం శేష శాయి గారు కలిశారు వేకువ నడకల్లో. 'నాలోని నీవు', 'అంత రంగిణి', 'ఐత రేయం' గురించి చాలా సేపు మాట్లాడు కొన్నాం. నేనే మన్నా అనుకొంటా నేమోనని, తన అనుమానాలను, చాలా మెత్తగా బయట పెట్టా రాయనగారు.

"మీరు మొఖమాట పడకండి. మీరింకాస్త గట్టిగా అన్నా, నేనేమీ అనుకోను. మీరన్నది, నూటికి నూరు పాళ్ళూ నిజం! ఆ మూడు పుస్తకాల నిండా కాంతమ్మ గారిని గురించే ఉన్నది,'అంత రంగిణి' - 'ఐత రేయం' పుస్తకాల్లో ఇతర అంశాలు కూడా ఉన్నాయి. నా డైరీలను యధాతథంగా, అన్ని రోజు లవీ అచ్చేయ లేదు. చాలా రోజుల్లో జరిగిన విషయాలను, సుబ్బారావు గారు మినహాయించారు నా ఇష్టం మీదనే! నాకు సామ్యవాద మంటే ఇష్టం. కాంతమ్మ గారంటే ఇష్టం. ఈశ్వరుడంటే ఇష్టం. ఈ మూడు అంశాలకు సంబంధించి నంత వరకూ, మినహాయింపు ల్లేవు. అవి - కొన్ని సందర్భాలలో సాదా సీదాగా ఉన్నాయి. ఉండడం కూడా సహజమే ననుకొంటున్నాను. అవి - వ్యాసాలూ, కథలూ కావు ...." అన్నాను వారితో.

(4-9-89 సోమవారం)

"ఓ చిన్న సాహిత్య సమావేశాన్ని ఏర్పాటుచేదా మనుకొంటున్నాను. అందులో తప్పకుండా పాల్గొనాలి" అన్నారు శేషశాయి గారు.
నాకున్న ఇబ్బందులన్నీ చెప్పుకొచ్చాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఒకప్పుడు - నాకూ ఇలాంటి సరదాలుండేవి. రానురాను వాటి మీద అభిరుచి తగ్గి పోయింది. నన్ను అభినందించడానికంటూ, సభలు, సమావేశాలు పెట్టకండి. సన్మాన పత్రాలు, పూల దండలు వద్దు. మిగతా వారి సంగతులేవీ నాకు తెలియవు గానీ, నా మట్టుకు నేనను కొంటున్న దేమిటంటే - ఒక రచయితను సన్మానించడమంటే, అతని పుస్తకాలను కొని చదవడం, వాటి మంచి చెడ్డలను మీకై మీరే చర్చించడం, ఇతరులతో చర్చించడం, మీకు దోషాలుగా కనిపించిన వాటిని గురించి, నిస్సంకోచంగా,ఆ రచయితకు రాయడం,ఎక్కడన్నా కాస్తంత మంచి కనబడితే, దాన్ని, నలుగురితో పంచుకోవడం .... ఇలాంటివి చేస్తే, మీరా రచయితను సన్మానించినట్లే అవుతుంది. నిజమైన రచయిత ప్రజల హృదయాలలో ఉండాలి గానీ, పూల దండల్లోనూ, సన్మాన పత్రాల్లోనూ జీవించడని, కాస్త ఆలస్యంగా గ్రహించాను. నన్నో ప్రత్యేకమైన వాణ్నిగా చూడకండి! మీలోని వాణ్నిగా మీ బిడ్డగా చూడండి చాలు. అలా - మీవంటి వారంతా చూసే లాగా, నేను ప్రవర్తించాలనీ, జీవించాలనీ, మీరు కోరుకోండి. అంతే చాలు. మీరు నా పుస్తకాలు చదివారు. నిన్ననో, మొన్ననో మనం మాట్లాడు కొన్నాం వాటిని గురించి" అన్నాను వారితో ...

(5-9-89 మంగళవారం)

మొన తేలిన కత్తుల కొమ్మలకు పూసిన దివ్య పుష్పం వంటిది ప్రేమ. అది సున్నితమైన సువాసనలను గుబాళిస్తూ ఉంటుంది. ఆ పరిమళం కోసమని, హృదయం, అక్కడికి కెడుతుంది. ఆ పుష్పం చుట్టూ ఉన్న కత్తుల్ని చూసీ, ఆ కత్తులు చేయగల గాయాలను తలుచుకొనీ, చాలా హృదయాలు వెను తిరుగుతాయి. కొన్ని హృదయాలయితే, ఆ పుష్పాన్ని గురించీ, దాని తీయని వాసనలను గురించీ, అసలే పట్టించు కోవు. ఆ హృదయాలు - ఏ అపాయమూ, ఏ ఇబ్బందీ లేని సాదాసీదా పూవుల దగ్గర కెడతాయి. లేదా - పుష్కలంగా కట్నం ఇవ్వగల పుష్పాలనే ఎన్నుకొని, ఉన్న వాసనతోనే తృప్తి పడతాయి.

నేనేమో కాస్త ఆశా పాతకుణ్ని. నా గుండె నిండా గాయాలయినా సరే,అసలు గుండె మొత్తం గాయంగా మారినా సరే, నెత్తుర్చితా కళపెళలాడి ఆవిరులుగా ఎగసి పోయినా సరే - లక్ష్య పెట్టను. 'సర్దుకు పోవడం' - 'రాజీ పడడం' అన్నవి బొత్తిగా తెలియని వాణ్నేం కాదు గానీ, ఈ విషయంలో మాత్రం, భరించ లేను ....

(6-9-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చలి చలిగా ఉండే వేకువను అడుగుతున్నాను
చలి చలిగా ఉండే సాయంసంధ్య నడుగుతున్నాను
నేలను తొలుచుకొచ్చిన మొక్కల - నడుగుతున్నాను
సింగిని చీల్చుకొచ్చిన చుక్కల - నడుగుతున్నాను
చిరిగి పోయిన నీలాకాశా న్నడుగు తున్నాను
చెదరి పోయిన తెల్ల మబ్బుల నడుగుతున్నాను
చెదలు తిన్నట్టున్న చందమామ నడుగుతున్నాను
పొడి పొడిగా రాలుతున్న వెన్నెల నడుగుతున్నాను
వెలుగు నడుగుతున్నాను, పులుగు నడుగుతున్నాను
వాన నడుగుతున్నాను, కోన నడుగుతున్నాను
మడుగు నడుగుతున్నాను, అడుగు నడుగుతున్నాను
నీడ నడుగుతున్నాను, జాడ నడుగుతున్నాను
ఊరు నడుగుతున్నాను, కాడు నడుగుతున్నాను
నాచుట్టూ ఉన్నవాటన్నింటినీ అడుగుతున్నాను
నాచుట్టూ ఉన్నవారందరినీ అడుగుతున్నాను
చిన్నీ! నీ గురించి ...

(7-9-89 గురువారం)

"భగవంతుడు అవతరాలెత్తడమే చిత్రం! మానవుడుగా అవతారాలెత్తడం మరీ చిత్రం గాదా ?" అన్నారు శేషశాయిగారు.

"భగవంతుడు చేపగానూ, తాబేలుగానూ, వరాహంగానూ, సగం మనిషి సగం సింహంగానూ, ముందుగా అవతారాలెత్తాడు. జలచరాలనూ, ఉభయచరాలనూ, భూచరాలనూ, అర్ధమానవులనూ బాగుచేశాడు. ఆ తరువాత వరసగ్గా మానవావతారాలనే ఎత్తాడు - ఐదుసార్లూ. మిగతా జీవకోటిని బాగుచేయడానికి, ఒక్కో అవతారమే సరిపోయింది. మనిషిని బాగుచేయదానికి ఐదుసార్లు అవతారాలెత్తవలసి వచ్చింది. అయినా ఈ మనిషి బాగుపడలేదు. రక రకాల దేశాల్లో, రకరకాల కాలాల్లో, రకరకాల మతాల్లో, రకరకాల పేర్లతో, రకరకాల చిహ్నాలతో, దేవుళ్ళలాంటి వారిని సృష్టించాడు ఈశ్వరుడు. బోధలు చేశాడు. ప్రచారంచేశాడు. ఐనా మృగదశను దాటి, మనిషి బయటపడలేదు. మిగిలిన రూపాల్లో, మళ్ళీ అవతారమెత్తకపోవడానికి కారణం, ఆయా రూపాల లోని జీవకోటిని పదే పదే బాగుచేయవలసిన అవసరం రాకపోవడమే! ఆ అవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్యకత, మనిషిపరంగా ఉన్నది గనకనే, మానవాకారంలో అవతారాలెత్తాడు. ఈశ్వరుడు చేసిన గొప్ప పొరబాటు, మృగాలను చేసిన పదార్థాలతోనే కొందరు మనుషుల్ని కూడా చేయడం.'నరసింహం' సగం మనిషి గనక సరిపోయింది. 'పూర్తి మనిషి' అయ్యాక, మనిషిలోని మృగత్వం పోతుందనుకొన్నాడు ఈశ్వరుడు. అతగాడి ఆశల్ని, అడియాసలుచేస్తూ, పైకిమనిషిగా, లోపల భయంకరమైన క్రూర మృగంగా బతికేస్తున్నారీ విచిత్రజీవులు" అన్నాను శేషశాయిగారితో.

(8-9-89 శుక్రవారం)

నా బాల్యాన్ని గురించి చెప్పుకోదగిన గొప్ప అంశాలంటూ నాకేమీ లేవు
బాల్య మంటే నాకు, పల్లేర్లు మొలిచిన మైదానం
బాల్య మంటే నాకు, కష్టాలు మొలిచిన కారడవి
బాల్య మంటే నాకు, చింతలు మొలిచిన చిట్టడవి
బాల్య మంటే నాకు, పారిపోయిన పసిడి చిలుక
బాల్య మంటే నాకు, రెచ్చిపోయిన పచ్చి పుండు
బాల్యమంటే నాకు, క్రూరమైన పీడకల
బాల్యమంటే నాకు, అందరాని కొండ మీది
అందమైన వెండిగిన్నె ...

(9-9-89 శనివారం)

"నేనిప్పుడు అక్కణ్నించే వస్తున్నాను" అన్నదా గాలితరగ నాకెదురుగా, కుదురుగా కూచుంటూ.
నాతో ఏదో చెప్పబోతున్న దానిలాగా, గొంతుకూడా సవరించుకొంది.
"అక్కడ చాలా మందే ఉన్నారు" అంటూ ప్రారంభించింది గాలి తరగ.
"నవ్వుతున్న వారూ, ఏడుస్తున్న వారూ ఉన్నారు. గుసగుసలాడుతున్న వారూ రుస రుస లాడుతున్న వారూ ఉన్నారు. వారందరి మధ్యా ఆమె బంగారు తూనీగలాగా ఉంది. పూరేకు లాగా ఉంది.
సంపెంగ పరిమళంలాగా ఉంది. ప్రాతస్సంధ్యలాగా ఉంది. శరద్రాత్రిలాగా ఉంది. సత్యం లాగా ఉంది. సద్భావంలాగా ఉంది.
సొఫోక్లిస్ నాటకంలోని అంటిగొనీ సుందరిలాగా ఉంది. సరోవరతీరాన, నికొలస్ కోసం ఎదురుచూస్తున్న ఓల్గా రాజకుమారిలాగా ఉంది. ఫిడియస్ శిల్పించిన ఎథేనా దేవతలాగా ఉంది. రుక్కులాగా ఉంది. దిక్కులాగా ఉంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అయినా బిక్కు బిక్కుగా ఉంది. అందరినీ తేరిపార చూస్తూ ఉంది. అలా చూస్తూన్న ఆమెను చూశాక నాకే జాలివేసింది. 'ఏం కావాలన్నాను. ఆమె నావేపు చూస్తూ చూస్తూండగానే, ఆ చూపులనిండా కన్నీళ్ళు వొలికిపోయాయి. మళ్ళీ అడిగాను. అప్పుడు నీ పేరు చెప్పిందామె. నీ వివరాలడిగాను - నీవెవరో నాకసలే తెలియనట్టుగా. అవీ చెప్పింది!" అని, ఓ క్షణకాలం ఆగింది గాలి. ఆగాక, తనూ కన్నీరు తుడుచుకొంది. తడి కనులతో నా వేపు పరిశీలనగా చూసింది. "ఆ చిన్న మట్టి ఇంట్లో, దివారాత్రాలు నీకోసం ఎదురు చూస్తూ ఉన్నదామె. ఏ చిన్నచప్పుడయినా 'కన్నా !' అంటూ ఉలికి పడుతోందామె. నిన్ను తీసుకొస్తానని మాటిచ్చాను. మనకోసం ఎదురు చూస్తూ ఉంటుందామె. వెడదాం రా!" అన్నది గాలి తరగ నన్ను నిలువునా అలముకొంటూ.

"పద !" అన్నాను.

నా వాక్యం పూర్తికానేలేదు - గోపీకూతురుగా ఆమెగారు మా అందరి మధ్యకూ వచ్చిందీ ప్రత్యూషసమయాన ...

(10-9-89 ఆదివారం)

ఒక మౌనం మాటున దాగిన మూగ బాధలెన్ని ? ఒక కన్నీటి చుక్క వెనక దాగిన కష్టగాథ లెన్ని ? ఒక చిరునవ్వుచాటున దాగిన ఛిద్ర జీవితాలెన్ని ? గడచిన మూడు వారాలుగా నేనా అమ్మాయిని చూస్తున్నాను.

ఉలకదు. పలకదు. నాకెందుకో అనుమానం వేసింది.

ఈ రోజు ఉదయం పలకరించాను. చాలా సేపు మౌనంగా ఉండిపోయింది. తరువాత రెండు కళ్ళు, చెంపలు, తడిసిపోయాయి. కొంచెం కొంచెంగా తేరుకొని, తనవిషాద గాథనంతా వినిపించి, కొసాన చిన్నగా నవ్వింది.

"సారీ! మిమ్మల్ని నొప్పించాను!" అన్నది మామూలుగా అయిపోతూ.

తనకు జరిగిన అన్యాయం,నమ్మినవాడు మోసగించడం,...చివరకు ఈసంస్థలో చేరడం...అంత చిన్న వయస్సుకే, ఎన్నిక్రూరమైన అనుభవాలో!

మనసు చాలా చిత్రమయింది. అది - మందు పాతరవంటిదీ, మంచు శిఖరం వంటిదీ కూడా. ఇష్టం లేనివారి ముందు, మందు పాతర లాగా పేలుతుంది. ఇష్టమున్న వారి ముందు, మంచు శిఖరంలా కరుగుతుంది. రానున్న చరిత్రను, అగ్ర రాజ్యాలుగానీ, అపారమైన వాటి ఆయుధ సంపద గానీరాయవు. అట్టడుగు వర్గాలు, అరణ్యాలు రక్తి కట్టిస్తాయి ...

(11-9-89 సోమవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రభూ! కొంత మందితో పోలిస్తే తప్ప, నేనెంత అదృష్టవంతుణ్నో నాకు తెలియలేదు.

ఎంతో గొప్ప వాడయిన సూర్యునికి, తల దాచుకొనేందుకింత తాటాకు నీడ నయినా ఇవ్వలేక పోయావు. అలా కాస్తంత చలిగాలి తగిలితే, ఇలా కరిగి పోయే మేఘానికి వానలో తడిసి పోకుండా, చిన్న చిరుగుల గొడుగునైనా ఇవ్వలేక పోయావు. చలికి గజగజలాడకుండా, వెచ్చగా కప్పుకొనేందుకోసం శీతువుకు, ఒక చిల్లుల దుప్పటిని కూడా ఇవ్వలేక పోయావు.

ప్రభూ! నీవు కరుణామయుడివయ్యా! నాకివన్నీ ఇచ్చావు!!

(12-9-89 మంగళవారం)

... పేరుండడం, అవార్డులు రావడం, సన్మానాలు జరగడం, ఉన్నతమైన పదవులలో ఉన్నవారితో పరిచయాలూ, స్నేహాలూ ఉండడం సరే! వీటిని చూసి నేను గర్వపడడంలేదు. ఇవన్నీ కలిసి, నాకు కొన్ని ప్రతి బంధకాలను తెచ్చిపెడుతున్నాయి. ఇవి - నా బతుకును నన్ను బతకనీయడం లేదు. నా ఆలోచన నన్ను చేసుకోనీయడం లేదు. నేను పుట్టిన వర్గాన్నుండి, ఇవన్నీ నన్ను దూరం చేస్తున్నాయి. ఏ పేద తనంలోంచి, అసమానతల్లోంచి, అవమానాల్లోంచి, అజ్ఞానంలోంచి నేను పుట్టుకొచ్చానో, పెరుగుతూ వచ్చానో, ఆ వ్యవస్థలకూ, అందులోనే బతుకుతున్న వారికీ దూరమవుతున్నానన్న బాధ, నన్ను సుఖంగా ఉండనీయడం లేదు ...

నేను మరీ పవిత్రుణ్నికాను. మహా శీలవంతుణ్నీ కాను. అబద్ధాలాడడం; ఇష్టం లేని వారిని కూడా ఇష్టపడుతున్నట్లు నటించడం; చచ్చు వెధవల్ని కూడా అభినందించడం; అసలేమీ ఎరగని వాణ్ని కాదు. తాడికొండ, నెల్లూరు, తెనాలి. ఈచోట్ల, నేను బతికిన తీరు నాకింకా గుర్తున్నది. కాంతమ్మ గారు, నాబతుకులోకి తొంగిచూడకపోతే - నేనలాగే బతుకేస్తూ ఉండే వాడిని. ఆమెగారు నన్ను అనునయంతో మార్చింది. ఆప్యాయతతో నాలోపాలను సవరించింది. ప్రేమాను రాగాలతో నన్ను తీర్చిదిద్దింది. "ఆమె - లేకపోతే?" అన్న ప్రశ్నకు, నాదగ్గర జవాబు లేదు.

ఆంతరిక జీవితంలోని, అరాచకమంతా, దివాళాకోరుతనమంతా, "ప్రేమరాహిత్యం" తో ముడిపడి ఉన్నదని, అనుభవం చెబుతున్నది ...

(13-9-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒరేయ్ ఆత్రేయా !
చివరికి నీవూ వెళిపోయావుట్రా - ఎక్కడో పారేసుకొన్న మనస్సుకు వెదుక్కుంటూ వెదుక్కుంటూ. నువ్వు, అందమైన అబద్ధాలు చెబుతావని నాకు తెలుసు, ఏ ఇద్దరికో ముగ్గురికో, నీ అంతరంగాన్ని పంచిపెడతావనీ నాకు తెలుసు. ఆ ముగ్గురిలో నేను - కనీసం చివరి వాణ్నయినా అయి ఉంటాననీ, నాకు నమ్మకంగా తెలుసు.

నాతోనన్నా నిజం చెబుతావనుకొన్నాను. అబద్ధాలాడడానికి అలవాటు పడీ పడీ, నాతోనూ అబద్ధమాడేసి వెళిపోయావు గుట్టు చప్పుడు కాకుండా.
జీవితం మనల్ని దగా చేసిందిరా ఆత్రేయా! ఆ సంగతి తెలిసికూడా, దాని వేపు నవ్వుతూ చూస్తూ ఉండిపోయాం! అది దగాచేసి, మోసంచేసి, దుమ్ముచల్లి, బురదచల్లి, చీల్చి, కాల్చి - నా; మనం నవ్వుకొంటూనే ఉన్నాం.
"మీరు మొండి లంజకొడుకులు" అన్నది జీవితం కసికసిగా.
మనం వొకరి నొకరం చూసుకొని, సరదాగా నవ్వుకొని, "నిజం నిజం" అన్నాం!

అదిగో - సరిగా అప్పట్నించే మనం లంజరికం మొదలు పెట్టాం. అయినా ఏం బావు కొన్నాం గనక, సుఖవ్యాధిలాంటి కీర్తి తప్ప.
మనుషులు మరిచిపోతారుగానీ, మానులూ మాకులూ మరిచిపోవురా ఆత్రేయా ! మన ఆకలి అరుపుల్ని; అణాల అప్పుల్ని; తూలిపడే అడుగుల్ని; నెల్లూరురోడ్లు పెన్నా నదీ తీరాలు, రైలు కట్టలు, తంగేడు చెట్లు, 'దీన బంధు'కార్యాలయం గోడలు, నాగరత్నం అరుగులు, రోహిణి కళ్ళు, ఇంకా జ్ఞాపకం చేస్తూనే ఉంటాయి.
గుండెల్లో శూలం గుచ్చుకొని బతికిన వాడివిరా! అందుకే నీ పాటలూ, మాటలు, అంత తడితడిగా ఉంటాయి. నువ్వేమో చచ్చి బతికి పోయావు. నేనేమో బతకలేక చస్తున్నాను. నా కన్నా వొడుపుగా బతకడం తెలిసిన వాడివి గదా ...

(14-9-89 గురువారం)

బాలా కాలంగా, చాలా మంది తెలుగు కవులు, రచయితలు ఎదురు చూస్తున్న జ్ఞానపీఠ బహుమతి - ఈ సంవత్సరం మిత్రులు నారాయణరెడ్డి గారికొచ్చింది. మిగిలిన వారి సంగతి నాకు తెలీదుగానీ, నామట్టుకు నాకిది ఎదురుచూస్తున్న వార్త! అనలీ - ఫలితం 1986లోనే వచ్చి ఉండవలసింది. కానీ ఇద్దరు ముగ్గురు కవులు రంగంలోకిదిగి, ఒకరి మీద మరొకరు దుమ్ము చల్లుకొని, మొత్తం తెలుగు సాహిత్యం మీదా, తెలుగు సారస్వతోపాసకుల మీదా - అఖిల భారత స్థాయిలో అసహ్యం కలిగేలా చేశారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అసలెవ్వరికీ రాకపోవడంకన్నా, ఏ తెలుగు రచయితకొచ్చినా, కవి కొచ్చినా, సంతోషమే! అందులోనూ, స్నేహిత పరిధిలోని వారి కొస్తే మరీ సంతోషం! రెండు దఫాలు జ్ఞాన పీఠ బహుమతులను అందుకొన్న భాషలో, నేనూ అంతో ఇంతో రాయడం, నా అదృష్టంగా భావిస్తున్నాను ...

(15-9-89 శుక్రవారం)

ఈ మహా మేధావులు, కవులు, పండితులు, కథకులు, విమర్శకులు, భాషా శాస్త్రవేత్తలు వగైరాల కన్నా, సాహిత్యంతో ఏమీ సంబంధంలేని ఒక సామాన్యుడు చాలా నయం! అతనికి రాగద్వేషా లుండవు. ఈర్ష్యాసూయ లుండవు. కనీసం - వీరిలో ఉన్నంతగా మాత్రం అసలే ఉండవు.

నా రచనలలోని బాగోగులను, నా వ్యక్తిత్వంలోని వెలుగు నీడలను కూడా, యదారూపంలోకాక, నేనే మరిచిపోయిన నా "కులం" తెరలోంచి మాత్రమే చూడగలిగిన "సహృదయులకు" నమస్కరించడం తప్ప, నేను చేయగలిగిందేమీ లేదు.

"మిమ్మల్ని కొంత మంది అభిమానించవచ్చు. మరికొంత మంది ద్వేషించవచ్చు. అది - వారి వారి సంస్కారాన్ని బట్టి ఉంటుంది. కానీ వొకటిమాత్రం నిజం! మిమ్మల్ని పూర్తిగా విస్మరించడం మాత్రం సాధ్యం కాదు. మీ స్థానం అలాంటిదీ!" అన్నారు శేషశాయి గారు.

వారి అభిమానానికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాను. ఒకవేళ విస్మరించితే మాత్రమేం? ఎంతమంది మహానుభావులు, కాలగర్భంలో, ఆనవాళ్ళు కూడాలేకుండా పోలేదు? వారితో - పోల్చడానికక్కూడా నాకు అర్హతలు లేవే! ...

(16-9-89 శనివారం)

... క్రీస్తు పూర్వం 5వ శతాబ్ది నాటివాడు ఫిడికస్. గొప్ప శిల్పి గొప్ప సౌందర్యోపాసి. అతను మును ముందుగా, కొయ్యతో ఏదేనా దేవతనుమలిచాడు. ఆ శిల్పాన్ని చూసిన వారందరూ అతన్ని మెచ్చుకొన్నారు. అయినా ఫిడికస్ అసంతృప్తితో మకమక లాడిపోయాడు. తను తీర్చగలిగినంత అందంగా, ఏదేనా దేవతను శిల్పించలేకపోయా ననుకొన్నాడు.

ఈసారి, మంచి శిలను ఎన్నుకొని, మునుపటి దానికన్నా అందంగా తయారు చేశాడు. పాలక వర్గాలు, పాలిత వర్గాలు, ఫిడికస్‌ను ఆకాశాని కెత్తాయి. అయినా ఆ మహా శిల్పికి తనివి తీరలేదు.

ఈ దఫా కంచుతో పోత పోశాడు. అయిదారేళ్ళ పాటు ఆ విగ్రహానికి మెరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గులు దిద్దాడు ఈ సారి ఆ మహా శిల్పిని తారా మండలంలో నిలిపారు ప్రేక్షకులు. అయినా ఫిడికస్ గొణగడం మానుకో లేదు.

"ఆ దేవత దివ్య సౌందర్యం, నా హృదయం నిండా, నా నిండా నిండి పోయింది. ఆమెను - నా మనో నేత్రంతో చూస్తున్నాను. కానీ - నేను చూస్తున్న దానిలో శతాంశం కూడా, నేను శిల్పించలేక పోయాను" అన్నాడా మహా శిల్పి.

ఈ విగ్రహాన్ని ఆక్రో పోలిస్ దుర్గ ప్రవేశ ద్వారానికి ఎదురుగా ప్రతిష్ఠించారు గ్రీకులు. ఈ దేవత ధరించిన స్వర్ణ కిరీటమూ, శూలమూ, చాలాదూరం దాకా కనబడుతూ ఉంటాయి!

చిన్నీ! నీవు నా ఎథేనా దేవతవు !!

(17-9-89 ఆదివారం)

... అక్కడ వారు ఆవేదనల విత్తనాలను చల్లుతారు
అవి, విప్లవ గీతాలుగా మొలకెత్తుతాయి
అక్కడ వారు కన్నీటి చుక్కల్ని ఎద బెదతారు
అవి, కరుణ రస ఝరులయి ప్రవహిస్తాయి
అక్కడ వారు సన సన్నని మౌన బీజాలను నాటుతారు
అవి, రణ న్నినాదాల ఫలాలను ప్రసవిస్తాయి
అక్కడ మాటలు మంటలయి పరుగులు తీస్తాయి
అక్కడ పాటలు పాశుపతాస్త్రాలయి పైకి లేస్తాయి
ఆకులు చాకు లవుతాయి, బాకు లవుతాయి
కొమ్మలు కత్తులవుతాయి, సుత్తెలవుతాయి ..

(18-9-89 సోమవారం)

అతను ప్రజలకోసం రాజ భోగాలనూ, భార్యా బిడ్డలనూ వదలి వేశాడు. అప్పుడతని పేరు సిద్ధార్థుడు.

అతను సామాన్యుల పక్షాన శిలువ నెక్కాడు. అప్పుడతని పేరు జీసస్ క్రీస్తు.

అతను బానిసల పక్షాన తిరుగు బాటు చేశాడు. అప్పుడతని పేరు స్పార్టకస్.

అతను సత్యం కోసం విషం తాగాడు. అప్పుడతని పేరు సోక్రటిస్.

అతనొక సిద్ధాంతంకోసం కాలి పోయాడు. అప్పుడతని పేరు గిర్డోయానో బ్రూనో.

అతను సామాన్య జన సంక్షేమంకోసం, తనను తాను రణంగా మార్చు కొన్నాడు. అప్పుడతని పేరు లెనిన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అతను తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను సత్యాహింసలుగా మార్చుకొన్నాడు. అప్పు డతని పేరు మహాత్ముడు.
అతను కరుణను కావ్యబద్ధం చేశాడు. అప్పుడతని పేరు భవభూతి.
అతను, సుందరమైన స్వప్నాలను, అక్షరాలలోకి ఆహ్వానించాడు. అప్పుడతని పేరు రవీంద్రుడు.
అతను విశ్వవిజేతను కావాలని, దండయాత్రలు చేశాడు. అప్పుడతని పేరు అలెగ్జాండర్.
అతను ఉన్మత్తుడై ప్రపంచాన్ని యుద్ధాగ్ని గుండంలోకి తోశాడు. అప్పుడతని పేరు హిట్లర్.
అతని - అసలు పేరు మనిషి !
మహానుభావుడైన, మహాక్రూరుడైన మనిషి !!
(20-9-89 బుధవారం)
చిన్నీ ! నీవు నేను కలిసి ఉండడం స్వప్నమా ? అయితే ఆ బంగారు స్వప్నం మరల మరల రావాలని కోరుకుంటూ, నిదురు కోసం ఎదురు చూస్తూ ఉంటాను.
నీవు నానించి దూరం కావడమే స్వప్నమా ? అయితే ఈ దుస్వప్నం తొరగా కరిగిపోవాలని, కోరుకొంటూ, మెలకువకోసం ఎదురు చూస్తూ ఉంటాను.
ఇప్పుడు నాకు సాయంకాలాలంటే భయం.
ఇప్పుడు నాకు సాయంకాలాలంటే అసహ్యం.
ఓ సాయంకాలం నేను నా మాటను పోగొట్టుకొన్నాను.
ఓ సాయంకాలం నేను నా పాటను పోగొట్టుకొన్నాను
ఓ సాయంకాలం నేను నా సంగీతాన్ని పోగొట్టుకొన్నాను.
ఓ సాయంకాలం నేను సంతోషాన్ని పోగొట్టు కొన్నాను
ఓ సాయంకాలం నేను నా స్వరూపాన్ని పోగోట్టుకొన్నాను.
ఓ సాయంకాలం నేను నా కాంతమ్మను పోగొట్టుకొన్నాను.
అదే సాయంకాలం నన్ను నేనే పోగొట్టుకొన్నాను ...
"నేను నిన్ను పిలవలేదే ? నువ్వెందుకొచ్చావమ్మా ?" అన్నాడతను ఆమెవేపు ఆశ్చర్యంగా చూస్తూ.
ఆమె నవ్వింది !
"నిజమే ! నీవు పిలవ లేదు. కానీ మనసులో తలచుకొన్నావు. పిలుపు విని పిస్తుంది. తలపు వినిపించదు. పిలిచినా, తలచినా నా దృష్టిలో వొక్కటే కన్నా ! అందుకే, ఇలా చక్కావచ్చాను !" అన్నదామె, అతని జుత్తును చిందర వందర చేస్తూ ...
(21-9-89 గురువారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిన్నీ ! నీ గురించిన ఆలోచనలను దాచుకొందామని, అంతరంగ పేటికను అలా తెరిచాను. అశ్రుజలాల మధ్య తూగుతున్న అపరంజి పుష్పంలాగా నీవే కనిపించా వక్కడ.

అక్షరం చుట్టూ ముసిరిన అనవసరపు టర్థాలను తరుముకొంటూ పోయాను. పోగా పోగా పోగా, 'శ్రీ' కారంలాగా నీవే కనిపించావు నవ్వుతూ.

శబ్దాన్ని బంధించి ఉంచిన నిశ్శబ్దపు నిగళాలను బద్దలు కొట్టుకొంటూ వెళ్ళాను. వెళ్ళగా వెళ్ళగా వెళ్ళగా, 'ఓం'కారంలాగా నీవే కనిపించావు వెలుగుతూ ...

(22-9-89 శుక్రవారం)

దయచేసి నన్నిప్పుడు పలకరించకండి
నేనిప్పుడు స్మృతికణం మీద మేను వాల్చిన వాణ్ని
జ్ఞాపకాలను పండిస్తున్న వాణ్ని
పంటను దాచుకొందుకు, అక్షరాల గాదెలను ఆశ్రయిస్తున్న వాణ్ని
నన్నిప్పుడు మీరేదడిగినా సరే - పిడికెడు స్వప్నాలనూ, దోసెడు జ్ఞాపకాలనూ మాత్రమే ఇవ్వగలిగిన వాణ్ని
విశుద్ధమైన ఆశీర్వాదం కోసం ఎదురు చూస్తున్న వాణ్ని ...

(23-9-89 శనివారం)

"ఆ రెండు స్వప్న కపోతాలనూ, నీకు కానుకగా ఇద్దామని, నిదుర వలను నిశ్శబ్దంగా వాటిమీద కప్పాను. అదేదో కథలో చెప్పినట్టుగా, వలతోబాటు, అవీ, అంతర్థాన మయ్యాయి. అంచాతనే రిక్తహస్తాలతో వచ్చాను" అన్నాడతను ఖిన్న వదనంతో.

ఆమె సన్నగా నవ్వింది.

"నీకన్నా ముందుగా నీ కానుకలే నాదగ్గర కొచ్చాయి కన్నా ! కానుకలు మాత్రమే పంపించి, నీవు రావడం మానేస్తావేమో నను కొన్నాను. నీవు లేకుండా, నీ కానుకలు మాత్రం నాకెందుకు ? నాకు నీవు ముఖ్యంగానీ, నీ కానుకలు కావుగదా ! అయినా - మనసు లోతుల్లో, ఎక్కడో ఓ ఆశ - నీవు తప్పకుండా వస్తావన్న ఆశ - కదులుతూనే ఉంది. అలాగే వచ్చావు" అన్నదామె, అతన్ని హృదయానికి హత్తుకొంటూ.

"చిన్నీ ! నీలాల నింగికి, సువీవ్రతీరాన ఉన్నావు. నేనా తీరాన ఉన్నాను. నేనిక్కడా, నీవక్కడా - బొత్తిగా బాగాలేదు. నాకెప్పుడూ, నీతోనే ఉండా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లని" - అతను వాక్యం పూర్తిచేయలేదింకా.
"నాకూనూ" అన్నదామె, అతని లాల్చీని సరిచేస్తూ.
"ఓ చుక్కల తేరునన్నా పంపించరాదా ?" అన్నాడతను.
"కన్నా !"
"లేదా - నన్నే చుక్కల రథంగా మార్చమని, నీ ఈశ్వరునితో చెప్పరాదా? అప్పుడు - నిన్నా రథం మీద ఆసీనను చేసి, భువన భువనాలనూ చుట్టివస్తాగదా !" అన్నాడతను.

ఈ మాట వింటూనే, ఆ స్వప్నకపోతాలు రెండూ, వొరిగి పోతూ, ఎగిరి పోతూ ...

(24-9-89 ఆదివారం)

నేనెంత మాత్రం కారణం గాని నా "కులం", నన్ను కనిపించని కటకటాల్లో బంధించింది. నా దరిద్రం నన్ను ఏడు నిలువుల ఊబిలో ముంచింది. నా అవిద్య నన్ను చాలా వాటికి అనర్హుణ్ని చేసింది. నిజమే గానీ, ఇవేవీ నా మనో ప్రపంచాన్ని పెద్దగా ప్రభావితం చేయలేకపోయాయి.
మొదట్లో - ఆ నా ప్రపంచం - స్వల్పమయిందీ, అల్పమయిందీ కూడా. రానురాను, దాని సరిహద్దులు సాగుతూ సాగుతూ వెడుతున్నాయి. ఆ ప్రపంచపు ఒక సరిహద్దు, ఇప్పుడు ఈశ్వరుని పాదాలదాకా విస్తరించింది. మరో సరి హద్దు, సామాన్యజనహృదయాంతరాళాంతరాలదాకా విస్తరించింది. మిగిలిన రెండువైపులా, కరుణ, మానవతలు, సరిహద్దు లయ్యాయి.
నా కులంగానీ, నా దారిద్ర్యంగానీ, నా నిరక్షరాస్యతగానీ, ఈ నా మనోప్రపంచ విస్తరణను అడ్డుకొనలేకపోయాయి.
ఈశ్వరుడే నా వాడయినప్పుడు, ఇంక నాకు - దేన్ని గురించి మాత్రం దిగు లెందుకు ?

(26-9-89 మంగళవారం)

చిన్నీ ! 'రాయవలసిం దేదో రాశాను' అని, కలం ముడిచేస్తున్న సమయాన, మెల్లగా ఓ గుర్తు తలెత్తి చూస్తుంది; ప్రగాఢ తిమిరంలోంచి తొంగిచూసే, ప్రత్యూషంలాగా; అసలు రాయవలసింది నేనింకా ప్రారంభించనే లేదని. విగ్రహారాధనమంటే నాకు బొత్తిగా గిట్టదు. అనేక సంవత్సరాలపాటు, దేవాలయాలను బహిష్కరించాను—అక్కడ దేవుళ్ళు, దేవతలూ విగ్రహాలుగా ఉంటారని; కానీ - నీ రాక నన్ను మార్చివేసింది. 'నిన్ను ఆరాధించాను' అర్చించాను. ఇప్పుడది ఈశ్వరారాధనదాకా విస్తరించింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నా చేత అర్చనలందుకోవాలన్న కోరికతో, ఈశ్వరుడే, నీ రూపంలో నా ముందు కొచ్చి, ఆరాధనలోని అమేయానందాన్ని అనుభవ ప్రాంగణంలోనికి తెచ్చి, దానికి నేను వశుణ్నయి పోయాక, కాంతమ్మగా కరిగిపోయి, తనుగా మిగిలి పోయాడనుకొంటున్నాను ...

(27-9-89 బుధవారం)

అసలైన రచయిత పరుసవేదిలాంటివాడు. ఎలాంటి మామూలు లోహాన్నయినా, మేలిమిబంగారంగా మార్చగలుగుతుంది పరుసవేది. రచయితకూడా అంతే! చాలా సాదా సీదా సన్నివేశంలోనే, అతనొక అపూర్వమైన దృశ్యాన్ని చూస్తాడు. అలా చూడడమూ, చూడలేకపోవడమూ, రచయిత సంసార్కం మీద ఆధారపడి ఉంటుంది.

తను దర్శించిన దానిని, మనదాకా తీసుకురావడంకోసం, భాష, శిల్పం, ప్రక్రియ, లాంటి సాధనాలన్నీ ఉపయోగ పడతాయి. ఎక్కువ సందర్భాల్లో ఈ సాధనాల పనివాడి తనాన్ని చూసీ, మెరుపుల్ని చూసీ, చప్పుళ్ళను 'చూసీ' మనం సంతోషిస్తూ ఉంటాం. ఈ "గొడవ" ఎప్పుడు బయలుదేరుతుందంటే, దర్శనం మసకమసగ్గా ఉన్నప్పుడూ, కొత్తగా లేనప్పుతూ, ఆ లోపాలను జాగ్రత్తగా కప్పిపుచ్చుకొనేందుకు, మిగతా సరంజామా పెరిగిపోతుంది. అందంగా ఉండే పెళ్ళికూతురుకు, అలంకారా లెందుకు?

మనం - అమ్మాయిగారి అసలు రూపం చూడకుండా, లేదా - అమ్మాయిగారి లొసుగుల మీదినుంచి మన దృష్టి మళ్ళించేందుగ్గాను,ధగధగల నగలతో, అలంకారాలతో తీర్చి దిద్దడానికి, దీనికి తేడా లేదు.

ఓ గొప్ప రచయిత - తనను తాను చీల్చుకొని కాల్చుకొని, ఒక నూత నాంశాన్ని దర్శిస్తాడు. అది - కొత్తగా, మెరుస్తూ ఉంటుంది. కొత్త గొంతుకతో అరుస్తూ ఉంటుంది. ఆ మెరుపును కని, ఆ అరుపును విని, ఉలికిపడిన మామూలు వారందరూ, అతన్ని అనుసరిస్తారు, అనుకరిస్తారు. ఆ మెరుపును కాస్త అటు మారుస్తారు. ఆ అరుపును కాస్త ఇటు మారుస్తారు. మార్చి - ఆదర్శనాన్ని - తమ సొంతంగా చెలామణీ చేసుకొంటూ బతికేస్తారు. ఈ బతుకు, నాలుగైదు దశాబ్దాలపాటు కొనసాగుతుంది. జనం - ఈ పాత సరుకుతో విసుగెత్తి పోతారు. చిల్లర మల్లర వ్యాపారస్థులు, అమ్మకాలు లేక, బేరాలు సాగక, పొట్టగడవక దొంగలుగా, గజదొంగలుగా మారిపోతారు ...

అందరికీ తెలిసినచోట్లనించీ, కొందరికే తెలిసినచోట్లనించీ విషయాలను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"సేకరించి", సొంత సరుకుగా చెలామణీ చేసుకొంటూ రోజులు వెళ్ళబుచ్చుతారు. మామూలు ముత్యంకన్నా, నకిలీ ముత్యం ఎక్కువ ధగధగలాడినట్లే, సేకరించి సొంతం చేసుకొన్న ఈ దొంగ సరుకూ్కడా, మిలమిలలాడి పోతూ ఉంటుంది.

అందమైన ప్రకటనలు చూసి, ఆకర్షితులమయి, కొనుక్కొన్నమందులు, పని చేయకపోతే కలిగే నిరాశవంటిది, ఈ సరుకు కొనుగోలుదారుల్లోనూ కలుగుతుంది. అప్పుడు వారు కొత్త ఉత్పత్తులకోసం ఎదురు చూస్తారు. ఈ దశను కూడా కొంతమంది సద్వినియోగం చేసుకొని జేబులు నింపుకొంటారు.

ఇలా జరగ్గా జరగ్గా జరగ్గా, మళ్లీ ఓదార్మనికుడు రంగ ప్రవేశం చేస్తాడు. తనలోనూ, తన పరిసరాలలోనూ, కొత్తదనంకోసం అన్వేషించి, శోధించి, ఆ జీవధాతువును పట్టుకొంటాడు. దానిని మనం అవగాహన చేసుకొనేలా చెప్పడం కోసం, కొత్త ప్రతీకలను సృష్టించుకొంటాడు. కొత్త గొంతుకను సృష్టించుకొంటాడు. కొత్త పాటను సృష్టించుకొంటాడు. కొత్తబాణీని సృష్టించుకొంటాడు. మన చుట్టూ ఉన్న మామూలు వాటినే, తన మహేంద్రజాలంతో అద్భుతాలుగా మారుస్తాడు. అలా కొంత కాలం సాగిపోతుంది. మిగిలిన వారికిది వరవడిగా మారిపోతుంది. కొంత కాలనికిదీ మొఖం మొత్తుతుంది. మళ్ళీ ఎప్పటికో, ఒక మహానుభావుడు అవతరిస్తాడు.

ఒక రచన, ఏ దేశానికి సంబంధించిన దయినా, ఏ కాలానికి సంబంధించిన దయినా కావచ్చు - పేర్లు మార్చి చదువు కొంటుంటే, అన్ని దేశాలకూ, అన్ని కాలాలకూ సంబంధించినదిగా ఉన్నప్పుడు - అది మంచి రచన అవుతుంది. అది మనకు తెలిసినట్టుగా ఉండాలి. మనకు తెలిసిన దానిలోంచే, మనకు తెలియని దేదో తెలియ చెబుతున్నట్టుగా ఉండాలి.

x x x

"ఎందుకిలా వచ్చావ్?" అన్నాడు ఈశ్వరుడు.

అతగాడు, తనెందు కొచ్చిందీ చెప్పబోయాడు. కానీ చెప్పలేకపోయాడు. చెబుదామని ప్రయత్నించిన ప్రతిసారీ, అతను దుఃఖంలా మారిపోతూనే ఉన్నాడు.

"స్థిమితపడు. నెమ్మదించుకో. నే నున్నానుగదా! నీకేం కావాలి? ఎందుకిలా వచ్చావ్?" అన్నాడు ఈశ్వరుడు మళ్ళీ.

అతగాడు మరోసారి వెక్కివెక్కిపడ్డాడు. గుక్కిళ్ళు పడ్డాడు. ఈశ్వరుణ్ణి తడిసిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కళ్ళలోంచి చూశాడు.

"స్వామీ! నేనో దురదృష్టవంతుణ్ని. జన్మజన్మలుగా కొంచెం కొంచెంగా నేను సేకరించుకొన్న అమృత బిందువులను, ఓ భాండంలో దాచుకొన్నాను. ఓ సాయంసంధ్యవేళ; ఆ అమృతభాండాన్ని నా నించి ఎవరో అపహరించారు. నేనా దొంగకోసం ఇప్పటికీ వెదుకుతున్నాను. దొరకలేదు. మీతో చెప్పుకొందామని, ఇలా వచ్చాను." అన్నాడతను

ఈశ్వరుడు నిట్టూర్చాడు. అతని నేత్రాలూ అశ్రుతప్తాలయినాయి.

"నాకు న్యాయం దయచేయించండి. సెలవు" అంటూ, అతగాడు ఈశ్వరుని నుండి వచ్చేశాడు.

వచ్చాక తెలిసింది, అమృతభాండాన్ని దొంగిలించిన మహా తస్కరుడు ఈశ్వరుడేనని.

"స్వామీ! కాపాడవలసిన నీవే, రాపాడి చంపుతుంటే, నే నింకెవరితో చెప్పుకోనయ్యా?" అన్నాడా దీనుడు, తానే దుఃఖంలా మారిపోతూ.

(30-9-89 శనివారం)

వ్యాపార నాగరికత మన జీవితాల్లోని ప్రతి మారుమూల భాగాన్నీ ప్రభావితం చేస్తున్నది. లాభార్జన దీని అంతిమ లక్ష్యం. ఈ లక్ష్య సాధనకోసం, వాణిజ్య వర్గాలు, సమస్తనైతిక విలువలనూ, బలిచేయడానిక్కూడా సిద్ధపడతాయి. ఈశ్వరుడూ, దేశమూ, సత్యమూ, ధర్మమూ, త్యాగమూ లాంటివన్నీ; మనకు వాణిజ్య వస్తువులే! ఆఖరుకు - మనం మగతనంతోనూ, ఆడతనంతోనూ కూడా, వ్యాపారం చేస్తున్నాం ...

(1-10-89 ఆదివారం)

"చిన్నీ! నీ వెళ్ళి పోయావు; నులి వెచ్చని పరిమళాలను నాకు మిగిల్చి, తీయని రంగుల్ని నాకు మిగిల్చి, మెరిసే జ్ఞాపకాలను నాకు మిగిల్చి, నీ వెళ్ళి పోయావు - నన్ను నీవు తీసుకొని, నాకు దుఖ్ఖాన్ని మిగిల్చి" అన్నాడతను.

"మిగిలిన వారందరిలాగా, నీవూ దుఖ్ఖించడం చూస్తే,నాకు నవ్వొస్తుంటుంది కన్నా! అందరికీ నేను చనిపోయిన మాట నిజమేగానీ, నీకూ చనిపోయానంటావా కన్నా? నీ స్మృతులలో నేను జీవించి ఉన్నాననుకొంటున్నాను. నీవున్నంత కాలం, నీ జ్ఞాపకాలున్నంత కాలం, నీతో, నేనూ ఉన్నట్లే కన్నా - దగ్గరగానో - దూరంగానో! కాదంటావా కన్నా?" అన్న దామె, అతని కన్నీటి నద్దుతూ ...

(4-10-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ప్రియా! ఒక్క నిమిషం ఆగు. నీ ఉద్విగ్న భరిత స్పర్శలతో నన్ను తరంగితం చేయకు" అన్నది కొలను, తన మీద వాల బోతున్న పవనునితో.

"నీ సౌందర్యాన్ని చూస్తూ, నిన్ను స్పృశించకుండా ఉండడం నాకు సాధ్యం కాదు. నన్ను మన్నించు" అన్నాడు పవనుడు, కొలను మీదికి వంగ బోతూ. అతని తహ తహలను చూసి, లోలోపలే మురిసి పోయింది కొలను.

"నిన్ను దూరంగా ఉండమనేందుకు నేనెంత బాధపడుతున్నానో, నీకు తెలీదు... కాస్సేసాగు. కాస్త వోపిక పట్టక తప్పదు. అదే...చెప్పబోతున్నాను ... చాలా కాలం తరువాత... మేఘుడు వొస్తున్నాడట. ఆ వార్త విన్నప్పణ్నించీ, గిరి సుందరి పొంగి పోతోంది. అతని కిష్టమైనట్టుగా, అలంకరించుకొంటోంది. ఆ అలంకరణ ఎలా ఉన్నదో, నాలో చూసుకొందామని చాలా సేపుగా కాచుకొని ఉంది పాపం! మరి - నువ్వేమో నన్ను తాకుతూనే ఉన్నావు. అలలు రేపుతూనే ఉన్నావు. తన ప్రతిబింబాన్ని చూసుకొనేంత వరకైనా, అలలు రేపకుండా ఉండు, నీకు పుణ్యముంటుంది." అన్నది కొలను, మెరిసే కళ్ళతో, పవనుని వేపు చూస్తూ.

అతగాడు చిరచిరలాడాడు. గిరి - సుందరి వేపు కొరకొర చూశాడు. అతని చూపుల్లోని ఆకలిని చూసి, మరోసారి నవ్వుకొంది కొలను.

"మేఘుణ్ని, ఇటుగా తెచ్చింది నీవే గదా ! అతనూ నీలాంటి వాడే గదా! నీకున్న తొందర అతనికీ ఉంటుంది గదా! అందుకే - ఒక్క క్షణం తమరు కదలకుండా ఉంటే చాలు; గిరి సుందరి, ముఖం చూసుకు వెడుతుంది." అన్నది కొలను.

అని - ఓ క్షణం ఆగింది. ఆగాక - ఇంకెవరన్నా ఉన్నారేమోనని, అటూ ఇటూ చూసింది. ఎవరూ లేరని రూఢి చేసుకొన్నాక -

"ఇక - ఆ తరువాత - తమ ఇష్టం !" అన్నది కొలను, గాలికే వినిపించేంత మెల్లగా ...

(5-10-89 గురువారం)

"నే నామెను పిలిచాను. నువ్వెందుకొచ్చావు స్వప్నమా?" అన్నాడతను.

ఆ స్వప్నం అతని వేపు చూసింది. ఆ చూపులో కాస్త కోపం ఉంది. కాస్త విసుగు ఉంది. కాస్త నవ్వు, కాస్త జాలికూడా ఉన్నాయి.

"నీ మతి మరుపు కాదుగానీ, చెప్పి చెప్పి చెప్పి - నాకు, ప్రాణం విసుగెత్తి పోతోంది కన్నా! ఇది వరకున్నూ ఇదే ప్రశ్నను నువ్వు చాలా సార్లడిగావు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనూ చాలా సార్లు చెప్పాను. ఈసారి – ఇదే ఆఖరి సారిగా చెబుతున్నాను. ఆమె వేరూ, నేను వేరూ కాదు; మేమిద్దరమూ వొక్కటే! ఇద్దరిలో ఏ వొకరిని పిలిచినా, రెండవ వారినీ పిలిచినట్లే! కాకపోతే, నీవు మెలకువగా ఉన్నప్పుడు, ఆమెగా కనపడతాను నిదురపోతున్నప్పుడు, స్వప్నంగా కనపడతాను. అంతే తేడా!" అన్నదామె నవ్వుతూ.

చిన్నీ! నీవు నవ్వినప్పుడల్లా నేను నవ్వినట్టుగా ఉంటుంది. నీవు అలసినప్పుడల్లా, నేను అలసినట్టుగా ఉంటుంది. నీవు కలగంటున్నప్పుడల్లా, నేను కలగన్నట్టుగా ఉంటుంది. నీవు "కన్నా" అని పిలిచినప్పుడల్లా, నన్ను నేనే పిలుచుకొన్నట్టుగా ఉంటుంది.

నీవు - శీతాకాలపు నీరెండలాగా ఉంటావు. గాలిలో కరిగిన పరిమళంలాగా ఉంటావు. కూని రాగాలు తీస్తున్న క్షుర స్వప్నంలాగా ఉంటావు, కాలావధుల్లేని అనుభూతిలాగా ఉంటావు ...

(6-10-89 శుక్రవారం)

"నీవు నన్ను మన్నించాలి." అన్నాడతను. ఆమె ముందు మోకరిల్లి, రెండు చేతులూ జోడించి.

అప్పుడామె – ఎర్రగా కందిపోయిన, తన పెదవులను అద్దంలో చూసు కొంటున్నది. ఆ పెదవుల వేపు అతను కూడా జాలిగా చూశాడు.

"అందమైన నీ పెదవులు, నా పేరును పదే పదే పలుకుతున్నప్పుడు, ఆ పెద వుల కదలికను తదేకంగా చూడడం నా కిష్టం! ఆప్యాయత నలముకొన్న నీ గొంతుకను, వింటూ వింటూనే కరిగిపోవడం నాకు మరీ మరీ ఇష్టం! నా ఇష్టమే నేను చూసుకొన్నానుగానీ: నా నామాక్షరాలు నీ పెదవులను తాకి వాటిని నొప్పించుతాయేమోనన్న అనుమానం కూడా నాకు రాలేదు." అన్నా డతను, ఆమె వేపు బితుకు బితుగ్గా చూస్తూ.

ఆమె మెత్తగా నవ్వబోయింది!

పెదవులు సహకరించక ఆగిపోయింది. అతని మంచితనానికి మురిసి పోయింది. తనపట్ల అతనికున్న పిచ్చివ్యామోహానికి కరిగిపోయింది ...

(7-10-89 శనివారం)

అతను తలొంచుకొని నడుస్తున్నాడు. తనేమో తలెత్తుకొని నడుస్తోంది. అతను "ఊఁ" కొడుతున్నాడు. తనేమో అందమైన కబుర్లను ఆసక్తికరమైన శైలిలో చెప్పుకు పోతున్నది. అవన్నీ వింటూ వింటూ, మధ్య మధ్య నవ్వుకొంటూ నవ్వుకొంటూ నడుస్తున్నాడతను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హఠాత్తుగా నిశ్శబ్దం ?

"నడుస్తూ నడుస్తూనే నడవడం మానేశావేం చల్లగాలీ? మాటాడుతూ, మాటాడుతూనే, మాటాడడం మానేశావేం చల్లగాలీ?" అన్నాడతను, ఇప్పటిదాకా తనతో కబుర్లాడుతూ వచ్చిన చల్లగాలి, తన కల్లంత దూరంలో నిలబడి ఉండడం చూసి.

ఆ ప్రశ్న వింటూనే, చల్లగాలి రవంత ఉలికి పడింది. మెల్లగా తలెత్తి ఎదురుగా చూసింది. చల్లగాలి చూసిన వేపుగా అతనూ చూశాడు. ఆ వేకువ వెలుగులో, ప్రత్యూష పవనం లాగా, ఓ అమ్మాయి కూడా ఎదురుగా వస్తోంది. వస్తూ వస్తూనే, పక్కనున్న పచ్చిక వేపుగా తిరిగింది. "నేను సున్నితంగా తాకినా, ఆ సుందరి కంది పోతుందేమోనని అనుమానం వేసింది. అందుకే కదలడం కూడా మానేశాను." అన్నది చల్లగాలి.

అతను, అదోలాగా నవ్వాడు.

"నమ్మలేదు గదూ?" అన్నది చల్లగాలి.

"నేను నమ్మడమూ నమ్మకపోవడం సమస్య కాదు. 'ఆమెను చూస్తూనే దిగ్భ్రమ చెందాను' అనుకొన్నాను. నిజంగా - నువ్వలానే అని ఉండవలసింది. ఎందుకనో అనలేక పోయావు." అన్నాడతను.

"నిజం కూడా అంతే - కానీ - కొన్ని నిజాలను బయటపెట్టి, నెత్తిమీదికి తెచ్చుకోవడం, నా కిష్టం లేదు. ఒక సారేం జరిగిందంటే -" అని, చెప్పడం ఆగి పోయింది చల్లగాలి, ఓ పాత అనుభవం గుర్తుకొచ్చి ...

(8-10-89 ఆదివారం)

నీ వంటే నాకెందుకింతే ఇష్టం ?
నీ వంటే నాకెందు కంత భక్తి ?
నీవో ఆకుపచ్చని ఆలోచనలాగా కనబడతా వెందుకని ?
నీవో నిత్యమంగళాశాసనంగా కనబడతా వెందుకని ?
నీ ప్రతి స్పర్శా పాటగా మారి ప్రవహిస్తుందెందుకని ?
నీ ప్రతి నవ్వూ వెలుగులా మారి పరిమళిస్తుం దెందుకని ?
నీ జ్ఞాపకాలలోకి జారిపోతూ జారిపోతూనే,
నన్ను నేను కోల్పోతూ కోల్పోతూనే,
నేనే నీ జ్ఞాపకంగా మారిపోయా నెందుకని ?
నీ కన్నులలో నన్ను నేను చూసుకొంటూ, చూసుకొంటూనే
నాకై నేను కరిగిపోతూ, కరిగి పోతూనే,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనే నీ చూపుగా మారిపోయా నెందుకని ?
ఆచి తూచి నీ అడుగులో అడుగు వేస్తూ తీస్తూనే
తడబడుతూ. తట్టుకొంటూ, దిద్దుకొంటూ సద్దు కొంటూనే
నేనే నీ అడుగుగా మారిపోయా నెందుకని ?
నీ వంటే నాకంత ఇష్టం ఎందుకని ?
నీ వంటే నాకంత భక్తి ఎందుకని ?

(9-10-89 సోమవారం)

పరిసరాల్లో వెదికాను, నగరమంతా వెదికాను, పసందైన కాసిని పసిడి కల లను కొనుక్కొందామని.

కలల కేం భాగ్యం, చాలా చోట్ల కనిపించాయి. చాలా రకాలవీ కనిపించాయి. అయితే - అవన్నీ నాసి రకంవి, కల్తీవి. ఈ పవిత్ర దేశంలో మంచి కలలు కూడా దొరకడం లేదు.

ఆప్యాయతనూ, అనురాగాన్నీ రంగరించి, మంచితనాన్నీ.. మానవత్వాన్నీ జతచేసి, ఓర్పునూ, నేర్పునూ మిళితం చేసి; అయిదడుగుల, రెండంగుళాల ఎత్తుండే ఓ తెలుగింటి ఆడపడుచులో వొద్దికగా అమర్చితే, ఆమె నీలాగానే ఉంటుంది.

నీ జ్ఞాపకం - నాలోని తలుపులను తెరుస్తుంది. అప్పుడు నే నా స్వర్ణమంజూష లోకి తొంగి చూస్తాను. చీకట్ల సుడిగుండాలు, ఇంద్ర ధనుస్సుల వెక్కిరింతలు, క్రిక్కిరిసి ఉంటాయక్కడ. పెదవులు - నా ఆలోచనల్ని మాటలుగా మారుస్తాయక్కడ. వేళ్ళు - నా మాటల్ని, అక్షరాలుగా మారుస్తాయక్కడ. నా ఆలోచనలను మాటలుగా మార్చిన పెదవులు అలసిపోయి, నీ నుదుటి మీద విశ్రాంతి తీసుకొంటాయి ...

ఓ రెండు నీడలు, ఎదురెదురుగా, దగ్గర దగ్గరగా ఉండడం చూశాను. అవి- నీవూ, నేనూ కాదుగదా ?

(10-9-89 మంగళవారం)

'నాలోని నీవు' పుస్తకానికి సంబంధించిన సావనీర్లు అందరికీ ఇచ్చాను. ఆమెగారికీ ఇద్దామనిపించింది. ఆమె కనిపించింది. సుమారు రెండేళ్ళ కిందట గావును, ఆమెను గురించి నానీతో అన్నాను -

"ఆమె వీనస్ లాగా ఉంటుంది. ఆఫ్రోడైట్‌లాగా ఉంటుంది. క్లియోపాత్రా లాగా ఉంటుంది. శాఫోలాగా ఉంటుంది. ఉమర్ ఖయ్యాం రుబాయత్‌లాగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉంటుంది. మెహిదీహసన్ గజల్ లాగా ఉంటుంది. వికసించిన పాటలాగా ఉంటుంది" అని.

"అక్షరాలా !" అన్నాడతను.

"ఐతరేయం' చదవలేదు. అక్కడక్కడ చూశాను ... మిమ్మల్ని అప్పుడప్పుడు ఇక్కడే చూస్తున్నాను గనక, ఇంటికి రాలేదు" అన్నది బెరుకు బెరుగ్గా.

లోపలేదో,దాచుకొని,పైకి మాత్రం మాట్లాడకపోతే బావుండదు గనక మాట్లాడుతున్న దానిలాగా కనిపించింది నాకు. నిరాశ, నిస్పృహ అన్నవి అలముకొనవలసింది నాకు గానీ '—' గారికి కాదు.

ఒక గొప్ప అవకాశాన్ని తను జారవిడుచుకొంది చెప్పరానంత పిరికితనంతో. అలా తొందరపడి జారవిడుచుకొన్నందుకు, అంతరాంతరాల్లో బాధ పడుతున్నట్లు బయటపడితే, అపజయాన్ని, అంగీకరించినట్లవుతుంది గనక - తనలో ఏ గొడవా లేనట్లు, తాను సుఖంగానే ఉన్నట్లూ కనిపించడానికి, వ్యర్థ ప్రయత్నం చేస్తున్నది.

"ఇదే సత్య" మని నాకూ, '—' గారికీ కూడా తెలుసు.

కొన్ని జీవితాలు శాపగ్రస్తాలు, అంతే !!

(12-10-89 గురువారం)

నీవు జ్ఞాపకం వచ్చావో -

పూలతో, మొగ్గలతో, పిందెలతో, కాయలతో, రంగులతో నిండిపోయిన వృక్షాలతో, నా మనోద్యానమంతా ఆహ్లాదమయమై పోతుంది. ఎక్కడెక్కడి సంగీతాలూ, తుంపురులై, తునకలై, వాసలై, వెల్లువలై నాలో నిండిపోతాయి.

రా చిన్నీ రా !

నా ఆలోచనల నిండా నిండిపో. నా అక్షరాల నిండా నిండిపో. నా గుండెల నిండా నిండిపో. నా లోపలంతా నిండిపో. నా వెలుపలంతా నిండిపో. నా అంతటా, నా అంతటా, నా అంతటా నిండిపో ...

(25-10-89 బుధవారం)

చిన్నీ ! నేను, శ్యాంప్రసాద్, వేకువజామునే బీచ్‌కెళ్ళాం ఇవాళ. సంతోషంతో కరిగిపోయిన వానమబ్బులు, చినుకులుగా వర్షించి, నీవులేవని తెలిశాక, ఎలా ఎలా పోయాయి. ఎండి పోయాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆకాశంలోంచి వాలికిపోతున్న స్వర్ణ ధారల్లాగా, సముద్రంలోకి జారిపోతున్నాయి మెరువులు.

ఒకప్పుడు, నీ - నా - పాదాలను తాకిన సముద్ర తరంగాలు, ఇప్పుడు నా పాదాలను మాత్రమే చూసి, నీ పాదాలు కనిపించక, నావేపు చూసి, ఏడుస్తూ సముద్రంలోకి వెళిపోయాయి. మనకోసం తాము పదిలంగా పట్టుకొచ్చిన' నురుగు పూలను తీరం మీదకు విసిరేస్తూ ...

ఇంతకాలంగానూ, అక్షరాలకూ, జీవితాలకూ అతుకులు వెడుతున్నాను. జీవితాన్ని అక్షరాలలోకి ఆహ్వానిస్తున్నాను. అయితే జీవితం అంకెల్లోకి ఇరుక్కుపోయిందన్న సత్యాన్ని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నాను. కాని ఏం లాభం? నేనా సత్యాన్ని గ్రహించే సమయానికి, జీవన గీతంలోని తుది చరణం మీదికొచ్చేశాను ...

(27-10-89 శుక్రవారం)

చిన్నీ ! నేను నీకేమవుతానో తెలీదు. కానీ, నీవు - నీవు - నానిశ్శబ్దచ్ఛాయా ప్రవాహానివి, నా షోడశ వర్ష స్వప్నానివి, నా జ్యోతిర్మండలానివి, నా వియద్గంగవు, నా జ్యోత్స్నాపాతానివి, నా ఉత్తమ ఆదర్శానివి, నా ఉదాత్తమైన ఆలోచనవు, నా జ్ఞాతమైన అజ్ఞాత పథానివి, నా అవగతమైన అంతరార్థానివి, నా సత్యానివి, శివానివి, సుందరానివి.

అన్నింటికీ దూరంగా, దూరదూరంగా; ఆవలగా, ఆవలావలగా; అందుబాటులో ఉన్నట్లనిపించే అంద (రా)నంత ఆవలగా; అద్వితీయంగా; అనన్యంగా; అభివ్యక్తాతీతంగా ఉన్న గొప్ప వెలుగువు నీవు నాకు.

కానీ - నేను? నేను నీకేమవుతానో నాకు తెలీదు. ఓ సారి కనిపించి చెప్పరాదా చిన్నీ, నేను నీకేమవుతానో ?

కన్నీటిలో తడిసిన నా అందమైన కలల్ని ఎక్కడ ఆరేసుకోవాలో తెలీడం లేదు. పొంగులెగసి పోతున్న నా జ్ఞాపకాలను, ఏ గుండెలోయల్లోకి మళ్ళించాలో తెలీడం లేదు.

నీ గురించి నిజంగా రాయవలసిన దానికన్నా; రాయాలని నేనను కొన్నదే తక్కువ; రాసిందేమో మరీ తక్కువ.

అద్భుతమైన పుష్పాలను ఫలాలను పండించడం కోసం, జీవిత క్షేత్రంలో విత్తనాలు నాటుదామని వాటిని వెలికి తీశాను. అవన్నీ నన్ను చూస్తూనే గొల్లుమని ఏడ్చాయి ...

(28-10-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీ గురించి ఎందుకు రాస్తున్నానో తెలీక, నీ గురించి మాత్రమే ఎందుకు రాస్తున్నానో తెలీక, చాలామంది కారణాలడుగుతున్నారు. అలా అడిగిన ప్రతిసారీ, తలవొంచుకొని శిలాప్రతిమనయి పోతున్నాను; మనిషిగా ఉంటే, మరలా శిరసెత్త వలసి వస్తుందేమో నని!

నీ సౌజన్యాన్ని, నీ సహృదయత్వాన్ని, నీ అనురాగాన్ని; అంతో ఇంతో తప్ప సంపూర్ణంగా అక్షరబద్ధం చేయలేని నా చేతగాని తనానికి, నేను సిగ్గు పడుతున్నాను.

నీవు నాకెప్పుడూ ఉన్నావు చిన్నీ !

ఇదివరకు స్పర్శా రూపంలో, ఇప్పుడు స్పర్శా తీత రూపంలో; ఇదివరకు అనుభవానికి చేరువగా, ఇప్పుడేమో అనుభూతికి చేరువగా.

నీవు నాతో ఎప్పుడూ ఉంటూనే ఉంటావు, ఉండకుండా నీవూ ఉండలేవు గనక ...

29-10-89 ఆదివారం)

"నాన్నా! జాగ్రత! ఎక్కడకూ కదలకు. నీకు మంచి ఫలహారం తెచ్చిపెడతాను." అన్నది తల్లి పులి, కొడుకు పులిని ఆప్యాయంగా నిమురుతూ.

కొడుకును పొదమాటున బజ్జో బెట్టి, కొమ్మలను రెమ్మలను కప్పి, పదే పదే వెను తిరిగి చూస్తూ వెళ్ళిన తల్లి పులి, అయిదు నిమిషలన్నా కాకముందే, ఉరుకులతో పరుగులతో వచ్చిపడింది !

"తెచ్చావా అమ్మా?" అన్నది కొడుకు పులి, తల్లికేసి పరిశీలనగా చూస్తూ.

"లేదునాన్నా! తెద్దామనే వాగుదాటాను. అంతలోకే మనిషి ఎదురు పడ్డాడు.'ఈ దుశ్శకునమేమిట్రా భగవంతుడా!' అనుకొంటూండగానే, వాడు - మన ఇంటి వేపే మళ్ళాడు. నాకు చచ్చేంత భయమేసింది. వాడేదో నిన్ను చేస్తాడని కాదు నాన్నా! క్రూరతనంవల్లా, తెలిసీ తెలియకా, నీవే వాడి మీదికి దూకి చీల్చి పారేస్తావేమోనని నాభయం! నువ్వేమో - నాకు లేకలేక కలిగిన మగ నలుసువు. నీదేమో అచ్చంగా - మీనాన్న గారి ధోరణి లాగే ఉన్నదాయె. ఆయన కూడా వొకసారి, చెబుతున్నా వినకుండా, మనిషి మీదికి దూకాడు. వాడి విషం తగిలి, నిమిషాల మీద అక్కడికక్కడే చనిపోయాడు. అలాగే నిన్నూ నేను, పొగొట్టుకోలేనుగదా నాన్నా ! ఒక్కగా నొక్క కొడుకువు. వంశానికంతా, నీ వొక్కడివే మిగిలావు నాన్నా!" అన్నది తల్లి పులి. కొడుకును, గుండెలకు హత్తుకొంటూ ...

(30-10-89 సోమవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నేను చూదా మనుకొంటున్న వాటిని, ఈ కళ్ళు చూడలేక పోతున్నాయి; ఈ కళ్ళు చూడగలుగుతున్న వాటితో నాకు బొత్తిగా అవసరం లేక పోతున్నది" అన్నాడతను కన్నీరు నించుకొంటూ.

"కన్నా! పదే పదే నన్ను తలుచు కొంటున్నావు. తలుచు కొన్న ప్రతి సారీ కన్నీరు పెట్టు కొంటున్నావు. అలా చేయొద్దు నాన్నా! నేనేమో - నీ కన్నుల్లోనే గదా ఉన్నాను! ఆ కళ్ళ నిండా నీరు నిండితే, నేను కరిగిపోనా కన్నా?" అన్నదామె అతని కన్నీటి నద్దుతూ.

(31-10-89 మంగళవారం)

"కొంత మంది, ఇతరుల అనుభవాలనుండి నేర్చు కొంటారు. ఇంకొంత మంది తమ అనుభవాల నుండే తప్ప ఏదీ నేర్చుకోరు. మనుషుల్ని గురించి నాకు తెలిసిందేదో చెప్పాను. నీవు వినలేదు. ఒక వేళ విన్నావేమో గానీ, నాకు నచ్చ లేదు. తప్పు నీది కాదు - నాదే! నీకు నచ్చేలాగా చెప్పలేక పోవడం నా లోపమే! మనం - ఇంకొంచెం సేపట్లో మనుషులమధ్య కెడుతున్నాం. అక్కడ, మనల్ని పట్టించు కొనేవారూ, పలకరించే వారూ, కనీసం - చూసే వారు కూడా ఉండరు. తన కంటూ ఏదో వొక ప్రయోజనం ఉంటే తప్ప, ఉంటుందన్న నమ్మకం ఉంటే తప్ప, ఈనాటి మనిషి - ఎవరినీ, దేనినీ పట్టించుకోడు. అందరి మధ్యా ఉంటూనే, అంధకార మయమైన ఆ ఏకాంతాన్ని భరించ లేక, మళ్ళీ ఈ అడవిలోకే వచ్చేస్తాం" అంటుందో పేద పురుగు నేను రాస్తున్న కథలో.

ఈ కథను తొందరగా పూర్తి చేయ గలిగితే బావుండును. మనుషుల మీద కోపం కాదు - భరించ లేనంత జాలి, ఏమీ చేయలేని, నిస్సహాయతల్లోంచి ఇలాంటివి వస్తా యనుకొంటాను ...

(1-11-89 బుధవారం)

నేనూ, '_' గారూ, దాదాపుగా రెండు గంటలు ఆ ఇంట్లోనే కూచున్నాం. ఆ రెండు గంటల్లోనూ, తన గురించి చాలా చెప్పు కొచ్చిందామె. తన చిన్ననాటి ప్రేమలు, తన కోసం కాలేజీ చుట్టూ, ఇంటి చుట్టూ తిరిగిన వారూ, ఉత్తరాలు రాసిన వారూ, ప్రెజెంటేషన్లు ఇచ్చిన వారిని గురించీ చెప్పింది. వారిలో ఎవ రెవరంటే తన కిష్టమో, ఎందు కిష్టమో కూడా చెప్పింది. ఎవరిని, ఎలా మోసగించిందీ, ఎందుకు మోసగించిందీ, ఎన్నెన్ని సార్లు మోసగించిందీ కూడా చెప్పింది, చాలా హాయిగా, సరదాగా, ఎలాంటి అరమరికలూ లేకుండా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నువ్వో అందమైన మోసానివని, కాస్త ఆలస్యంగా గ్రహించాను. అందంగా ఉండడం నీ జన్మ హక్కు. నీ అందాన్ని చూసి, కిర్రెక్కిపోయి, నీ చుట్టూ తిరిగి భంగపడడం వారి జన్మ హక్కు!" అన్నాను నవ్వుతూ.

"నేనూ ఓ సిగరెట్ కాల్చనా?" అంటూనే ఒకటి తీసుకొంది.

నేను వెలిగించాను. ఓ గుక్క పొగ పీల్చి, ఉక్కిరి బిక్కిరయి, దగ్గుతో, అవతలకు విసిరేయబోయి టేబిల్ అంచు మీద పెట్టింది. నేనే ఓగ్లాసు మంచి నీళ్ళు తెచ్చిచ్చాను.

"మనిద్దరం తప్ప, ఇంట్లో ఎవ్వరమూ లేరని తెలిశాక, నాతో కాస్త ఎక్కువ 'చనువు' తీసుకొంటావేమో నను కొన్నాను." అన్నదామె 'చనువు' అన్న చోట నొక్కుతూ.

కముట్టు కోడం, ముద్దెట్టు కోడం, కావలించుకోడం నాకు ముఖ్య మయితే; నీ కన్నా అందమైన వాళ్ళను ఎన్ను కోవడమూ, కొనుక్కోవడమూ, నాకిప్పు డేమాత్రం కష్టం కాదు. చాలా మందితో నీవు మనిషిగా ప్రవర్తించవని నాకు తెలుసు. నీ దగ్గర కొచ్చిన చాలా మంది, నీ ముందు, మనుషులుగా నిలబడ లేక పోయారనీ నాకు తెలుసు. నేను కాస్త మొండివాణ్ని ... ఇన్నేళ్ళుగా - దాదాపు, ఏడెనిమిది సంవత్సరాలుగా, మనం, దగ్గరగా తెలిసిన వాళ్ళ మయినా ఆ గీత దాటి, అరంగుళం కూడా నిన్ను ముందుకు రానివ్వ లేదు. నేనూ రాలేదు." అన్నాను, చాలా నెమ్మదిగా.

ముందుగా ఏమీ అనలేదు గానీ, తరువాత నావేపు చూసి, ఏడ్చేసింది పాపం! "మరీ గట్టిగా అన్నానేమో! అలా అనకుండా ఉండవలసింది" అన్నానే గానీ, ఓదార్చే ప్రయత్న మన్నా చేయలేదు.

"నాకు ఆకలిగా ఉంది" అన్నాను, ఈ దిక్కుమాలిన గొడవలోంచి, ఆమెను తప్పించుదామని.

"నాకు లేదు" అన్నది హాయిగా నవ్వుతూ.
"నీ నవ్వు చూశాక, నాకూ లేదు" అన్నాను.
"వెడతాను. ఇంకా కాంతమ్మ గారి దగ్గర కెళ్ళాలి, కబుర్లు చెప్పాలి"
ఆమె నన్ను కారులో తీసుకొచ్చి, కాంతమ్మ గారి సమాధి దగ్గర దించింది.
చిచ్చీ! ఇవ్వాళ నేనో మంచి పని చేశాను గదూ?
(2-11-89 గురువారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇన్నేళ్ళ తరువాత, నా కిప్పు డేమనిపిస్తున్న దంటే - 'జీవితమంటే ఒక రాజీ!' అని. ఒక సామరస్యమని. ఒకప్పటి నీకూ, ఇప్పటి నీకూ మధ్య; నీకూ, నీ పరిసరాలకూ మధ్య; నీకూ నీ ఆశయాలకూ మధ్య; నీకూ నీ దేవునికీ మధ్య; ఒక సామరస్య పూర్వకమైన వొప్పందం, ఒక సర్దుబాటు, ఒక సహజీవనం - అదీ జీవితమంటేనని!

మెహిదీపట్నం బస్టాండు దగ్గర 'ప—' కనిపించింది. ఆ అమ్మాయి మునుపటి లాగా లేదు.

"డబ్బిచ్చి మొగుణ్ని కొనుక్కో వలసిన అవసరం నాకు లేదు. నేనంటే అంగ లార్చే వాడు, భర్తగా నాక్కావాలి. డబ్బుకు అమ్ముడు పోయే వాడు మనిషి కాడు - పశువు. ముందుగా, అతగాడు నాకు నచ్చాలి. నేనూ అతనికి నచ్చా లనుకోండి. నాతో బాటు, వేలూ, లక్షలూ కట్నం తెస్తే తప్ప నేను పెళ్ళాంగా పనికి రానన్న వాడితో, నేను చేయబోయేది వ్యభిచారం గాని సంసారం కాదు. డబ్బు కోసం వొళ్ళమ్ముకొనే దాన్ని 'కులట' అంటున్నారు. ఆ డబ్బుకే ఓ మగాడు, తన మగతనాన్ని అమ్ముకొంటున్నప్పుడు, అతన్నేమనాలి?"

అయిదారు మాసాల కిందట, ఇంకాస్త ఎక్కువేనేమోమరి - 'ప-' ధోరణి, అచ్చంగా ఇలానే ఉంది. నాతో వాదించింది. శపథాలు చేసింది ...

ఆమె కోసం అంగలార్చిన వాడు, ఆమెకు నచ్చలేదని, ఆమే చెప్పింది. ఆమెకు నచ్చిన వాడి ఖరీదు చుక్కల్లో ఉంది. అందుకని, కాస్త చవగ్గా వచ్చిన ఒక ససవను కొనుక్కొంది. వాడితో 'సర్దుకు' పోతున్నది. పెళ్ళి కార్డు స్వయంగా వచ్చి ఇచ్చింది. కాని వెళ్ళ లేక పోయాను.

"వీరే, మావారు" అంటూ, అతగాణ్ని పరిచయం చేసింది; వాడంటే ఎంతో ప్రేమాభిమానాలున్న దానిలాగా!

నేనాశ్చర్య పోలేదు. నవ్వుకోనూ లేదు. అంతే జీవితం!

(3-11-89 శుక్రవారం)

మనిషి పుట్టడానికి లక్షల, కోట్ల సంవత్సరాల ముందు నించీ, సూర్యుడు, నక్ష త్రాలు, చంద్రుడు ... కాంతుల్ని కుమ్మరిస్తున్నాయి. మనిషి పుట్టిన దగ్గర నించీ, ఇన్ని వేల సంవత్సరాలుగానూ, వెలుగులను విరజిమ్ము తున్నాయి. కాంతుల్లో ముంచు తున్నాయి. మహాత్ములు - మనిషి - లోలో పలికి వెలుగుర లను వరద పారించారు. ఏం చేస్తేనేం? మనిషిలోని చీకటి పిసరంత కూడా తగ్గడం లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నే నెక్కడకూ వెళ్ళను. ఇది వరకు ఎక్కడున్నానో ఇప్పుడూ అక్కడే ఉన్నాను. ఇకముందూ అక్కడే ఉంటాను. కానీ - నా కోసం, యుగ యుగాలుగా, ఈ మనుషులు తన్నుకొంటున్నారు, నరుక్కొంటున్నారు, చీల్చుకొంటున్నారు, కాల్చుకొంటున్నారు, నన్ను స్వాధీనం చేసుకొందా మన్న ఆశతో, చేసుకొన్నామన్న అహంతో. ఎవరూ, తమ వెంట నన్ను తీసుకెళ్ళలేరని వారికి తెలీదు. నాలోని చిన్న అంశం కూడా, తమ వెంట రాదనీ, వారికి తెలీదు. గతంనించి, చరిత్రనించి, అనుభవాలనించి, ఏ పాఠమూ నేర్చుకొనడాని కిష్టపడని వొకే వొక ప్రాణి, మనిషి మాత్రమే!" అన్నది భూదేవి, నా వేపు చూస్తూ; సరిహద్దు గోడ తగాదా దగ్గర నేను నిలబడ్డప్పుడు ...

- ఏవో సినిమాల గురించి ప్రసక్తి తీసుకు వచ్చారు కృష్ణమూర్తిగారు, ఉదయపు నడకలో.

"కళా పూర్ణోదయం కన్నా, కొక్కోకమే గొప్ప దనుకొనే వారికి, నేను చెప్ప గలిగిం దేమీ లేదు" అన్నాను.

"చాలా సంవత్సరాల కిందట, కొక్కోకం చదివాను. ఈ రెండో పేరు ఎప్పుడూ విన లేదు" అన్నారాయన.

కృష్ణమూర్తిగారంటే, నా కందుకే అంత ఇష్టం!

(4-11-89 శనివారం)

ప్రభూ! నిన్ను చూదామన్న కోరిక కలిగింది. నా ఇంటి కిటికీలు, వాకిళ్ళు మూసి ఉన్నాయి.

నీ దగ్గరకు రావా లనుకొన్నాను. ఇరుకు దోవ కూడా కనిపించ లేదు.

"అయ్యో! ఏమిటీ దురదృష్టం! ఎందు కిలా జరిగింది? నా ఈశ్వరుణ్ని నేనెలా చూడను?" అంటూ తపించి పోయాను.

ఇంకెటూ చూడలేక, నాలోకి నేను చూసుకొన్నాను. చిత్రం! నా కిష్టమైన నీవు, నాక్కావలసిన రూపంలో, నాలోనే నాకు కనిపించావు.

నాన్నా! తపించిన హృదయానికి గానీ, నీ దర్శనం లభించదా?

(5-11-89 ఆదివారం)

నాకు తెలిసిన ఏ గొప్పవాడూ, తన గొప్పను తానుగా చెప్పకో లేదు. ఇతరులు - అలా చెప్పకోవడానికి ఉపయోగపడే అవకాశాలను కూడా, ఎక్కడా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మిగల్చ లేదు; తను చాలా సామాన్యుణ్ననీ, తెలుసుకొనవలసిన దానితో పోల్చి చూసుకొన్నప్పుడు, తనకు తెలుసు ననుకొంటున్నది, స్వల్పాతి స్వల్పమైనదనీ ఆయనకు తెలుసు గనక !

ఒక్కో మెట్టు ఎక్కుతున్న కొద్దీ, ఒక్కో ఆడంబరాన్ని, భేషజాన్ని, అహంకారాన్ని, తగ్గించుకొంటూ, వొదిలేసుకొంటూ వెళ్ళారు. ఎంత నిర్మలంగా, నగ్నంగా, మృదువుగా, కాంతిగా, ఈ భూమిమీది కొచ్చారో, అలాగే బతికారు. అలాగే మట్టిలో కలిసి పోయారు.

ఈ రాక పోకల మధ్య గల స్వల్ప కాలంలో, వారిని ముసురు కొన చూచిన, మిథ్యా గౌరవాలు, సనదులు, సంపదలు, అధికారాలు, వారిని సమీపించను కూడా లేక పోయాయి.

వారూ, అసలైన మహాత్ములు !

"నిండు చంద్రుణ్ని చూపించవయ్యా బాబూ !" అంటూ ఈశ్వరుణ్ని అడిగాను.

ఆయనగారు - ఎందుకనో గానీ; సగం చంద్రుణ్నే నాకు చూపించారు.

"మిగిలిన సగం మాటేమిటి ?" అని, నే నడగ లేదు.

ఈ సగం కూడా చూప లేదనుకోండి, ఆయన్ని నేను చేయగలిగిందే ముంది ?

(6-11-89 సోమవారం)

ఇదో మనుషుల దుకాణం ! ఇక్కడ రకరకాల మనుషులు హోల్ సేల్‌గానూ, చిల్లరగానూ దొరుకుతారు.

ఈ దుకాణం రెండు భాగాలుగా ఉంటుంది. ఒక భాగంలో అచ్చంగా అబ్బాయిలుంటారు. వీరందరూ, తమ చదువుల్ని, ఉద్యోగాల్ని, ఆస్తిపాస్తుల్ని, అందచందాల్ని చూపిస్తూ, తమ పుంసత్వాన్ని వేలకూ, లక్షలకూ, అమ్ముకొంటూ ఉంటారు. ఈ అమ్మకానికి చెలామణిలో ఉన్న ముద్దుపేరు "కట్నం". తమకున్న కొనుగోలు శక్తిని బట్టి, అమ్మాయిలు - ఇక్కడనుండే, తమ భర్తలను కొనుక్కుపోతూ ఉంటారు. ఈ కొనుక్కోవడంలో, అభిరుచి, ఇష్టమూ లాంటి వేమీ పనిచేయవు. తాము చెల్లించ గల ధరకు, ఏ మగవాడు దొరికితే, వాడినే భర్తగా ఆమోదించి, వాడితో బతికేస్తారు. ముందుగా వస్తువును కొనుక్కొంటారు. తరువాత ఆ వస్తువు మీద ఆపేక్షను కలిగించుకోవడానికి ప్రయత్నిస్తారు.

ఇంక - రెండో విభాగంలో - అచ్చంగా, అమ్మాయిలే ఉంటారు. వీరు - తమ శరీరాలను అద్దెకిస్తూ, అమ్ముకొంటూ బతుకుతారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ సంగతులన్నీ నాకు జ్ఞాపకం రావడానిక్కారణం '—' గారు.
"నీవు తప్ప, నాకేమీ అవసరం లేదు" అన్న వాణ్ణి, కాదన్నది.
తరువాత ??
తన కోసం తపస్సు చేసిన వారితో కలిసి జీవించడం వేరూ, తను చెల్లించ గల ఖరీదుకు అమ్ముడు బోయిన వారితో కలిసి జీవించడం వేరూనని - అనుభవం - ఎప్పటికో చెబుతుంది.
జీవితమంతా, దిగుళ్ళూ, కన్నీళ్ళూ తప్ప, ఏం మిగులుతాయి ?

(7-11-89 మంగళవారం)

అందరూ సంపాదించు కొంటున్నారు. నేను పోగొట్టు కొంటున్నాను . ఓసారి వెనుదిరిగి చూసుకొంటే, "ఎన్ని పోగొట్టుకొన్నానో !" అనిపిస్తుంది, దిగు లేస్తుంది.
చిన్నతనాన్ని పోగొట్టుకొన్నాను. చదువుకొనే అవకాశాన్ని పోగొట్టు కొన్నాను. తలిదండ్రుల ప్రేమాభి మానాలను పోగొట్టుకొన్నాను. ప్రాణంలో ప్రాణమైన కాంతమ్మను కూడా పోగొట్టుకొన్నాను.
ఇలా జీవితమంతా పోగొట్టుకొంటూనే ఉండాలనుకొంటాను.
కొన్నింటిని పోగొట్టు కొ(ంటు)న్నందుకు, సంతోషిస్తున్నాను. ఇంకొన్నింటిని పోగొట్టు కొనవలసిన దౌర్భాగ్యం పట్టినందుకు, ఖేదిస్తున్నాను ...

(8-11-89 బుధవారం)

నేనిప్పుడు, హద్దులు చెరిగిపోయిన ఆకాశాన్నంతా వెదుకుతున్నాను. ఆకాశం నిండా అలముకొన్న అంధకారాన్ని వెదుకుతున్నాను. అంధకారార్ణవంలో తేలుతోన్న నక్షత్ర దీపాలను వెదుకుతున్నాను. నక్షత్ర దీపాలను మూసురు కొంటున్న, వెలుతురు మబ్బుల్ని వెదుకుతున్నాను. వెలుతురు మబ్బుల్లోంచి జారి పడుతున్న మెరుపు చినుకుల్ని వెదుకుతున్నాను. మెరుపు చినుకులకు మొలిచిన, చినచిన్న గాలి రెక్కలను వెదుకుతున్నాను. గాలి రెక్కలను ఆలింగనం చేసుకొన్న పసందైన పాటను వెదుకుతున్నాను నీ కోసం !
గుండెలోంచి కాలువలు తీసి, అక్షర క్షేత్రాలనిండా నింపి, అలసి, అలా చేర గిలబడి, నా లోకి నేను చూసుకొంటే చాలు; మళ్ళీ, నా గుండెలు; నిండుగానే ఉంటున్నాయి నీ జ్ఞాపకాలతో, ఈశ్వరుని అక్షయపాత్ర లాగా.
సూర్యునిక్కూడా చలివేసిందేమో; ఇల్లు, ఇల్లాలు గుర్తు కొచ్చిందేమో; తొర తొరగా వెళ్ళిపోయాడీ రోజున ...

(9-11-89 గురువారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'—' గారు, నాకు చాలా కాలంగా తెలుసు. ఆమెకు నేను చెప్పవలసినవన్నీ చెప్పాను. ఆమెకోసం ఎన్నో ఉదయాలు, సాయంకాలాలు, వేకువలు, అర్ధ రాత్రులు ఖర్చు చేశాను; ఆమె నా కోసం ఏమీ చేయదనీ చేయలేదనీ తెలిసి కూడా. ఆమెను కాదని, కూతురుక్కూడా చెప్పి చూశాను. అయినా వినలేదు. పెళ్ళికి ముందు, ఆ పిల్ల నిజంగానే ఒప్పులకుప్ప. పెళ్ళయ్యాక, ఆమె అక్షరాలా నిప్పుల కుప్పగా మారిపోయింది. బాలు పెళ్ళిరోజునే, ఆ అమ్మాయి పెళ్ళి కూడా అయింది.

తన సమస్యలన్నీ '—'గారు నా ముందు కుప్ప పోశారు. గతాన్ని తవ్వకుండా, ఓదార్చి పంపించాను. నాకు తోచిన సూచనలు చేశాను ...

చిన్నీ ! ఇవ్వాళంతా నీవు జ్ఞాపకం వస్తూనే ఉన్నావు. చాలామంది మాటల్లో చెబుతారు. ఐనా అర్థం కాదు. కొద్దిమంది కళ్ళతోనూ, నవ్వులతోనూ చెబుతారు. వారు చెప్పింది, జానపద గీతమంత హాయిగా అర్థమవుతుంది. అందుకే నిన్ను జానపద గీతంతో నేను పోల్చడం.

ఇప్పుడేమో, నా పాట అదృశ్యమయి పోయింది.

నా నీడ నిశ్శబ్దమయి పోయింది ...

(10-11-89 శుక్రవారం)

"నీ కేం కావాలి ? ఎందుకలా పదే పదే నన్ను పిలుస్తున్నావ్ ? ఎందుకలా నీడలాగా, నా వెంట వెంటే నడుస్తున్నావ్ ?" అన్నదామె, అతనివేపు చూస్తూ. ఆమె చూపుల్లోని సౌమ్యమూ, గొంతులోని మార్దవమూ గమనించా డతను. "నీ చెక్కిళ్ళ కాంతుల్ని, నా హస్తాలనిండా అలముకోనివ్వు. నీ లేత నవ్వుల్ని, నా దోయిలి నిండా నింపుకో నివ్వు. నీ అరచేతుల్లో, నా ముఖాన్ని దాచుకో నివ్వు" అన్నాడతను ప్రాధేయ పూర్వకంగా.

అతని గొంతులోని వేడికోలుకు, ఆమె కరిగి పోయింది.
"నీ విజ్ఞప్తిని మన్నించాను" అన్నదామె, అతని అరచేతులను, తన చెక్కిళ్ళకు చేర్చుకొంటూ.

(11-11-89 శనివారం)

"మీరు అదృష్టవంతులు. కొడుకులు మంచివాళ్ళు. కోడళ్ళు మంచి వాళ్ళే దొరికారు. అసలు మొదణ్ణించీ, ఒక పద్ధతిగా, ఒక నియమంగా, క్రమశిక్షణతో, మీరు జీవితాన్ని నడుపుకొంటూ వచ్చారు. మిమ్మల్ని చూస్తూంటే నాకు పద్య కవిత గుర్తుకొస్తూ ఉంటుంది" అన్నారు మార్కండేయ శాస్త్రి గారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనంటే వారికి అభిమానం! వారంటే నాకు గౌరవం. బాగా చదువుకొన్న వారు. అంతకు మించిన సాత్వికులు.

"అవును బాబుగారూ ! చాలా కారణాలవల్ల, నా జీవితం, నియమంగా, పద్ధతిగా, కష్టంగా, క్లిష్టంగా - మీరన్నట్లు, పద్య కవితలాగే నడిచింది మొన్న మొన్నటి దాకా. ఇప్పుడు 'కవిత' లేదు. ఈ నిమిషాన, నేనుత్త పద్యాన్ని మాత్రమే !" అన్నాను.

శాస్త్రిగారు నన్ను నిలువునా ఆలింగనం చేసుకొన్నారు; మా నాన్నలాగా, మా సంజీవయ్య లాగా.

"మొన్న నిన్న 'ఐతరేయం' చదువుతున్నాను. కవిత ఎప్పుడూ మీతోనే ఉంది; కాకపోతే, ఇదివరకు మీకు వెలుపలిగా ఉండేది - కనపడుతూ. ఇప్పుడేమో, మీ లోపలికొచ్చి మా అందరకూ కనబడుతోంది" అన్నారాయన నన్ను వోదారుస్తూ.

(13-11-89 సోమవారం)

పెళ్ళి కొడుక్కు, చదువు, అందం, సంపద, ఉద్యోగం, అన్నీ ఉన్నప్పటికీ, టూత్ బ్రష్ దగ్గర్నించీ, అత్తవారింటి నుంచే ఎందుకు అడుక్కుంటాడో, నాకు తెలీదు.

పొరబాటు చేసినప్పుడు శిక్ష అనుభవించవలసిందే: అందంగా ఉండడం, బాగా చదువుకోడం, ఉద్యోగం చేయడం, మెత్తగా ఉండడం - ఇవేవీ చెడ్డ లక్షణాలు గానీ, శిక్షార్హమైన నేరాలుగానీ కావు గదా ! కానీ - ఇవన్నీ ఉన్న ఆడపిల్ల-భర్తను కొనుక్కోలేక అవస్థ పడుతుంటే మనందరం ఎందుకు సిగ్గుపడడం లేదో కూడా నాకు తెలీదు.

ఏవేపు నుంచి కాసేండి, గిరి శిఖరం ఎక్కడం ముఖ్యం. ఎక్కుతూ ఎక్కుతూ ఉన్నవారికి, రకరకాల దృశ్యాలు కనబడతాయి. ఒకరు చూస్తున్న దానికీ, మరొకరు చూస్తున్న దానికీ పొంతన ఉండదు. శిఖరం పూర్తిగా ఎక్కాక, ఎటునించి ఎక్కిన వారికైనా సరే, కనిపించే దృశ్యాలు, వొకలాగే ఉంటాయి. మనతగాదాలు, మార్గమధ్యానికి సంబంధించినవి గానీ, మార్గాంతానికి సంబంధించినవి కావు.

ఒక మంచి పదం కోసం, ఒక అందమైన శబ్దంకోసం, నేననుకొన్న దాన్ని, అనుకొన్నంత స్పష్టంగా అవతలి వారికి తెలియచేయగల జీవంతమైన ఒక ప్రతీకకోసం, నేనెంత మధనపడుతున్నానంటే - నాకాంతం కోసమూ, నా ఈశ్వరుని కోసమూ పడుతున్నంత . .

(14-11-89 మంగళవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాలో ఏదో జరిగినట్లనిపిస్తుంది. నన్నెందుకో పిలిచినట్లనిపిస్తుంది. నన్నెవరో తాకినట్లనిపిస్తుంది. నామీంచి, నిదురతెర జారి నట్లనిపిస్తుంది. అప్పుడు దిగ్గున లేస్తాను. మూలనున్న మునలిదీపం, నా వేపు జాలిగా చూస్తుంది. మబ్బుల పడకమీద నడుము వాల్చిన నిశా సుందరి, ఇంకా మైమరిచి నిదురపోతూనే ఉంటుంది. నింగిలోకి తలలనూ, నేలలోకి కాళ్ళనూ చాపుకొన్న చెట్లవరస, ఆకు పచ్చని కలలను కంటూనే ఉంటుంది. నులి ఎండను వొంటినిండా పీల్చుకొనడం కోసం, పచ్చిక బయలు నేలమీదికి పాకుతూనే ఉంటుంది. శుక్రతార ఆపలింత, బద్ధకంగా వినబడుతూనే ఉంటుంది.

అప్పుడు ఉలిక్కి పడి, నా వేపు నేనే తిరుగుతాను. అక్కడ హిమరశ్మిలాగా శీతల సమీరం లాగా, నీవుంటావు నవ్వుతూ ...

"ప్రత్యూష ప్రశాంతతకు భంగం కలిగిస్తూ, మీ రెందుకలా శంఖాలను ఊదుతున్నారు?" అన్నాను ఎగురుతోన్న వేకువ పక్షులతో.

అవి క్షణకాలం ఆగి, ఒకదాన్ని మరొకటి చూసుకొన్నాయి. నన్నూ ఎగాదిగా చూశాయి.

"మేము ఉషస్సుందరిని మేలు కొలుపు తున్నాం" అన్నాయా పక్షులు శంఖ నాదాలతో ఎగసిపోతూ.

ఆ పాటి చిన్న విషయం కూడా తెలియని, నా మూర్ఖత్వాన్ని, అవి చాలా దయతో క్షమించి ఉండాలి.

(15-11-89 బుధవారం)

"భవతీ భిక్షాందేహి"

అని, ఓ అభ్యర్థన మెత్తగా వినిపించింది వీధిలోంచీ, వీధినిండా కమ్మిన మసక చీకటిలోంచీ

"భవతి లేదు" అన్నాడతను దుఃఖాన్ని దిగమింగుకొంటూ.

కొద్దిపాటి నిశ్శబ్దం తరువాత -

"పోనీ, భిక్షం?" అన్నదామె లోగొంతుకతో.

"మరొకరి కివ్వగలిగినంత విలువైన వేమీ నాకు లేవు" అన్నాడతను తల వొంచుకొంటూ.

"నీవివ్వ గలిగిన దేదో, నీవివ్వ దలచిన దేదో, ఉన్నంతలో విలువైన దేదో, అదే నా కివ్వరాదా?" అన్నదామె.

అతనో నిమషం పాటు, మౌనంగా ఉండి పోయాడు.

తరువాత మెల్లగా తల ఎత్తాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"హృదయం మాత్రమే ఉంది. దాన్నివ్వ మంటావా?" అన్నాడు సిగ్గుపడుతూ.
"ఇన్నేళ్ళుగా, నీ హృదయం నీ అధీనంలోనే ఉంటే, దాన్నింకెవ్వళికీ ఇవ్వకుండా ఉంటే - దాన్నే నాకివ్వు. సంతోషంగా స్వీకరిస్తాను" అన్నదామె కంపిస్తోన్న కంఠంతో.
"అయితే నన్ను మన్నించు. నీ కిద్దామనుకొన్న హృదయం కూడా, ఇప్పుడు నాది కాదు. నేను అనుక్షణం ఆరాధించే నా చిన్నికి, దాన్నెప్పుడో ఇచ్చి వేశాను. ఇవ్వాళ, ఎవరికివ్వడాని కయినా, నా దగ్గరేమీ లేదు" అన్నాడతను రుద్ధ కంఠంతో.
అప్పుడు వీధిలోంచి, వీధి నిండా కమ్మిన మసక చీకటి లోంచి, మసక చీకటి ముసిరిన వెక్కిళ్ళ లోంచి, సన్నగా వినిపించింది –
"నువ్వే - నువ్వే - నిజంగా - నా బంగారు తండ్రివి కన్నా!" అని ...

(16-11-89 గురువారం)

శ్మశానం నిండా సంజకాంతులు ఎగజిమ్ముతున్నప్పుడు, తెల్ల అంచుల నల్ల మబ్బు చీరలు ఆకాశం నిండా రెపరెప లాడుతున్నప్పుడు, నీతో తనివారా కబుర్లాడాక, ఇంటికి వెళ్ళాలంటే ఎంత దిగులుగా ఉంటుందో ఎలా చెప్పను? ఎవరికి చెప్పను?
ఎన్ని సూర్యోదయాలు భూమిని అలంకరించాయి గాదు? ఎన్ని అస్తమయాలు ఏడుస్తో చీకటిలో కలిశాయి గాదు? ఎన్ని కోట్ల జ్ఞాపకాలు మంటల్లో కాలి పోయాయి గాదు? ఎన్ని కన్నీళ్ళు నిశ్శబ్దంగా ఆవిరులయి పోయాయి గాదు? అయినా - అలాంటి వేవీ ఎప్పుడూ, జరగనట్లూ: ఇప్పుడే జరుగుతోన్నట్లూ నాకనిపిస్తోంది చిన్నీ! నాకు ప్రాతస్సంధ్య మీద కోపం, మెలకువొచ్చి, పవలంతా నీవు గుర్తుకొచ్చి, తీయగా బాధిస్తావని. నాకు సాయం సంధ్య మీదా కోపమే; నిదుర వొచ్చి, కలగా వొచ్చి, రేయంతా తీయగా హింసిస్తావని!
నీవు నడిచినప్పుడు కాలం నీ ముందు కుందేలు పిల్లలా మారి పోతుంది. నీవు నవ్వినప్పుడు, కాలం నీ ముందు పరిమళంలా పరుచుకు పోతుంది. నీవు రుస లాడినప్పుడు, కాలం నీ ముందు మంచులా కరిగి పోతుంది ...

(17-11-89 శుక్రవారం)

అవధుల్లేని అతని దుఃఖన్ని చూసీ చూసీ చూసీ, మరింక చూడలేక, మబ్బులను ముసుగ్గా కప్పు కొన్నాయి నక్షత్రాలు. ఈ సాంద్రాంధకారంలోంచి మినుకు మినుగ్గా వినబడుతోన్న చలిత కాంతులు నీ పాద ముద్ర లేనని నాకు తెలుసు. అంత గాఢమైన రాత్రి కూడా, పక్షుల ఉద్ఘోష గాఢానికి మేలుకొన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిన్నీ! నీవు మంచిలాగా ఉంటావు. మంచులాగా ఉంటావు. పొన్నాయి పూవు లాగా ఉంటావు. సంక్రాంతి ముగ్గులాగా ఉంటావు. శీతా కాలపు పొద్దులాగా ఉంటావు. మెత్తని కోపం లాగా ఉంటావు. వచ్చీరాని అలుక లాగా ఉంటావు. పద్యం నిండా తుళ్ళుతోన్న కవిత లాగా ఉంటావు. అమ్మలాగా ఉంటావు. అమ్మి లాగా ఉంటావు.

నిన్ను అక్షరాల్లోకి ఆహ్వానించడం నాకు సాధ్యం కాదు. రంగుల కుంచె గానో, రసమయ రాగంగానో మారిపోదా మనుకొంటున్నాను అందుకే ...

(18-11-89 శనివారం)

ఓ మందానిలం వినిపించినా, ఓ మంచు చుక్క కనిపించినా, చలించి పోవ డానికి, చాలా సంస్కారం కావాలి.

ఆ చెట్ల లేత కొమ్మలు, ఆకులు, నాకు తగులుతుంటే, ఏవో రహస్యాలను చెప్పడం కోసం, అవి దగ్గరగా వొస్తున్న ట్లనిపించింది నాకు.

ఓ ముసలి బాటసారీ!

నీ ప్రయాణాన్ని విరమించు. క్షితిజ రేఖను స్పర్శించాలన్న నీ ఆశ ఎప్పటికీ తీరదు. నీకూ, ఆ రేఖకూ మధ్య గల దూరం, ఎప్పుడూ తరగదు. ఆ తరుణ చ్ఛాయలు నీ కోసం కాదు. ఆ మోహన వేణు గానమూ నీ కోసం కాదు.

ఎంత బరువును మోసీ మోసీ మోసీ, మబ్బులు అలిసి పోయాయి, అరిగి పోయాయి, చివరికి వానగా కరిగి పోయాయి ...

(19-11-89 ఆదివారం)

వేకువకు శీతల పక్షాలు మొలిచి, తూరుపులోకి ఎగురుతున్నట్లూ; మంచు విత్తనాలు మొలిచి, హేమంతోద్యానంగా మారినట్లూ; ఏ నక్షత్ర మేఘమో కరిగి, వెలుతురు జల్లులు కురుస్తున్నట్లూ; ఎంత అందంగా ఉన్నదీ ప్రత్యూషిని!

ఆ అక్షరాల మీద అనవసరంగా విసుక్కోకు. అవన్నీ ఇప్పుడు పొడి పొడిగా ఉన్నాయి. వాటిని బలవంతాన పక్క పక్కన చేర్చినా, పేర్చినా, అవు క్కోపు కళ్ళను చీల్చుకొచ్చిన కన్నీటిలోనో, గుండెను తొలుచుకొచ్చిన క్రొన్నెత్తుటిలోనో అవి బాగా తడిశాక ఇట్టే అదుక్కుపోతాయి.

ఏదీ - అలా - ఓసారి ప్రయత్నించి చూడు!

ప్రభూ! నిన్ను నేను తలుచుకొంటూ, తలుచు కొంటూనే;
నన్ను కమ్మిన మాయ పొరలను వొలుచుకొంటూ, వొలుచుకొంటూనే;
నిన్ను చేరే బాటలోకి, నన్ను నేను మలచుకొంటున్నాను ...

(20-11-89 సోమవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నేను మంచినీళ్ళడిగాను. నీ వింకేమో ఇచ్చావు" అన్నాడతను, ఓ గుక్క తాగి, గ్లాసును బల్లమీద పెడుతూ.

ఆ మాట వింటూనే, ఆమె ఉలికి పడింది. గబగబా బల్ల దగ్గర కొచ్చింది. గ్లాసును చేతిలోకి తీసుకొంది. పరీక్షగా చూసింది. ఒక్క నలుసుకూడా లేదు. "మంచి నీళ్ళే ఇచ్చానే !" అన్నది అతనివేపు చూస్తూ.

ఆమె తత్తరపాటును చూసి అతను నవ్వాడు.

"నువ్విచ్చింది అచ్చమైన మంచి నీళ్ళే అయితే, అవింత రుచిగా ఉండేం దుకు వీల్లేదు" అన్నాడతను ఆమె కేసి చూస్తూ, హాయిగా నవ్వేస్తూ.

అప్పుడు "హమ్మయ్య" అనుకొని ఆమె కూడా నవ్వింది.

"అయ్యో ! అదేం చిత్రమోగానీ, నన్నుచూసిన ప్రతిసారీ, నీకు దప్పికవు తూనే ఉంటుంది. నీవేమో దాహందాహ మంటూ వ్వరాడిపోతూ ఉంటే, 'పోన్లే పాప' మని ఓ గ్లాసెడు నీళ్ళిస్తూ ఇస్తూ, వొక్కటంటే వొక్కటే గుక్క - అలా తాగి - మిగిలిన నీళ్ళన్నీ నీకే ఇచ్చానే !" అన్నడామె అతని కళ్ళల్లోకి చూస్తూ.

"అవును. అలాంటి అమృత స్పర్శ లభించి ఉండకపోతే, ఈమామూలు మంచి నీళ్ళకు అంత మంచి రుచి రాదని నాకూ తెలుసు" అన్నాడతను, మిగిలిన నీటినంతా గడగడా తాగేస్తూ ...

ధృవపథం మీద, హిమరథం పోతూన్నప్పుడు లేచే ధూళిలాగా, ఆకాశం నిండా మంచు దుమ్ము ...

(23-11-89 గురువారం)

ఈ మునిమాపు ఎంత అందంగా ఉన్నదనీ ! అలా - మునివేళ్ళతో నిశ్శ బ్దంగా తాకి, ఇలా - ముద్దాడదామన్నంత ముచ్చటగా ఉంది !

ఒక స్వప్నం, మరో స్వప్నంలోకి ప్రవహిస్తున్నప్పుడూ; ఆ రెండు స్వప్న వాహినుల తీరాలు, వొకదానిలోకి మరొకటి కరిగిపోతున్నప్పుడూ, ఎలా ఉంటుందో - నీ కన్నుల్లోకి చూస్తున్నప్పుడలా ఉంటుంది !

చిన్నీ ! నా బంగారు తల్లీ ! !

నా కిక్కడ దేనికోసూ పని లేదు
నా కిప్పుడు ఎవరికోసూ పని లేదు
నీ చూపులు నక్షత్రాలు వాలే మైదానంగా
నీ మునివేళ్ళు పున్నీరంగా తాకే పూవ్వుగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నీ పాదాలు మెత్తగా నడిచే బాటగా
నీ నిండా హాయిగా అలముకొనే కాంతిగా
నీ చుట్టూ సున్నితంగా వీచే గాలిగా
నీ వెంట మౌనంగా నడిచే నీడలా - మారి;
నిన్నోసారి పుక్కిలింతలయ్యేలా దర్శించేందుకే
నిన్నోసారి ఉక్కిరి బిక్కిరయ్యేలా స్పర్శించేందుకే
అందుకే - అక్షరాలా అందుకే - నే నిక్కడున్నాను.

(24-11-89 శుక్రవారం)

ఏ చక్కని చుక్కలో, ఏ నీరవ నిశి వేళనో, పచ్చిక మైదానం నిండా వొలక బోసిన మంచు పూసలను, కిరణాల మునివేళ్ళతో మెత్తగా, ఎత్తుతున్నాడు ఉదయ సూర్యుడు.

ప్రభూ ! ఏమీ నా కివ్వకు. ఇంకేమీ నా మీద విరజిమ్మకు. నా నిండా, నా చుట్టూ, నీవు వొలికిస్తున్న కాంతులను నేను మోయలేను. సంధ్యకు నీవు అద్దిన హేమ రశ్మిని చూడలేను. పరిమళాలను పలకరించేందుకు పరువు లెత్తుతున్న హిమ సమీరపు గుండె చప్పుడును నేను వినలేను. ఇంకెందుకూ, ఏవేవో నీవు నా కివ్వడం ?

"అప్పటికీ నేను చాలా నిశ్శబ్దంగానే వచ్చాను గదా ! అయినా - నీకు మెలకు వెలా వచ్చింది కన్నా ?" అన్నదామె నవ్వుతూ.

"నీ నీడ, మెత్తని పెదవులుగా మారి, నా కను రెప్పలను సుతి మెత్తగా తాకి నట్లనిపించి మేలుకొన్నాను" అన్నాడతను కూడా చిలిపిగా నవ్వుతూ.
చిన్నీ! నీ వెలాకనిపించినా, నాకు నచ్చుతావని నీకు తెలుసు. ఐనా - నా మీది దయతో, నీ వెప్పుడూ నాకు నచ్చే రూపంలోనే కనబడుతూ ఉంటావు.

(25-11-89 శనివారం)

ఇవ్వాళ '___' పుట్టిన రోజు. ఆ సంగతి గుర్తు చేస్తూ ఉదయమే ఫోను కూడా చేసింది. ఓ చిన్న ప్లాస్టిక్ పూవును బహుమతిగా ఇచ్చాను.
"ఇదేమిటి?" అన్నది, కాస్త ఆశ్చర్యపోతూ.
"అందంగా ఉంది. అందుకని-" అన్నాను నవ్వుతూనే.
ఆమె కూడా - కాస్త అసహజంగా నవ్వింది.
ఆమె నాకు చాలా కాలంగా తెలుసు. అనుమానమేమీ లేదు - ఆవిడ నిస్సం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేహంగా అందగత్తె. అన్నీ దిద్దినట్టుగా, అద్దినట్టుగా, పేర్చినట్టుగా, తీర్చినట్టుగా ముద్దుగా ఉంటాయి. ముద్దు ముద్దుగా నవ్వుతుంది. మరీ ముద్దుగా మాట్లాడుతుంది. ఏదో వొంకతో ఆమెను పలకరించాలనుకొనే మగాళ్లూ, పలకరించే మగాళ్ళూనాకు తెలుసు. అలాంటి వారిని ఆవిడ సులభంగానేపోల్చుకొంటుంది. ఆసంగతీ నాకు తెలుసు.

ఆవిడ నాతో చనువుగా కబుర్లాడదం చూసి, నన్ను అభినందించిన వారూ, అంతో ఇంతో అసూయ పడినవారూ ఉన్నారు. చిత్రమేమిటంటే, ఎంతో మంది నరాలను మెలిపెట్టి, ప్రాణాలనుతోడేసే ఆవిడగారు, నా కళ్ళకొక ప్లాస్టిక్ పుష్పం లాగా కనపడుతుంది. ప్లాస్టిక్ పూవుకు, రేకులు, రంగులు, అందంగా, అద్భుతంగా ఉండే మాట నిజమేగానీ, 'జీవం' ఉండదు. '—' కూడా అచ్చంగా అలాంటిదే! నా దృష్టికావిడ, 'నిర్జీవ నిర్గంధ కుసుమం'లాగా కనిపిస్తుంది.

ఆ మాటే, ఈ రోజునా అన్నాను.

"ఇప్పటికే నన్ను కాకుల్లాగా ముసురుకున్నారు. అవి కూడా ఉంటే, పీరుకుకు తినే వారు" అన్నది.

"ఎన్నో పుట్టిన రోజు?" అన్నాను.

"అందరికి — ముప్పయ్ రెండోది. నీకు మాత్రం ముప్పయ్ తొమ్మిదోది" అన్నది నవ్వుతూ

అది నవ్వులాగా లేదని నాకు తెలుసు.

నవ్విన ఆమెకూ తెలుసు ననుకొంటాను ...

(27-11-89 సోమవారం)

"క్షితిజం లోంచి మిసుకు కాంతులు చిందులేస్తున్నాయి. నీ వసంతం వస్తున్నది!" అన్నారు వారు.

అతను తలనన్నా కదప లేదు.

"మంగళ వాద్యాలు హృద్యంగా వినబడుతున్నాయి. నీ వసంతం వస్తున్నది!" అన్నారు వారు.

అతను బొత్తిగా వినిపించుకో లేదు.

"అతిలోక సుగంధ సంభరిత హిమ వాయువులు వీస్తున్నాయి. నీ వసంతం వస్తున్నది!" అన్నారు వారు.

అప్పుడతను గడ్డిపూవును చూస్తున్నాడు.

"పచ్చిక మీంచి మెత్తగా మెరుస్తోన్న పాదాలు కనబడుతున్నాయి. నీ వసంతం వస్తున్నది!" అన్నారు వారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అతనా గడ్డిపూవును పదిలంగా దోసిలిలోకి తీసుకొని కనుల కద్దుకొన్నాడు.

"ఇదే నా వసంతం! ఆడంబరాలు, అలంకారాలు, అట్టహాసాలు, నా వసంతానికి తెలియవు. ఇవన్నీ ఉన్నది - ఇంకేమన్నా అవుతుందేమోగానీ, నా వసంతం మాత్రం కాదు." అన్నాడతను, ఆ గడ్డిపూవును హృదయానికి హత్తుకొంటూ.

"అయ్యా! రోజుకు నన్నెన్నిసార్లు గుర్తు చేసుకొంటావ్?" అన్నదామె సన్నగా నవ్వుతూ.

"నేను లెక్కపెట్టలేనన్ని సార్లు. ఈ ప్రపంచంలోని సంఖ్యలన్నీ కలిసినా, చాలనన్ని సార్లు, నేను మోయలేనన్ని సార్లు" అన్నాడతను.

"కన్నా! నేను చాలా అదృష్టవంతురాలినయ్యా!" అన్నదామె, అతని చెంపలను, అర చేతులతో సున్నితంగా రాస్తూ ...

ఎవ్వరూ లేని చోటుకు, ఏదీ లేని చోటుకు వెళ్ళాలనీ; నా శేష జీవితాన్ని అక్కడ ప్రశాంతంగా ముగించుదామనీ అనుకొన్నాను. విజ్ఞులు చెప్పిన విధంగా వెదికి వెదికి, చివరికో చోటును, ఎన్నుకొన్నాను. కానీ - ఏం లాభం? అక్కడా నీవే ఉన్నావు. నీవున్నావను కొంటున్న నేనూ ఉన్నాను. ఇంకా ఏకాంత మేముంది?

(28-11-89 మంగళవారం)

"చేయ వలసిన ఘోరమంతా చేశావు. నాకు దిక్కు లేకుండా తుడి చేశావు. నా ఉసురు పోసుకొన్నావు. ఇప్పుడొచ్చి 'మన్నించు' అంటున్నావు. పశ్చాత్తాప పడుతున్నావు. 'విచారిస్తున్నా' నంటున్నావు. ఆ ఒక్క మాటతో నీవు బయట పడతావు. కానీ - నాకు జరిగిన అన్యాయం నుండి, నన్ను ముసిరిన దుఃఖం నుండి, నేనెప్పటికీ బయట పడలేను. బయట పడలేనని తెలిసి కూడా నన్ను ఓదార్చాలని ఎందుకు చూస్తున్నావో, నాకు తెలీదు. తెలుసు కోవాలనీ నాకు లేదు" అన్నాను - అతగాడు ఈశ్వరుదేనని తెలిసి కూడా.

అవును - ఈశ్వరుడంతటి వాడు, నాతో అబద్ధమాడి నవ్వుతూ, నాకు అన్యాయం చేసినప్పుడూ, నేనెందు కతన్ని లక్ష్య పెట్టాలి? అతనేదో నన్ను, చేస్తాడన్న భయం కూడా, నాకిప్పుడు లేదు. నన్నూ, నా కాంతాన్నీ వేరు చేయడం కన్నా మించిన క్రూర కార్యాన్ని, ఈశ్వరుడు కూడా చేయలేడని నాకు తెలుసు. అందుకే బరి తెగించాను

నేనిప్పుడో విధి గాయకుణ్ని; నా పాట ఏ శ్రోతకూ అవసరం లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నే నిప్పుడొక ఏకాంత పథికుణ్ని; నా నడక ఏతోవకూ అవసరం లేదు.
నే నిప్పుడొక విరిగిపోయిన చూపును; నా దృష్టి ఏకంటికీ అవసరం లేదు.
నే నిప్పుడొక ముసలి మబ్బును; నా చినుకు, ఏతోటకూ అవసరం లేదు ...
(29-11-89 బుధవారం)

"అక్కడ నీకోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. నీవెవర్ని అనుగ్రహిస్తావో?" అన్నాను, ఆమె పేరు 'కవిత' అని తెలిశాక.

ఆవిణ్నెక్కడో చూసినట్టూ, ఏదో కాస్త తెలిసినట్టూ, మొత్తం మీద ఏమీ తెలియనట్టూ, ముఖ పరిచయం మాత్రం ఉన్నట్టూ నా కనిపించింది.

వారందరి వేపూ చూసి, కవిత నవ్వింది.

"నీ నవ్వుకెన్ని అర్థాలున్నాయో నాకు తెలీదు. నేను మరీ వచనంగాణ్ని. కాస్త నాకు తెలిసేట్టు చెప్పరాదా?" అన్నాను కవిత గారితో.

ఏగుణాన ఉన్నదోగానీ, కవిత 'సరే' నన్నట్టు తల పంకించింది.

"ఆ మొదటి వారికి శాస్త్రం ముఖ్యం. నియమ నిబంధనలు ముఖ్యం. అవన్నీ సరిగ్గా ఉంటే చాలు. నేనున్నా లేకపోయినా ఏమీ అనుకోడు. కానీ - అప్పు డప్పుడు నేనూ అలా తొంగి చూస్తూ ఉంటాను. నేను - అక్కడే ఉన్నానన్న భ్రమలో, అతనూ ఉంటాడు ... ఆ తరువాతి వాడు సంపన్నుడు. అతగాడి దగ్గర రకరకాల ఆభరణాలున్నాయి. అవి చాల వన్నట్లుగా, ఇంకా కొత్త కొత్తవి చేయిస్తూ ఉంటాడు. నడి నెత్తి నుండి అరికాలిదాకా సొమ్ములు తగి లిస్తాడు. వద్దన్నా వినడు. వాటి బరువు మోయలేక ఆయాస పడుతుంటాను. చాలా సార్లు స్పృహ కూడా తప్పుతుంటుంది. అయినా వాడికి లక్ష్యంలేదు. నగలు మిలమిలాడుతుంటే గలగల్లాడుతుంటే చాలు. ఆ మిల మిలల్లో, గలగలల్లో నేనున్నా ననుకొంటాడు ... ఆ పక్కనే ఉన్న వాడో చిత్రమైన మనిషి. వాడి దగ్గర శాస్త్రజ్ఞానమూ లేదు. నగలూ నాణ్యాలూ లేవు. అంగ విన్యాసమంటే వాడికి వల్లమాలిన ఆపేక్ష. రకరకాల వ్యూహాల్లో బంధాల్లో ఇరకబెట్టి, ఉడకబెట్టి, మెలిబెట్టి, హూనం హూనం చేసి పారేస్తాడు. ఈ కసరత్తుల్లోనే నేనున్నానని అత నను కొంటాడు. ఆ నాలుగో వాడు - పొగలు సెగలు కక్కుతుంటాడు. నాగళ్ళు, గొడ్డళ్ళు, పిడికిళ్ళు, అంటుంటాడు నొక్కు, రక్కు, నరుకు, కొరుకు అంటుంటాడు. ఆ పక్కనున్నవాడో అయోమయం వేషం. 'నా నెడినెత్తిన, రెండు ధృవాలు వేళ్ళాడుతున్నప్పుడు, [illegible]ప్పుల్లో పదకొండు కత్తులు సంగీత ఝురులయి, గాంగ్రినా మాండలోవా ఫీడగా, మిరాండా చిరు చిరు నవ్వుల్ని సైబరస్ చప్పరిస్తున్న వేళ్ళ, మెరీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాలో వీనస్ బొడ్డులోంచి చిందిపడే సువాసన సుడి గుండాలయిన వేళ, ఓ స్పార్టకస్, ఓ అసిరస్, ఓ అంతర్నేత్ర నోవా, హేమంత శకుంత కూజితాలను మైఖెలాంజిలో శిల్పంలోలా, లియోనార్డో డావిన్సీ కళ్ళకు, బ్రూనోను బూస్టించి వోల్గా ఇల్విచ్‌నోవిచ్‌ను లిప్టించి వ్రాస్తు - అంటాడు"

"క్షమించండమ్మా! అంటే ఏమిటో నాకు తెలియడం లేదు" అన్నాను.

"నాకూ తెలియడం లేదు" అన్నది కవిత.

"పోనీ - ఆ అయ్యగారి నడగనా?" అన్నాను.

"అడగబోకు. అతగాడికి అంతకన్నా తెలీదు." అన్నది మళ్ళీ వరస వేపు తిరుగుతూ. "ఏడున్నాడే - మరీ సనవ. రాసిందానికన్నా రాయా లనుకొనేది ఎక్కువ. ఇతగాడిది మరీ సద్యో గర్భం. ఏది కావాలంటే దాన్ని, క్షణాల మీద ప్రసవిస్తాడు. కోకిల మీద రాస్తాడు. కాకి మీద రాస్తాడు. ప్రేమ మీద రాస్తాడు. దోమ మీద రాస్తాడు. ఉత్త - నేలబారు సరుకు. ఆ తరువాత వారం దరూ, మైనాకిటీ దాటనివారు. ఒకదికి అంత్యప్రాసలంటే చచ్చేంత మోజు. 'నాకు పెట్టు భిక్షం, మెరుస్తోంది రుక్షం, ఇప్పుడీ చెట్టే వృక్షం, తెస్తాను నీకు మోక్షం' అంటాడు. 'ఓ సేవ్ కాకీ, నీ జుట్టు పీకీ, చూస్తాను మూకీ, పేలుస్తా తుపాకీ' అంటాడు. ఆ పక్కగా ఉన్నవాడు - ఓ వాక్యాన్ని ముక్కలుగా కత్తిరించి. ఆ ముక్కల్ని ఒక దానికింద మరో దాన్ని పేర్చి, బెదిరిస్తూ ఉంటాడు. 'అమ్మా! ఆకలిగా ఉంది' అన్న వాక్యాన్ని, 'అమ్మా' ఒక లైను' 'ఆ' ఒక లైను, 'కలి' మరో లైను, 'గా ఉం' ఇంకో లైను, చివరగా 'ది' అని చేర్చి, దానికి నా పేరే పెడతాడు" అన్నది కవిత విసుగ్గా.

"అయితే - కవితగారూ - తమకు నచ్చిన వారేలేరా?" అన్నాను ఆశ్చర్యంగా.

"లేక పోవడమేం? నా స్వరూపాన్ని చూసిన వారూ; నా అంతస్సును అవగాహన చేసుకొన్న వారూ ఉన్నారు; యుగానికి ముగ్గురో నలుగురో!" అన్నది కవిత, తన్మయతలో తేలిపోతూ ...

(30-11-89 గురువారం)

"నీ కోసం ఎదురు చూస్తున్నాను. నిన్ను నేనూ, నన్ను నీవూ తప్ప; నిన్నూ నన్నూ మరొకరెవరు చూడడమూ నా కిష్టం లేదు. అందుకే - నిన్ను నా కన్నుల్లో దాచుకొన్నాను. అందుకే - నిన్ను నా గుండెల్లో దాచుకొందా మను కొంటున్నాను. అందుకే - సరిగ్గా అందుకే - నెలవంకను తొరగా వెళ్ళి పొమ్మని ప్రార్థించాను. చుక్కలను మబ్బుల చాటుకెళ్ళమని. వేడుకొన్నాను. ఇప్పుడు నా చుట్టూ సగం చీకటి, సగం వెలుగుగు - విషాదానందం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లాగా, పరుచుకొని ఉంది. చలిగాలి హిమగీతాన్నాలా పిస్తున్నది. చెట్ల ఆకులు ఆనందంతో చప్పట్లు చరుస్తున్నాయి. మినుకు దీపాలను మోసుకొంటూ, మిణుగురులు దోవ చూపిస్తున్నాయి. వేకువ వెలుగుల వెల్లువలో, తోవలన్నీ కలిసిపోక ముందే నీవు వచ్చెయ్యి" అన్నాడతను

"నేను దూరమయ్యానని, నీవెప్పుడన్నా అనుకొన్నావేమో నాకు తెలియదు కానీ, నీవెప్పుడూ నాకు దగ్గరగా, నాతోనే, నాలోనే ఉన్నావు కన్నా! కాకపోతే, ఇది వరకేమో, నీకు కనబడుతూ ఉండేదాన్ని; ఇప్పుడేమో, నీకు కనబడకుండా ఉంటున్నాను. వచ్చెయ్యమంటున్నావు బాగానే ఉంది గానీ, నేనెక్కడ కెళ్ళాను గనక రావడానికి?" అన్నదామె నవ్వి ...

(1-12-89 శుక్రవారం)

"క్షణం నిశ్శబ్దం!" అన్నారెవరో.

ఆ మాట వింటూనే, నాకెంత నవ్వొచ్చిందని! ఒక్క క్షణం సేపే కావచ్చు - అచ్చమైన నిశ్శబ్దం లభించడానికి, ఎంత పుణ్యం చేసుకోవాలో తెలిసిన వారెవరూ, అలా అనరు, అనలేరు.

క్షణం కూడా అవసరం లేదు; క్షణంలోని శతాంశం పాటు, పోనీ సహస్రాంశం పాటయినా నిశ్శబ్దం లభిస్తుందా? యుగ యుగాలుగా, జన్మ జన్మలుగా, జగత్తంతా అన్వేషిస్తున్నాను, ఒక్క నిశ్శబ్ద శకలం కోసం. దూరాల్లోకి, లోతుల్లోకి, ఎత్తుల్లోకి, మూలల్లోకి, చొచ్చుకొని, చొరుచుకొని పోతున్నాను. అక్కడా నాకు శబ్దమే సాక్షాత్కరించింది.

చీమ కదులు తున్నప్పుడు, చివురు నవ్వుతున్నప్పుడు, హిమకణం ఆవిరవుతున్నప్పుడు, చీకటి చిరుగు తున్నప్పుడు, మేఘం కరుగుతున్నప్పుడు, దీపం వెలుగు తున్నప్పుడు, మొగ్గ వికసిస్తున్నప్పుడు, నీడ నడుస్తున్నప్పుడు, చూపు తాకు తున్నప్పుడయ్యే చప్పుడును కూడా నేను వినగలుగు తున్నాను. పరమాణువు లోని, మహాసూక్ష్మాణు భ్రమణ, పరిభ్రమణాల ధ్వనినీ నేను వింటున్నాను. అన్ని వేళలా, అన్ని చోట్లా శబ్దమే!

ప్రభూ! నీవు శబ్ద స్వరూపుడ వని, అప్పుడను కొన్నానయ్యా ...

(2-12-89 శనివారం)

ఒకప్పుడు వందల మందినీ, వేల మందినీ చూశాను. చేతనా చేతన ప్రకృతినీ చూశాను. ఇప్పుడు —

నీవు తప్ప, నీవే తప్ప, ఇంకెవ్వరూ, ఇంకేదీ నాకు కనిపించడం లేదు. ఒకప్పుడు, నా ఆలోచనలు దూరాలలోకి, దూరాలలోని మలుపుల్లోకి, మలుపుల్లోని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చీకట్లలోకి, మసక వెలుగుల్లోకి, మెరుపుల్లోకి, రహస్యాంతర్భాగాలలోకి చొచ్చుకు పోయేవి. ఇప్పుడు - నిన్ను తప్ప, నిన్నే తప్ప, ఇంక దేనిని గురించీ, నేను ఆలోచించ లేక పోతున్నాను.

నీవు ఏకమో, అనేకమో తెలియడం లేదు. నా చిన్ని లాగా, నా ఈశ్వరుని లాగా, నాలాగా, నాకు కనబడుతున్న నీ వెవరు? నే నెవరు??

'ఏకం' - 'అనేకం' అన్నవి, మరీ అర్థం కానంత గొట్టు విషయాలు కావను కొంటున్నాను. మనం ఏ నాటికీ తెలుసుకో లేనంత గొట్టు విషయాలను, ఈశ్వరుడు మాత్రం, మన ముందెందు కుంచుతాడు? ఒక పసి బిడ్డకు విద్యను బోధించడం కోసం, ఉపాధ్యాయుడు అవలంబించే విధానాన్నే ఈశ్వరుడు కూడా, మనపట్ల అవలంబిస్తా డనుకొంటున్నాను. ఇట్టే తెలిసి పోయే విషయంతో పాఠాన్ని ప్రారంభించిన అధ్యాపకుడు, విషయంలోని జటిలతను బోధ పరచేందుకు, ఉదాహరణలనూ, ప్రతీకలనూ, ఇస్తున్నట్లే, ఈశ్వరుడు కూడా, ఎన్నో ప్రతీకలను మన చుట్టూ అమర్చుతున్నా డను కొంటున్నాను. చినుకు ఏకం. వాన అనేకం. కిరణం ఏకం. వెలుగు అనేకం.

ప్రభూ! నన్ను 'నన్ను' గా మార్చేందుకూ, తీర్చేందుకూ, నా చుట్టూ చాలా అమర్చావు. నేను గుడ్డివాడినయి, వాటిని చూడలేక పోతున్నాను. సోమరినయి, వాటిని అందుకోలేక పోతున్నాను. దోషం నాది గానీ, నీది కాదయ్యా ...

(3-12-89 ఆదివారం)

ప్రభూ! ఎక్కడి నించీ ఏమీ వినిపించడం లేదు; ఆకాశంలోంచీ, ఆకాశం పరుచుకొన్న ఆకు పచ్చని అడవుల్లోంచీ, అడవుల్ని కప్పుకొన్న అవనీ తలంలోంచీ, అవని మీంచి అపార పారావారంలోకి ప్రవహిస్తున్న అసంఖ్యాక నదీ నదాల్లోంచీ, ఎక్కడిన్నించీ ఏమీ వినిపించడం లేదు. ఆ శబ్ద ప్రపంచమంతా, ఏ దృశ్యంలో లయించి పోయిందో తెలుసుకోవాలని ఉంది!

ఇప్పుడు నా ముందు విస్తరించి ఉన్న దృశ్య ప్రపంచం నించి, దృశ్యం కూడా ఏ శబ్ద ప్రపంచంలోనో లయించి పోగా - మిగిలిన, శబ్ద దృశ్య రహిత స్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు కోవాలని ఉంది.

శబ్దాతీత, దృశ్యాతీత రీతిలో, అవగాహన చేసుకొనే జ్ఞానాన్ని నాకు ప్రసాదించు. ప్రభూ! నాకు చాలా ఇచ్చిన మాట నిజమే! ఇతరులు నన్ను చూసి, అసూయ పడేటన్ని నాకిచ్చావు. ఇవన్నీ నా కొద్దు, నీ విచ్చిన వన్నీ నీవే తీసేసుకో. నాకున్న వన్నీ తీసేసుకో. నీ వేదీ ఉత్తినే తీసుకోవని నాకు తెలుసు. ఓ నమ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్కారం మాత్రం తీసుకొని, మాతప్పులన్నీ క్షమిస్తావు. ఓ వేడికోలును అందుకొని, మా ఇబ్బందులను తీరుస్తావు. ఓ మొక్కును పుచ్చుకొని, మా కోరికలన్నీ నెరవేరుస్తావు. వాటికి బదులుగా, నా మనసులోని మాటను చెప్పుకోనేందు కొక చిన్న దయా హృదయాన్నీ, నా కన్నీటని తుడిచేందుకు, రెండు సుతి మెత్తని వేళ్ళనూ నా కివ్వు చాలు ...

(4-12-89 సోమవారం)

నేనో సారి చిన్న చిటిక వేస్తే చాలు; కాలమేఘం ఉరుముతుంది; కానీ, నేను చప్పట్లు చరిచినా నీవు పలకవు.

నేనో సారి గొంతు సవరించు కొంటే చాలు; కాంతి గోళం బద్దలవుతుంది; కానీ, నేను గొంతెత్తి అరచినా నీవు పలకవు.

నేనో సారి భ్రుకుటి ముడిస్తే చాలు; ఆకాశం గజ గజ లాడిపోతుంది; కానీ, నేను గుండెలు బాదుకొన్నా నీవు పలకవు.
నేనో సారి ...
ఎందుకులే చిన్నీ అనుకోవడం; నేను ఏడుపు ముద్దగా మారినా నీవు పలకనప్పుడు?

(5-12-89 మంగళవారం)

"ఎక్కడికి? ఎక్కడికి చీకట్లను మోసుకు పోతున్నావ్?" అన్నాను ఆయాసపడుతో పరుగులిడుతోన్న గాలితో.
"రశ్మిలో స్నానం చేయించుదా మనీ" అన్నది చలిగాలి రయ్యుమని పోతూనే.
"అందరూ 'చీకటి చీకటి' అంటుంటారు. అదెలా ఉంటుందో, ఇంత వరకూ నాకు తెలీనే తెలీదు." అన్నాడు సూర్యుడు.
ఆ అనడంలోనూ, 'అయ్యో! చూడలేక పోయానే' అన్న బాధకన్నా, 'నన్ను చూస్తూనే చీకటి, కోట్లాది యోజనాల దూరం పారిపోతుంది సుమా' అన్న అహంకారం ఉంది.
సూర్యునికి అర్ఘ్యమిస్తున్న తపస్వి ఆ మాటలు విని నవ్వాడు.
"నవ్వావెందుకు? నే నన్నది సత్యమేనే!" అన్నాడు సూర్యుడు.
"నీ వెప్పుడూ నీ చుట్టూ చూస్తావు. నిన్నూ పై పైన చూసుకొంటావు. నీ లోకి నీ వెప్పుడూ చూసుకొని ఉండవు. ఒక సారి ఆత్మ దర్శనం చేసుకో. నీలో ఎన్ని చీకటి గుయ్యారాలున్నాయో నీకే తెలుస్తుంది!" అన్నాడు తపస్వి ...

(6-12-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఎవరి కోసమన్నా చూస్తున్నావా? దేని కోసమన్నా వెదుకు తున్నావా?" అన్న దామె, అలసినట్టుగా కనిపిస్తున్న అతని వంక జాలిగా చూస్తూ.

"అవును. జ్ఞానం కోసం చూస్తున్నాను. కనీసం, దాని అడుగుజాడలన్నా కన బడతాయేమోనని వెదుకు తున్నాను" అన్నాడతను దీనంగా.

"ఆచూకీ అయినా దొరికిందా?"

"లేదు" అన్నాడతను నీరసంగా.

అతని నుదుటి మీదా, మెడ మీదా పట్టిన చెమటను, పైట చెరగుతో అద్దిం దావిడ!

"అయ్యో! నేనుండి కూడా ఏమీ ప్రయోజనం లేక పోతోంది కన్నా! నాకేమో - ఆ పేరు కూడా ఎప్పుడూ విన్న గుర్తు లేదు ... పోనీ - అదెలా ఉంటుందో ఎక్కడ ఉంటుందో నీవన్నా కాస్త వివరంగా చెప్పు. ఇంత కాలానికి, నీకు దాని అవసరం రావడమే విడ్డూరంగా ఉంది! .. నేనో మొద్దును. ఇన్నేళ్ళు నీతో కాపరం చేసినా, నీకేం కావాలో కూడా తెలీనంత మొద్దు రాచ్చిప్పను. విసుక్కోకుండా, కాస్త వివరంగా చెప్పు. నేనూ వెదుకుతాను." అన్నదామె, అతని చెమట నింకా తుడుస్తూనే!

"నాకు - నాకు - నీవే కావాలమ్మా !" అన్నాడతను, ఆమెను నిలువునా ఆలింగనం చేసుకొంటూ.

"ఇప్పటి దాకా 'జ్ఞానం జ్ఞాన' మంటూ కలవరించావుగా కన్నా ! అంత లోనే మనసు మార్చుకొన్నావేం ?" అన్నదామె హాయిగా నవ్వుతూ.

"తనకేమీ తెలియదన్న పరమ సత్యాన్ని తెలుసుకోవడం కన్నా మించిన జ్ఞానం వేరే ఏముంటుంది చిన్నీ ?" అన్నాడతను.

"నువ్వొత్త పిచ్చివాడివి కన్నా !" అన్నదామె, తన చుట్టూ అల్లుకు పోయిన అతని చేతులను మెల్లగా విడదీస్తూ ...

(7-12-89 గురువారం)

"నీ మీద వచ్చినన్ని కథలు, గాథలు, కావ్యాలు, పాటలు, పద్యాలు, నాట కాలు ... ఇంకెవరి మీదా రాలేదు. మాట పుట్టినప్పట్నించీ, మనిషి నిన్ను కీర్తిస్తూనే ఉన్నాడు. మాట లేక ముందు, రేఖలతో, రంగులతో నిన్ను చిత్రించుకొని, తన్మయుడయి పోయాడు. ప్రేమ, విరహం, శృంగారం, ఉన్న ప్రతిచోటా నువ్వున్నావు. అందంగా ఉన్న ప్రతి ముఖాన్ని నీతో పోల్చడం, మాకొక సాంప్రదాయ మయిపోయింది. నిన్ను వర్ణించడం, మా కవుల ప్రతిభ కొక కొలమానమయిపోయింది. నీ గురించి వినని వారూ, నిన్ను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చూడనివారూ, భూ మండలంమీద లేరు. దొరకరు" అన్నాడతను చంద్రుణ్ణి చూస్తూ.
ఆ పొగడ్తలు వింటూనే, చంద్రుడు, సిగ్గుతో ముడుచుకు పోయాడు. వెన్నెల పలచబడి పోయింది.
"చంద్రుడా ! ఏం జరిగింది ? అలా అయి పోయా వేమిటి ?" అన్నాడతను భయంగా, దిగులుగా.
"నన్ను మన్నించు నాన్నా ! నీ అభినందనలకు నేనెంత మాత్రం అర్హుణ్ణి కాను. నాలో - నీవు, చూస్తూన్నవేవీ, నా నించి నీవు పొందుతున్నవేవీ, నా సొంతంగాదు. నేను - భాస్కరుని కరుణ కిరణ స్పర్శను వరంగా పొందిన అదృష్టవంతుణ్ణి మాత్రమే !" అన్నాడు చంద్రుడు వినయంగా ...

(8-12-89 శుక్రవారం)

పగిలిన అద్దంలో కనిపించే ప్రతిబింబంలాగా, జీవితం ముక్కలు ముక్కలుగా, చెక్కలు చెక్కలుగా అయిపోయింది. ప్రతి అద్దం పెంకులోనూ, అంతో ఇంతో కనిపించేది, నా ముఖంలోని భాగమే కావచ్చు. కానీ - ఆ కనిపించే కాస్త భాగమే, నా ముఖం కాదు. ఈ ముక్కలన్నింటినీ, జాగ్రత్తగా కలిపి ఉంచేవారూ, ముఖమంతా స్పుటంగా కనిపించేలాగా చేసే వారూ, ఇప్పుడు నాకు లేరు.
పాతగాయా లింకా సలుపుతూనే ఉన్నాయి. నెత్తురులు చిమ్ముతూనే ఉన్నాయి. కాలభిషగ్వరుడు పైపూత పూస్తున్నాడు. కాస్తంత చెక్కు కడుతున్నాయి. ఈ వ్యవధిలోనే ఈశ్వరుడు మళ్ళీ కొత్త గాయాలు చేసే ప్రయత్నాలారంభిం చాడు. సృష్టిలో - కొన్ని సదాహరిత వృక్షాలున్నట్లే, కొందరు, సదా దుఃఖి తులు కూడా ఉంటారు. ఇలా - గాయాలు చేయడానికయినా నన్నే ఎన్ను కొన్నందుకు, ఈశ్వరునికి నేను చాలా చాలా కృతజ్ఞుణ్ని.
చిన్నీ ! ఏ లోకంలోనో, ఏ రూపంలోనో ఉన్న నన్ను, ఎవరో దయా మయులు, నీ చేతుల్లో ఉంచి, ఇక్కడికి తీసుకొచ్చారు. నిన్నెమో తీసుకెళ్ళారు; నన్ను ఒంటరిని చేశారు. నీ కోసమూ, నిన్నూ నన్నూ ఇక్కడికి తీసు కొచ్చిన వారి కోసమూ, నే నిప్పుడు వెదుకుతున్నాను.
ఏం లేదు. ఏమీ మిగలదు. లేదనీ, మిగలదనీ తెలిసికూడా నావెంపర లాటను వొదలలేక పోతున్నాను. నీవేమో "నిన్న" వయి పోయావు. నేనేమో "వర్తమానం" నుంచి "రేపు" మీదికి వొంగి, తొంగి తొంగి చూస్తున్నాను. మూర్ఖంగా ...

(9-12-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాకు రెక్కలున్నాయో లేవో చూడకుండానే, ఎవరో నన్ను ఆకాశంలోకి విసిరేశారు. విధి లేక - ఎగురుతూ, ఎగురుతూనే, రెక్కలను సృష్టించుకొన్నాను. రెక్కలు మొలిచాక, వాటి సాయంతో మరికొన్ని దూరాలకూ ఎత్తులకూ ఎగిరే ప్రయత్నాలు చేస్తున్నాను. అంచాత నా గగన యానంలో, సహజంగానే, చాలా దోషాలు కనబడతాయి. నన్ను మన్నించక తప్పదు ...

నే నిక్కడేమిటో, నాకు అంతో ఇంతో తెలుస్తూనే ఉంది. నేను తెలుసుకొనలేనేమోనన్న అనుమానం కలిగినప్పుడు - నా హితులూ, అహితులూ, మాటల ద్వారానో, చేతల ద్వారానో - నేను ముక్కలుగా, చెక్కలుగా, చీలుకుపోయేలాగా, క్రక్కదలి పోయేలాగా, నా గురించి నాకు చెబుతూనే ఉన్నారు. ఇక్కడ సరే - ఇదెలాగూ నాది కాదని నాకు తెలుసు. నాదైనదేదో మరొకటి, అక్కడెక్కడో ఉండి ఉండాలి. అక్కడ - నేనేదో వొకటి అయి ఉండాలి గదా ! అదేదో — ఏమయి ఉంటానో, తెలుసుకోవాలని ఉంది !

జీవితం అందమైన వాక్యం వంటిది. ప్రేమ, అనురాగం, వియోగం, మొదలైన వన్నీ, విరామ చిహ్నాల వంటివి. మరణం, ఒక సెమికోలన్ (;) వంటిది. అయితే - ఈ వాక్యానికి ఆద్యంతా లేమిటో నాకు తెలీదు ...

(10-12-89 ఆదివారం)

ఎన్నెన్నో పోగొట్టుకొన్నప్పుడు, ఎంతో కొంత బాధ పడిన మాట నిజం : నిన్ను పోగొట్టుకొన్నప్పుడు మాత్రం బాధ పడలేదు; "బాధపడుతున్నా"నన్న స్పృహను కూడా పోగొట్టు కొన్నాను గనక. నీతో బాటు, నాకున్నవన్నీ నీవే తీసుకెళ్ళావు. అందుకే, ఆ శూన్యాన్ని భరించలేకనే, నీవెక్కడకూ వెళ్ళలేదనీ, నాతోనే ఉన్నావనీ, నాకు నేను నచ్చచెప్పుకొంటున్నాను. నన్ను నేను మోసం చేసుకొంటున్నాను.

చిన్నీ ! నీవు - అతిలోక మోహనమైన శైలిలాగా ఉంటావు. కాలం నిండా కమ్మిన కాంతిధార లాగా ఉంటావు. సంక్షుభిత జీవితం మీద వాలిన ధవళ పారావతం లాగా ఉంటావు. సెలయేటి నిండా కమ్మిన వెన్నెల పన్నీటి లాగా ఉంటావు. నిశ్శబ్దపు పొత్తిళ్ళలో మసిలే శబ్ద శిశువు లాగా ఉంటావు ...

"కన్నా ! ఇక్కడేం చేస్తున్నావు ?" అన్నదామె.

"వెన్నెలలో వేళ్ళు తడిపి, వేకువ మీద నీ చిత్రం చిత్రిస్తున్నాను" అన్నాడతను.

"ఎందు కట్లా ?" అన్నదామె ఆశ్చర్యంగా.

"వెన్నెలా, వేకువా ఉన్నంత కాలమూ నీవూ ఉండాలని !" అన్నాడతను ...

(11-12-89 సోమవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రేమ - ఒక ఇంద్రజాలం వంటిది. అది - బండరాతిలో భగవంతుణ్ని చూపిస్తుంది. చలి చీమలో చైతన్య జగద్రహస్యాన్ని చూపిస్తుంది. అలా చూడలేని వారి ముందు - ప్రేమను గురించి ప్రస్తావించడం వృధా !

అది - ఐహికమేగానీ, ఆముష్మికమేగానీ, ప్రేమను ఎరగక పోవడంకన్నా దురదృష్టాన్ని నే నూహించలేను. ఒక గొప్ప త్యాగానికీ, ఏకాగ్రతకూ, శ్రీకారం వంటిది ప్రేమ.

చూడడానికి ప్రశాంతంగా ఉన్నట్లు కనిపిస్తుంది కుమ్మరి ఆవం. కానీ - లోపల మాత్రం కణకణలాడే నిప్పులుంటాయి. అవి - మృత్తికను కూడా కరిగించి మరిగించి చిట్టెం కట్టుకుపోయేలాగా చేస్తాయి. నే నిప్పుడా కుమ్మరి ఆవం లాంటి వాణ్ని ...

(12-12-89 మంగళవారం)

శీతల సముద్రం పొంగులెత్తి, భూమండలాన్ని ముంచెత్తినట్లుగా వొకటే చలి !

చిన్నీ ! సముద్రాన్ని తలుచుకొన్న ప్రతిసారీ, నా కళ్లు మహా సముద్రా లవుతాయి నీవు గుర్తుకొచ్చి.

సముద్రంలోంచి, అలా పైకొచ్చాడు సూర్యుడు. అతని తడి వొంటిని అద్దేందుకు, చుట్టూ మూగారు మేఘ కన్యలు. నేలనిండా, నింగినిండా, ఉదయాన్ని ఆరేసుకొంటున్నాడు సూర్యుడు.

కొండ గొంతులోంచి ధారలాగా జాలు వారే పాట; నేల లోంచి పచ్చగా మొలుచుకొచ్చిన బాట; విరగ పండిన పొలం మీంచి అలలుగా వీచే వెలుగు; కొమ్మ మీంచి, కొమ్మ మీదికి దుమికే పులుగు; గుర్తు కొస్తాయి, నిన్ను తలుచుకొనగానే !

దేనికీ వొక శాశ్వతమైన సిద్ధాంతంగానీ, ఒక నిర్దిష్టమైన విధానంగానీ ఉండదనుకొంటాను. జీవితానికి అసలే ఉండ దనిపిస్తుంది. కానీ - ఒక్కోసారి, ఉన్నదేమో ననిపిస్తుంది. మరోసారి లేదనీ, అనిపిస్తుంది. ఒక్కొక్కసారి, ఆ ఉన్నదేదో తెలిసినట్టుగా అనిపిస్తుంది. మరోసారి, లేనిదేదో తెలిసినట్టుగా అనిపిస్తుంది. చివరికి, అటో ఇటో తేలకుండా, అటూ ఇటూ ఊగిసలాడుతూ ఉంటుంది ...

(13-12-89 బుధవారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఏం కావాలి? నువ్వేమిటో మెల్లిగా గొణుగుతున్నావుగానీ, నాకు వినిపించడం లేదు" అన్నాడతను, తన కెదురుగా నుంచున్న మట్టి ముద్దను.

అది ముందుగా నిట్టూర్చింది. కాస్సేపు ఆలోచించింది. తరువాత చెప్పడం ఆరంభించింది.

"నేను రాజోద్యానం నుండి వస్తున్నాను. నాకు రాజుగారంటే భయం రాణిగారంటే ఇష్టం. యువరాణీ గారంటే - దాన్నే మనాలో తెలీడం లేదు - అదీ! ఆమెగారి సౌందర్యం మీకు తెలిసే అవకాశం లేదుగానీ, నాకు తెలుసు. గొ——ప్ప—అందం! గాలి తాకినా, వెలుతురు సోకినా, కంది పోయేంత సున్నితమైన, లలితమైన సౌందర్యమామెది. ఆమెకు పచ్చిక నేలలంటే ఇష్టమని గ్రహించాను. నా నిండా, పచ్చిక పచ్చదాన్ని కప్పుకొన్నాను. ఆ పచ్చనం మీంచి, ఆమె మెల్లగా నడిచి పోతుంటే, నేను తనిసి పోయాను. నా జీవ [illegible]ంతా; వేళ్ళల్లోంచి, కాండాల్లోంచి, కొమ్మల్లోంచి, మొగ్గల్లోకి, పూలల్లోకి వా[illegible]ను. నా ప్రాణాలను రంగరించి, రంగులుగా, పరిమళాలుగా మార్చి, ఆ పూలకు అద్దాను. ఆమె - ఆ వాసనలకు, రంగులకు, పులకించి పోయినప్పుడు, నా జన్మ ధన్యమయిందనుకొన్నాను. మీతో చెప్పకపోవడమేమిటిగానీ బాబుగారూ, నా అదృష్టానికి నేనే అసూయపడ్డాను. ఆమె గారంటే, నాకు వల్లమాలిన ఇష్టం. చెప్పలేనంత ఇష్టం! ఆ ఇష్టం నన్ను ఉన్మాదిని చేసిందండీ!" అని క్షణ కాలం ఆగిందా మట్టి ముద్ద.

అతను - ఆ మట్టి ముద్ద చెప్పేదంతా, ఆసక్తిగా వింటున్నాడు.

"నా సమస్యను, మీరొక్కరే పరిష్కరించ గలుగుతారు." అన్నదది.

"ఇన్నింటికి - మీ ..." అని ఆగిపోయాదతను.

మట్టి ముద్ద కాస్సేపు ఆలోచించింది. ఆలోచించాక, మళ్ళీ, మెల్లగా గొంతు విప్పింది!

"తన కోసం, మీరో అందమైన ప్రతిమను తయారు చేస్తున్నట్లుగా, రాజకుమారి తన చెలికత్తెలతో చెప్పడం, నిన్న సాయంకాలమే విన్నాను. అప్పటి నుండీ, నా కంటి మీద కునుకులేదు. రాత్రంతా, రకరకాల ఆలోచనలు నన్ను ఇసుకల్లా ముసిరాయి నేనేమో మట్టి ముద్దను. ఆమె గారేమో, మహారాజు గారి ముద్దుల కూతురు. నా అభిలాష తీర్చగల సమర్థులు, దక్షులు, మీరొక్కరేనని, నాకు తెలుసు. అందుకే - నా సొదంతా తమతో చెప్పుకొందామని, ఇలా తమ దగ్గర కొచ్చాను" అన్నది మట్టి ముద్ద.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నన్నేం చేయమంటావు?" అన్నాడతను అయోమయంగా, దాని వేపు చూస్తూ.

"మీరు దయా హృదయులు. నా చిన్న కోరికను మన్నించండి! నన్ను - చెక్కిళ్ళుగానూ, పెదవులుగానూ మార్చండి. మీరు తయారు చేస్తున్న ప్రతిమకు, వాటిని అమర్చండి. ఆ మహాసౌందర్య రాశి, మునివేళ్ళ, చెక్కిళ్ళ, అధరాల స్పర్శలను, నన్ను తనివి తీరా అనుభవించ నీయండి! అంతా మీ చేతుల్లో ఉంది. మీ దయ!" అన్నదా మృత్తిక ప్రార్థనా పూర్వక స్వరంతో. అతగాడు - అసూయతో భగ్గున మండిపోయాడు. ఆ మట్టి ముద్దను, కసిగా, వీధిలోకి విసిరి వేశాడు.

"ఓరి దుర్మార్గుడా! ఎంత పని చేశావురా? నీవూ మట్టిగా మారి, మొత్తం ప్రతిమగా రూపొందుదా మనుకొంటున్నా వన్న మాట! ఆమె - అందం అలాంటి దయినప్పుడు - నిన్ననిమాత్రం ఏం ప్రయోజనం?" అనుకొన్నదా మట్టి ముద్ద.

(14-12-89 గురువారం)

నీ గురించీ, నా గురించీ, ఎవరెవరో, ఏ వేవో అంటున్నప్పుడు నా కనిపిస్తుంది' "పోనీ, మన మేమిటో వీరికి చెప్పేసుకొందామా?" అని! అయితే, ఆ పని మనమెప్పుడో చేశామన్న విషయం, వేయిన్నొకటో సారి గుర్తు కొచ్చి, మనలో మనమే నవ్వుకొంటాం.

మన మేదో దాచుకొన్నామని వీరు అనుకొంటున్నారుగానీ, దాచుకొనవలసిందేమీ మన దగ్గర లేదని వీరికి తెలీదు. అలాగే - బహిర్గతం చేయదగ్గది కూడా మనకు లేదనీ, వీరికి తెలీదు.

ఇన్నిటికీ మన మెవరం?

ఒకరు వేకువ, ఒకరు ఉదయం అని చెబుదామా?

ఒకరు దేహం, ఒకరు దేహి అని చెబుదామా?

ఒకరు జ్ఞాత, ఒకరు జ్ఞేయం అని చెబుదామా?

ఇలానూ మనం చాలా కాలంగా చెబుతూనే ఉన్నాం. వారూ వింటూనే ఉన్నారు.

విసీ విసీ విసీ, మళ్ళీ అడుగుతారు;

ఎవరు వేకువ, ఎవరు ఉదయం అని

ఎవరు దేహం, ఎవరు దేహి అని

ఎవరు జ్ఞాత, ఎవరు జ్ఞేయం అని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వారడిగిందాకా, మనమేమిటో నన్న అనుమానం కూడా మనకు రాలేదు. వాడు అడిగాక - నేనేమిటో నాకూ; మనమేమిటో మనకూ; తెలీడం లేదు.

చిన్ని : మనమిప్పుడెంతో నిస్సహాయ స్థితిలో ఉన్నాంగదూ?

(15-12-89 శుక్రవారం)

ఒక విత్తనాన్ని అంకితమిచ్చిన వారికి, పది విత్తనాలను ప్రసాదిస్తుంది భూమాత. నీవూ, ఆ మాతకే అంకితమయిపోయావు గదా! కనీసం - ఒక్క కాంతమ్మగా నన్నా రావేం చిన్ని?

"చాలా చోట్ల తిరిగాను. నాకు తెలిసిన వారినీ, నన్ను తెలిసిన వారినీ అడిగాను. నాకు తెలియకపోయినా, నన్ను తెలిసిన వారినీ అడిగాను. నాకు తెలియక పోయినా. నన్ను తెలియక పోయినా, విషయం తెలుసు ననుకొన్న వారినీ అడిగాను. ఆఖరుకు, నా హితవరులు సూచించిన వారిని కూడా అడిగాను. కానీ - నీకివ్వదగిన కానుకను - ఒక్కటంటే ఒక్క కానుకను కూడా - వారు సూచించలేక పోయారు. అందుకే, నేను శూన్య హస్తాలతో నీ ముందు కొచ్చాను. నన్ను మన్నించు" అన్నాడతను దిగులుగా.

ఆ మాటలు విని, ఆమె జాలిగా నవ్వింది. నవ్వాక, అతన్ని తనివి తీరా చూసింది.

"నాక్కావలసిన ఒక్క కానుకా, నా ముందుకే కదలి వచ్చినప్పుడు, ఇంకా నేను కోరుకోనవలసిన కానుకేముంటుంది కన్నా?" అన్నదామె, అతని చెంపలను మెత్తగా స్పృశిస్తూ.

(16-12-89 శనివారం)

"ఎందుకలా దిగులుగా ఉన్నావ్?" అన్నాడతను, ఓ మూలగా, బిక్కు బిక్కుమంటూ, దిగులు దిగులుగా ఉన్న ఆ పదాన్ని చూస్తూ.

అతని గొంతు వింటూనే, కళ్ళనిండా, నీళ్ళు పెట్టుకొన్నదా పదం. ఆ స్థితిలో ఉన్న దాన్ని చూస్తూనే అతనూ కరిగిపోయాడు. మెల్లగా దగ్గరకెళ్ళి, దాని కన్నీళ్ళు తుడిచాడు.

"ఊరుకో. ఏ సమస్యకూ ఏడుపు పరిష్కారం కాదు. నీ కభ్యంతరం లేకపోతే అసలేం జరిగిందో చెప్పు. నా చేతనయిన సాయం చేస్తాను" అన్నాడతను ఆ పదాన్ని ఓదారుస్తూ.

కాస్సేపు వెక్కి వెక్కి ఏడ్చి, అది కోలుకొన్నది.

"బాబూ! మీరు పెద్దవారు. అనుభవం ఉన్నవారు. మీకెన్నో తెలుసు ... ఒక్క

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సారి, అనుకోకుండా, ఏవేవో జరిగిపోతాయి. పెద్దవాళ్ళు చూసీ చూడనట్టుండాలి. తమ పెద్దరికాన్ని దక్కించుకోవాలి. అవునంటారా కాదంటారా బాబుగారూ?" అన్నదా పదం.

"నువ్వన్నది నిజమే! ఇప్పుడే మయింది?" అన్నాడతను.

"నేనోసారి, ఎందుకో అలా షికారుగా వెళ్ళాను. అప్పుడు నాకో పదం కనిపించింది దూరంగా. ఆ పదం, అందంగా ఉన్నట్టు అనిపించి, దగ్గరగా వెళ్ళి చూశాను. నిజంగానే అందంగా ఉంది. నాజూగ్గా ఉంది. కాస్తంత - కొత్తగానూ ఉంది. కారణం చెప్పలేనుగానీ బాబు గారూ, నాకా పదం బాగా నచ్చిందండీ! మా చూపులు కలిశాయి. మాటలు కలిశాయి. పరిచయం పెరిగి స్నేహంగా మారింది. స్నేహం పెరిగి పెరిగి, ఒకరిని విడిచి మరొకరం ఉండలేని స్థితి కొచ్చాం. అంటే - మా హృదయాలు రెండూ కలిశాయన్న మాట. మేము ఒకరి నొకరం మనస్ఫూర్తిగా ప్రేమించు కొంటున్నా మన్న మాట. అయితే - మా ప్రేమను, మా పెద్ద వాళ్ళు ఒప్పుకో లేదు. వారి జాతి వేరట మా జాతి వేరట. మేమిద్దరమూ జత కట్టడానికి వీల్లేదన్నారు. వర్ణ సాంకర్య మవుతుందని గోల పెడుతున్నారు. మేము మాత్రం - విడిబడ లేకుండా ఉన్నాం" అన్నదా పదం దీనంగా.

అతనొక్క క్షణం కూడా ఆలోచించ లేదు.

"మీ పెద్ద వాళ్ళనూ, ఆ పక్క పెద్ద వాళ్ళనూ కొట్టుకు చావనీండి. మీరు మాత్రం విడిపోకండి. మీరిద్దరూ కలిసి తిరగడం నా కిష్టమే! మనసు పడిన వారితో వియోగం ఎంత దుర్భరంగా ఉంటుందో నాకు తెలుసు. బుద్ధీ జ్ఞానం ఉన్న వారెవరూ మిమ్మల్ని విడదీయ లేరు" అన్నాడతను. ఆ పదానికి ధైర్యం చెబుతూ.

ఇది జరిగి చాలాకాల మయింది.

"మిశ్ర సమాసం" గా ఇప్పుడా జంటను అందరూ ఆదరిస్తున్నారు ...

(17-12-89 ఆదివారం)

ప్రభూ! 'తెలుసు కోవడం' అన్నదొక దాహం, ఒక అగ్ని, ఒకతీవ్రేచ్ఛ. ఇది నన్ను వ్యాధిలా పట్టుకొంది. జ్వాలలా చుట్టుకొంది. ఆ మంటల్లోంచి బయటపడడానికి ప్రయత్నించిన ప్రతిసారీ, సెగలెగసిపోతున్నాయి. మంటలు సాంద్రమవుతున్నాయి.

నన్ను నేను తెలుసుకోవడంతో ప్రారంభించి, జగద్రహస్యాన్ని అవగాహన చేసుకోవడం దాకా ప్రయాణించుదా మనుకొన్నారు. "చాలా దూరం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచ్చాను సుమా!" అనిపించిందొక దశలో. అపుడు, ఎక్కడో ఏదో వినబడింది. ఎవరో, ఏదో ఓ వాక్యమన్నారు. అప్పుడనిపించింది. నేనసలు నడకనే ప్రారంభించలే'దని.

"ఏది తెలుసు కొందుకయినా, ఈశ్వరానుగ్రహం కావా"లన్నారు. అప్పుడు నీకోసం వెదకడం ప్రారంభించాను. ఒక దశలో - అసలు నీవంటూ ఉన్నావో లేవోనన్న అనుమానం వేసింది. "పోనీ గొడవెందు"కని సర్దుకొనే వేళకు, దూరదూరంగా, సన సన్నగా ఓ అనుమానం కదులుతుంది, నీవున్నావేమోనని! మళ్ళా అన్వేషణ ప్రారంభం. వెదికి వెదికి, విసిగి విసిగి, అలసిసొలసి, వేసారి, నిన్ను మరచిపోదామనుకొనే వేళకు, ఎక్కడో ఏదో జరిగి, నువ్వున్నావనిపిస్తుంది మళ్ళీ.

ఒక్కొక్కసారి, అన్నిటా అంతటా నీవున్నా వనుకొంటాను. అన్నీ నీవే ననుకుంటాను. నీవు కానిదేదీ లేదనుకొంటాను. అలా అనుకొంటున్నప్పుడే, అదేదో మాయ కమ్ముతుంది. ఓ మబ్బుగాఢంగా ముసురుతుంది. వెలుగు కాస్తా మసకేసి పోతుంది. మళ్ళీ ఓ అనుమానం వేరు పురుగులా తొలుస్తుంది తాచు పాములా బుస కొడుతుంది.

అపునుగాని ప్రభూ! అసలిన్ని గొడవలెందుకు పెడుతున్నావయ్యా ? నిన్ను గుర్తించని వారందరూ హాయిగా ఉన్నారు. నిన్ను నమ్ముకున్న వారినే కష్టాలు కడగండ్లు ముంచేస్తున్నాయి. ఎందుకిలా చేస్తున్నవో తెలీదు. నువ్వో ప్రత్యుత్తరం దొరకని ప్రశ్న లాగా తయారయ్యా విప్పుడు ...

(18-12-89 సోమవారం)

దాదాపుగా 30 ఏళ్ళ తర్వాత, ఆర్మీనియన్ వీధిలోని పాత ఇంటి ముందు కెళ్ళాం, నేనూ శ్యామూ. దుఃఖం పుక్కిలింతలయింది. ఆ గడపదాటి, ఆ మెట్ల మీదుగా కాంతమ్మ గారు వందల సార్లు, వేల సార్లూ నడచి ఉంటుంది. ఆమె పాద ముద్రలింకా, ఆ మెట్లకు జ్ఞాపకం ఉంచే ఉంటాయి. ఆమె పాదాలు తాకిన ఆ మెట్లను రెండు చేతులతోనూ స్పృశించి, కళ్ళకద్దుకొన్నాను. ఆ తలుపు వెనక నుండి, ఆమె నన్ను పిలుస్తున్నట్లని పించింది ...

(19-12-89 మంగళవారం)

ఋషుల తపస్సును భగ్నం చేయడానికి, ఎందరో దేవ వేశ్యలను ప్రయోగించాడు ఇంద్రుడు తన పదవీ భద్రత కోసం, తన వర్గ ప్రయోజనాల కోసం, స్త్రీ శీలాన్ని బలి పెట్టడాని క్కూడా, పురుష స్వభావం వెనుదీయదని నాకర్థమవుతోంది. పదవీ కాంక్ష అలాంటిదీ!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తపస్వినుల తపోభంగం కోసం, నృత్యంచేస్తూనో, పాట పాడుతూనో వెళ్ళ వలసిందని, ఏ మగవాణ్ణీ, దేవేంద్రుడు ఆదేశించినట్టు నేను చదవలేదు. వినలేదు కూడా. బ్రహ్మచారిణులైన తపస్వినులున్నట్టు కూడా నాకు తెలీదు. ఒక ద్రౌపదిని నిండు సభలో అవమానించారు. ఆమె కట్టుకున్న గుడ్డలను ఊడదీశారు. కానీ - ఏ మగవాడికీ వస్త్రాపహరణం చేసినట్టు నేనెక్కడా చదవలేదు. వినలేదు. బహుశా, అలా జరిగి ఉండకపోవచ్చు.

ఎందుకని ?

స్త్రీలోని అపారమైన క్షమాగుణం, ఆమె నీ పైశాచిక దశకు ఎప్పుడూ దిగజార్చదు గనక.

"స్త్రీ అద్భుతంగా నటిస్తుంది" అన్న చాలా మందిని నేనెరుగుదును. దానిక్కారణం మగవాడే ! తను చెప్పే నిజాన్ని విని, మగవాడు భరించలేడని ఆమెకు అనుభవపూర్వకంగా తెలుసు. అందుకే - మగవాడు భరించగలిగిన మేరకే - ఆమె నిజం చెబుతుంది. మిగిలిన విషయాలు తనకు తెలియనే తెలియవని, మగవాణ్ణి నమ్మించడానికి ప్రయత్నం చేస్తుంది. అవతలివారిని తాను, సంపూర్ణంగా విశ్వసించిందో - ఇంక రహస్య మంటూ తనలో ఏమీ మిగుల్చుకోకుండా - పాదాల ముందు కుప్పబోస్తుంది.

అలాంటి బంగారు తల్లులు నాకు కొద్ది మంది తెలుసు ...

(20-12-89 బుధవారం)

"నీకేం కావాలి ?" అన్నాడు ఈశ్వరుడు.

అతను పలకలేదు. ఆలోచనలో పడ్డాడు. అసలు - తనకేం కావాలి ? ఏం కోరు కొందామని ఈశ్వరుని దాకా వచ్చాడు ? ఒకదాని బదులు, మరోటి అడిగితే, తను నష్టపోడా ? అందుకని ఆలోచించి ఆలోచించి, నలుగుర్నీ సంప్రదించి అడగడమే మంచిదనుకొన్నాడు. అనుకొని -

"ప్రభూ ! మీ దయకు కృతజ్ఞుణ్ణి. నిజంగా నాకేం కావాలో తెలుసుకొన్నాక మళ్ళీ వస్తాను" అన్నాడతను.

ఈశ్వరుడు నవ్వాడు. ఆ నవ్వును చూసి అతను గతుక్కుమన్నాడు.

"స్వామీ ! నా మాట నమ్మండి ! నేను నిజంగానే మళ్ళీ వస్తాను" అన్నాడతను.

ఈశ్వరుడు మరోసారి నవ్వాడు.

"చూడు నాన్నా! నీవు మళ్ళీ వచ్చా వంటే, నీకేం కావాలో, నిజంగానే నీకు తెలీదన్న మాట! ఏం కావాలో తెలిస్తే, మళ్ళ నువ్విటుకేసి రావన్న మాట!" అన్నాడు ఈశ్వరుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఎందుకని?" అన్నాడతను.
"నీక్కావలసిన వేవీ నీకు బయట లేవనీ, అవసరమైన వన్నీ నీకున్నాయనీ, తెలిసి పోతుంది గనక, మళ్ళీ నీవిటు వేపు రావు" అన్నాడు ఈశ్వరుడు.
"ఉండడం, లేక పోవడం అన్నది నీలోనే ఉంది" అంటారు స్వామి తత్వానంద. వినడానికీ, చదవడానికీ బాగానే ఉందిగానీ, ఆచరణలో ఇది సాధ్యపడుతుందా? చచ్చేంత ఆకలితో మరిగి పోతూ, 'ఆకలి లేదు' అనుకోగలనా? నాకళ్ళ ముందే విలవిల్లాడుతూ, చనిపోయిన పావురం, 'బతికే వుంది' అనుకోగలనా? తత్వ చింతనకు, ఇలాంటి ఉదాహరణలు పనికిరావేమో నాకు తెలీదు . .

(21-12-89 గురువారం)

నేననుకో లేదు '—' వస్తుందని. నేనాశ్చర్య పోయి ఉండాలి.
"నేనూ అనుకోలేదు వద్దామని. ఎందుకో మిమ్మల్ని చూడాలనిపించింది. మీ గురించి, హిమానీ గారినడుగుతూనే ఉన్నాను. వచ్చారని చెప్పింది. అందుకే పనిమాలా వచ్చాను" అన్నదామె.
"కలలో కొచ్చావనంటా వేమోనను కొన్నాను. ఆశ పడ్డాను కూడా! నువ్వింకేదో చెబుతున్నావు" అన్నాను.
ఆవిడ ఫక్కుమని నవ్వింది.
"నవ్వుతూ, నవ్విస్తూ బతకడం గొప్ప అదృష్టం!" అన్నదామె.
"నిజమే! అలా బతుకుతూనే, నవ్వుతూనే చనిపోవడం, మరీ అదృష్టం!" అన్నాను.
'—' గారేమీ వ్యాఖ్యానించలేదు గానీ, ఓ మూలగా ఉన్న చిన్న డబ్బీని తెరిచి, ఓసారి నాకేసి చూసింది. 'అదేమి'టన్నట్టుగా. నేనా చూపుల్ని తట్టు కోలేక పోయాను. నీవంతా కలిసి, ఈ చిన్న డబ్బీలోని గుప్పెడు మట్టిగా మారిపోయావని, ఆమెతో చెప్పలేకపోయాను.
"నవ్వుతూ నవ్విస్తూ చనిపోదా మనుకొన్నాను. కానీ, ఏడుస్తూ ఇంకా బతకమని ఈశ్వరుడు శపించాడు" అన్నాను.
'—' చాలా సేపు నొచ్చుకొంది, కాంతమ్మ ప్రసక్తి తీసుకొచ్చినందుకు ...

(23-12-89 శనివారం)

ఓ కుర్రాడు మురికి సంచిని భుజాన వేసుకొని చెత్తకుండీని రెండు చేతుల తోనూ కుళ్ళగిస్తున్నాడు.
మరో కుర్రాడు దేవేంద్రునిలాగా వొంటినిండా కన్ను మొలిపించుకొని, శవం వెంట నడుస్తూ, కింద రాలిన ఘరమరాలను ఏరుకొంటున్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ కుర్రాడు - అరటి తొక్కలకంటుకున్న పిసరంత గుజ్జునూ గోళ్ళతో గీరుతున్నాడు.

ఈ కుర్రాడు సినిమా పోస్టర్ల వెనక, ఎండిపోయిన మైదా పెచ్చుల్ని గిల్లు కొంటున్నాడు.

ఇంకో కుర్రాడు. పార్కులోని గడియారం స్తంభం చాటున, ఆకలినే కడుపు నిండా ఆరగించేసి, ఆద మరిచి నిదురపోతున్నాడు.

నేనంటే నాకెంత ఇష్టమో, ఈ కుర్రాళ్ళంటే నాకంతకన్నా ఎక్కువ ఇష్టం. నేను కొన్ని పనులే చేశాను. నేను చేయలేని వాటినికూడా, వీళ్ళు నిశ్చితంగా చేస్తున్నారు. కాకపోతే వొక్కటే తేడా! నేనేమో 45 సంవత్సరాల కిందట, అస్వతంత్ర భారతంలో, ఈ పనులన్నీ చేశాను. వీళ్ళేమో స్వతంత్ర భార తంలో, ఈనాడు చేస్తున్నారు

మంచి దుస్తులు, మంచి పదవులు, మంచి అధికారాలు, మనికి చాలా అడ్డంకులను కలిగిస్తాయను కొంటాను. ఈ రోజు ఉదయం, ఇద్దరు పెద్ద ఉద్యోగులతో మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు, మురికి గుడ్డ లేసుకొన్న కుర్రా డొకడు; ఎండు మండల్ని లాక్కెడుతూ కనిపించాడు. ఆ ఇద్దరు ఉద్యోగులూ నా వెంట లేకపోతే, నేనా కుర్రాడికి తప్పకుండా సాయపడి ఉండేవాణ్ని. అంటే నాలో . భేషజమింకా చాలా ఉన్న దన్న మాటే గదా!

(24-12-89 ఆదివారం)

ఇప్పుడంటే నాకొక్కటే పేరుంది గానీ, చిన్న తనంలో నాకు చాలా పేర్లు న్నాయి.

నా పేరు కొండ, కొలను; చెరువు, దొరువు; గట్టు, మెట్టు; సీద, గోడ; చేను, చెలక; వాగు, వంక; ఈత, రాత; తూనీగ, గోరింక; గాలిపటం గోలికాయ; ఆకలి, దరిద్రం; ఇవన్నీ, ఇంకా ఇన్నీ, ఇలాంటి వన్నీ నా చిన్నతనం నిండా పరుచుకు పోయాయి. నా బాల్యం నిండా అల్లుకు పోయాయి. వీటిల్లోంచి ఏ వొక్కటి తప్పించినా, గణం తప్పిన పద్య పాదం లాగా, నా బాల్యం కుంటు తుంది. అందుకే - ఎప్పుడో తప్ప నేను నా బాల్యం జోలికి పోను. నా బాల్యాన్ని నేనెప్పుడో పారేసుకొన్నాను.

వ్యభిచార గృహ యజమానులు, అందమైన పేద బాలికల్ని, కారు చవగ్గా కొని, ఖరీదైన హార్మోన్సును బలవంతంగా వారికిచ్చి, తొరగా ఈడేరాలాగా చేసి, తొర తొరగా "వృత్తి"లోకి దించినట్టుగానే; నాకు నేనే హార్మోన్సు నిచ్చి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొని, నాకు నేనే తొర తొరగా ఈడేరి, నాకు నేనే "వృత్తి"లోకి దిగి బతకడం ప్రారంభించాను.

అందుకే - అందరూ బాగా ఇష్టపడే, బాల్యం, నాకు దక్కకుండా పోయింది. నేను భరించలేని బాల్యం, విషవాయువు లాగా, నన్ను కమ్మి వేసింది. చిన్న తనమే తరగని, నా చిన్న తనాన్ని తలుచుకొని, నేనెంత ఏడుస్తానో ఎంత మందికి తెలుసు?

లాగి డొక్కలో తన్నిన కొడుకు కాలును, ముని వేళ్ళతో నిమురుతూ, 'దెబ్బ తగిలిందా నాన్నా?' అంటుంది అమ్మ. తనను మట్టగిస్తూ, తొక్కు కుంటూ పోయే పాదాలను మెత్తగా, చల్లగా, ముద్దెట్టు కొంటుంది పచ్చిక మైదానం! అందుకే - చల్లగా, పచ్చగా, మెత్తగా ఉన్న ఆ మైదానం నిండా, అమ్మ గుండె పరుచుకొన్నదేమో ననిపిస్తుంది నాకు....

(25-12-89 సోమవారం)

వేకువలోకి నడుస్తున్న ప్రతిసారీ, మంచి కవిత్వంలోకి చొచ్చుకు పోతున్నట్టుగా ఉంటుంది. మంచి కవిత్వం చదువుతున్న ప్రతి సారీ, మగత లోంచి, స్వప్నం లోంచి, వేకువలోకి తొంగి చూస్తున్నట్లుగా ఉంటుంది.

"బాగా అలిసినట్లుగా కనిపిస్తున్నావేం?" అన్నది పద్మం, ఆయాస పడుతోన్న సూర్యుణ్ణి చూస్తూ.

"మేఘాల మెట్లెక్కి ఇప్పుడే గదా వస్తున్నాను!" అన్నాడు సూర్యుడు, ఓ మబ్బుకు చేరగిల బడుతూ.

ఆ పూలు సంతోషంతో పాడుతున్నాయని తెలుస్తూనే ఉంది. కానీ వాటి భాష తెలీడం లేదు. అయితే నేం? ఓ గొప్ప వెలుగు, ఓ గొప్ప ఆనందం, ఆ పాట ల్లోంచి చింది పడుతున్నాయి. భాషను మించిన నాద శక్తి ఏదో, ఆ పాటల్లో లేకపోతే, అది విషాద గీతమో, ఆనంద గీతమో నాకెలా తెలిసింది? ఆ గొప్ప దనం పాటల్లో ఉన్నదా? పాటలను పలికించిన గొంతుల్లో పెదవుల్లో ఉన్నదా? అదే పాట నేను పాడితే కరుగ్గా మురిగ్గా ఉంటుంది.

ఒకరు మంచి గీతం వంటి వారు, మరొకరు మంచి సంగీతం వంటి వారు. అయితే ఎవరు గీతమో ఎవరు సంగీతమో, వింటున్న వారికీ తెలీదు. వారికీ తెలీదు. సంగీతానికి పొదుగుతూ గీతం సాగినట్టుంటుంది. గీతాన్ని వొరుసు కొంటూ సంగీతం సాగినట్టుంటుంది. దేనికేది వొదుగుకొంటూ, వొదుగుకొంటూ సాగిందీ, గీతానికీ సంగీతానికీ తెలీదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నీవు గీతం లాగానూ, సంగీతం లాగానూ ఉంటావు. అంటాత - నీవుకానీ, ఆ రెండవది ఏదైతే అదే నేను. నేను కాని దేదో అదే నీవను కొంటాను. అయినా ఒక్క ఆద్యక్షరం తప్ప - నీ - నా - మధ్య తేడా మాత్రం ఏ ముందమ్మా?" అన్నాడతను.

(26-12-89 మంగళవారం)

"నాదం వాలిపోయి, తూలిపోయి రాగంగా మారినట్టు; చీకటి చిరిగిపోయి కరిగిపోయి, వేకువగా వెలసినట్టు; నిద్దుర తేలిపోయి, పాలిపోయి, మెలకువగా మసిలినట్టు; జీవితం మరిగిపోయి, మసిలిపోయి, కవితగా మారినట్టు; నీవు నా ముందు కొచ్చావు, రాగంగా, వేకువగా, మెలకువగా, కవితగా ... ఇన్నిటికీ నీవెవరివమ్మా?" అన్నాడతను మెరిసిపోతున్న ఆమె కళ్ళల్లోకి చూస్తూ,

ఆమె సన్నగా నవ్వింది.

"అది తెలుసు కొందామని నేనొస్తే, నన్నే అడుగు తావేం కన్నా?" అన్నదామె ఆప్యాయంగా, అతని గడ్డాన్ని పుణుకుతూ.

"నిండు చందమామ రెండు నెలవంక లయినట్లూ, వికసిన పూవు రెండు మొగ్గలుగా మారినట్లూ, ఎందుకు నవ్వుతావమ్మా? నీ నవ్వులోకి దూకి, గిల గిల్లాడి పోతూనే, అలానే, అక్కడే, అప్పుడే చచ్చి పోదామని పిస్తుంది నాకు" అన్నాడతను.

"కన్నా!" అంటూ ఆగి పోయిందామె, ఇంకేదో అనబోయి, అనలేక.

అప్పటికే ఆమె కళ్ళ నిండా, గొంతు నిండా ఆమె నిండా కన్నీళ్ళు నిండి పోయాయి ...

(27-12-89 బుధవారం)

తను కాసిన కాయలేవీ తనకు దక్కవని, ఆ ఫల వృక్షానికి తెలుసు. తను పూసిన పూవులేవీ తనకు ఉండవని, ఆతీవెకూ తెలుసు. కానీ - ఆ చెట్టు కాయడమూ, ఈతీవె పూయడమూ మానుకోవు.

స్త్రీ కూడా అంతే! తను ప్రేమిస్తూనే ఉంటుంది. తరుచుగా మోస పోతూనే ఉంటుంది. తనను మోసగించిన వాడు; పశ్చాత్తాప పడుతున్నట్టు నటించాడో, కన్నీళ్ళు పెట్టుకొన్నాడో, మళ్ళీ - అతని చేతుల్లో వాలి పోతుంది. ఆమెతో సహజంగా ఉన్న ఈ మృదు స్వభావాన్ని చేజిక్కించుకొని, ఆమెతో క్రూరంగా ఆడుకొంటున్నాడు పురుషుడు.

హడావుడిగా వెళ్ళి పోతున్న కారు మబ్బులు కూడా, ఓ నిమషం ఆగి, ఓసారి మెరిసి, ఇంకో సారి పిలిచి, తాము మోసుకొస్తున్న నీటి తుంపురులను శ్మశానం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిండా చిలకరించి పోతున్నాయంటే, అక్కడ - నీవుండడమే కారణ మను కొంటున్నాను చిన్నీ!

"ఒకప్పుడు మీ పాటల నిండా, నిండు తనం, వొదుగు, సంతోషం, సౌందర్యం, చిమ్మ్ము తుండేవి. ఇప్పుడేమిటి, అన్నీ చిరిగిపోయి పీలికలుగా వినబడుతున్నాయేం?" అన్నాను అతనితో.

"సహ గాయని లేక —" అన్నాడతను ...

(28-12-89 గురువారం)

మనలో చాలా మందిమి దొంగలం. చాలా వాటిని బయటకు పొక్కకుండా, లోలోపలే దాచుకొంటాం. డబ్బులు, నగలు, ఆశలు, ఆస్తులు, అసూయలు, ఆగ్రహాలు, అనుమానాలు, కోరికలు, విరహాలు, ప్రేమలు, విజయాలు, వైఫల్యాలు, కుట్రలు, మోసాలు వంటి నెన్నింటినో మనం మరొకరికీ అందకుండా ఇంకొకరికి తెలీకుండా, దాచుకొంటాం. మన నాలుక, పెదవులు, అబద్ధాలాడతాయి. (చాల మంది) కళ్ళకు అబద్ధా లాడడం చాత కాదు. ఎన్నెన్నింటినో గోప్యంగా దాచుకొంటాం - ఒక్క కన్నీళ్ళను తప్ప!

చిన్నీ వద్దు. అలా చూడకు. దయచేసి, అలాగా, దిగులుగా, దీనంగా, నావేపు చూడకు. నీ చూపు తాకిన ప్రతి చోటా, ఓ గాయం మొలుస్తుంది. ఆ గాయం లోంచి జ్ఞాపకాలు విరబూస్తాయి. గాయాలు మొలిచీ మొలిచీ మొలిచీ, మేనంతా, నేనంతా ఓ పెద్ద గాయంగా మారి పోతుంది. 'నన్ను' నన్ను గానే చూడలేవు గదా! గాయంగా మారిపోయిన నన్ను నువ్వేం చూడగలవమ్మా? అందుకనే - నేను గాయమయి పోకుండేందుకే - నన్నలా, దిగులుగా, దీనంగా చూడవద్దని, నిన్ను కోరుకొంటున్నాను ...

(29-12-89 శుక్రవారం)

"ఓ వన కుమారీ! ఓ హరిత సుందరీ!! నిన్ను చూసి, చాలా కాలమయింది!" అన్నాడతను.

"ఒకప్పుడు మీరు నాకు ప్రతి నిత్యమూ అతిధులే!" అన్నాదా చిన్న ఉద్యానవనం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అవును. అప్పుడు - సహస్రాధిక దినాల వెనుక, మేముభయులమూ, ఉదయ సాయంకాలాలు, నీకు అతిధులుగా ఉన్నాం. నీ వందించిన కమ్మని గాలిని, రంగుల పూలను, అందాలను, ప్రశాంతతను పుష్కలంగా అనుభవించాం. నీ అతిథి మర్యాదలను గురించి, మేము ఎన్నోసార్లు చెప్పుకొన్నాం కూడా!" అన్నాడతను.

"మీ వంటి వారికి - ఆ పాటైనా, సేవచేయ గలిగినందుకు, నిజంగానే ఆనందించాను. మరో సంగతి బాబు గారూ! చాలా కాలంగా మీ కోసం ఎదురు చూస్తున్నాను. నేనేమో మీ దాకా రాలేను. మీరేమో - ఇటు వేపు రాసన్నారారు. నా అంచునించి వెడుతూ వెడుతూ కూడా, నా వేపు ఎందుకు చూడడం లేదో నాకు తెలుసు" అన్నది ఉద్యానవనం దిగులు దిగులుగా.

"ఓ వన సుందరీ! నా కోసం ఎందుకు ఎదురు చూశావు?" అన్నాడతను, పొడి కళ్ళను తడి చేసుకొంటూ.

పరిమళాలను విరజిమ్ముతున్న ఓ చిన్న గంధపు పెట్టెను వన సుందరి, అతని కిచ్చింది.

"ఏమిటిది? దీన్ని నా కెందుకిస్తున్నావ్?" అన్నాడతను.

"ఇది - మీకు - నా నూతన సంవత్సర బహుమతి!" అన్నది వన సుందరి. అతనా గంధపు పెట్టెను తెరచి చూశాడు. పచ్చగా మెరిసి పోతున్న మెత్తని చీనాంబరం మధ్య, అందమైన పసిడి రంగు పాద ముద్రలు రెండు - మిల మిల్లాడుతూ కనిపించాయి.

"ఇవి - అమ్మ గారి అఖరి పాద ముద్రలు బాబూ! ఆ నాటి వేకువన, పాద రక్షలు లేకుండా, నా పచ్చిక మీంచి మెత్తగా నడిచి పోతున్నప్పుడు ముచ్చట పడి, వీటిని నేనే సేకరించు కొన్నాను. ఇంత కాలంగానూ, భద్రంగా దాచి ఉంచాను మీ కిద్దామని. తీసుకోండి" అన్నది హరిత సుందరి గద్గద స్వరంతో.
"గొప్ప కానుక. అపూర్వమైన బహుమతి" అన్నాడతను, ఆ పేటికను కనుల కద్దుకొంటూ.
ఇప్పుడది, అతని అక్షర మందిరంలో ఉంది ...

(30-12-89 శనివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నీ పట్టుదలను చూసి మెచ్చుకోవాలో, నీ అమాయికత్వాన్ని చూసి, జాలిపడాలో నాకు తెలీడం లేదు. కనురెప్పలన్నా వాల్చకుండా నా కోసం చూస్తున్నావు. కన్నుల్లో వత్తులువేసుకొని వెదుకుతున్నావు. ఆకాశాన్నంతా గాలిస్తున్నావు. అవనీ తలాన్నంతా అన్వేషిస్తున్నావు. వెదికి వెదికి అలసి పోతున్నావు. అయినా, నా కోసమింకా వెదుకుతూనే ఉన్నావు" అన్నదామె జాలిగా.

ఆ మాటలు వింటూనే అతను ఉలికి పడ్డాడు.

"ఇప్పుడు నువ్వెక్కడున్నా వమ్మా ?" అన్నాడతను, క్షణకాలం మెరిసిపోయిన ఆమెకోసం చుట్టూ చూస్తూ.

"ఎప్పుడూ ఎక్కడుంటానో, ఇప్పుడూ అక్కడే ఉన్నాను" అన్నదామె.

ఆ గొంతునిండా సంతోషం ధ్వనిస్తోంది.

"అప్పుడప్పుడు; మెరపులాగానో, సదాలోచనలాగానో, నీవు కనబడి నప్పుడు; తనివి తీరక, నిన్నింకా ఇంకా చూడాలని తపించి పోతాను. అసలే కనబడనప్పుడు - క్షణకాలం కనిపించినా చాలు ననుకొంటాను. ఒకోసారి దగ్గరగా, బిగ్గరగా కనపడతావు. మరోసారి దూరంగా, లీలగా, రేఖగా, మంచుగా, మసగ్గా నన్నాకనపడవు. ఇల్లాగా - అప్పుడప్పుడూ కనిపిస్తూ, మళ్ళా మాయమవుతూ, నన్నెందుకు హింసిస్తున్నావో తెలియడం లేదు" అన్నాడతను దుఃఖపడుతూ.

ఒకటి రెండు క్షణాలు, శిలా సదృశమైన నిశ్శబ్దం!

తరువాత "అయ్యో!" అన్న పిలుపు.

ఆ దరిమిలా చల్లగా, తీయగా, ఓనాద ధార.

వెక్కిళ్ళు, గుక్కిళ్ళు ఆగిపోయాయి.

"నేను నీ కళ్ళలోనే ఉన్నప్పుడూ, నేనున్న ఆ కళ్ళే నన్ను వెదుకుతున్నప్పుడూ వాటికి నేనెలా కనబడతాను కన్నా? నువ్వెక్కడ వెదికినా, ఎంతగా వెదికినా, ఆ కళ్ళకు నేను కనబడనయ్యా! అప్పుడప్పుడూ నేను కనిపిస్తున్నది, ఈ కళ్ళకు కాదు; నీలోపలున్న కళ్ళకు. ఆ అంతర్నేత్రాలకు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేనే కాదు; నాలో ఉన్నవాడూ. నా చుట్టూ ఉన్నవాడూ, కనబడతారు. ఈ కళ్ళు మూసుకోవాలి. ఆ కళ్ళను విప్పాలి. అప్పుడు - నేనూ, నాలోనివాడూ, నా చుట్టూ ఉన్నవాడూ, నేనున్న వాడూ, కనబడతారు" అన్నదామె కనబడకుండానే!

అలా అంటున్నప్పుడు, మంచి కవిత్వంలాగా చలిగాలి వీస్తున్నది!

గడ్డి పరకలు, హిమకిరీటాలను ధరించాయి.

చుక్కలన్నింటినీ ఊడ్చేసి, ఆకాశం నిండా మబ్బులను పరిచారెవరో.

సంధ్యలోంచి తొంగిచూసే సూర్యునిలాగా, ఆ పొదల్లోంచి, ఓ ఎర్రని పూవు తలెత్తి చూస్తోంది.

ఓ దశాబ్దమా, నీకు హృదయ పూర్వకంగా వీడ్కోలు చెబుతున్నాను. మళ్ళీ మనం ఎప్పుడూ, ఇక్కటూ, ఎప్పుడూ కలుసుకోలేం గదూ?

(31-12-89 ఆదివారం)

गुरुकुल कांगड़ी विश्वविद्यालय
7970

(సమాప్తం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Access on
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

AIENA OKA EKANTAM —Dr. R. BHARADWAJA

ఎవ్వరూ కాలిడని కీకారణ్యాలలోకి, ఎవ్వరూ చొరబడని చిట్టడవుల లోకి, ప్రయాణించడం మిత్రుడు భరద్వాజ ఇష్టం. ఎవ్వరికీ పనికిరాని దానిలోంచి, కొందరికైనా పనికొచ్చే దాన్ని వెలికి తీయడం అతని ఇష్టం. మెల మెల్లగా చేతులను ముందుకు చాస్తూ, అ ముని వేళ్ళ కందిన అంశాలనూ, అనుభూతులనూ ఏరుకొంటూ, ఒడినిండా, ఒంటినిండా వాటిని నింపుకొంటూ, కొండమీదనుంచి లోయలోకి జారేలే ఎండలాగా, పచ్చికను తాకి చినుకులుగా చిరిగిపోయే వర్షధార లాగా, చల్లగా, మెల్లగా మన ముందుకొచ్చి, ఇలా చల్లి, అలా - పక్కగా వొదిగి నిలుచోవడం అతని ఇష్టం.

భరద్వాజ స్మృతి సాహితీ స్రవంతిలో ఇది నాలుగవ కెరటం. పారదర్శకమైన ఈ తరంగంలో, భరద్వాజలోని తాత్త్వికుడైన కవి కనపడతాడు. సాంద్రమైన, అతని చేతనావరణంలోని, నైతిక మూల్యాలు కనపడతాయి. విశిష్టమైన అతని సంకల్పమూ, విశుద్ధమైన అతని వ్యక్తిత్వమూ కనపడతాయి.

అంతరాళాన్ని ఆత్మికంగా ఆవరించే ఆనందమయమైన ఆలాపనా గీతం వినపడుతుంది. జార్జియన్ మెలోడీ వినపడుతుంది.

త్రిపురనేని సుబ్బారావు
సంపాదకుడు

Cover Printed at Sri Balaji Art Printers, Chikkadpally, Hyd-20.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar